మల్లికా గుచ్ఛము

కథల సంపుటి

మాడపాటి హనుమంతరావు

1984

ఆంధ్ర సారస్వత పరిషత్తు
తిలక్ రోడ్ - హైదరాబాద్

మల్లికా గుచ్ఛము

కథల సంపుటి

మాడపాటి హనుమంతరావు

1984

ఆంధ్ర సారస్వత పరిషత్తు
తిలక్ రోడ్ - హైదరాబాద్

ముద్రణ : 1984 జనవరి

ప్రతులు : 1000

వెల : రూ. 8-00

ముద్రణ :
పద్మావతీ ఆర్ట్ ప్రింటర్స్,
హైదర్ గూడ, హైదరాబాదు

Paper used for the printing of this book was made available by the Government of India at concessional rate.

ముందుమాట

ఆంధ్రదేశంలో, ముఖ్యంగా పూర్వ నిజాం హైదరాబాదు సంస్థానంలో భాగమైన తెలంగాణాలో సాంస్కృతిక పునరుజ్జీవనానికి నాయకత్వం వహించినవారిలో ఆంధ్ర పితామహ మాడపాటి హనుమంతరావుగారు ముఖ్యులు. ఆంగ్లేయుల పరిపాలనలో కొంత ప్రజాస్వామ్య సంప్రదాయాలు నెలకొన్న ఆనాటి మద్రాసు రాష్ట్రంలోని ఆంధ్రప్రాంతంలోవలె గాక పూర్తిగా నిరంకుశ పరిపాలన గల హైదరాబాదు సంస్థానంలో తెలుగు భాషోద్యమమే ఒక రాజకీయోద్యమంగా కొనసాగించవలసివచ్చిన రోజులలో సాంస్కృతిక పునరుజ్జీవనోద్యమాన్ని కత్తిమీద సామువలె నడిపించినారు హనుమంతరావుగారు. ఆంధ్రప్రాంతంలో వచ్చిన పలు ఉద్యమాలను హనుమంతరావుగారి వంటివారు ఒక్క చేతిమీదుగా నడిపించవలసి వచ్చింది. రాజనీతి, సంస్కరణ, స్త్రీవిద్య, చరిత్ర, భాష, సాహిత్యం మొదలైన అన్ని రంగాలలోను ఆయన కృషి చేసినారు. తెలుగు, ఉర్దూ, పార్సీ, ఇంగ్లీషు భాషలలో ఆయన పండితులు. కవిత్వం వ్రాసినారు. అనువాదాలు చేసినారు. వ్యాసాలు, గ్రంథాలు రచించినారు. బంకించంద్ 'ఆనందమఠ్' నవలను తెలుగులోనికి అనువదించినారు. ఇటలీ దేశభక్తశేఖరుడు గ్యారీబాల్డీ జీవిత చరిత్రను రచించినారు. 'రోమన్ సామ్రాజ్య చరిత్రము' సగ భాగం వ్రాసినారు. కాని ఇవి ఏవీ ముద్రణ భాగ్యాన్ని పొందలేదు. బొంబాయి నివాసి చింతామణి వైద్యా రచించిన 'ఎపిక్ ఇండియా'లోని వ్యాసాలకు హనుమంతరావుగారు చేసిన తెలుగు అనువాదం 'క్షాత్రకాలపు హిందూర్యులు' 1927 లో ముద్రణ పొందింది. కీ. శే. పువ్వాడ వేంకటప్పయ్యగారి 'కృషి ప్రచారిణీ గ్రంథమాల' ఈ

పుస్తకాన్ని ప్రకటించింది. 'మహా భారత సమీక్షణము'కూడా చింతామణి రావు వైద్యా గారి రచనకు అనువాదమే. ఈ వ్యాసాలు కొన్ని పత్రికలలో ప్రకటితమైనవి. పార్సీ కవులను పరిచయం చేస్తూ మాడపాటి వారు అనేక వ్యాసాలను వ్రాసినారు.

అన్నిటినిమించి మాడపాటి హనుమంతరావుగారు ప్రథమాంధ్ర కథానికా కారులలో ఒకరు కావడం గర్వించదగిన విషయం. హనుమంత రావుగారి షష్టిపూర్తి సంచికలో 'ఆంధ్ర పితామహ మాడపాటి హనుమంత రాయ చరిత్రము' అన్న వ్యాసంలో ఆదిరాజు వీరభద్రరావు గారు హనుమంతరావుగారు వ్రాసిన మొత్తం పదమూడు కథలను ఉదహరించి నారు. హృదయ శల్యము, రాణీ సారంధా, ముసలిదాని యుసురు, నేనే, అగ్ని గుండము, నాడు నీ పంతము-నేడు నా పంతము, ఆత్మార్పణము- అన్న ఏడు కథలను సంకలనంగా 'మల్లికా గుచ్ఛము' అన్న పేరిట *మచిలీపట్టణంలోని సరస్వతీ నికేతనంవారు* ***1915*** *లో ప్రకటించి* నారు. 'విధి ప్రేరణము,' 'ఎవరికి?' అన్న కథలను హైదరాబాదులోని అణా గ్రంథమాల వారు ప్రకటించినారు. 'న్యాయమా?,' 'ఎవరిది తప్పు?,' 'ఇక కావలసిన దేమి?,' 'నిజమేనా?' అన్న కథలు సుజాత, భారతి, శారద మాస పత్రికలలో ప్రకటితాలు. ఈ కథలలో హృదయ శల్యము, నేనే అన్న కథలు మాడపాటివారి స్వకపోల కల్పితాలని, తక్కినవి ప్రేమ్‌చంద్ ఉర్దూ కథలకు అనువాదాలు, అనుసరణలు అని వీరభద్రరావు గారు పేర్కొన్నారు. 'మల్లికా గుచ్ఛము' పీఠికలో కూడా పై రెండు కథలుతప్ప తక్కినవి ప్రేమ్‌చంద్ కథలకు అనుసరణలని హనుమంత రావుగారు స్వయంగా చెప్పుకొన్నారు. కాని అనుసరణలైన కథలకు మూల రచనల పేర్లను ఇద్దరూ పేర్కొనలేదు. మాడపాటివారి సాహిత్య కృషిని గురించి భవిష్యత్తులో పరిశోధన చేయగోరువారు ఈ విషయాన్ని

పరిశీలించవలసి ఉంటుంది. ఆంధ్ర వాఙ్మయ చరిత్ర సంగ్రహ కర్త కవిత్రివేది (1928) "మైనంపాటి (మాడపాటికి బదులుగా పొరపాటున వ్రాసినది) హనుమంతరావుగారి మల్లికా గుచ్ఛ మొప్పుల కుప్ప" అని ప్రశంసించినారు.

మాడపాటి హనుమంతరావుగారు 22 జనవరి 1885 నాడు జన్మించి నారు. వారి శతజయంతి కానుకగా ఆంధ్ర సారస్వత పరిషత్తు 'మల్లికా గుచ్ఛము' అన్న ఈ కథా సంకలనాన్ని యథాతథంగా ప్రచురిస్తున్నది. అందులోని ఏడు కథలతోపాటు 'ఎవరిది తప్పు ?, అణాగ్రంథమాల వారు మాలతీ గుచ్ఛమన్న పేరుతో 1940లో ప్రకటించిన ఎవరికి ? విధిప్రేరణ అను రెండు కథలను ఇందులో చేర్చడం జరిగినది. మొదటి ప్రచురణ లోని హనుమంతరావు గారి పీఠికను కూడా చేర్చడం జరిగినది. ప్రథ మాంధ్ర కథానికా కారులలో ఒకరుగా మాడపాటి వారిని సాహిత్య లోకం మరొకసారి జ్ఞాపకం చేసుకొనడానికి ఈ ప్రచురణ తోడ్పడగలదని ఆశిస్తున్నాము.

కార్యదర్శి
ఆంధ్ర సారస్వత పరిషత్తు

హైదరాబాదు
జనవరి, 1984.

మొదటి ముద్రణ పీఠిక

ఈ చిన్న పుస్తకమును గుఱించి రెండు మాటలు చెప్పఁదలఁచి యున్నాను. దీనిలోఁగల ఏడు కథలలో మొదటిది, నాల్గవది తప్ప తక్కిన ఉర్దూ భాషయందు వ్రాయఁబడిన కథల యనుసరణములు. వీనిలో నాలుగు కథలు 'ఆంధ్ర భారతి' యందును, ఒకటి 'కృష్ణా పత్రిక' యందును గొంత కాలము క్రిందఁ బ్రకటింపఁబడి యుండెను. మిగిలిన రెండు కథల నిటీవల వ్రాసితిని.

ఉర్దూ భాషలోఁ బైనఁ జెప్పిన యయిదు కథలను వ్రాసిన కవి 'ప్రేమచందు' అను నతఁడు. రచనా కౌశల్యమునందును, ఇతివృత్త నిర్మాణము నందును నితఁడు ఉత్తర హిందూస్థానమున ఖ్యాతిఁ గాంచిన వాఁడు. అట్టివాని వ్రాతలను దెనిఁగించు పని నావంటి యల్పజ్ఞుని చేతఁ బడుటవలన మూలములోని సారస్యము చెడిపోయియుండుననుట నిర్వివాదాంశము. కనుక, పాఠకులిందలి గుణములు ప్రేమచందునివిగను దోషములు నావిగను, భావింతురు గాక !

నా యీ ప్రథమ గ్రంథము, ఆంధ్ర సోదరుల యాదరముఁ బొందినచో ధన్యుఁడ నయ్యెదను.

౧౪౬, రెసిడెన్సిబజారు,
హైదరాబాదు (దక్కన్)
౨౪, మార్చి ౧౯౧౪.

మాడపాటి హనుమంతరావు

అంకితము

ఎద్దాని

పంచమ వార్షికోత్సవము నాఁడీ గ్రంథ రచన

సమాప్తి య్యయ్యెనో

అట్టి

ఆంధ్రజాతీయ కళాశాలయొక్క

స్వార్థత్యాగులగు

స్థాపకులకును, నిర్వాహకులకును,

ఈ గ్రంథము

భక్తి పూర్వకముగ

నంకితము చేయఁబడినది.

విషయసూచిక

మల్లికాగుచ్ఛము

హృదయశల్యము

ప్రథమ రంగము

ఆ. పడఁతియొక్కదానివిడచి యించుక యమృ
తంబులేదు; భువి విషంబు లేదు; భర్తృహరి.

సుమారు, ఆఱువందల ఏఁబది సంవత్సరములకు ముందు, ఒకనాఁటి సాయంకాలమున, ఐదున్నర గంటలవేళ, ఓరుగల్లు, *అంబాలలకు నడుమనుండు అరణ్యప్రదేశమున, నొక పల్లకి, ఓరుగల్లు ముఖముగా వచ్చుచుండెను. పల్లకియందున్న యువతి ప్రాయశః పదునెనిమిది వసంతర్తువులఁ జూచి యుండ వచ్చును. భర్తయు, నామెతోఁగూడ నశ్వారూఢుఁడై చను

---

* ఈ అంబాల గ్రామమును విఖ్యాతచరిత్రయు కాకతీయ సామ్రాజ్యధురీణయు నగు రుద్రమదేవి (తనపేర) అంబాలయ మను నామముతోఁ గట్టించియుండినట్లు ప్రతాపచరిత్రము నుడువుచున్నది. రుద్రమదేవికి అంబయను నామాంతరముండెననికూడ నాగ్రంథమే చెప్పు చున్నది.

దెంచుచుండెను. ప్రయాణపుఁ బడలిక వారిరువురయొక్కయు, పల్లకీ బోయలయొక్కయు, ముఖములందే కాక, గుఱ్ఱము నందు నైతము స్పష్టముగఁ గనబఁడుచుండెను. వేళ సాయం తనమును, ప్రవేశించిన దరణ్యమును, అగుటచేత నయ్యాశ్వి కుఁడు వేవేఁగ నడువ బోయల నాజ్ఞాపించుచు, తన యశ్వమును వడిగ నడువ హెచ్చరించుచు, నా సుందరికి భయము కలుగ కుండునట్లు వినోదములగు ముచ్చటలఁ జెప్పుచుఁ బోవసాగెను. అంతకుమున్ను బోయల కుక్షులలోఁ బ్రవేశించిన మద్యము యొక్క ప్రభావముచేత, వారు వడి వడిగ నడుగు లిడఁదొడఁ గిరి. కాని, యాశ్వికుని వాహన మాబోయల నడకతోఁ దూగ లేక మెల్లగఁ బోవుచుండెను. అస్తమయభానుఁడు తన కరము లచే నావనమందలి వృక్షాగ్రములకు బంగరుపూతఁ బూయుచుఁ బూయుచుఁ దుట్టతుదకుఁ బశ్చిమ సముద్రమున మునింగెను. వలనైనంత వేఁగమున సురక్షిత ప్రదేశమును జేరఁ దొందర పడుచుండిన యాశ్వికునకు, గుఱ్ఱముయొక్క మందగమనము నిరుత్సాహకరముగ నుండినందున నతఁడు చింతించుచు, పల్లకిని ముందుఁబోనియ్య నిష్టములేక, మెల్లగ నడువుఁడని బోయలకుఁ గేకవేసి చెప్పెను,కాని వారామాటాల వినిపించుకొనక పల్లకితోఁ బఱువిడసాగిరి. వారి యోంకారనినాద వశమునఁ బల్లకిలో నున్న జవ్వనికిఁగూడ భర్తకేకలు విన వచ్చినవి గావు. అయి నను, నాయువతి భర్తవెనుకఁ జిక్కుటకు విచారించుచు, డోలాందోళిత మానసయై కొంతసేపేమియుఁ జేయఁదోపక

భర్త వచ్చువఱకుఁ బల్లకి నట్లే యాపి యుంచ బోయల నాజ్ఞాపించెను. కాని, యరణ్యము భయంకరమైనదనియు, తమ యేలిక కెట్టిభయమును లేదనియుఁ జెప్పుచు బోయలు ఎప్పటి యట్లే పోవసాగిరి. కొన్ని నిముసములలోఁ బల్లకికిని, అశ్వికునకును నొకమైలు యెడమయ్యెను!

అంత రాత్రి పొడసూపెను. అది శుక్లపక్ష మగుటచేఁ జంద్రోదయ మయ్యెను. గ్రుడ్డి వెన్నెల కాయుచుండినందున, నా ప్రయాణికుల కెంతయు నిరుత్సాహముగ నుండెను. మైకము దిగినందున బోయల వడియుఁ దగ్గి వారు మెల్ల మెల్లగఁ నడువ మొదలిడిరి. అట్టి తరుణమున మార్గమునకొక ప్రక్కనుండిన పొదలో నేదో చప్పు డాసుందరి వీనుల సోకఁగా నామె యనుమానముతో నటు నిటుఁ బరికించి చూచెను గాని, యేమియుఁ గన్పట్టలేదు. తన మనమున సందడించినది, ఉత్త భ్రమయే యని సమాధానముచేసికొని యాయువతి ధైర్యముతోఁ గూర్చుండిన మఱి యొక నిముసమున, అక్కటా! మూర్తీభవించిన యమదూతలో యన, నల్లని యాకారములును, తదనుగుణ్యములగు వస్త్రములును, గలిగిన జనుల గుంపొకటి యాపొదనుండి సాయుధముగ బయలువెడివచ్చి "నిలుఁడు; నిలుఁ" డని బోయల గద్దించుచు, పల్లకీ కడ్డముగ నిలచెను! వెలవెలఁ బోయిన మోములతో నా బోయలు గత్యంతరముఁ గానక నిలువఁబడి తమ దొరసానివైపు విస్మయ విచార మిశ్రితములగు చూడ్కులఁ బఱపిరి.

ఇఁక నాసుందరి మానసిక స్థితిని వేఱుగ వర్ణింపవల యునా? మొదట నీదృశ్య మామె హృదయమును భేదించు నట్లుండినను, వెంటనే సహజ దౌర్బల్య మామె యెదను వదలి యాస్థలమును గట్టి గుండె యాక్రమించెను. కానున్నది గాక మానదని గుండె రాయిచేసికొని యాలేమ ధైర్యమూని యుండు నంతలో, దోఁపిడికాండ్ర నాయకుఁడు రెండు దండప్రహారము లతో బోయలచేఁ బల్లకి దింపించి జవ్వని సమీపింపసాగెను. అంతవఱకితిక ర్తవ్యతా మూఢయై యుండిన యా యువతి యెట్టెట్లో ధైర్యము చిక్కఁబట్టి గుప్తమై యుండిన కటారు నాతని రొమ్మునఁ గ్రుమ్మ నుద్యమించెను. నాయకుఁడును మాఱిన స్థితిగతులను నిముసమున గ్రహించి, మొలను వ్రేలాడు చుండిన ఖడ్గమును విద్యుద్వేగముతో నూడఁబెఱికి తటాలున దానితో నొక బలమగు వ్రేటు, నాయువతి కోమలకంఠమును గుఱిచూచి వేయనుంకించెను.

ద్వితీయ రంగము

మనకథ జరుగు కాలమునఁ ద్రిలింగ రాజ్యమును కాకతి రుద్రమదేవి, మహా వైభవోపేతమగు ఓరుగల్లు నగరము రాజధానిగఁ బరిపాలించుచుండెను. ఆ పురమునకు దాదాఁపు పండ్రెండు మైళ్ల దూరమున నున్న అంబాల యను గ్రామము

దేవిగారికిఁ బ్రియతమ మగు ప్రదేశముగ నుండుటవలన నోరు గంటికిని నాగ్రామమునకును రాకపోకలు తఱచుగ నుండినను, నా ప్రదేశములనడుమ నుండిన సాంద్రారణ్య మొకొకప్పుడు దోఁపిడికాండ్ర కాశ్రయ మిచ్చుచుండుటకూడ సంభవించు చుండెను. గత ప్రకరణాంతమునఁ వర్ణింపఁబడిన భయంకర కార్యము జరుగుచుండిన సమయమున నోరుగల్లునుండి వెడలి, అంబాల గ్రామోన్ముఖులుగ వచ్చుచుండిన ఇద్దఱాశ్వికభటు లక స్మాత్తుగ రంగమున వ్రాలిరి. క్రొత్తగా వచ్చుచుండిన వారి స్వల్పసంఖ్య బందికాండ్ర కేమాత్రమును భయముఁగలిగింపక వారిని వారి పని యథేచ్ఛముగఁ జేయనిచ్చెను. వెనుకఁ జెప్పఁ పడిన విధమున నాదోపిడికాండ్ర నాయకుఁడా సుందరి కత్తు కను గత్తితోఁ దెగవ్రేయ కేలెత్తి యుండెను. మరియొక నిము సమున నిర్దోషియగు నాకోమలి పరలోక గామియై యుండును. కాని యాగంతుకులలో నొక్కఁడు వెనుకనుండి ఘోరకార్యము నకై కటిబద్ధుఁడుగ నుండిన యానాయకుని యెత్తినకేలు నెత్తి నట్లే, తీవ్రమును సమయోచితమును నగు తన పట్టాకత్తి వ్రేటుచే నేలఁబడవేయునంతవఱకు నొక్కరేనియు నిట్టిపని జరుగుట సంభవమని యెంచి యుండలేదు. ఇఁక రెండవ యాశ్వికుఁడు తక్కిన బందికాండ్రపని చక్కఁబెట్ట సాగెను. నాయకుఁడు తనకు సంభవించిన యాపదకుఁ దల్లడిల్లుచు 'బ్రతుకు జీవుఁడా'యని పిక్కబలముఁ జూప మొదలిడి, తన యనుచరులకు మార్గదర్శి యయ్యె. మన కథానాయికప్రాణములఁ

గాపాడిన మొదటి యాశ్వికుఁ డందమైనమోమును, స్ఫుటమగు తేజమును, గలిగియుండెను. కాని పురుష సౌందర్యమును సంపూర్ణముగ నొనర్చు మీసము లాతని ముఖము నలంకరించి యుండలేదు. తన్నుఁ జంప సిద్ధముగ నుండిన దోఁపిడికానిని రూపుమాపి ప్రాణదాన మొనర్చిన యా రౌతుపైన నా సుదతి కృతజ్ఞతావలోకనములఁ బఱపి, స్వీయభావముల వెల్లడింప యత్నించెను. కాని యానందాతిశయ మామె నోటమాట వెలువడనీయలేదు. ముత్తియములవంటి బాష్పకణము లామె కనుదమ్ముల నుండి పరంపరలుగ వెడలి నునుజెక్కులపై జాఱుచు, అప్పుడు దేదీప్యమానముగ వెలుంగు చుండిన చంద్రకిరణములు ప్రతిఫలించుటచే ధగధగ వెలుంగుచుండెను. ఆమె మనమ్మున వెల్లివిరిసి పాఱుచుండిన భావములను ముఖమునఁ జదివిన యయ్యాశ్వికుని హృదయము చాలఁ జాలినొందిన ట్లగపడియె. అంత నాతఁడప్రయత్నముగ ముం దడుగిడి యాముద్దియను తనవక్షమున కదిమికొని కన్నీరుగార్చుచుండుటయు, మైలు దూరమున వెనుకఁ బడియుండిన యా ముద్దరాలి భర్త యా స్థలమునకు వచ్చుటయు నొక్కతూరియే సంభవించెను. తస్కర నాయకుని తెగిపడిన హస్తమును, రక్తపు మడువులును, బోయల చిన్నవోయిన మోములును, ఆయుధపాణులగు క్రొత్తమనుష్యుల తెఱంగును, నాతనికి జరిగిన కథను చెప్పకయె చెప్పెను. ఆరంగమునుజూచి వివరముల నెఱింగినతోడనే దుఃఖమును, సంతసమును, కృతజ్ఞతయు, నెట్లాతని హృదయమున ముప్పిరిగొనెనో వర్ణించుట యనవసరము.

'యమునా!' యను మాట నోట వెడల నా పురుషుఁడు తన భార్యను గౌఁగలించుకొనెను. యమునయుఁ బ్రాణేశున కెదురుగఁబోయి, యాతని కంఠమున బాహులతలవైచి వెక్కి వెక్కి, ఏడ్వసాగెను.

అంత ప్రతాపుఁడు భార్య నూఱడించుచుఁ "నెచ్చెలీ! ఏడ్వకుము; దైవము నేఁడు మనపాలిఁట నుండుటచేత, నీ యాశ్వికరూపమున వచ్చి నీ ప్రాణమును, తన్మూలమున నా ప్రాణమును గాపాడెను. లేనిచో..."యని ఇంకేమో పల్కఁ బోయి తన ప్రియభార్యను రక్షించిన యాశ్వికుని వంకఁజూచి నయముతోఁ బల్కెను: "అయ్యా! తమ యుపకారమును దగినవిధమున శ్లాఘింపఁజాలను. నేనేమి ప్రత్యుపకార మొనర్పఁగలను? మాబోటి మందభాగ్యుల రక్షణమునకై ఈశ్వరుఁడు మిమ్ముఁ జిరకాలము సజీవులుగ నుంచుగాక!"

ఆశ్వి:- అయ్యా! మేమంత శ్లాఘనీయ కార్యము చేయలేదు. ఏమైనఁజేసితిమేని యది మాకర్తవ్యమే యగును గాని యంతకన్న నేమియులేదు. ఈ సుందరి ప్రాణముఁ గాపాఁడగల్గినందున కెంతయు సంతోషమగుచున్నది. మేమిఁకఁ బోయెదము. ఈ రౌతు మీ వెంట నీయర ణ్యము దాటువఱకు రాఁగలఁడు. పాప మీ సుందరిని వదలిపోవుట నాకిష్టముగలేదు. అయినను, అట్లు చేయక తప్పదు. మీ గ్రామ మెద్దియో తెల్పిన నొకమారచ్చటికి వచ్చి మిమ్ము దర్శించి ధన్యత నొందెదను.

ప్రతా:-ఇంతకన్న నానందప్రదము మాకు మఱెద్దియు నుండదు. ఇచ్చటి కాఱుమైళ్ళ దూరమునున్న రుద్రవరము మా నివాసగ్రామము. తమరు మా గృహమును దప్పక పావనమొనర్చి మా యాతిథ్యము నంగీకరింప వేడు చున్నాము.

ఆశ్వి:- సుందరీ! సెలవు. అయ్యా! సెలవు.

యమునా, ప్రతాప:- అయ్యా! వందనములు. మాకమితోపకార మొనర్చిన తమ పవిత్ర నామమును మే మెఱుఁగ వచ్చునా?

అంతలో నయ్యాశ్వికుఁడు కొంత దవ్వేఁగియుండి నందున నాతఁ డీ ప్రశ్న కిచ్చిన ప్రత్యుత్తరముగ "రుద్రదే-" అను మాట మాత్రము వినవచ్చెను. అతని పేరు "రుద్రదేవుఁ" డని వారు నిశ్చయించుకొనిరి.

—o—

తృతీయ రంగము

యమునాప్రతాపుల వాసస్థలమగు రుద్రవరము చిన్న గ్రామమేయైనను నందముగ నుండెడిది. ఈ కథ యారంభ మగుట కాఱు సంవత్సరములకుఁ బూర్వము, తల్లిదండ్రులు

కలివై పోయినందున, ప్రతాపుఁడు పైతృకములగు భూములఁ దన కేలగొనవలసిన వాఁడాయెను. అతని యాదాయము సంవత్సరమునకుఁ గొన్నివేల రూపాయల పరిమితి గలిగియుండెను. రుద్రవరములోని యాతని గృహము రాజభవనమువలెఁ గడు రమ్యమై చక్కని యుద్యాన వనమునకు నడుమనుండెను. ఆవరణపుఁగోడ మిగుల నెత్తుగనుండి లోపల నుత్తరదిశన నట్టనడుమ నొక గొప్ప కమాను, అంతర్మందిరపు సింహద్వారమున కెదుట గంభీరముగఁ బ్రకాశించుచు, నాగృహమున నివసించుచుండు దంపతుల గొప్పతనమును జాఁటుచుండెను. యమున కాపురమునకు వచ్చిన నాల్గు సంవత్సరములనుండియు, ప్రతాపుఁడు జీవితసౌఖ్యములను సంపూర్ణముగ ననుభవించుచుండెను. ఆమె హృదయము కడు మృదులము. ఆమె జీవితము పరిశుద్ధముగ నుండెను. తాను భర్తను హృదయపూర్వకముగఁ బ్రేమించుచు, నతనివలన గాఢముగ బ్రేమింపఁబడుచుంటి నను మనోనిశ్చయ మామె మానసమును సర్వదా సంతుష్టముగ నుంచుచుండెను.

ప్రతాపుఁడు నైతము భార్యను మనఃపూర్వకముగఁ బ్రేమించువాఁడే. అయినను, అనురాగమున కునికిపట్టులగు స్త్రీలు పురుషుల నెంత గాఢముగఁ బ్రేమింపఁగలరో, పురుషులు స్త్రీలనంత గాఢముగఁ బ్రేమింపఁగల్గుట యసంభవము. పురుషుల హృదయము బహుసులభముగ సందియములకుఁ దావొ

సంగును. యమున ప్రాణములు రక్షింపఁబడిన యానాఁడు వారింటికి వచ్చి చేరినప్పటినుండియు ప్రతాపుని స్వచ్ఛహృదయమున నేదో మాలిన్యము ప్రవేశించెను. వస్త్రముపైఁబడిన మచ్చను కడిగి వేయవచ్చును; కాని హృదయమునఁ బడిన మచ్చఁ దుడిచివేయుట దుస్సాధ్యము. ఒక వెలగల ముత్తియమును బగులఁ గొట్టితిమేని, దానికిఁ బ్రతిగఁ దన్మూల్యమగు ధనమునిచ్చిన నేరము తీఱిపోవును; కాని ఒక్కరి మనస్సును జితుకఁగొట్టితిమేని ప్రపంచమునఁగల యెట్టి మూల్యవంతమగు వస్తువును నాకొఱఁత దీర్పఁజాలదు. దురదృష్ట కారణమగు నా నాఁటినుండి ప్రతాపుఁడు క్రమ క్రమముగ విచారాందోళిత మానసుఁడై కానరాసాగెను. భార్య యెదుటనున్నవేళ, వికాసమును ముఖమున వ్యక్తపఱచుచు, నెవ్వరును లేని తరుణమున దీర్ఘవిచారమున మున్గి యుండును. ఈ స్థితి నానాఁటికి హెచ్చసాగెను. అంతకు మున్ననుదినము ప్రేయసితోఁ గూడ సాయంసమయములందు గృహారామమున విహార మొనర్ప నలవాటు పడి యుండిన ప్రతాఁపుఁడు, ఒకనాఁడు తల దిమ్ముగ నున్నదనియు, మఱియొకనాఁడు గాలి కడుచల్లగ వీచుచున్నదనియు, మిషలఁ బన్నఁ దొడఁగెను. విశ్రమ సమయములం దభ్యంతర గృహమున నామెసరసఁ గూర్చుండి వినోద సంభాషణమునఁ బ్రొద్దుపుచ్చు నాతఁడు, అట్టి యవకాశము లభించినపుడు 'ఉక్కగానున్న' దని కాని, 'వాకిట నెవరో పిలచుచున్నట్లున్న' దని కాని పలుకుచు లేచిపోవును. ఏకాంత మాతని కెక్కువ

రుచించినట్లు కన్పట్ట సాగెను. స్వవ్యవహారములను, గడు జాగరూకతతోఁ గనిపెట్టు తనతొంటి యభ్యాసమును మానుకొనఁ జొచ్చెను. పని కలిగివచ్చు పెద్ద మనుష్యులతోఁ బూర్వమువలె వివరముగ మనసిచ్చి భాషించుట మాని నాల్గుమాటలతో సరిపుచ్చి వారి నవ్వల కంపివేయుచుండెను. భర్తయొక్క మానసికావస్థకుఁ గారణ మారయఁబలుమా ఱామె యత్నించెను. కాని వ్యర్థమయ్యె. ఆమె పల్కు నర్మగర్భములగు వాక్యముల కొకప్పుడు ఖండితముగను, వేఱొకప్పుడు కసరుకొనియు, నిచ్చు ప్రత్యుత్తరము లారంభములయ్యె. ఆ ముఖ వికాసము, ఆ మందహాసము, ఆ యనురాగ ప్రకటనము, అన్నియు మాయమయ్యెను. ఈ మార్పులు యమున నిర్మల హృదయమును జింతాసముద్రమున ముంచివైచెను. భర్త మనస్సునకుఁ దాత్కాలిక విశ్రాంతియేని కలిగించుటను నాశజనించి, యామె మిగుల జాలి బుట్టించు నానాఁటి తన ప్రాణరక్షణవృత్తాంతపుఁ బ్రసక్తిఁ దెచ్చి, ముష్కరుఁడగు నాబందికాంద్ర నాయకుఁడు దన యుసురులఁగొనఁబూనినవిధమును, రుద్రదేవుఁడా దుర్మార్గుని చేతిని నఱికి యాబందిపోటు నాయకునిఁ బరుగెత్తించిన విధమును, మనసు కఱగునట్లు చెప్పఁబూన నతని దృక్కులు కొంచెము ప్రసన్నములుగ మాఱి నట్లామెకుఁ దోచెను. కాని తరువాత నాజవ్వని రుద్రదేవునియెడఁ గృతజ్ఞతఁ జూపినపుడెల్ల నతని హృదయము మఱింత ఖిన్నమై యుండుటయు, నొక్కొకప్పుడు రుద్రదేవుని పేరామె పెదవులనుండి వెడలునప్పు డాతఁడు

భార్యముఖమునఁ దన దృష్టి తీక్ష్ణముగ నిల్పి, యామె హృద యాంతరాళము నన్వేషించు వానివలె నగపడుటయు సంభవింప సాగెను. ఈ లక్షణములను బట్టి, యమున భర్తహృదయమును గలంచుచున్న విచారకారణమును కొంతవఱకు-కాదు-సంపూర్ణ ముగఁ దోల్చుకొనఁగల్గెను. ఆమె నిర్దోషియనుట నిశ్చయము. యమున మానసము గంగా తరంగమువలె పవిత్రమైనదని మన మెఱుఁగుదుము. కాని ప్రతాపునెట్లు నమ్మింపఁగల్గుదుము ? తన హృదయమును విచ్చి భర్త యెదుటఁ బెట్టి భర్తయంతస్తాపముం దీర్ప యమున పలుమాఱు తలంచుకొనెను. కాని యంతమాత్ర మున నాతని హృదయశల్యము వీడఁగల్గినచో నంతకుఁ బూర్వ మామెభర్తయెడఁ జూపియుండిన నిశ్చలానురాగమును, నామె వర్తనాపావిత్ర్యముయొక్క జ్ఞప్తియు, నాతని మనస్తాపముం దీర్చియుండఁగూడదా? ఇట్టి భావము లామె నాయుద్యమము నుండి మరలించెను. మానవ హృదయము విచిత్రమగు క్షేత్రము. ఇందొక నిముసమున, పరిమళవంతములై మేదస్సు నానంద పరచు కుసుమము లుదయించును; మనోజ్ఞములగు ఫలములు పండును; వేఱొక నిముసమున నదే కంటకావృతమై విష వృక్షములకుఁ బుట్టినిల్లయి వికారరూపమును దాల్చును. ప్రతాపుని మనక్షేత్ర మిట్టిదిధముగ మాఱుట మా చదువరులు చూచి యున్నారు! అక్కటా! ఈ హృదయ శల్యము వీడుటెట్లు?

చతుర్థ రంగము

ఈ విధముగ దినములు గడచెను. యమున ప్రాణములు రక్షింపఁబడిన యాదినము-ఆ దుర్దినము-గడచి నేఁటికి మూఁడు మాసము లయ్యెను. వారిభవనము నాశ్రయించి యుండిన యారామములోని వృక్షములును, లతావితానమును, నవవసంత సమాగమముచే నవనవలాడఁ జొచ్చెను. కుసుమ సంతానములు తమ సౌరభముల వాయుదేవుని మూలమున నలుదెసల కంపి యెల్లర మానసములఁ బల్లవింపఁ జేయసాగెను. ఉద్యానవనములోని కేళాకూళుల స్వచ్ఛనీరముల కడకు పక్షిమిధునములు మాటిమాటికి వచ్చి జలక్రీడల సల్పుచు పరస్పర సహవాస సౌఖ్యముల నవ్వారిగా ననుభవించుచుండెను. కాని దైవనిర్మితములగు నీసౌఖ్య సాధనములలో నొక్కటి యేనియు సంతప్త హృదయులగు యమునా ప్రతాపులకుఁ జిత్తవిశ్రాంతి నియ్యఁజాలదయ్యె. ఇన్ని సంవత్సరముల సహవాసము ననుభవించిన తరువాతఁ గూడ భర్త తన యంతరంగము నెఱుంగఁడయ్యెఁగదా యను సంతాప మామెను మఱిమఱి బాధింపసాగెను. "దైవమా! నాకేల యిట్టి చిక్కులఁ దెచ్చి పెట్టితివి? బందిపోండ్ర చేతులలో నసువులఁ బాయనున్న నన్నానాఁడు రక్షింపకుండిన నీ కేమి చేటు మూడియుండును? ఓ మాయదారి రుద్రదేవా! నీ హృదయమెట్టిదో నేనెఱుంగను. కృతజ్ఞతాభారవివశనై యున్న నన్నానాఁడేల దయగలవానివలె దగ్గఱకుఁ దీసికొని నా నాధుని మనస్సు

ననుమానము పాలు చేసితివి? ఓ మాలదైవమా! ఇప్పుడైనను నెట్లో నా ప్రాణములఁ బాపి నాకు సంతసమును నా జీవితేశ్వరునకు శంకారాహిత్యమును, ఏల కల్గింపవు?'' అని కన్నీరు మున్నీరుగ నేడ్చుచుండెను. ఆ దంపతుల మనోవ్యాకుల మిట్టి దశ నందిన దినములలో నొక్కనాఁడు, అకస్మాత్తుగ రుద్రదేవుఁడని వారనుకొనిన యయ్యాశ్వికుఁడు వారింటికి వచ్చెను!

ప్రతాపుఁడు రుద్రదేవురాక వినఁగానే మనస్తాపమును మఱుఁగుపఱచి సగౌరవముగ నతని నెదుర్కొని లోనికిఁ దోడి తెచ్చెను. తనకీయఁబడిన యాతిథ్యమునకు రుద్రదేవుఁడు కృతజ్ఞతఁ దెల్పెను. యమున కనఁబడినప్పు డయ్యతిథి యామెను కుశల ప్రశ్నము చేసెను. కాని యుత్సాహ పూర్వకమగు ప్రత్యుత్తరముఁ బడయఁజాలఁడయ్యె. ప్రతాపుఁ డెంతసంతసముఁ జూపినను, నాదంపతుల హృదయకమలముల యడుగున కలక్కొన మెదలుచుండిన కంటకము నాతఁడు కనిపెట్టక పోలేదు. ఇవ్విధముగ నాయతిథి రెండు దినము లచ్చటఁగడపెను. ఈ రెండుదినములును యమునకు రెండు యుగములుగ గడచెను. ఈ దినద్వయమున నామె మనస్సు చిత్రవిచిత్రమగు తర్కవితర్కమున మునింగి కర్తవ్యము నిర్ణయింపఁజాలక తొట్రుపడుచుండెను. ఎవ్వాఁడు తన భర్తృ మానసికాస్వస్థతకుఁ గారణుఁడయ్యెనో యట్టి రుద్రదేవు నామె మనస్సునఁ బరిపరి విధముల నిందించుచుండెను. వచ్చిననాఁడే

వెడలియైనఁ బోక దినములు గడపుచుండిన యాతని యునికి యమున దుఃఖసముద్రమునఁ దీవ్రమగు క్రోధాగ్నిఁ బుట్టించెను. తుదకామె యొకరితో నాలోచింపక, భర్తయేమనునో యని తలంపక, ప్రాణములరక్షించిన రుద్రదేవునియెడఁ గృతజ్ఞత వహింపక, క్రోధావేశపరవశయై కన్నుల జలజల బాష్పములు రాల, రుద్రదేవుని దిక్కు మొగమై యిట్లనెను: "చాలుచాలును; బహు సన్మార్గుఁడవు! నాఁటి నీ దుశ్చేష్టమూలమున నా పచ్చని కాపురము పాడైపోవు దినముఁ దెచ్చితివి! ఆ విధముగ మా దాంపత్య సుఖమును దగ్ధముచేసి యంతటితోఁ బోక మరల నిటకువచ్చి మమ్ము వేధించుటకు నీకు సిగ్గులేదా?"

ఈ పరుష వాక్యములఁ బల్కునప్పుడు ప్రతాపుఁడు కనుసన్నచే భార్యను వారింప నెంతయు యత్నించెనుగాని యాతని కోర్కి నెఱవేరదయ్యె. ఆ మాటలకుఁ బెదవులపై నాట్యము సేయుచుండిన చిఱునగవును బలవంతముగ నడఁచుకొని యామెకన్న నెక్కుడుక్రోధమునునటించుచు రుద్రదేవుఁడనెను: "అమ్మా! నేనేల నిందింపఁబడుచున్నానో యెఱుఁగను. నాఁడు నిన్నుఁగాపాడుటయే నేను చేసిన ఘోరపాపమైనచో, పరోపకారమాహాత్మ్యమును నీవు నాకుఁ గడుచక్కఁగ బోధించితివి! ఆనాడు నీ భర్త నా రాక కంగీకరించి నందుననే నిటు రా సాహసించితిని. తినఁ గూడు లేక మీ సత్రమునకు వచ్చినవాఁడఁగాను. నాకును నలుగురఁ బోషించు స్థితి కలదు. మీకిట్టి యగౌరవభావమున్నదని

నాకు వచ్చినతోడనే తెలిసియుండిన రెండు దినములు మీయింట నుండి యుండను.'' తన భార్య మూలముగ నతిథికిఁ గోప మొదవుట కెంతయుఁ జింతిల్లి ప్రతాపుఁడు యమునను ముఖము వాయఁ జీవాట్లు పెట్టి, రుద్రదేవునికిఁ దన భార్య పిచ్చితనమును బోధించి శాంతింపఁజేయఁ జూచెను; కాని, అతిథి ముఖలక్షణము లను మార్పక చావిడిలోనికేఁగి కూర్చుండెను. ప్రతాపుఁడు జరిగినదానికి వగచుచు వాకిట నిలువఁబడియుండెను. అంతలో జరీబుటేదారి యల్లికపనిచేఁ దళతళ మెఱయు నల్లపట్టు బట్టతోఁ జేయఁబడిన సైనికుని దుస్తుల ధరించి, స్థిరకాయుఁడుగ నున్న యొక యాశ్వికుడు మందిరద్వారము కడకువచ్చి యచట నిలచి యున్న ప్రతాపునిచూచి, గుఱ్ఱమును దిగి, నమస్కరించి "అయ్యా! మూడుదినములక్రింద నిచ్చటకి వచ్చిన మా మహా రాజ్ఞి శ్రీరుద్రమ దేవిగారిని వెంటనే దర్శింపవలసి యున్న'' దని గంభీరస్వరముతోఁ బల్కెను. "మహారాజ్ఞిగా రిచ్చటికేల వత్తు''రను మాటలాతని నోట ప్రత్యుత్తరముగ వెడలఁ బోవు చుండునంతలో, చావడిలోఁ గూర్చుండియున్న రుద్రదేవుఁడు ద్వారముకడకు వచ్చి నిలచెను. అంత నా క్రొత్త యాశ్వికుఁడు రుద్రదేవుఁడని మనము వ్యవహరించుచున్న యాపురుషునిజూచి వంగి సవినయముగ జోహారొనర్చి విన్నవించెను. "అమ్మా! మహారాజ్ఞిగారి యానతి ప్రకారము రెండువందల భటులు వాకిట సిద్ధముగ నున్నారు. దేవిగారికొఱకు పల్లకి నాయత్తము చేతుమా లేక యశ్వమునా? దేవి యాజ్ఞ'' యని మరల నొకమారు

జోహారొనర్చి తలవాల్చి నిలచెను. "పల్లకి చాలును; రెండుగడి యలలో మనము ఓరుగల్లు చేరవలయును జాగ్రత్త" అని పల్కి రుద్రదేవుఁడు—కాదు మహారాజ్ఞియగు శ్రీ రుద్రమదేవి నుడివెను. అంత నయ్యాశ్వికుఁడచ్చోటు వాసిపోయెను. ఆ సంభాషణమును వినిన ప్రతాపుఁడు తత్తరపాటుతో లోనికేఁగి యంతకు ముందు తన భార్యచే నిందితుఁడైన వ్యక్తి త్రిలింగ సామ్రాజ్యమునకు రాణియేగు శ్రీ రుద్రమదేవి యని-యమునకుఁ దెల్పి వెంటనే యామెనుగూడఁ గొనివచ్చి, యిరువురును రాణి గారి పాదరాజీవములపైనఁ బడి తమ యపరాధమును మన్నింప వేడుకొనిరి.

రాణి మందహాసముతో నా దంపతుల లేవఁదీసి సాదర ముగఁ బల్కెను. "అమ్మాయీ! నీవంటివని నాకు చింతలేదు. నేను క్రోధము నభినయించితిఁగాని యనుభవింపలేదు. ఆనాఁడు స్త్రీ జాతికి సహజమగు హృదయ మార్దవముచేతను, అనేక దుఃఖముల ననుభవించిన నా మనస్సునకు నీ నివర్తిత దుఃఖము జ్ఞప్తికి వచ్చుటచేతను నావేష స్వభావమును మఱచి జాలిచే నిన్ను గౌఁగిలించుకొంటిని; కాని పురుషవేషమున నున్న నేనట్లు చేయుట నీభర్త కనుమానము నాపాదించునను మాట తరువాత స్మరణకువచ్చి మిమ్ము మరల నొకమారు దర్శింప ననుజ్ఞ వేడి నేఁడు మీ యతిథినై యిటకు వచ్చితిని. నీ నిష్కాపట్య

స్వభావమునకును, మీ పరస్పరానురాగమునకు నానందించితిని; కాని కొంతకాలము మీమనస్తాపమునకుఁ గారణభూత నైనందు నకు నన్ను మీరు మన్నింపవలెను.''

దంపతులు దేవికి మరలమరల వందనము లర్పించి ''దేవిగారియెడఁ జేసిన యవజ్ఞతకు క్షమింప వేఁడవలసినది మేముకాని తమరు కార''ని కేలుమోడ్చి పల్కి కన్నుల నానంద బాష్పముల రాల్పసాగిరి.

అంతలోఁ బల్లకివచ్చి వాకిటనిలచెను. దేవి దాని నెక్కఁ బోవుచు నాదంపతుల నాశీర్వదించి యడిగెను: ''మీ హృదయ శల్య మిఁక వీడినదని నేను దృఢముగ నమ్మవచ్చునా?''

దంప: ''దేవిగారి యనుగ్రహము చేత నిస్సందేహముగ వీడినది!''

రాణీసారంధా

ప్రథమరంగము

అంధకారమయ్యమై, నిశ్శబ్దముగ నుండిన నిశాసమయమున, ధసాన నదీప్రవాహము పర్వత శిలలకు మాటిమాటికిఁ దాకుచుఁ మంజు లారావమును గలిగించుచున్నది. నది కెడమగట్టున నున్న గుట్టమీఁదఁ బురాతనమగు కోట యొకటి, పచ్చికచే ముట్టడింపఁబడియున్నది. ఆ గుట్టకుఁ దూర్పుదిశనఁ గొంచె మెడముగ నుండిన చిన్న గ్రామమును, నాదుర్గమును, నొక బుందేలు సరదారుని స్మరణ చిహ్నములుగ నిలిచి యున్నవి. ఇప్పుడా దుర్గ మాసర్దారుని వంశజుఁడగు, ఠాకుర్ అనిరుద్ధసింహుఁడను యౌవనుని స్వాధీనమున నున్నది. కడచిన యైదు శతాబ్దములలో బుందేలు ఖండమం దనేకరాజ్యము లుదయించి యస్తమించెను. మహమ్మదీయుల దాడు లనేక పర్యాయము వచ్చి పోయెను. బుందేలు రాజులు పలువురు ప్రబలి యడంగిరి. వేయేల! రాజ్యకాంక్షకు గుఱియై బాధింపఁబడని గ్రామముగాని ప్రాంతముగాని యాదేశమందుఁ గానరాదు. అయినను, మనమిప్పుడు ప్రస్తావించుచున్న దుర్గముపైన నిధివఱ కెన్నడును శత్రురాజుల పతాకము రెపరెపలాడుటగాని

యాగ్రామమునఁ బరసేనల పాదచిహ్నము లగపడుటగాని, సంభవింపక పోవుట యచ్చట వారి యదృష్టమే కదా!

అనిరుద్ధసింహుఁడు ధీరుఁడగు నొక రసపుత్రుఁడు. ప్రతి పురుషుఁడును ధీరుఁడుగను శూరుఁడుఁగను నుండుట తప్పని యవసరముగఁ జేసిన యాకాల మాహాత్మ్యమే యట్టిది! ఒక ప్రక్క మహమ్మదీయ సైన్యములు సర్వసిద్ధముగ పైఁబడ వేచియుండెడివి. వేఱొకదెస బలవంతులగు బుందేలురాజులు చిన్నరాజ్యముల నాశాభరితములగు చూడ్కులతోఁ జూచుచుండెడివారు. అనిరుద్ధ సింహుని యొద్ద స్వల్పసంఖ్యాకమైనను యుద్ధానుభవముగల యాశ్వికులు, పదాతులు చేరియుండిన యొక సేన యుండెను. తత్సహాయమున నతఁడు వంశగౌరమును బూర్వికుల కీర్తిని స్తవనీయముగ రక్షించుకొనుచుండువాఁడు. ఆ కాలపు తొందరలను బట్టి, యొకప్పుడైన సుఖముగా నొక తావునఁ గాలముఁ గడపు నవకాశ మాయనకు దొరకదయ్యె. శీతలాదేవిని బరిణయమై మూఁడు వత్సరములు మాత్రమే కడచినను, అనిరుద్ధసింహుని కోరికలతోడి దివములను, నాసల తోడి రాత్రులును, బర్వతారణ్య ప్రదేశములందుఁ గడచుచుండెను. శీతలాదేవి యనునిమిషమును భర్తృప్రాణములఁ గాపాడ భగవరితునకు వేయి మ్రొక్కు లిడుచుండును. "మీరు నాకన్నుల యెదుటనుండి యెచ్చటికిని బోవలదు. నన్ను హరి ద్వారమునకుఁ గొనిపొండు. బృందావనమును నాకుఁ జూపుఁడు,

మీతోఁగూడ నరణ్యవాసమునకైన సమ్మతించెదను. కాని మందీ వియోగ బాధను సహించఁజాల'' నని పలుమారామె నాథునితో నుడివెను. ఆమె యతనికిఁ జనువునఁ జెప్పెను. హటముతో ననెను. వినయముతో విన్నవించెను. కాని యనిరుద్ధ సింహుఁడు శూరుఁడగు బుందేలుఁడు కాన, శీతలాదేవి తనకడనున్న యే యాయుధముతోను నాతని జయింపఁ జాలదయ్యె.

అంధకార పరీవృతమగు నారాత్రివేళ ప్రపంచమంతయు నిద్రావస్థయందు నిమగ్నమై యుండినను, నక్షత్రములు మాత్రము తమ యాకాశ నివాసము నుండి నిక్కినిక్కి చూచు చుండెను. శీతలాదేవి శయ్యపై నిటునటుఁ బొరలుచుండ నామె యాఁడుబిడ్డ (భర్తృ సోదరి) యగు సారంధ క్రిందఁ గూరు చుండి హృదయాహ్లాదకరముగ నేదియో గీతమును బాడు చుండెను.

శీతలాదేవి :- ''నన్నేల బాధించెదవమ్మా! నావలెనే నీకును నిద్రపట్టలేదా?''

సారంధా :- ''నీకొక పాట వినిపించు చుంటిని.''

శీత :- ''నిద్దుర నా కన్నులను వదలి యెచ్చటికోపోయి నట్లున్నది''

సారం :- ''ఎవ్వరినైన వెదకఁబోయి యుండనోపును''

అంతలో ద్వారము తెరువఁబడి పొడవగు నాకారమును సుందర శరీరమును గల యౌవనుఁడొకఁడు తడిసిన కట్టుబట్ట లతో నిరాయుధుఁడై లోనఁ బ్రవేశించెను. శీతలాదేవి యది చూచి, మంచము దిగి క్రిందఁ గూర్చుండెను.

సారంధా యాపురుషుని జూచి "అన్నయ్యా! అనిరుద్ధ సింహా! నీ బట్ట తడిసి యున్నదేమి?" అని విచారించెను.

అనిరుద్ధ :- "నదియందీది, దాటి వచ్చితిని"

సారం :- "ఆయుధము లేమైనవి ?"

అనిరుద్ధ :- "లాగికొనఁబడినవి."

సారం :- "పరిజనులో ?"

అనిరుద్ధ :- వారందఱును రణరంగమున వీరశయన మొనర్చిరి.

ఈ సంభాషణమును విన్న శీతలాదేవి "భగవంతుఁడా! నేఁటికి రక్షించితి" వని యీశ్వరుని బొగడెను. కాని సారంధా ముఖము విచిత్రముగ మాఱెను. ఆత్మ గౌరవ భావతీక్ష్ణత యామె వదనమున కెఱ్ఱరంగును దెచ్చె. అంత నామె "అన్నయ్యా! వంశమర్యాదను బోఁగొట్టితివి గదా! ఇదివఱ కిట్లెన్నడును జరిగి యుండలేదు" అని చెప్పెను.

తనను బ్రాణతుల్యముగఁ బ్రేమించు సోదరి పెదవుల నుండి పై కఠిన వాక్యములను విని యనిరుద్ధసింహుఁడు సిగ్గుచే వివర్ణుఁ డయ్యెను. అనురాగభరమున నడఁగియుండిన యాతని

పౌరుషజ్వాల భగ్గున మండెను. అప్పుడాతఁడు ''సారంధా! నీవు నాకు జీవితాంతము వఱకు స్మరణయం దుంచుకొనఁ దగిన గుణ పాఠమును నేర్పితివి. దీని నెన్నటికి మఱువ'' ననుమాటతో వచ్చిన దారిని మరల వెడలిపోయెను.

అంధకార బంధురమగు నారాత్రి, యాకసమున రిక్కలు నిక్కి చూచుచుండ ననిరుద్ధసింహుఁడు కోటదాటి, కనురెప్ప పాటున నదిదాటి, మరలఁ దిమిరె సముద్రమున మునిఁగి యగ పడఁడయ్యె. శీతలాదేవి భర్త వెంట కోటగోడవఱకుఁ బోయి యాయన యొక దుముకున గోడ దాటి యవతల ఁబడిన తోడనే యొక శిలాతలమున గూలఁబడి విలపించుచుండెను.

అంతలో సారంధా యామెను గలసికొనఁగా శీతలాదేవి క్రోధదుఃఖాకులమగు మనమ్ముతో ''ఏమమ్మా! వంశమర్యాద యంత ప్రియమైనదా?'' యని యనెను.

సారం :- అవును, మఱేమని తలఁచితివి?

శీతలా :- నీ భర్తయైనచో హృదయ పేటిక యందు దాచికొని యుందువు.

సారం :- కాదు; కాదు! హృదయమును గటారుతో ప్రక్కలు చేసియుందును.

శీతలా :- ఇవి మాటలే కాని క్రియలు కాఁజాలవు. పల్లకియందు దాచుకొని తిరుగఁగలవు. నా మాట జ్ఞప్తియందుంచుకొనుము.

సారం :- ఇట్టి స్థితి సంభవించిననాఁడు నా మాటను నేను నిల్పి
కొనుటఁ జూచెదవులే.

ఇది జరిగిన మూఁడు మాసముల కనిరుద్ధసింహుఁడు "మహరూని" దుర్గమును జయించి యింటికి వచ్చెను. తరువాత నొక సంవత్సరమునకు స్సారంధాకన్య చంపత్ రాయని కర గ్రహణ మొనర్చెను. ఈ విధముగ నా యువతీ మణులు విడి పోయినను, నాఁటి మాటలు మాత్రము వారి హృదయము లందు మెదలుచునే యుండెను.

ద్వితీయ రంగము

రాజా చంపత్ రాయఁడు సమర్థుఁడును, నున్నతోద్దేశ పూరితుఁడును నగు రాజపుత్రుఁడు. బుంధేలుల కందఱకును నాతఁడు ప్రాణసమానుఁడుగనుండె. అతని కనుబొమ్మల కదలిక మాత్రమున సేనలు యుద్ధమునకును, రాజ్యములు పరాభవ దుఃఖమునకును సిద్ధపడునుండెడివి. సింహాసనము నధిష్ఠించిన తోడనే యాతఁడు మొగలాయి చక్రవర్తులకుఁ గప్పమిచ్చుట మానుకొని, కరవాలబలమునఁ దన రాజ్యమును విశాలముగఁ జేయ నారంభించెను. మహమ్మదీయ సైన్యములు మాటిమాటి కాతని పైకెత్తి వచ్చుటయు, బరాభూతములై కాళ్ళకు బుద్ధి చెప్పుకొనుటయు సంభవించుచుండెను. ఆ వీరశిరోమణి కొఱకు

బుందేలు ఖండమంతయు ప్రాణ త్యాగము చేయుటకు సర్వదా యుద్యుక్తమై యుండెడిది. అట్టి యశస్సామ్రాజ్యధురంధరుని ప్రేమకు ననిరుద్ధసింహుఁడు తన చెలియలి నప్పగించెను. సారంధావాంఛలు నెఱవేరెను. తన భర్త బుందేలు ఖండమునకు శిరోభూషణముగ నుండవలయునను నామె మనోరథము సఫలమయ్యెను. చంపత్ రాయుని రాణివాసమున నైదుగురు రాణు లుండినను మనఃపూర్వకముగఁ దన్నుఁ బూజించు యువతీరత్నము సారంధాతప్ప మఱెవ్వరును గారని యాతఁడత్యల్ప కాలముననే గ్రహింపఁగల్గెను.

కొంతకాలమునకుఁ గర్మవశమునఁ గొన్నికారణములు చంపత్‌రాయని ఢిల్లీ చక్రవర్తికంకితునిగఁ జేసెను. రాజ్యమును, దదితర వస్తు సందోహమును, సోదరుఁడగు "పహాడ్ సింగున" కప్పగించి యాతఁడు ఢిల్లీ కేఁగెను. అది షాజిహాను చక్రవర్తి పరిపాలన కాలముయొక్క తుదిభాగము. యువరాజు చంపత్ రాయని సమరప్రసంగముల నాశ్చర్యసంతోషములతో విని, సారవంతమును తొమ్మిది లక్షలరూప్యములు వచ్చుబడి గలదియును నగు "కాల్పి" ప్రాంతము నావీరునకు జాగీరుగ నిచ్చి గౌరవించెను.

చంపత్ రాయని కనుదిన యుద్ధోద్యోగమునుండి విముక్తి కలిగిన దినములలో నిదియే మొదటిది. సవైభవముగను, ససౌఖ్యముగను, క్రొత్త రాజ్యమును బాలింప మొదలిడెను,

విశ్రాంతితోఁబాటు శ్రీమంతమున కనుగుణములగు మార్పులు పొడసూపసాగెను. సుఖజీవనమందఱను బ్రమత్తులుగఁజేసె. కాని సారంధామాత్ర మాదినములలో మనోవ్యాకులతకును, నిరంతర విచారమునకును. గుఱియై యానందప్రధానములగు విందుల కంతగాఁబోఁగోరక యప్పటిసవ్యాజ సుఖముల నేవ గించు కొనుచున్నదిగఁ గానఁబడుచుండెను.

ఒకనాడు సంపత్ రాయఁడు సారంధాతో "ప్రేయసీ! ఈ నడుమ నీవు ఉదాసీనత వహించియుండుటకుఁ గారణమేమి? ఒక్కమారేనియు నీ సుందర ముఖారవిందమును వికసితస్థితి యందుఁ జూడనైతిని. నాయెడ నప్రియమా?'' యని యడిగెను. సారంధాసాశ్రులోచనయై "నాథా! తామట్లేల తలంచెదరు? మీ సుఖమే నా సుఖము. మీరు సంతోషముగ నుండిన నేను సంతోషముగ నున్నయట్లె'' యని గద్గదస్వరమున నుత్తర మిచ్చెను.

చంప:- నేను ఢిల్లీకి వచ్చినప్పటినుండి మున్ను నా నెమ్మ
నమును హరించుచుండు కాంతివంతమగు నీ చిఱు
నగవు నొక్క మారైన నీ ముఖము నలంకరిం
పఁగాఁ జూడనైతిని. కోమలములగు నీ హస్తము
లీనడుమ నొక్కమారైనను నాకు విడియమిచ్చి యుండ
లేదు. నీవొక్కసారియైనను నా శిరోవేష్టమును దిద్దలేదు.
నీ కరమ్ము లొక్కతూరి యేనియు నా శరీరమున

కాయుధమ్ములఁ దగిలింప లేదు. నిజముగా బల్కుము. సారన్ ! కారణమేమి ? నీకు నాపైఁగల తొంటి యను రాగపుఁ గ్రొత్తందనము తొలఁగి పోయినదనియే నేను భావించవలసినది.''

సారం :- "ప్రాణనాథా ! నేను ప్రత్యుత్తరమియ్యఁ జాలనట్టి ప్రశ్నముల వేయుచున్నారు. నిజముగనే యీ నడుమ నా హృదయము తేలికగ నుండుట లేదు. సంతోషముగ నుండుటకు నేనెంతయో యత్నించుచుందును. కాని, యేదియో భారము నా యుత్సాహము నడచి పట్టు చుండును.''

చంప :- (విచారముతో ఫాలమున ముడుతలువడ) ''నాకు నీ మనోవ్యథకుఁ గారణమే మాత్రమును దోచుటలేదు. ప్రియే! నీవే చెప్పుము. నీకుఁగల కొదువయెయ్యది ? ''ఓర్చా'' యందు మాత్ర మింతకన్న నెక్కువ సుఖ సాధనము లేవి యుండెను?''

ఈ మాటలు విన్నపిదప సారంధమో మెల్లవారెను. అంతనామె "నేమైన ననిన మీకుఁగోపము రాదేని చెప్పెద'' ననెను.

చంప :- చెప్పుము. నిశ్శంకముగాఁ జెప్పుము.

సారం :- ఓర్చాయందు నేను రాణిగనుంటిని; ఇచ్చటనో నేనొక జాగీరుదారుని భార్యను. అయోధ్యయందుఁ గౌసల్యాదేవి

యెట్టిపదవి యందుండెనో "ఓర్చా" యందు నేనట్టి పదవి ననుభవించు చుంటిని. ఇచ్చటనో నేను చక్రవర్తినికి దాసిని. ఏ రాజు నెదుట నేఁడు మీరు వినయమునఁ దల వంచుచున్నారో, యారాజు నిన్న మీ పేరు విన్న భయో త్కంపితుఁడగు చుండువాఁడు. రాణీ దశనుండి దాసి దశకు దిగియుఁ ద్రొంటియట్లు సంతసముగ నుండుట నా చేతనగు చుండలేదు. మీరీవిలాసములను, విశ్రాంతిని, సత్యున్నత మూల్యమునకుఁ గొనియున్నారు.

చంపత్ రాయని మనోదృష్టినంతకుమున్ను గప్పియుండిన మాయ విచ్చిపోయెను. అంతకు మునుపాతఁడు సారంధాయొక్క యాధ్యాత్మికౌన్నత్యము నెఱుంగఁడు. తన తల్లిని గూర్చిన ముచ్చటలు విన్న మాతృహీనుఁడగు బాలునివలెనే "ఓర్చా" జ్ఞప్తికి వచ్చి, తోడనే చంపత్ రాయని లోచన కమలము లశ్రు వులతో నిండెను. అంత నాతనికి సారంధాయెడ, దేవతపైన నవ్యాజోపాసకున కుండునట్టి భక్తిమనఃపూర్వకముగఁ గలిగెను. ఆనాఁటినుండి, యేస్థలమునుండి విలాసాసక్తిఁ దన్నులాగికొని ఢిల్లీకిఁ దెచ్చెనో, యాపూర్వ నివాసస్థలమునకుఁ బోయి నివసింప నాతని మనసు తొందరపెట్టసాగెను.

చిరకాలమునుండి దూరముననున్న కుమారుని రాకచే నానందమునొందు తల్లివలె, చంపత్ రాయని యాగమనము వలన బుందేలు ఖండమంతయు హర్షవారిధిఁ దేలియాడెను.

"జీరజ్" దుర్గముయొక్క సుప్త భాగ్యదేవత మేల్కొనెను. సంతోషసూచక భేరీ నినాదములు వీనులకు విందొనర్పసాగెను. సారంధాదృక్ప్రదేశములందు చిరునగవు మరలఁ దన కాంతిని జూపెను.

ఇచ్చటి నివాసమునఁ గొన్ని మాసములు గడచెను. అంతలో షాజిహాను వ్యాధిగ్రస్తుడయ్యె. చక్రవర్తి కుమారులలో మొదటినుండియే మనస్పర్థలుండినవి. ఈ వార్త న్నలుదెసలఁ గ్రమ్మఁగానే కలహాగ్ని ప్రజ్వరిల్లెను. సమరసన్నాహము లారంభమయ్యెను. మురాదు మొహియుద్దీనులు తమ సేనా వారముతో దక్కను నుండి వెడలినడిచిరి.

వర్షకాలమున వనప్రదేశ మాద్యంతమును పచ్చని పచ్చికతో నేత్రోత్సవ మొనరించుచుండెను. వృక్షలతాదులు వివిధవర్ణకుసుమములతో వనదేవత నలంకరించియుండెరు. మురాదు మొహియుద్దీనులు, ఆతురతతో సాగిపోవుచుఁ దుదకు "ధోలపుర" సమీపమున చేంబల్ నదీతీరమును జేరి చూడఁగా నవతలియొడ్డున సార్వభౌమిక సేన వారి నెదుర్కొన సిద్ధముగ నుండెను.

చక్రవర్తి పుత్రులిరువురును కళవళపడఁజొచ్చిరి. ఎదుట నది విశాలముగఁ బ్రవహించుచుండె. అవతలి గట్టున విరాగి ధైర్యమువలె సుస్థిరముగను, నినుపగోడవలె దుర్భేద్యముగను,

శత్రుసేనలు నిలచియుండెను. అప్పుడేమిచేయుటకును దోఁపక వారు "కరుణించి మమ్ము నీ విపత్తునుండి కాపాడు భారము మీది" అని వేడికొనుచు చంపత్ రాయనకు సందేశమంపిరి.

అంతట రాజు, రాణి వాసమునకేఁగి "ఈ సందేశమున కేమి ప్రత్యుత్తర మియ్యఁదగు"నని సారంధాను బ్రశ్నించెను.

సారం: సాయము చేయుట మన విధి.

చంప: వీరికిఁగేలూత నొసగుట దారాతో వైరము తెచ్చి పెట్టు కొనుటయే కదా!

సారం :- అవునుగాని శరణాగతత్రాణమున కన్న నుత్తమధర్మ మెచ్చటఁగలదు?

చంప :- (యోచించి) సారన్! నీవు యోచించి ప్రత్యుత్తర మియ్యలేదు సుమా!

సారం :- నాథా! ఇప్పటిస్థితి మహాకఠినమైనదని నేనెఱుఁగుదును. మన సైనికుల రుధిరమ్మును నీరమ్మువలెఁబాఱఁ జేయ వలసివచ్చును. మన రక్తమును బ్రవహింపఁ జేయవలయును. ఆత్మార్పకులగు మన భటుల శిరముల నాశ్రిత జనావనమున నర్పించి తీరవలయును. చేంబల్ నది తీరమున శవములచే ఘట్టము నిర్మింపక తప్పదు. ఎంత కాలమువఱకానదీజలములు పాఱుచుండునో, యంత కాలమువఱకు బుందేలు స్వార్థత్యాగుల రక్త మరుణ కాంతులతోఁ బ్రకాశించుచుండుననియు, బుందేలు ఖండ

వాసుల సంతానములలో నొక్కఁడేనియు జీవించియుండు వఱకీరక్తమాతని ఫాలదేశమునఁగేసరీతిలకమై మెఱయు ననియు, జ్ఞప్తియందుంచుకొనుఁడు.

ఆకాశమున మేఘరూపక సముద్ర ముత్తుంగత రంగమున లతో నొప్పుచుండెను. అట్టి తరుణమున "జీరజ్" దుర్గము నుండి రణరంగమునఁ దమశిరముల బలివెట్ట నుద్యుక్తులై యున్న బుంధేలు పరాక్రమశీలుర ప్రబల సైన్యము బయలువెడలి చేంబల్ నదిదెస సాగినడిచెను. ప్రతి భటుఁడును మూర్తీభవించిన వీర రసమువలెనుండె. అత్తఱి సారంధా, సమరావని కేఁగుచున్న తన కుమార ద్వయమును గౌఁగిలించుకొని నాథునకు విడె మొసంగి "బుంధేలుల మానము మీ చేత నున్నది. పరమేశ్వ రుఁడు మీ ఖడ్గముల నింద్రుని వజ్రాయుధములుగఁ జేయుగాత" మని దీవెన లిచ్చిపంపెను.

మన వీరనారీమణి యీసందర్భమున సమితోత్సాహభరిత హృదయయై యానందసాగరమున నోలలాడుచుండెను.

చతుర్థ రంగము

ఎడారియందు దాహాతిశయముచేఁ గంఠగతప్రాణుఁడగు పాంథుఁడు దూరమున సతీరతరుప్రచ్ఛాయ జలాశయము (oases) దృగ్గోచరమైనంతనే యానందపరవశమున మైమరచు

నట్లు, బుంధేలు సైనికుల యౌత్సుక్యముం జూచిన చక్రవర్తి తనూభవుల సంతోషమునకు మేరలేక పోయెను. చంపత్‌రాయఁడా ప్రాంతములను జక్కఁగా నెఱింగిన వాఁడగుటచే రహస్య స్థలముల డాఁగియుండఁ దన పరివారమునకు సన్నఁజేసి, చక్రవర్తి పుత్రులవెంట వచ్చి యధైర్యముచేత యథాయథలై యుండిన సేనలఁ బోరికాయత్తపఱచి నదియొడ్డుపొడుగునఁ బశ్చిమదిశోన్ముఖుఁడై నడిచెను. నదికవతలి గట్టుననున్న దారా ప్రతిపక్ష సైన్యములు వేఱొక రేవున నదిని దాటనుంకించు చున్నవని యూహించి, తత్క్షణమే తన సేనలనుసైతమాదెసకే నడుపసాగెను. అట్టి యదనుకై వేచియుండిన బుంధేలులు తోడనే తమ గుప్తస్థానములనుండి వెలువడి, యశ్వారూఢులై నదిలోకి దిగిరి. చంపత్ రాయఁడనంతరము దారాను మఱపించుచుఁదన సేనలఁ బలువైపులఁద్రిప్పి, బుంధేలుల మార్గముననుస రించి సేనతో రేవుదాటెను. ఇదియంతయు జరుగుట కేడు గంటలకాలము మాత్రమే పట్టెను. కాని రేవుదాటి చూచువఱకు బుంధేలు స్వామి భక్తుల శవము లేడువంద లచ్చట గుప్ప లుగఁ గూలి యుండెను.

రాజునుజూచినతోడనే, బుంధేలు సైన్యములకుఁ గలిగిన ధైర్యమింతయని చెప్పవలనుపడదు. వారంతట 'అల్లాహు అక్బ'రను రణనినాదముతో విజృంభించు చుండిన మొహియుద్దీనుని-సిపాయిలతోడఁగూడి, ఘోరున వీచుచు సముద్రము నల్ల

కల్లోలముసేయు తుపానువిధమునఁ జక్రవర్తిసేనలఁ జెల్లాచెద రుగఁజేసిరి. అంతకుమున్నె బుందేలు వీరులవలన గాసి చెంది యుండిన యాసేన, ఈ క్రొత్తదాడివలన మఱింత డీలువడెను. ముష్టాముష్టియుద్ధ మారంభమయ్యె. కరవాలములు తమతమ యొఱలలోనుండి బయట దుముకసాగెను. ఎల్లెడల రక్తము కాలువలై పాఱఁజొచ్చెను. అంత సూర్యుఁడును నీఘోర రంగ మును జూడఁజాలకేమోయనఁ బశ్చిమాంబుధి మునిఁగెను. ఆక సము సంధ్యారాగముచేతను, భూమి రక్తపాతముచేతను నెఱ్ఱ వారెను. చిమ్మచీకటులు గ్రమ్మనారంభింపఁగానే ఖడ్గములు గూడ విశ్రాంతి నపేక్షింపసాగెను. అంతలోఁ బశ్చిమదిఙ్మండ లము నుండి మఱియొక దళము లోచన గోచరమై, చూచు చుండఁగనే చక్రవర్తి సేనల వెన్నంటి నిరుపమాన యుద్ధ నైపుణ్యముతో వానిపై కెగఁబడి తత్సైనికుల యడుగులఁ జెద రఁగొట్టెను. చూపరులు "ఈ క్రొత్త సైన్యమెచ్చటిదో"యని యాశ్చర్యచకితులై చూడసాగిరి. భక్తి విశ్వాసములు గలవారు కొందఱు విపత్సమయమునఁ జక్రవర్తి సుతులకు సాయపడ వచ్చిన దేవదూతలే వీరని భావించిరి. చంపత్ రాయఁ డీసేనో దంత మెఱుంగఁగోరి సమీపించు వఱకుఁ గ్రొత్తదళమున కధి నాయకుఁ డశ్వమును దిగి రాజు నెదుట నమ్రతతోఁ దలవంచెను. ఇంతకు ముందద్భుతముగ వీరవిహారము సల్పినది తన సారం ధాయేయని తెలిసినప్పుడు రాజున కెంత యుత్సాహముగను,

గర్వముగను, నుండెనో యూహించుకొను భారము మాచదువరు లదే యై యున్నది.

సమరాంగణ మప్పు డద్భుతాకారముఁ దాల్చియుండెను, ఏ తావునఁ గొన్ని గంటలకు ముందు భట సమూహములుండెనో యా తావున నిప్పుడు శవములు తప్ప మతేవియు నగపడవు! అక్కటా! సృష్ట్యాదినుండి మానవుఁడెన్ని ప్రాణముల నెంత నిర్దయతోఁ దీసి యున్నాఁడో వాని లెక్కించ నేరి తరమగును?

అంత, విజయాలంకృత సేనలు ప్రతిపక్ష సైనికుల వస్తువాహనముల లాగికొనసాగెను. ఇంతకుఁబూర్వము సజీవులు సజీవులతోఁ బోరాడుచుండిరి; ఇప్పుడో జీవవంతులు మృతకళే బరములతోఁ బోరాటము సల్పుచున్నారు! ఇంతకుము న్నగపడి నది పౌరుష ప్రదర్శక రంగము, ఇప్పుడది యాశాపరాయణ త్వముమై విషాదకరమగు దృశ్యముగ మాఱెను! ఇంతకు మునుపు మనుష్యుఁడు పశుత్వము నవలంబించియుండిన నిప్పుడాతఁ డాపశుత్వమునుండి పిశాచ దశకు దిగెను.

ఈ పెనఁగులాటలో, చక్రవర్తి సేనాధిపతియగు వలీ బహద్దరు ఖానుని శరీర ముండి లేని ప్రాణములతో మంటి యందుఁ బడియుండెను. అతని గుఱ్ఱము యజమానుని చెంగట నిలచి యాఁగలఁ బాఱఁదోలుచుండెను.

అట్టి స్థితియందు, గుఱ్ఱములపై నమితప్రేమగల చంపత్ రాయని మనము నావారువ మాకర్షించెను, అది యొక మేలు జాతిది. పోతవోసినవో యనునట్లుండిన యవయవములసంపూర్ణ స్థితియుఁ బులివంటి వక్షమును జిరుతపులింబోలు నడుమును సొగసైన కన్గవయుఁ గలిగిన యాయశ్వమును, యజయానునియెడ దాని విశ్వాసమును, గన్గొని జనులచ్చెరువు నొందసాగిరి. దానింజూచి రాజు "జాగ్రత్త! ఆ గుఱ్ఱము నాయుధములతో నంటవలదు! దానినట్లే పట్టితెండు. అది నా లాయమునలంకరింపఁగలదు. దాని నాకడకుఁ దెచ్చియిచ్చువారు బహుమానము వడయుదు"రని యాజ్ఞాపించెను.

అనుభవశాలురగు నాయాశ్వికులు నలుదిక్కుల నుండి దానిని సమీపించిరి. కొందఱు వలను వేసియు, మరికొందఱితరోపాయము లొనర్చియు దానింబట్టదమ యుక్తిశక్తులను ధారవోసిరి. కాని వారి కోరిక నెఱవేరలేదు. నిమిషకాలమున సైనిక నికాయమెంతయో దాని చుట్టును మూఁగెను. సారంధాయును తన గుడారము వెలువడి నిర్భయముగ నా యుత్తమాశ్వము కడకేఁగి మంత్ర ప్రభావముచేతఁ బోలెఁ దలవంచి నిలచిన యద్దానిమెడపై చేయివైచి వీపు దువ్వసాగెను, స్వామిభక్తితత్పరమగు నాయశ్వము నిరాశ సూపునట్లామె చెరఁగు చాటున మోము దాచికొని, మేకపిల్లవలె మచ్చికగా నిలఁబడి కన్నీరు గార్పసాగెను. రాణియుఁ దన కన్నబిడ్డకువలె దాని

యశ్రువులఁదుడిచి జూలుపట్టి తన గుడారమునకుఁ దీసికొని వచ్చెను. అశ్వముగూడ ప్రాతచుట్టమువలె నామెవెంట నడిచెను. దయాగుణముయొక్క యీ ప్రభావమును జూచిన వారందఱు నాశ్చర్యము జెందిరవి వేఱుగఁజెప్పవలయునా?

తక్కిన వారియెడవలెనే గుఱ్ఱమామెయెడఁగూడ నిరాకరణభావమును జూపిన నెంత బాగై యుండెడిది! సుందర శరీరముగల యీజంతు వీరాజవంశము పాలిటికిఁకముందు, రామాయణమునందలి స్వర్ణ మృగముగఁ బరిణమించుట మా చదువరులు చూడఁగలరు.

పంచమ రంగము

ప్రపంచమొక యుద్ధ రంగము. ఏ సేనాని దృష్టులు ప్రసంగావధానము కలిగియుండునో, యాతఁడే యీ రంగమున విజయము నొందును. అట్టివాఁ డెంత ధైర్యోత్సాహములతో ముందడుగిడునో, విపత్సమయమున నంతే తాలిమితో వెనుకకుఁ దగ్గనేర్చియుండును. అట్టి వీరుఁడు రాజ్యముల స్థాపించును. రాష్ట్రముల నిర్మించును. ఇతిహాస మాతని పేరఁ బూలపూజ యొనర్చుచుండును.

అయినను, నీరంగమునఁగొన్ని వేళల, సమయోచితముగ ముందంజవేయు బాగుగ నేర్చినను నుపద్రవ సమయమున

వెనుకకు మరలుట నెఱుఁగని సేనానులు సైతము వచ్చుచుందురు ఇట్టివారు నీతి సిద్ధాంతములను బాలించుట కొఱకు విజయలక్ష్మిని నిర్లక్ష్యభావముతోఁ దిలకించెదరు. ఈ పద్ధతిగల సేనాని సమ రావని నొక్క మారడుగిడెనేని తన సైన్యమంతయు రూపు మాసిపోయినను సరే, వెనుకకు మాత్రమెన్నఁడును తగ్గడు. సమ యోచిత జ్ఞానహీనుఁడగు నీ సిపాయికిఁ బ్రాపంచిక విజయ మెప్పుడో యొకమారు తప్ప సామాన్యముగ లభింపదు. అయి నను నట్టి శూరుని పరాజయము సైతము పలుమారు విజయము కన్న నెక్కువ కీర్తిప్రదమైయుండును. సమయోచితజ్ఞుఁడగు సేనాపతి రాజ్యములను స్థాపించి రాష్ట్రముల నిర్మించినచో, నాత్మగౌరవ రక్షణార్థమై ప్రాణములఁ దృణీకరించు నీ సేనాని-వెనుకంజవేయుట కలనైన నెఱుఁగని నీ వీరావతంసుఁడు-రాష్ట్రముల నీతి వర్తనమును సంస్కరించును. వారి హృదయ ఫలకములపైన నీతియొక్క ప్రాముఖ్యమును శిలాక్షరములను వలెఁ జెక్కును. ప్రాపంచిక విజయమున నాతఁడు వన్నెకు రాకున్నను, ఏదైన సభయందుగాని, యుపన్యాసము నందుఁ గాని, యా పురుషుని నామోచ్చారణమయ్యేనేని, తోడనే సభ్యు లంద ఱేకగ్రీవముగా నాతని స్తుతించి కరతాళ ధ్వనులఁజేయు దురు. సృష్ట్యంతమువఱకును నాతని పవిత్ర నామము చుట్టును ఆధ్యాత్మిక గౌరవ రూపకతేజః పరివేషము స్థిరముగ నేర్పడి యుండును. మన కథానాయిక యగు సారంధా సహితము స్వగౌర వమునకై ప్రాణము లర్పించు నట్టి సేనానులలోఁ జేరినదే!

చక్రవర్తి పుత్రుఁడగు మొహియుద్దీన్ చేంబల్ నదీ తీరమునుండి, ఆగ్రాపురోన్ముఖుఁడై పోవునప్పుడు భాగ్యదేవత తన చల్లని నీడ నాతనిపైఁబడవైచు చుండెను. విజయలక్ష్మి దృగంచలముల నాతని జూచుచు వరింప సిద్ధపడియుండె. కావున నాగ్రాపుర ప్రవేశమైనతోడనే, సార్వభౌమిక సింహాసన మాతనికిఁ దన్నర్పించుకొనెను.

సింహాసనము నధిష్ఠించిన వెంటనే, ఔరంగజేబు, సార్వభౌమిక సైన్యపు సరదారుల తప్పులమన్నించి వారి మన్సబుల నెప్పటివలెనే నిల్పియుంచెను. రాజా చంపత్ రాయఁడు తన కొనర్చిన స్వార్థరహితమగు నుపకారమునకుఁ బ్రతిఫలముగ బారాహజారి (పండ్రెండు వేలు) నాయకత్వోద్యోగము నిచ్చియు, ఓర్ఛానుండి కాశివఱకును నచ్చటినుండి యమునానదివఱకును జాగీ రొసంగియు సన్మానించెను. బుంధేలు రాజసింహము మరల ఢిల్లీ సింహాసనపుమాండలికత్వమును తల ధరించెను. మరల నొకమారు విలాసప్రధానములగు విందులును, సభలును సమావేశము కాసాగెను. మరల సంగీత వాద్యశ్రవణసుఖాదులు తాండవ మాడఁ జొచ్చెను. మరల సారంధా మనఃపద్మము విచారతమముచే ముకుళించెను.

వలీబహద్దర్ ఖానుని వాగ్వైచిత్ర్య మనతికాలముననే యాలమ్గీరు చక్రవర్తి హృదయమునఁ దనకాశ్రయము సంపాదించుకొనఁగల్గెను. చక్రవర్తి యాతనిపైఁ దన కృపాదృష్టులఁ

బఱపసాగెను. కాని తక్కిన విషయములకన్న తాఁగోల్పోయిన గుఱ్ఱము సంగతి మాటి మాటి కాతని మనమ్మును వేధించు చుండెను. ఒకనాఁడు రాజకుమారుఁడగు ఛత్రపాలుఁ డాయశ్వ మునే యధిష్ఠించి విహారమునకై బయటికేఁగి మార్గవశమున ఖాను గృహమును సమీపించుట సంభవించెను. సమయమునకై యెదురు చూచుచుండిన యాఖానుఁడు తన సేవకులకు సన్న చేసెను. వారు గుఱ్ఱము నపహరించిరి. రాజపుత్రుఁ డొంటరి వాఁడగుటచే వారి నెదిరింపఁజాలక, నడిచి గృహమునకేతెంచి, సారంధాతో నాయుదంతమునంతయు విన్నవించెను. ఈ వార్త విన్నతోడనే రాణిరోషారుణితలోచనయై "గుఱ్ఱముపోయినదను విచారము నాకులేదు. కాని దాని వదలివచ్చిన నిన్నుఁజూచిన దుఃఖము వొడముచున్నది. నీ శరీరమున బుంధేలులకు సహజ మగు వీర రక్తము ప్రవహించుచుండలేదా? గుఱ్ఱము నీకు లభింపకపోయినమానె. ఒక బుంధేలుబాలుని నుండి యాతని యశ్వము నూడఁ దీసికొనుట నవ్వులాట కాదనియైన భవత్కర వాలబలమున నీవు చూపవలసియుంటి''వని విషాదము గదురఁ బల్కెను.

పై వాక్యములతో నామె శౌర్యధనులగు దన యిరువది యైదుగుర సిపాయిలను సమరోద్యుక్తులుగా నియమించి తానును బురుష వేషమున వారి నాయకత్వమును వహించి, ఖానుని యింటికిఁబోయి విచారింప నతఁడావారుపమునే యెక్కి దర్బారున

కరిగియుండెను. సారంధా తక్షణమె విద్యుద్వేగమున దర్బారున కెదురుగఁ బోయిచేరెను. సభాసీనులందఱును ఈ వార్తనెఱిఁగి కళవళము నొందసాగిరి. రాజసేవకులామూలనుండి యీమూలకును నీమూలనుండి యామూలకును బఱువిడి కూడిరి. ఆలమ్గీరు నైతము తన పీఠమునుండి లేచి సభాంగణమునకు వచ్చెను. సరదారులందఱు నాయుధపాణులై లేచి యుద్ధ సన్నద్ధులైరి. పలుదిక్కులఁ గోలాహల మారంభమయ్యెను. మున్నొకమారాసభయందే యమరసింహుని దారుణ కృపాణకాంతుల నవలోకించి యుండిన యనేకుల దృష్టియెదుట నప్పటిరంగము మరల మూర్తీభవించెను. అంతట సారంధా యెలుఁగెత్తి ఖానునితో "ఖానుగారూ! చేంబల్ నదీ తీరమునఁ జూపవలసియుండిన శౌర్యమును మీరు నేఁడొక బాలునియెడఁ జూపి యుండుట యెంతయు లజ్జాకరము. బాలునినుండి యశ్వమును లాగికొనుట మీకు న్యాయముగనే తోచినదా?" యని యడిగెను.

కన్నుల నిప్పులు వెదజల్లుచు ఖానుఁడు కఠినముగఁ బలికెను: "నా వస్తువును దమ స్వాధీనము చేసికొనుట కితరుల కెట్లధికారము గలదు?"

రాణి:- రణభూమియందు నాకు దొరకిన యీవస్తువు నాదికాక మీ దెట్లగును? నా వస్తువును మీరింత సులభముగ లాగికొనఁజాలరని దృఢముగఁ జెప్పుచున్నాను. దాని

కొఱకు నే నొక సహస్ర సైనికుల రక్తపాతమునకు సిద్ధపడి యున్నానని యెఱుంగుఁడు!

ఖాను:- ఈ గుఱ్ఱమునకు మారుగ నా లాయములోని యశ్వముల నన్నింటిని వదలుకొనెదను గాని దీనిని మాత్రమియ్యను.

రాణి:- నేను నా గుఱ్ఱమును దీసికొనక మానను!

ఖాను:- దానియెత్తు స్వర్ణరత్నాదు లనైన నిచ్చెదను గాని దాని నియ్యను.

రాణి:- అట్లయిన నా విషయమును ఖడ్గములు తీర్మానించుఁ గాక!

అంత బుంధేలు సర్దారు లొఱలనుండి కరవాలముల దూసిరి. కొంచెము సేపటిలో నాసభాంగణము రణాంగణముగ మాఱియేయుండును గాని యంతలో, ఆలమ్గీరడ్డమువచ్చి "రాణీగారూ! మీ భటుల వారింపుఁడు. గుఱ్ఱమును మీకిప్పించెదను. కాని దానివెల మాత్రము చాల హెచ్చుగు" ననెను.

రాణి:- దానికై నేను నా సర్వమును గోల్పోవ సిద్ధముగ నున్నాను.

ఆలం:- జాగీరు మన్నబులుగూడనా?

రాణి:- జాగీరుమన్నబులు నాకొక లెక్కయా?

ఆలం:- మీ రాజ్యముకూడ నంతేయగునా?

రాణి:- అదియు నాకుఁ దృణప్రాయము.

ఆలం:- ఇంతటి త్యాగమొక్క గుఱ్ఱము కొఱకుగా !

రాణి:- అయ్యో! గుఱ్ఱము కొరకుగాదు. ప్రపంచమందలి పదార్థముల నన్నిటిలోఁ బ్రియతమ మగునదేదియో దాని కొరకు.

ఆలం:- అదేది ?

రాణి:- ఆత్మగౌరవము.

ఈ విధముగ రాణీ సారంధాయొక గుఱ్ఱము కొరకుఁ దన విశాలమగు జాగీరును, గొప్ప మనసబును, చక్రవర్తికిఁ దమ యెడఁగల గౌరమును దృజించెను! ఇంతియకాక, సార్వభౌముని యాగ్రహమునకుఁగూడఁ బాత్రురాలయ్యె. ఆ నిముసమునుండి యామరణాంతమును చంపత్ రాయఁడు మనశ్శాంతి ననుభవింపలేదు.

షష్ఠమ రంగము

చంపత్ రాయఁడు మరల జీరజ్ దుర్గమున నివాసముండెను. మన్సబు జాగీరులను గోల్పోవుట యాతనికి వ్యసనము గలిగించెనుగాని, భార్య స్వభావమును బూర్తిగా నెఱింగిన వాడఁగుటచేఁ దన వ్యాకులతను బయటికిఁ దోఁపనియ్యఁడయ్యె.

కొంతకాలమిట్లు సుఖముగనే కడచెను. ఆనాఁటి సారంధా కఠిన వచనముల నాలమ్గీరు మఱచి యుండలేదు. కనుక సోదరులతోఁ గలిగిన వ్యవహారముల నుండి తీఱికయైనతోడనే యాతఁడొక ప్రబల సైన్యమును చంపత్ రాయని శిక్షింపఁ బంపెను. సమరానుభవముగల యిరువది యిద్దఱు సరదారు లీదండయాత్రకై నియోగింపఁబడిరి. చంపత్ రాయుని పిన్ననాఁటి క్రీడాసఖుఁడును బాల స్నేహితుఁడును నగు 'శుభకర్ణుఁ'డను బుంధేలుఁడు చక్రవర్తి సేనకు సుబేదారుగ నుండి రాయని సాధింప బద్ధకంకణుఁ డయ్యెను! ఇంకను ననేకులు బుంధేలు సరదారులు, తమరాజు పక్షమును వదలి చక్రవర్తి సేనాధిపతితోఁ జేరిరి. పోరు మహా ఘోరమయ్యె. సార్వభౌముని క్రీఁగంటి చూపుల యాశ సోదరులను సోదరుల రక్తమునకుఁ బిపాసాతురులఁ జేసెను. ఈ యుద్ధమున రాజునకే జయముగలిగినను నతని బలము పూర్తిగ గొఱవడెను. అతని రాజ్యమునకుఁ జుట్టుపట్టులనున్న బుంధేలు సంస్థానికులు చక్రవర్తి యనుగ్రహమునకుఁ దమ కర్తవ్య ధర్మము నమ్ముకొనిరి. ప్రాణమిత్రులలో గొందఱక్కఱకు వచ్చిరి. కొందఱు వంచించిరి. బంధువులు మొగములఁ దప్పింపసాగిరి. ఇన్ని యిక్కట్టులు ప్రాప్తించినను చంపత్ రాయఁడు ధైర్యము వదలినవాఁడుగాఁడు. జీరజ్ దుర్గమును వదలి మూఁడు సంవత్సరముల వఱకాఁతఁడు పర్వతారణ్యముల నిల్లుగఁ జేసికొనెను. వేట మృగములవలె దేశమందంతటను సంచరించు చుండు చక్రవర్తి సేనలలో నేదైన నొకదాని నసుదిన మెదు

ర్కొనవలసి వచ్చుచుండెడిది. సర్వకాల సర్వావస్థలయందును రాణి భర్తకుఁ దోడునీడయై ధైర్యమిచ్చుచుండెను. ఓర్ఛ నొకఁ మూలకుఁబోఁద్రోలి, యాశనశవిపాలుచేయు నంత భయంకర సమరసమయము లందును, నాత్మగౌరవ రక్షణోద్యోగ మాతని మనోదృష్టియెదుట మూర్తిభవించి యుండెడిది. ఒక సంవత్స రము వఱకీ విధముగ జరిగిన పిదపఁ జక్రవర్తి సేనాపతులు విసికి 'ఈ పులిని వేటాడుటకు దేవరకుఁ దప్ప వేఱొకరికి సాధ్యముకా'దని విన్నపమంపుకొనిరి. దాని కుత్తరముగ 'ముట్ట డులనాపి, సేనల మరలించుకొనిరం' డనునాజ్ఞాపత్రము వచ్చెను. 'ఈ యలజడి దప్పిన దింతేచాలు' ననుకొని రాయఁడు ఓర్ఛా దుర్గమునకు వచ్చి నివసించెను. కాని దట్టమగు మబ్బునుండి కొంచెము సేపు బయటఁబడి ప్రకాశించినను మరల మేఘాచ్ఛా దితుఁడగు భాస్కరునివలెనే కొన్ని మాసముల శాంత జీవనము తరువాత రాయభాస్కరుఁడు మరల వనవాసముపాలు గావలసి వచ్చెను.

సప్తమ రంగము

మూఁడువారములనుండి చక్రవర్తి సేనలు, ఓర్ఛా దుర్గ మును ముట్టడించి యున్నవి. హృదయములను భేదించు కఠిన వాక్యములవలె ఫిరంగిగుండ్లు ప్రహరీగోడలను భేదించుచున్నవి. కోటలోనుండిన యిరువదివేల జనులలో సగముకన్న నెక్కుడుగ

స్త్రీలును, దాదాపుగా నంతమందియె బాలురును నున్నారు. పురుషుల సంఖ్య దిన దినమునకును దగ్గుచున్నది. గాలియైన లోనికిఁ జొరకుండ నలుదెసల మార్గము లరికట్టఁబడినవి. భోజన సామగ్రు లత్యల్పములుగ శేషించియున్నవి. భర్తల యొక్కయు బిడ్డలయొక్కయుఁ బ్రాణములఁ గాపాడుట కొఱకు స్త్రీ లుపవాసవ్రతములఁ గడుపుచున్నారు. 'కొలఁదిదినములలోనే యందఱమును నిరాహారులమై చెడియవలసియుండు' నను నిశ్చయము వారి నందఱను గంఠగతప్రాణులఁ జేసినది. స్త్రీలు సూర్యునిదిక్కు చేతులెత్తి శత్రుసేనల శపించుచున్నారు. బాలురు కోపావేశపరవశులై తమ చిన్ని చేతులతో శత్రుసేనలపైకి విసరివైచుచుండిన రాళ్లు కోటగోడల వఱకైనను బోవుచుండుటలేదు. దురదృష్టవశమున చంపత్ రాయఁడుకూడ జ్వరబాధచేఁ గడు డస్సి మంచమువట్టి యున్నాఁడు. అప్పుడప్పుడాయనను జూచుట వలన నించుక యూఱట గలుగుచుండినను కోటలోనివారందరు సంక్షోభమగ్నమానసులై యుండిరి.

ఇట్టితరుణమున, రాజు సారంధాతో "సారన్! శత్రువులు నేఁడు తప్పక గోటలోఁ బ్రవేశించెదరని తోఁచెడి" నని పలికెను.

సారం:- అట్టిదినము జూచుఁ దౌర్భాగ్యము నీ కన్నులకు దేవుఁడు గలుగఁజేయకుండుఁ గాక!

రాజు:- మన యవస్థకేమి గాని 'మనతోఁబాటీ నిర్దోషులుగూడ నిడుమల గుడుచుచున్నారు కదా' యని తలంచినపుడు మనస్సున కగు నెవ్వగ యిట్టిదని చెప్పఁజాలను.

సారం:- మన మిక్కడనుండి వెడలిపోయినచో -

రాజు:- ఈ నిస్సహాయులను వదలిపెట్టియా?

సారం:-వారనుభవించుచున్న యాపదలకు మనమే కదా కారకులము-కనుక మన మొకవేళ వెడలిపోయినచో శత్రువులు వీరియెడ కనికరముఁ జూపవచ్చును.

రాజు:- నేను వారిని విడువఁజాలను. ఏ పురుషులు మన కొఱకు దమ యసువుల బలియిడిరో వారి భార్యాపుత్రుల నిట్టి స్థితియందు వదలిపోవనొల్లను.

సారం:-మన మిచ్చటనుండి మాత్రము వారికేమి సహాయము చేయుచున్నాము?

రాజు;- చేయకపోయినను వారితోఁగూడఁ జచ్చుటకైన వీలు కలదుగదా! వారి రక్షణోద్యమమున నేను ప్రాణములఁ బాసెదను, వారికొఱకుఁ జక్రవర్తి సైన్యముల వేడుకొనెదను. చెఱసాల దుఃఖముల ననుభవించెదను. కాని వారిని విడువను.

సారంధా వెలవెలఁ బారిన తన ముఖమును వంచుకొని తనలో 'నిజముగనే చిరమిత్రులగు వీరిని శత్రు సైన్యముల

కోపాగ్నికి బాసటఁ జేసి మన ప్రాణములఁ గాపాడుకొనుటయేటి శౌర్యము? నాకిట్టి స్వార్థపరాయణత్వపు టుద్దేశమేల కలిగెను? నాధుని పరాధీన దైన్యమునుండి కాపాడవలయునను గాటమగు తలంపు మానవ కర్తవ్యభావము నడచి వైచినది కదా' యని తలంచి మరల భర్తతో ''ఒకవేళ శత్రుసేనలు వీరిని బాధింప వను నిశ్చయము మీకుఁకలిగినచో నావేడికోలు నంగీక రింతురా''?'' యని యడిగెను.

రాజు:- అట్టి నిశ్చయముఁ గలిగించు వారెవరు?

సారం:-చక్రవర్తియొక్క సేనాధిపతి వ్రాత.

రాజు;- ఆ! అట్లయిన నొప్పుకొనెదను. కాని యింకొక సంగతి. వీరందఱు సంతోష పూర్వకముగ నన్ను వీడుకొల్ప వలయును.

సారంధా కొంచెము సేపు విచారసాగరమున మునింగి యుండెను. ''సేనాధిపతితో నిట్టి యొడంబడిక చేసికొను టెట్లు? సందేశమును దీసికొని పోవువారెవరు? ముష్కరులగు నాశాత్రవు లిట్టి నియమమున కెట్లులోబడుదురు? రెండుమూఁడు దినములలో జయమబ్బునను నమ్మకముగల శత్రుసేనలు సంధి కెట్లంగీక రించును? వాక్చమత్కృతి చేతను వ్యవహార నైపుణిచేతను నీ పనిని నెరవేర్పయోగ్యుఁడగు వాడెవ్వఁడు గలఁడు? ఛత్రసాలుని చేత నీ కార్యము నెఱవేరునా?' యను తలంపు లామె మనము

ననేక మారులు బాధించి తుదకు ఛత్రసాలుని బిలువనంపఁ జేసెను. ఈ ఛత్రసాలుఁడు రాణియొక్క సుతచతుష్టయమున, తక్కినవారికన్న నెక్కువ ధీమంతుఁడును వచోమాధుర్యము గలవాఁడును నైయుండినందున తల్లి కీతనియం దెక్కువ మక్కువ గలిగియుండెను. ఛత్రసాలుఁడు వచ్చి తల్లికిఁ బ్రణామము లొనర్పఁగానే, రాణి కనుదమ్ముల నశ్రువులునిండి హృదయమునుండి యొక దీర్ఘనిశ్వాసము వెలువడెను.

ఛత్ర:- అమ్మా! నాకేమి యాజ్ఞ?

రాణి:- ఈనాఁటి యుద్ధవార్తలేమి?

ఛత్ర:- మనభటు లేఁబదిమంది యిదివఱకు మడసిరి.

రాణి:- హా! పరమేశ్వరా! బుందేలుల మానములఁగాపాడు భారమిఁక నీదే.

ఛత్ర:- నేఁడు రాత్రివేళఁగూడ యుద్ధము చేయ నుంకించు చున్నాము.

అంత రాణి తన యుద్దేశమును నాల్గుమాటలతో నాతనికిఁ దెల్పి "ఈ కార్యమున కెవరిని నియోగించిన బాగు" అని ప్రశ్నించెను.

ఛత్ర:- నన్ను నియోగింపుము.

రాణి:- నిన్నా! నీవీకార్యము నెఱవేర్పఁగలవా?

ఛత్ర:- నాకు నాశక్తిని గూర్చి యట్టి నమ్మకము గలదు.

ఛత్రసాలుఁడా సందేశమునుగొని వెడలి పోవునపుడు తల్లి తన తనూజుని గౌఁగిలించుకొని "ఈశ్వరుఁడు నీ మోమును ద్వరఁగాఁ జూచు భాగ్యము నాకుఁ గలుగఁజేయుగాత" మని దీవించి కొంత సేపటివఱకుఁ గన్నీరు మున్నీరుగ నేడ్చెను. పిమ్మట నాకసమువంకఁ దన కర పల్లవములనెత్తి ''దేవా! యశఃకాముఁడును వీరశిరోమణియునగు నా నవయౌవన పుత్రుని బుందేలుల మానరక్షణమునకై నీ కర్పించితిని. నీవుగాక మా గౌరము నిలువఁబెట్టువారు మరెవ్వరుగలరు? కరుణతో నాయొసఁగిన యీ యమూల్యార్పణము నంగీకరింపుము'' అని వేడెను.

అష్టమ రంగము

మరుచటిదిన ముదయమున, రాణి స్నానము చేసి, పళ్లెరమునఁ బూజాద్రవ్యముల నిడుకొని దేవాలయమునకుఁ బోవునప్పుడామె ముఖము పచ్చఁబారియుండెను. కన్నులఁ జీకటులు గ్రమ్మెను. నిద్రాదేవి యొక్క సన్మోహనాస్త్ర ప్రభావము విచారగ్రస్తులగు వారియెడఁ బనిచేయదుకదా! అట్లామె దేవతామందిర ద్వారమును జేరువఱకామె చేతనున్న పళ్లెరమున, మొనకుఁ గాగితము చుట్టఁబడియుండిన బాణ మొకటి వచ్చిపడెను. రాణి పళ్లెరము నాలయపు టరుగుమీఁద నునిచి కాగితమును దీసి చదువునప్పు డామెమోముఁదమ్మి వికసితమై కన్పట్టెను. కాని

యావికాసము చాలసేపు నిలచినదికాదు. "అక్కటా! ఈ కాగితమునకై నవయౌవనుఁడగు బిడ్డ నొకనిని బోఁగొట్టుకొంటిని గదా! కాగితపు ముక్కకొఱ కింతవెల నిచ్చినవా రీప్రపంచమున నెవరైన నుందురే?" యనుమాట లామె పెదవులనుండి వెడలెను.

సారంధా దేవళమునుండి మరలి వచ్చినతోడనే నాథుని కదకరిగి "మనోనాథా! మీరు రాత్రి చేసియుండిన వాగ్దత్తము నిప్పుడు నెఱవేర్చవలయు" ననెను.

రాజు కలవరముతో మేల్కాని "నీ వాగ్దత్తమును నీవు నెఱవేర్చితివా?" యని యడిగెను.

రాణి తాను దెచ్చిన కాగితమును రాజుచేత కందియ్య నాతఁడు దానిఁ దుదివఱకుఁ జదువుకొని "సరి. ఇఁక నాకు మన వారినిఁగూర్చి చింతలేదు; పోవుదము. ఈశ్వరానుగ్రహ ముండిన మరియొకమా రీశత్రువుల రక్తముచే నా కరవాలపు దప్పి దీర్చెదను. కాని ప్రేయసీ! నిజము చెప్పుము. ఈ యొడం బడిక కెంత వెలఁజెల్లించితివి?" యని ప్రశ్నించెను.

రాణి:- (యశ్రుపూరితనయనయై) చాల ప్రియమైన వెల!

రాజు:- అదెంత?

రాణి:- సుకుమారుఁడగు నొక కుమారుఁడు

రాజామాటవిని నిశ్చేష్టితుఁడై కొంతసేపటికి "ఏ కుమారుడు? అంగదరాయడా?"

రాణి:- కాఁడు.

రాజు:- రత్నసాహుఁడా?

రాణి:- కాఁడు.

రాజు:- ఛత్రసాలుఁడా?

రాణి:- అవు నతఁడే——

ఈ శబ్దమును విన్న చంపత్ రాయఁడు, కంఠము నఱకఁబడిన పులుఁగుమాడ్కి, నొక్కమారు పై కెగసి మరల శయ్యపైఁబడి మూర్ఛితుఁడయ్యె. ఛత్రసాలుఁడాతనికిఁ గడు గారాబుకొడు కగుటయే కాక నాయన యాశలన్నియు నాతని యందే యుండెను. అఱగంట తరువాతఁ దెలివివచ్చిన పిమ్మట "సారన్! నా కీమాట ముందుగానే తెలిసియుండినచో ఛత్రసాలుని గోల్పోయియుండను. ఛత్రసాలుఁడు మృత్యువువాతఁ బడియెనేని, బుందేలు వంశ జ్యోతి కొండ కెక్కును గదా!" యని పట్టరాని నెవ్వగతో దీనముగఁ బలికెను.

ఆ రాత్రి కోటలోని వారికిఁగడు విషాదముగఁ గడచెను. స్త్రీలందఱును రాణి పాదముల పైఁబడి "మమ్మెన్నఁటికిని మఱువవలదని" వేడుకొనుచుండిరి, పురుషులు "పిన్ననాఁట నుండియు నీడవలె మీ వెంటనున్న మమ్మునిప్పుడు సైతము మీ వెనువెంటఁ గొనిపొం"డని జాలిగదురఁ బలుకుచుండిరి. కోటయంతయు దుఃఖరూపమును దాల్చెను. సారంధా స్త్రీలనంద

అను గౌఁగిలించుకొనెను. చంపత్ రాయఁడు పురుషులందఱ నెలవుఁగైకొని, సహస్ర సంఖ్యాకులగు జనులు వియోగ దుఃఖమున హాహాకారములు సేయుచుండఁ బల్లకి నెక్కెను. అచ్చటి వారందఱి డెందములును 'మరల నీ మహాత్మునిజూచు నదృష్టమబ్బునా'యని సందియమున గొందలమందుచుండె. ఇదియే తుదిదర్శనమని వారికిఁ దోఁపసాగెను. అంతియకాని, పల్లకియే యాతని శవ వాహనమగునేని యెవరు తలంపఁగల్గిరి!

కటికిచీకటులచే నిండియుండిన నాఁటిరాతిరి యాకాశము మాత్ర మసంఖ్య నక్షత్ర రూపకదీపికలు వెలుంగుచుండెను. కాని సమాధి దీపములవలె నవి కాంతి విహీనముగ నుండెను. దుర్గమంతయు శ్మశాన వాటికఁబోలె రోదనధ్వానములతోనిండి విను వారి గుండెలఁ బగులఁజేయఁజాలియుండె. అత్తఱి రాణి సైనిక వేషము ధరించి యశ్వారూఢయై వెంటరాఁగా, పల్లకి సొరంగము మార్గమున దుర్గమును దాటెను.

అనేక సంవత్సరముల క్రింద నిట్లే భయంకరముగ నుండిన యొకరాతిరి మా చదువరుల స్మరణయందుండవచ్చును. ఆ రాత్రి సారంధా మనస్సు ప్రేమామృతపు రుచినెఱింగి యుండ లేదు. ఆ సమయమున శీతలాదేవి చెప్పిన భవిష్యత్తిప్పుడు యథార్థమైనది కదా! అప్పుడు సారంధా యొసంగిన ప్రత్యుత్తర వాక్యములోని భవిష్యత్తు సైతమిప్పుడు నిజమగునా?

నవమ రంగము

మధ్యందిన మార్తాండుఁడు కిరణవ్యాజమున నిప్పుకణములఁ వెదఁజల్లుచుండెను. తీక్ష్ణమై, శరీరముల దహింపఁజేయు వేడిగాడ్పు దావానలము చందమున నరణ్యమును మండించుచు దిరుగుచుండెను. అగ్నిదేవుని సైన్యమంతయు విచ్చలవిడిగ విహరించుచున్నదో యనునట్లు తోఁచుచుండెను. భూమ్యాకాశ మధ్య ప్రదేశము నుష్ణధూళి మేఘమువలెఁ గ్రమ్ముకొనెను. అట్టివేళ సారంధా వారువము నెక్కి భర్తపల్లకిని వెంటఁగొని పశ్చిమ దిశోన్ముఖయై చనుచుండె. ఓర్ఛా దాటి పదిక్రోసుల దూరమేఁగిన పిదప నిఁకభయము లేదని మనస్సునకు ధైర్యము దోఁప నారంభించెను. మూర్ఛావశుఁడై యుండిన రాజుపల్లకిని మోయుబోయలు మార్గాయాసముచేఁ గడుడస్సి చెమ్మటయందు మునింగిదేలిరి. వెంటవచ్చు నైదుగురాశ్వికులును, వీరదంపతులును, బోయలతోఁ బాటు దాహాతిశయముచేఁ దహతహ లాడుచుండిరి. నీడనిచ్చు వృక్షము కొఱకును, నీటినిచ్చు బావి కొఱకును వారందఱ దృక్కు లత్యాతురతతో వెదకుచుండెను.

అంత రాణి వెనుకకు మరలి చూచునప్పటికి ఆశ్వికదళ మొకటి వచ్చుచుండెను. శాత్రవులు తమ్ము వెంటనంటివచ్చుచున్నారనియు ముందేదో కీడుమూడ నున్నదనియు నామెకు భయముదోఁచెను. కాని తరువాత తన తనూజ లొకవేళ సహాయమునకై వచ్చుచున్నారేమో యను నాశ కలుగసాగెను. నిరాశా

వశులై యున్నప్పుడు నైత మాశాంకురము లగపడుట మానవ స్వభావమే కదా! ఇట్లు కొంచెము సేపటివఱకా శూరవనిత యొక ప్పుడాశకును మరొకప్పుడు భీతికిని లోబడుచుండ, నంతలో నాయశ్వికులు రాజు పరిజనమును సమీపించిరి. శత్రుసేనల రాకను జూచి రాణి దీర్ఘనిశ్వాసము వదలెను. అంత నావిదుషీ మణి పల్లకి దింపుకొన భోయల కాజ్ఞాపించెను. వెంటనున్న బుంధేలు సిపాయిలుగూడ ఖడ్గహస్తులై సమరమున కాయత్తులైరి. దౌర్బల్యమువలనఁ దనయవస్థ కడు దుఃఖకరముగ నుండి నను, బలమైన గాలి సోకఁగనే ప్రజరిల్లు చిదుగులుగప్పిన నిప్పువలె, శత్రువుల యాగమనవార్త నెఱింగినతోడనే శరీరము నకు బలము హెచ్చ, రాజు పల్లకిఁదిగి బాణతూణీరములఁగేల బూని వెలువడెను. ఒకప్పుడు పరసేనలకు యము సందేశముఁ బోలియుండిన యాశూరుని బాణవిప్పుడు నిరర్థకమై వంగి పోయెను. తలవడఁకసాగె. నేల చదికిలఁబడియె. ఇక నదృష్ట దినములు గడచిపోయినవను మనోనిశ్చయ మాతనికిఁ గలిగెను సర్పమును జూడఁగనే యెగురనుంకించి మరల నేలగూలు రెక్కలులేని పక్షి విధమున చంపత్‌రాయఁడు దన స్థానమునుండి లేచి మరల క్రిందఁ బడెను. సారంధా బాష్పకలిత నేత్రయై "నాథా!" యని యొక్కమా రుచ్చరించి యూరకుండెను. తరువాత నామె పెదవులనుండి మాట వెడలలేదు. ఇట్టి సమయ ములందు, మౌనము ఉపన్యాసము కన్న నెక్కువభావ బోధకమై యుండును గదా! పాపము సారంధావంటి శూరవనిత నైత

మాతరుణమున స్త్రీ జన సహజమగు నబలాత్వమునకు లొంగిన ట్లగ పడుచున్నది ! అవును ; కొంతవఱకు మౌగ్ధ్యము స్త్రీలకు భూషణాస్పదమే యనుటయం దెవరికాక్షేప ముండును ? చంపత్ రాయఁడు భార్యనుజూచి "చూచితివా సారన్ ! మన భటులలో మరియొకఁగూడ మృత్యుకరాళమునఁ బడెను.ఏ యవమానముఁ దప్పించుకొన నే నాజన్మము యత్నించుచుంటినో, యా యవ మానమే అవసాన సమయమున నే ననుభవింపవలసి వచ్చెను ! నా కట్టెదుటనే శత్రువులు నీ పవిత్ర గాత్రము నంటుచుండ, నేనున్న తావునుండి కదలఁజాలని యవస్థయం దుండుట తటస్థిం చెను ! అయ్యో, మృత్యుదేవతా ! ఎన్నడు నా యవమానమున కంతము కలిగింతువో కదా !'' యన వగవ సాగెను.

ఈ వాక్యములఁ బలుకువేళ నా వీర పురుషున కొక సంగతి జ్ఞప్తికి వచ్చినందున దవ్వననున్న ఖడ్గముపై కాతని హస్త మఱికెను. కాని కరముల బలహీనతను దలంచి యాప్రయత్నమును మానుకొని ''సారన్ ! నీ వనేక మారులు నా మానము గాపాడి యుంటివి ! జ్ఞాపకమున్నదా ?'' యని యడిగెను.

ప్రియుని వాక్కు నుండి వెలువడిన యీ మాటలు సారంధా మనోదౌర్బల్యమును బారఁదోలెను; అశ్రుపు లారి పోయె; వాడియుండిన ముఖకమలముపై మరల నరుణకాంతి పొడచూపెను. ''ఇంకను నేను నా మనోనాధునకు సాయము

చేయఁగలను గదా!" యను భావ మామెను దుఃఖనిద్ర నుండి మేలు కొల్పెను. అంత నామె భర్త దిక్కు మొగమై "ప్రాణేశ్వరా! ఈశ్వరుఁడు రక్షించిన జీవితాంతమువఱకును నన్నే కాపాడెద"నని ధైర్యముతోఁ జెప్పెను.

చంపత్:— నీవు నా కోరిక నెన్నడును వృధపుచ్చిన దానవు కావు.

సారం:— ప్రాణములు బొందిలో నుండునంత కాలము వృధ పుచ్చను.

చంపత్:— ఇదియే నా తుది కోరిక యగునేమో! దీనిని తప్పక నెఱవేర్చవలయుఁ జుమా!

అగౌరవము పాలుగాకుండ నాత్మహత్య చేసికొనఁ దన్నుఁ బ్రేరేపించుట భర్త యుద్దేశమై యుండునని తలఁచి సారంధా తన కరవాలము నెదకానించి "నాథా! ఇది తమ కోరిక కాదు. తమ పాదరాజీవములపైనఁ దలమోపి యసువులఁబాయుట నా మనోభీష్టమని నమ్ముఁడు" అని నమ్మకముదోఁపఁ బలికెను.

చంపత్:- నీవు నా యభిప్రాయమును గ్రహించియుండలేదు. శృంఖలబద్ధములగు గాలేళులతో, ఢిల్లీపుర వీధులందు లజ్జాకరముగ దిరుగుమనియా నన్ను శత్రువుల కప్ప గించి పోయెదవు?

సారంధ ఆశ్చర్యమగ్న మానసయై, భర్త యుద్దేశము నెఱుంగఁ జాలక యామె నాథుని మోమువంకఁ దేఱిపాఱఁ జూచెను.

చంపత్:- కోమలీ! నా కొకవరదాన మొసఁగఁగలవా?

రాణి :- నిశ్చింతగా నడుగవచ్చును.

చంపత్:- ఇది నిన్ను వేఁడు నా తుది మనోరథముసుమా! నా చెప్పినయట్లు చేసెదవా?

రాణి:- నాథా! సందియమేల? తప్పక చేసెదను; సెలవిండు.

చంపత్:- మాట యిచ్చితివి. వెనుకకుఁ దిరుగఁగూడదు.

రాణి :- (వణఁకుచు) సెలవిండు—

చంపత్:- నీ ఖడ్గముతో నా హృదయమును ఛేదింపుము.

రాణికిఁ బిడుగు వడినట్లు దోఁచె. అయినను గొంతతాలిమి వహించి యామె "ప్రాణేశ్వరా! ప్రపంచమున నిట్లెందేని జరిగెనా?'' యనెను.

రాజు:- సంకెలల వేసికొనుటకై జీవించుట నా కిష్టము లేదు.

రాణి:- ఇట్టి కార్యమునకు నేనెట్లు తోడ్పడనేర్తును? జీవితేశ్వరా! మన్నింపుము —

ఇంతలో రాజు ననుచరులలోని యైదవ యాశ్వికుఁడుఁ గూడ గాయపడి నేలఁగూలెను, అదిచూచి రాజు పరాభవక్లేశ జనిత క్రోధముతో "నిట్టి సమయముననే కదా నా మానముఁ గాపాడెదనని నీవు పంతము చేసి యుంటివి'' యనెను. చక్రవర్తి

సైనికులు రాజుపైకి వచ్చునంతలో రాణి తన కటారును రాజు వక్షమునఁ గ్రుచ్చెను. ఎదనుండి రక్తము ప్రవాహమువలె గారు చుండినను రాజు ముఖమునఁ జిఱునగవు వ్యక్తమగుచుండెను.

అక్కటకటా ! ఎట్టి విషాదకరమగు దృశ్యము ! ఏ యువతి భర్త కొఱకుఁ దన ప్రాణముల నర్పింప సిద్ధముగ నుండెనో యా యువతి తన భర్తకు హంతకురాలయ్యెను ! ఏ వక్షస్థల మామె యౌవన సౌఖ్యములకు స్థానమైయుండెనో, యే వక్షస్థస్సలమామె యాసల కాటపట్టుగను, మనోరథమ్ముల కాశ్రయమ్ముగను నుండెనో, యే వక్షస్థల మామె గౌరము నకుఁ గాపరిగను, ప్రేమకు నిదానముగను, నుండెనో, యా వక్ష స్థలమును నేఁడు సారంధా కరవాలము ముద్దిడుకొనుచున్నది ! ఈ ఖడ్గము విధి నిర్వహణపుఁ గటారు ! ఈ ఖడ్గ మనురాగపు బల్లెము ! కానిచో నే స్త్రీ ఖడ్గ మిట్టిపని చేయఁ గల్గును ?

ఆహాహా ! ఆత్మ గౌరవాసక్తి యొక్క పరిణామమెట్టి సంతాపకరమైనదో చూడుఁడు ! ఉదయపుర మార్వాడదేశ చరిత్రములలో నైత మాత్మ గౌరవము యొక్కయు, ధైర్య సాహసముల యొక్కయు నిట్టి యుదాహరణము లగపడుట దుర్లభము ! తమ ప్రాణములఁ బాయుట స్త్రీలకుఁ గడు సులభ మైన కార్యము, కాని, యిట్టి కార్యమును సారంధావలనఁ దప్ప మఱి యే వనిత వలనను నెఱవేరియుండలేదు. అసూయ వలనను, విషయ సుఖాసక్తివలనను దమ భర్తలయుసురులం గొనిన స్త్రీ

లనేకులు గలరు. కాని కర్తవ్య నిర్వహణమునందు, పాతి వ్రత్యరక్షణమునందును, ఆత్మగౌరవ నిరతియందును, ఇట్టి కీర్తి ప్రదమగు బలిదానము ఎచ్చటను గానరాదు !

సారంధా యొక్క నిరుపమాన ధైర్యమును జూచి చక్రవర్తి సైనికులు చిత్రప్రతిమలైరి. వారి మనసు నందుండిన విరోధము గౌరవభావముగ మాఱెను. అంత వారి సరదారులు ముందడుగిడి యిట్లు విన్నవించిరి: "అమ్మా! మేమందఱమును మీ దాసులమని దైవసాక్షిగఁ బ్రమాణము నేసెదము. మీ యాజ్ఞ మాకు శిరసావంద్యము." రాణి యా మాటలకుఁ జిఱు నవ్వునవ్వి "మా కుమారులలో నెవ్వఁడైన బ్రతికి యుండెనేని, మా శవములను వానికి నప్పగింపుడు" అని చెప్పి రక్తసిక్త మైన యా కటారును దన రొమ్ముననఁ గ్రుమ్ముకొని, భర్త వక్షస్థలమునఁ దలనునిచి నేల కొఱిగి ప్రాణములఁ బాసెను.

గీ. కాలమా ! యొకించుక మమ్ముఁ గనికరించి
మా కొసఁగరాదె మా మహామహుల మరల ?

—ఆధునికకవి.

ముసలిదాని యుసురు

ప్రథమ రంగము

గీ. దీనయగు నాథుదాని దుఃఖానలమునఁ
బాడు కాలేదె బాగ్దాదు పట్టణంబు! సాదీకవి.

భైరవమూర్తి ధుమ ధుమ లాడుచు గుమ్మము వెలుపలికివచ్చి విసుకుకొనుచుఁ బల్కెను: "ఇటువంటి బ్రతుకు కంటెఁ జావు మంచిది.''

మృత్యుదేవతను దిట్టనివాఁ డీప్రపంచమున సాధారణముగాఁ గానరాఁడు. మనుష్యుని చేతిలోనే యుండిన పక్షమున మృత్యువు నామమాత్రా వశిష్టమై యుండును. మృత్యుదేవతను బిలచువారు కూడఁ జాలమంది గలరు; కాని యన్ని యాహ్వానముల నంగీకరించుటకు దానికి తీఱిక యెక్కడిది? కావలసినంత తీఱికయే యుండిచచో నేఁడు జగమంతయు నిర్మానుష్యమై యుండెడిది!

భైరవమూర్తి మాయవర గ్రామములోఁ బ్రసిద్ధుఁడగు దేశపాండ్యా-గొప్ప వంశస్థులకుండవలసిన లక్షణము లన్నియు నతనియందుండెను. అహంభావము, దౌర్బల్యము ఎంత విస్తా

రముగా నుండెనో, అతని యాదాగూడ నంత యెక్కువగా నుండెను. మన మూర్తికి పైఁజెప్పిన గుణములు పిత్రార్జితమైన యాస్తి. అతఁడు ప్రతిదినము ప్రాడ్వివాకన్యాయస్థానము (మునసబు కోర్టు) లోపలి యొక వేఁపచెట్టు క్రిందఁ బగుళ్లు వాసిన యొక బల్లమీఁద దస్తరము విప్పుకొని కాగితములఁ దిరుగ వేయుచుఁ గానవచ్చుచుండును. ఏదైన 'లా' విషయమును గుఱించి కోర్టులో వాదించుచుండఁగా నతనిజూచిన వారెవరును లేకపోయినను, జనులందఱు, ఆయనను 'వకీలుగారు' 'వకీలు గారు' అని వాడుకొనుచుందురు. మండుగాడ్పులు వీచుచున్నను సరే, కుంభవృష్టి గురియుచుండినను సరే, వడగండ్లు రాలు చుండినను సరే, ఆయన స్వస్థానమును వదలువాఁడుకాఁడు. కోర్టునకుఁ బోవుచుండువేళ పల్లెటూరివాండ్ర గుంపొకటి యాతని వెంట నడుచుచుండును. గుంపులోని ప్రతివాని దృష్టియు గౌరవ భావ మిశ్రితమై యాతనిపై నఁ బ్రసరించుచుండును. అంతేకాదు, చుట్టుప్రక్కల గ్రామములలోని వారందఱకును నొకటే విశ్వాసము. "ఇతని నాలుకమీఁద సరస్వతీదేవి యున్నది."

ఇది వకాల్తువృత్తి యగునోకాదో మాకుఁదెలియదుగాని, మొత్తముమీఁద నిది యాతనికి అనువంశికమగు వృత్తి. గౌరవ ప్రతిఫలము కోరకుండచేయు వృత్తి. అదా విశేషముగా వచ్చుచుండె ననుమాట, మాకు తెలిసియున్నంతవఱకు, కేవల మసత్యము. వెండి నాణెములు చేతిలోనికి వచ్చుమాట లేదుగదా

రాగినాణెములైనను నతనిచేతిని సమీపించుటకు సందేహించు చుండును!

భైరవమూర్తికి 'లా' వచ్చుననుమాట నిర్వివాదాంశమే; కాని 'మొగమోట' మార్జనకడ్డము వచ్చుచుండునఁట. ఏ కారణ మైననేమి, ఈ వృత్తి యతనికి గౌరవవృత్తియేకాని వేఱుకాదు. అతని సంపాదనకు రెండ్లే మార్గములు. అవి, చుట్టు ప్రక్కల నుండు ధనవంతురాండ్రగు వితంతువుల వ్యవహారములను జక్క బెట్టుట; సంపన్నులై తెలివిమాలిని గృహస్థుల పనుల నెఱ వేర్చుట. వితంతువులు తమ ద్రవ్య మాతని యొద్ద దాచుకొను చుందురు. అవిధేయులగు కుమారులచేతఁ జిక్కకుండ ముసలి వాండ్రు తమ డబ్బు నతని కప్పగించుచుందురు. అతని పిడికిలి లోనికిఁ బోయిన తరువాత డబ్బు బయటికి వచ్చుట యెఱుఁగనే యెఱుఁగదు. మన మూర్తి అప్పుడప్పుడు నప్పుకూడఁ జేయు చుండును. సంసారియైన వానికి ఋణము లేక యుండునా? సాయంతనము వేళ నిచ్చెదనని యతఁడు బదులు తీసికొనును గాని సాయంత్రమెన్నఁడును రానేరాదు! అప్పులవాండ్రకు పైకముఁ జెల్లించుట జీవితకాలములో నతఁడెఱుఁగఁడు. ఇది యాతనికి తరతరములనుండి వచ్చిన బూర్వాచారముగాని క్రొత్తదికాదు.

ఇట్టి వ్యవహారములు గొన్ని వేళల నతని సౌఖ్యమునకు భంగము గలిగించు చుండును. 'లా' విషయమున నతని

కేమాత్రము భయము లేదు. 'లా' రంగమున మన మూర్తితోఁ బోరాడుట పర్వతమును డీకొనుటయే. కాని, తుంటరులు కొంద అతనిపై నపోహములు కల్పించి, అతనివర్తనము మంచిదికాదని యనినప్పుడును, దుర్భాషలాడి నప్పుడును, అతనికిఁ జాల కష్టముగా నుండును. ఇట్టి సందర్భములు ప్రతిదినము వచ్చుచుండెను ఇట్టి తుంటరుల చేష్టలను జూచి కొన్ని సమయములలోఁ గొద్ది పాటిమనుష్యులు గూడ మూర్తి యసౌఖ్యమునకుఁ గారకులగుచుండిరి. కాదేని, చిల్లిగవ్వ చేయని కూరలమ్మ 'మైసికి' అతని యింటికిఁబోయి కఠిన వచనములచే నొప్పించునంతటి సాహసము పుట్టునా? అతఁడేమి క్రొత్తవాఁడా? ఎన్నియో సంవత్సరములనుండి తనయొద్ద కూరగాయలఁ గొనుచుండినవాఁడు. పైసలియ్యలేదనియే యనుకొనుఁడు. ఇంతలోనిల్లూడఁబెఱికికొని యెచ్చటికైన పాఱిపోవునా? నేఁడియ్యక పోయినచో మఱినాలుగు నెలలకిచ్చును. ఇంతలో ముంచుకొని పోవునదేమి? కాని, మైసికి ఓపిక యెక్కడిది? రెండేండ్లయినంత మాత్రమున, పావలా డబ్బుల కొఱకుఁ బెద్దమనుష్యుని నవమాన పఱచినది! ఇట్టి సమయమున మూర్తికిఁ గోపము వచ్చి విసికికొని మృత్యువును బిలచినచో నందు దోషమేమియున్నది?

ద్వితీయ రంగము

ఆ గ్రామమున 'అంకమ్మ' యను బ్రాహ్మణ వితంతు వొకతెయుండెను. ఆమె భర్త బర్మా పటాలములో హవాల్దారు

పనిఁజేసి యుద్ధమునఁ జనిపోయెను. అతని యుద్యోగమును మెచ్చుకొని సర్కారువారు, అంకమ్మకు అయిదువందల రూపాయలిప్పించిరి. తాను ఆఁడుది. కాలము మాయలమారిది కనుక, అంకమ్మ ఆ ద్రవ్యమును మన భైరవమూర్తి యొద్ద నుంచి నెలనెలకుఁ గావలసినంత డబ్బు తీసికొని కాలము గడపుకొనుచుండెను. కొన్ని సంవత్సరముల కాలము మూర్తిపైకము చెల్లించుచువచ్చెను. కాని, 'ఎంత కాలమైనను అంకమ్మ చావదయ్యె. 'సగమైనను నాకు వదలునో వదలదో కదా' యను సంశయ మాతని బాధింపసాగెను. ఒకనాఁడు అతఁడామెతో ఖండితముగా నడిగెను: "ఏమి, అంకమ్మా! స్పష్టముగాఁజెప్పుము నీవు చస్తావా? నన్ను చావమంటావా?''

అనాఁడు అంకమ్మ కన్నులు తెఱచెను, "నాలెక్కయెంతో చెప్పండి'' యనెను. లెక్కదెంత యాలస్యము! వసూలుబాకీ సిద్ధముగానే యుండెను. వసూలుపోఁగా మిగత సున్న: ముసలితనమునకు సహజమగు కాఠిన్యముతో అంకమ్మ, మూర్తిచేయి పట్టుకొని యిట్లనెను. "నా రెండువందల యాభై రూపాయలూ మింగినావు. వాటిలో చిల్లి గవ్వ వదలిపెట్టను. ఏమనుకున్నావో?

మాట మాత్ర మనినది కాని దిక్కులేని యంకమ్మ కోపమునకు భయపడు వాఁడెవఁడు? అదేమి చేయును? వ్రాత, పూత రాదు. లెక్క, పత్రము అంతకుముందేరాదు, పంచాయతీ తప్ప మరే యాశయును లేదు, గ్రామములోని పెద్ద

మనుష్యులుకూడి పంచాయతీ చేసిరి. భైరవమూర్తి హృదయము గంగాజలమువలెఁ బవిత్రమైనది! ఆతనికేమి భయము? అందఱ యెదుట నిలచి యాతఁడిట్లనెను; "అయ్యలారా! తమరందఱు మర్యాదగలవారు. న్యాయబుద్ధికలవారు. నేను తమ పాదధూళివంటివాఁడను. తమ యందఱ పోషణవలన బ్రదుకుచున్న వాఁడను. తమ యనుగ్రహము తమ యౌదార్యము నా శరీరములోని యొక్కొక యణువును నిర్మించినది. దిక్కుమాలిన వితంతువు సొమ్మును నేనపహరించితి నని సత్పురుషులగు మీరు తలఁచుచున్నారా?"

పంచాయతీదారులు ఏకగ్రీవముగాఁ బలికిరి: "మీరాప్రకారము చేయువారు కారు, కారు."

"అంకమ్మ డబ్బు నేను మ్రింగినానని మర్యాద గల మీరు తలఁచిన పక్షమున నేనూతిలోనో పడుట తప్ప నాకు నుపాయాంతరము కానరాదు. నేను ధనవంతుఁడను గానుగదా! ఔదార్యము కలవాఁడనని నేను చెప్పకొనను గాని నా కలము బలమునను, దమ యనుగ్రహబలమునను, ఒకని యెదుట చేయిఁ జాపవలసిన యవసరము లేదు. దిక్కుమాలిన యొక ఆఁడుదాని ద్రవ్యమును హరించునంతటి తుచ్ఛకార్యమునకు నేను లోఁబడుదునా?"

పంచాయతీ దారులు మరల నేకగ్రీవముగా ననిరి; "మీరట్టిపని చేయువారు కారు. ముమ్మాటికిఁగారు."

'నోరుకలవానిది యూరు' మూర్తిని నిర్దోషి యని పంచాయతీదారులు విడుదలచేసిరి. అంకమ్మకుఁ గల యీ యాశయు నణఁగిపోయెను. మనస్సున కొంత యూఱటఁ గలిగించు నాశ యొకటి మాత్రము మిగిలియుండెను, "ఇక్కడఁ దప్పించుకుంటివి గాని, అక్కడఁ దప్పించుకుంటావా?"

తృతీయ రంగము

అంకమ్మను ఆదరించువా రెవరును లేరైరి. దారిద్ర్యమూలములగు కష్టములన్నియు నామెతలపైనఁ బడెను. రాత్రిందివములు 'ధనము' అనునది తప్ప వేఱుధ్యాన మామెకులేదు. జాగ్రతావస్థయందేమి, స్వప్నావస్థయందేమి, సర్వకాలసర్వావస్థలయందును- భైరవమూర్తి స్మరణతప్ప వేఱుపనిలేదు. తన కుటీరద్వారమునఁ గూరుచుండి, ఆమె మూర్తిని మనసు వచ్చినట్లు దీవించుచుండును. కొన్నివేళల నాదీవెనలు రసవంతములగు నుపమానములతోను, కావ్యోచితములగు యమకములతోను, మిళితములై యుండి వినువారికి నాశ్చర్యము కలిగించుచుండును!

అంకమ్మకు జనించిన యీ నిరాశ కాలక్రమమున వెఱ్ఱిగా మాఱెను. వెండ్రుకలు విరియఁబోసికొని దిగంబరయై, చేత నొక గొడ్డలిఁబూని నిశ్శబ్దముగా నుండు స్థలమునకుఁబోయి కూర్చుండును. కుటీరమును వదలి శ్మశానములందును, నదీ తీరములందును, పాడుగోడలలోను దిరుగుచుండును. ఎఱ్ఱని కండ్లతోను, భయంకరమగు ముఖముతోను, ఎండిపోయిన కాలు సేతులతోను నుండు నామెవిగ్రహమును జూచి జనులు భయపడు చుందురు. పూర్వమువలె నామె నిప్పుడు ఎవరును వెక్కిరింపరు. ఇండ్లకడకు రాఁగానే స్త్రీలు తలుపులు బిగించుకొనెదరు. పురుషులు ముఖములఁ దప్పించి వెడలిపోవుచుందురు. పిల్లవాండ్రు 'కాండ్రుకాండ్రు' మని పఱుగెత్తి పోవుచుందురు. అట్లు పరుగెత్తని ధైర్యశాలి మన భైరవమూర్తి కుమారుఁడు భేతాళ మూర్తి యొకఁడే. తండ్రియందుఁ గొఱఁగానున్న దుర్గుణములను బూర్తి చేయుటకో యనునటు లీశ్వరుఁడీబాలుని సృష్టించెను. గ్రామములోని కుఱ్ఱవాండ్ర నందఱను వీఁడుచావఁగొట్టి చెవులు మూయుచుండువాఁడు. ఊరిలోని కుంటి గ్రుడ్డివాండ్రందఱును వీని ముఖముఁ జూడఁగనే తిట్టుచుందురు. అత్తవారింటికిఁ బోవుట యనిన క్రొత్త యల్లునకెంత సంతోషమో తిట్లుతినుట యనిన మన భేతాళమూర్తి కంత సంతోషము. వీఁడు పిచ్చిదాని వెనువెంటఁ దిరుగుచు నది యూరువెడలి పోవునందాక చప్పటలు చఱచుచుండును. పిచ్చిది ఒంటరిగాఁ గూరుచుండి గంటల కొలఁది తనలోఁదానే మాట్లాడుకొనుచుండును. ఇట్టి స్వగతము

లలో భైరవమూర్తి మాంసమును, నెముకలను, చర్మమును, కన్నులను, ప్రేవులను ఊడఁబెఱికితినుట, నమలుట, మ్రింగుట మొదలగు విషయములు మహదుత్సాహముతో బయటఁ బడు చుండును. ఈ యుత్సాహ మతిరేకదశకు వచ్చినప్పుడు పిచ్చిది భైరవమూర్తి యింటివైపు ముఖము త్రిప్పి భయంకరధ్వనితో "నీ నెత్తురు తాగుతానుర్నా!" యని కేక వేయును.

నిశ్శబ్దముగా నుండు నిశాసమయములందు, ఈ కేక విని స్త్రీలదఱిపడి మేల్కొనుచుండిరి. ఈ కేక కంటె నెక్కువ భయంకరమయినది దాని యట్టహాసము! పిచ్చిది మూర్తి రక్తమును నిజముగానే తాను త్రాగుచున్నానని భ్రమించి, సంతోషమున బిగ్గరగా నవ్వును. ఈ యట్టహాసమునఁ బిచ్చిదాని యానందమును, క్రోధమును, మిళితములై వినువారి గుండెల వ్రయ్యలు నేయుచుండును. వందలకొలఁది కంఠములొకసారి కూడి నవ్వుచుండినట్లు దోఁచును!

భైరవమూర్తి కొంకుజంకు లేనివాఁడు. అతనికి దీవానీ (సివిలు) వ్యవహారమనినను భయములేదు; ఫౌజ్దారి(క్రిమినలు) యనినను భయములేదు. కాని పిచ్చిదాని భయంకరములగు కేకలు మాత్ర మతని ధైర్యమును గదలించుచుండెను. ప్రాపంచిక న్యాయస్థానముల భయముండినను లేకపోయినను, పారలౌకిక న్యాయస్థానభయము మాత్రము ప్రతి మానవుని హృదయము నందును సహజముగా నుండును. ఎంతటి దుర్మార్గుని

హృదయము నందై నను నీ బావ యొక్కొక్కవేళఁ బెకలించుకొని బయటకు వచ్చును. భైరవమూర్తి భార్య నాగమ్మ భర్త యెడ మిగుల విశ్వాసము గలదై, స్వీయవర్తనము వలన సహధర్మచారిణి యనిపించుకొనుటయే కాక, అను దినము వచ్చుచుండు వ్యవహారములలోను వివాదములలోను భాగము గొనుచుండును. ఆమె వాగ్విజృంభణము స్త్రీ జనమునందంతటను సుప్రసిద్ధము. వ్రాత యక్కఱలేకుండ నోటిమాటతో జరుగవలసిన వ్యవహారముల నన్నిఁటి నామెయే పరిష్కారము చేయును. మన పెద్దమూర్తి నాలుకపైన సరస్వతీదేవి యున్నదని యనుకొను వారిది పొరపాటు. ఆ గౌరవమున కర్హురాలు నిజముగా నాగమ్మకాని యాతఁడు కాఁడు. ఒక్కమాటలో, బైరవమూర్తికిఁ గల లేఖనాసామర్థ్య మామెకు వాక్కునందుండెనని చెప్పవచ్చును. ఈ భార్యాభర్త లిరువురును 'దీని కేమి యుపాయము చేయుదము' అని యొంటరిగా నాలోచించుకొనుచుండిరి.

చతుర్థ రంగము

అర్ధరాత్రివేళ యయ్యెను. మన పెద్దమూర్తి నిద్రించుచుండెను. ముసలిది హఠాత్తుగా నతని వాకిట నిలచి బిగ్గరగా "నీ నెత్తురు తాగుతానురా" యని యఱచి పక్కున నవ్వెను!

ఆ వికట హాస్యమునకు భైరవమూర్తి మేల్కాని, భయముచే గడగడలాడుచు ధైర్యము చిక్కఁబట్టి గది తలుపుఁ దెఱచి నాగమ్మను లేపెను.

నాగమ్మ యదరిపడి లేచి "ఏమి సంగతి ?" యని యడిగెను.

భైరవమూర్తి గద్గద స్వరముతోఁ బల్కెను : "అది వచ్చి వాకిట నిలచినది?"

నాగ:- "ఏమనుచున్నది?"

"నీ శ్రాద్ధము!"

"గుమ్మములోనున్నదా?"

"ఆ! దాని యఱుపు నీకు వినరాలేదా?"

మూఁడు ముక్కలు, అవతలఁబెట్టి నోరు మూయించ వచ్చునను ధైర్యము కలదగుటచేత, నాగమ్మ కొంత తెప్ప ఱిల్లుకొని, "నేను పోయి నాలుగు చీవాట్లు పెట్టి వెళ్ళగొట్టుతాను చూడండి" యనెను. కాని భైరవమూర్తి భార్యను పోనియ్య లేదు.

తరువాత భార్యాభర్త లిరువురును తలుపునొద్దకుఁ బోయి సందులలోనుండి తొంగి చూచిరి. ముసలిది నేలమీఁదఁబడి యుండెను. శ్వాసము వేగముగాఁ గొనుచుండె. భైరవమూర్తి రక్తమాంసములను గోరి కోరి యామె రక్తమాంసము లెండి

పోయెను. చేతితో నంటినంతమాత్రమున నేలపైఁ బడునంత దౌర్బల్య మామె నావహించెను. అట్టి స్థితియందు నామెఁజూచిన వారిలో ననేకులు భయకంపితులగుచుండిరి.

రాత్రి గడచెను. తలుపులు బిగిసియే యుండెను. కాని భైరవమూర్తికిఁగాని నాగమ్మకుఁగాని కునుకుపట్టలేదు. అట్లే కూర్చుండి యుండిరి. అంకమ్మ విగ్రహముకంటె నామె ధ్వనియే యెక్కువ భయము కలిగించుచుండెను. అంకమ్మను లోనికి రానియ్యరేమో కాని ధ్వని రాకుండ నెట్లాపఁగలరు?

తెల్లవారిన తరువాత మన మూర్తి బయటికి వచ్చి ముసలిదాని నడిగెను: "ఇక్కడ యెందునకుఁ బడుకున్నావు?"

ముస: "నీ నెత్తురు తాగుతాను."

నాగమ్మ గ్రుడ్లెఱ్ఱఁజేసి, "నీ దవడలు పగులగొడ్తాను" అనెను.

ముసలిది నాగమ్మ తిరస్కారమును లెక్కసేయక పకపక నవ్వెను. నాగమ్మ తెల్లపోయి యూరకుండెను! నవ్వునకుఁ బ్రత్యుత్తర మేమికలదు?

భైరవమూర్తి మరల ముసలిదానితో "ఎంతసేపు పడుకుంటావు?" అనెను.

ముస: "నీ నెత్తురు తాగేవఱకు."

భైరవమూర్తి లేఖనా సామర్థ్యముగాని, నాగమ్మ వాక్సామర్థ్యముగాని ఈ సమయమున నేమి పనియుఁ జేయలేక పోయెను. ఇద్దఱును నింటిలోనికిఁబోయి "ఈ పాడు పీడ యెట్లా వదలుతుంది?" అని విచారింపసాగిరి,

గ్రామ దేవతలు జంతువుల రక్తమును గ్రావి తృప్తిఁ జెందును; కాని ఈ ముసలిదీ మనుష్య రక్తమును గోరుచున్నది, ముల్లు గ్రుచ్చుకొని కొంచెము రక్తము వెడలినప్పుడే మన మూర్తి యెంతో పరితాప పడుచుండునే. అట్టివాఁడు తన రక్తమును నీ రాక్షసి కెట్లప్పగించును? ఈతని రక్తముఁ గ్రావి ముసలిది మరలఁ జిగురించునా?

ముసలిది మూర్తి వాకిట వచ్చిపడియున్న వార్త గ్రామ మంతటను వ్యాపించెను. పంతులకుఁ బరాభవమగుట యందఱి కిష్టమే కనుక వందలకొలఁది జనులు గుంపులుగూడి యాతని వాకిట వచ్చి నిలచిరి. అతని గుమ్మమున నిట్టి తిరునాళ్ళు సాగుట క్రొత్త వింతకాదు. అయినను మునుపటి గుంపులలోను, నిప్పటి గుంపులలోను భేదము లేకపోలేదు. మునుపు జనులల్లరి చేయుచుండువారు. ఇప్పుడో, వారు నిశ్శబ్దముగ నుండిరి. వాకిట నీ జనసమూహ ముండుట భేతాళమూర్తి కసహ్యముగఁ దోఁచెను. ముసలిదానిమీఁద వానికిఁ బట్టరాని కోపము వచ్చుచుండెను. "దప్పికవుచున్నదేమో బావియొద్దకు బోదమురా

యని యక్కడకుఁ దీసికొనిపోయి దభాలున ముసలిదానిని నూతిలోఁ బడఁద్రోసితినా, ఎంత చప్పుడగును! ఎంత తమాషాగా నుండును! వీలులేక పోయెగదా!'' యని వాఁడు తనలోఁదా నను కొనుచుండెను. కాని, ముసలిదాని కచ్చటినుండి కదలుటకే శక్తి లేదాయెను. కనుక నాతుంటరి మతియొక్క పన్నాగముఁబన్నెను. బైరవమూర్తిగారి యింటిలో శల్యావశిష్టమగు నావొకటి యుండెను. దానికిఁ బ్రతిదినము గానుఁగపిండి, పొట్టు, మొదలైనవి యేమేమో పెట్టుచుండిరఁట కాని, అవెక్కడకుఁ బోవుచున్నవో, ఆవు నానాఁటికిఁ గంకాళ మగుచువచ్చెను. భేతాళ మూర్తి యా యావుపేడ నొక కడవెడు నీళ్లలోఁగలిపి యా కలాపితెచ్చి ముసలిదాని ముఖముమీఁదఁ గ్రుమ్మరించి కొన్ని బొట్లు గుమిగూడియున్న జనుల మీఁదఁగూడ వెదఁజల్లి వారిని సత్కరించెను. పాపము! ముసలిది తడిసి ముద్దయయ్యెను. చుట్టును మూగియుండిన జనుల బట్టలు చెడిపోయెను. "ఇది, ఇంకోటి ఇంకోటి కాదు. బైరవమూర్తిగారి గుమ్మమురా బాబూ! నిలిచియుంటిమా ఇంక నెక్కువ శాస్తి జరుగుతుందిరా!" అని వారందఱు యథాయథలై పఱువిడిరి. అంతట భేతాళమూర్తి చప్పటలు చఱచుచు లోనికిఁబోయి కడుపుబ్బ నవ్వసాగెను. అక్రమపు గుంపును నంతయు త్రిప్పికొట్టెను, అంత సుకరముగను, చొలఁగించినందునకుఁ దండ్రి కుమారుని వీపు చఱచి 'సెబాస్, సెబాస్' అని సంతోసించెను. ఎవరు పోయినను ముసలిది మాత్రమెప్పటివలె వాకిటనే యుండెను!

మధ్యాహ్నమైనను ముసలిది యేమియును దినలేదు. సాయంత్రమయ్యెను. ఎంత బ్రతిమాలుకొనినను నామె యన్నము ముట్టలేదు. కరణముగా రామెనెంతో పొగడి యన్నము తినిపింపఁ జూచెను. భైరవమూర్తి కూడ దోసిలియొగ్గి ప్రార్థించెను. కాని ముసలిది యొప్పుకొనలేదు. 'కడుపులో సురసురలాడినప్పుడదియే తినును' అనుకొని యాతఁడింటిలోనికిఁ బోయెను. ఆ రాత్రికూడ ముసలి దన్నము, నీరు ముట్టక గడిపెను. భైరవమూర్తి, నాగమ్మ, యా రాత్రికూడ నిద్రయెట్టిదో యెఱుఁగరు. ఈ రెండవ రాత్రి ముసలిదాని యఱపు, నవ్వు తక్కువగానుండెను. 'పీడ వదలినదిలే' యని యింటిలోని వారనుకొనిరి. ఉదయమున వచ్చి చూచువఱకు ముసలిది కదలిక లేక పడియుండెను, ముఖమునిండ నీఁగలు మూఁగియుండె. ప్రాణము పోయినది! పాపము ప్రాణములు పోగొట్టుకొనుటకే యామె యచ్చటికి వచ్చియుండెను. తన ద్రవ్యమును హరించిన వానికే తన ప్రాణములనుగూడ నప్పగింప నిశ్చయించుకొని యుండెను. తుదకుఁ దన కళేబరమును గూడ నితనికే యర్పించెను. ధనమెంత ప్రియమైనదో చూడుఁడు! ముఖ్యముగా ముసలితనమున నది ప్రాణముకంటెను బ్రియతరమైన దగును!!

ఆ దినమున గ్రామమందెంత గడబిడ జరిగెనో, భైరవమూర్తిని జనులెంత దూఱిరో వివరింపవలసిన పనిలేదు. అతఁడనుభవించిన యవమానము వర్ణనాతీతము. గ్రామములోని

మాలవాఁడు గూడు వారింటి నీరు ద్రాఁగుటకుఁగాని వారిని ముట్టు కొనుటకుఁగాని ఇష్టపడలేదు. మంగలవాండ్రు వారికి క్షవరము చేయఁగూడదనియు, నీళ్ల బ్రాహ్మణుఁడు నీళ్లు పోయఁగూడ దనియు నిశ్చయించుకొనిరి. ఇట్టి కార్యము జరుగవలయునని తలఁచియే ముసలిది మూర్తి వాకిటఁ జచ్చెను. 'బ్రతికియుండి చేయలేని పనిని చచ్చి నెఱవేర్చెదఁగాక' యని యామె యను కొని యుండెను.

పంచమ రంగము

బైరవమూర్తి 'లా' తెలిసినవాఁడు కాని సామాన్యుఁడు కాఁడు. 'లా' ప్రకార మతఁడు చేసిన నేరమే లేదు. ముసలిది శిక్షాస్మృతిలోని ఫలాని సెక్షన్ ప్రకారము చచ్చినదని చెప్పుటకు వీలులేదు. లారిపోర్టులలో నిట్టి నిదర్శనము లేదు. కనుక బైరవ మూర్తికిఁ బ్రాయశ్చిత్తమే యవసరములేదు. "బ్రాహ్మణుఁడు నీళ్ళు పోయక పోయిన మనమే తెచ్చుకొనవచ్చును. మన యింటి పనిని మనమే చేసికొనుటకు సిగ్గేల? మంగలివాఁడు క్షవరము చేయకపోయిన మానె; అసలు క్షవరము చేయించు కొనవలసిన యవసరమే లేదు. గడ్డము పెరిగినచో నందముగా నుండును. పురుషుఁడగువాని కది యలంకారము. వెండ్రుకలు పెరిగి యంతగా బాధించినట్లయిన నొక యణా యావలఁ బాఱ వేసినఁ గత్తి యొకటి దొరుకును. చాకలివాఁడు బట్ట లుతకక

పోయిన మఱియు మంచిది. దమ్మిడీపెట్టిన సబ్బు బిళ్ల వచ్చును. ఎన్నిబట్టలనైనను దానితో కొంగ రెక్కలవలెఁ దెల్లగా నుదికి కొనవచ్చును. అసలు చాకలివాని యుతుకేపాటిది ? వాఁడు బట్టలను బండమీఁదఁ జఱచి చఱచి పాడుచేయును. తాను తొడుగుకొనును; మంది కిచ్చును, అందువలననే కదా నా కుడతాలు రెండు మూఁడు సంవత్సరములకన్న నెక్కువ కాల మాగవు. మా తాతగారి కాలములో రెండు కుడతాలయిదు సంవత్సరము లుండెడివి !" అనుకొనుచు భైరవమూర్తియును, భార్యయును మనస్సమాధానము చేసికొనిరి.

సాయంత్రమైన కొలఁదివారి తార్కికశక్తి తగ్గసాగెను. కారణము లేని భయమొకటి హృదయము నావరింపఁజొచ్చెను. రాత్రి కాఁగానే యాభీతి మఱి మఱి హెచ్చెను. వంటయింటి లోనికి నాగమ్మ యొంటరిగాఁ బోలేక పోయెను. పొరపాటు వశమున వారానాఁడు బయటి ద్వారమును మూయమఱచిరి. ఆ తలుపు మూసివచ్చు ధైర్య మొకరికిని లేకపోయెను. తుదకు నాగమ్మ చేత దీపముఁబూని భైరవమూర్తి గొడ్డలిని, భేతాళ మూర్తి కొడవలిని బట్టుకొని వెంటరాఁగా తలుపు బిగించి వచ్చుటకై వెడలెను. వారు నడుమ నడుమ దగ్గుచు వెనుకకుఁ జూచుచుఁ బోయిరి. అంత భైరవమూర్తి మహాధైర్యముతో ద్వారము బయటకుఁ బోవయత్నించి వడవడ వడఁకుచు, బలవంతముగాఁ దెచ్చికొనిన గట్టి ధ్వనితో నాగమ్మనుజూచి యనెను! "ఎందుకీవెఱ్ఱి భయము; ముసలి దక్షుడఁగూర్చున్నదా?"

నాగమ్మ భర్తను లోపలికి లాగి, "ఏమిటి, ఈ పిల్ల చేష్టలు!"

ఇట్టి ఘనకార్యమును సాధించి వారు ముగ్గురు వంట యింటిలోఁ బ్రవేశించిరి. వంట యారంభమయ్యెను.

అయినను, ముసల్దాని యకారము వారి దృష్టియెదుట చిత్రితమైయుండెను. తమ తమ నీడలను జూచి యది ముసలిదని వారు భ్రమింపసాగిరి. చీఁకటిగానుండిన మూల లలో ముసలిది కూర్చుండి యున్నట్లు వారికిఁ దోఁపసాగెను. అదే అస్థిపంజరము ; అవే జడలు కట్టిన వెంట్రుకలు ; అదే వికృతాకారము ; అవే భయంకరములగు కండ్లు ! వేయేల ? ముసలిదే యాపాద మస్తకము వారికిఁ గానవచ్చుచుండెను. వంటయింటిలో ధాన్యపుకుండ లుండెను. ధాన్యమును జూచు భాగ్యము వాని కెన్నఁడైన లభించినదో లేదో చెప్పఁజాలము. కుండల సమీపమున రెండు కట్టెపుల్ల లుండెను. ఎలుకలు కుండలచాటున నటునిటుఁబఱుగెత్తుటవలనఁ గొంత ధ్వనియగుట యేకాక రెండు కట్టెపుల్లల స్థలము కూడ మాఱెను. ఇంకేమి కావలెను ? కట్టెపుల్లలు ముసలిదాని కాళ్ళవలె వారికిఁ గన్పట్టె. నాగమ్మ కెవ్వున కేకవేసెను. భైరవమూర్తి భయభ్రాంతుఁడై తలుపువైపు దుమికెను. భేతాళమూర్తి తండ్రికాళ్ళను బిగ్గఁబట్టు కొని నిశ్చేష్టుఁడయ్యెను. అంతలో నదృష్టవశమున యెలుకలు బయటికివచ్చి వారి భయమును బోఁగొట్టెను. అప్పుడు భైరవ

మూర్తి యసహాయశూరుఁడై కుండలవైపు పోఁబోవుచుండ "తెలిసిందిలెండి మీ మగతనము" అని నాగమ్మ యెత్తి పొడిచెను.

నాగమ్మ పోటుమాటకు మూర్తి కోపగించుకొని "భయపడితినని యనుకొన్నావు కాఁబోలును. ఏమి భయము? ముసలి దప్పుడే చచ్చెను. ఇంకను గూర్చున్నదా? ఏమి? ఇందాక నేను బయటి తలుపు తెఱచికొని వీధిలోనికిఁబోవ సిద్ధపడ లేదా? నీవు వద్దనఁబట్టిగాని లేకపోయిన నవతలికిఁ బోయియే యుందును!"

మూర్తిచేసిన యీ యుక్తివాదము నాగమ్మను నిరుత్తరురాలుగాఁజేసెను. అంతకుముందు భైరవమూర్తి ధైర్యముతో ద్వారము వెలుపలికిఁబోవుట—లేక, పోవయత్నించుట—సామాన్యకార్యమా? అంతటి సాహసమును బ్రదర్శించిన తరువాతఁగూడ పంతులును బిఱికి వాఁడనినచో, నది నాగమ్మ మూర్ఖత్వముకాక మఱేమగును?

భోజనానంతరము వారు ముగ్గురు పడకగది లోనికిఁ బోయిరి. కాని, అచ్చట నైతము ముసలిది వారిని వదల లేదు. చాలసేపు వారు మాటలాడుచు వినోదముగఁ గడిపిరి. నాగమ్మ కొన్ని కథలు చెప్పెను. భైరవమూర్తి కొన్ని ఫౌజ్దారీ కేసులను వర్ణించి వానిలో జరిగిన తీర్పులు వారికిఁ జెప్పెను.

ఎన్ని యత్నములు చేసిననేమి? ముసలిదాని విగ్రహము వారి కన్నుల యెదుటనే నిలచియుండెను. తలుపు చప్పుడు కాఁగానే వా రులికిపడుచుండిరి. చెట్ల యాకులలో మర్మరధ్వని కాఁగానే వారికి రోమాంచమగుచుండెను. అంతేకాదు. ఆకాశము నుండియో లేక పాతాళము నుండియో—ఎక్కడినుండియో తెలియదుగాని—మందమగు నొక ధ్వని 'నేను నీ నెత్తురు తాగుతానురా' అనునది వారి చెవులఁబడుచునే యుండెను.

షష్ఠమ రంగము

అర్ధరాత్రివేళ నాగమ్మ నిద్రలో నదరిపడి లేచెను. పాపము! నాగమ్మ గర్భవతి. నిప్పుకణములవలె నెఱ్ఱఁగాఁ బ్రకాశించుచున్న కన్నులను, పదునైన మొనల పండ్లనుగల ముసలిది, ఆమె రొమ్ముమీఁద నెక్కికూర్చుండెను. నాగమ్మ కేకవేసి లేచి మైమఱచి వెఱ్ఱిదానివలెఁ బందిటిలోని కుటికి నేలపైనఁబడెను. శరీరమంతయుఁ జెమటచేఁ దడిసెను. భార్య కేక విని బైరవమూర్తి మేల్కొనెను. కాని భయముచేతఁ గన్నులు తెఱిపిడిపడవయ్యె. కాళ్ళు తడఁబడసాగెను. గ్రుడ్డివానివలెఁ దలుపుఁ దడవికొనుచుండెను. ఎంతోసేపైన తరువాతఁగాని యతనికిఁ దలుపుదొరకలేదు. పందిటిలోనికి వచ్చిచూచుఁగదా నాగమ్మ నేలమీఁదఁబడి కాలుసేతులు కొట్టుకొనుచుండెను. ఆమెను లేవఁదీసి లోనికిఁదెచ్చెను. కాని యామె ఆ రాత్రి

యంతయు కన్నులు తెఱవలేదు. తెల్లవారినది మొదలు తబ్బిబ్బు మాట లాడసాగెను. మఱికొంత సేపటికి తీక్ష్ణమగు జ్వరమువచ్చి శరీర మంతయుఁ బెనమువలెఁ గ్రాగుచుండెను. సాయంత్రము వఱకు సన్నిపాతము పొడసూపి నిశ్శబ్దముగానున్న నిశా సమయమున నామె యీ లోకమును వదలెను. ముసలిదాని భయ మామె ప్రాణములఁదీసియే వైచెను. ముసలిదామె జీవితకాలమం దెప్పుడును నాగమ్మయఱపులకు భయపడుచుండెడిది. పిచ్చిదైన తరువాతఁగూడ నామె నాగమ్మనెన్నఁడు డీకొనలేదు. కాని, తన ప్రాణములను వదలి నాగమ్మ ప్రాణములను దీసికొనెను.

తెల్లవారి ప్రొద్దెక్కెను. శవవహనమునకు గ్రామము లోని వాఁడొకఁడైనను రాలేదు. భైరవమూర్తి, ఇల్లిల్లు తిరిగి వేసరెను. 'మేము రాము; మేము వానియింటి శవమును బట్టము' అను మాటలే వినవచ్చెను. భైరవమూర్తి కలము యొక్క సామర్థ్యముగాని, అతని వ్యవహార దక్షతగాని ఈ సమయమున నక్కఱకురాలేదు. తిరిగి తిరిగి యింటికి వచ్చెను గాని లోన నడుగుపెట్ట మనసొప్పలేదు. బయట నుండుటయుఁ గష్టము. లోపల భార్య శవము; బయట ముసలిదాని భయము. ఎట్లెట్లో ధైర్యము చేసి హనుమంతుని దండకము చదివికొనుచు లోనికిఁ బోయెను. అప్పుడతని భావము లెట్లుండెనో వర్ణించుట కష్టము. ఇంటిలో శవము పడియున్నది. చూడదిక్కు, మ్రొక్కదైవము లేదు. ముందు వివాహము కాదేమో యను విచారము మాత్రము

భైరవమూర్తికి లేదు. ఎన్నేండ్లవాఁడు? ఆ ఫాల్గుణ మాసమునకే కదా! ఏఁబది సంవత్సరములు వెళ్ళునున్నది! మహారాజువలె నాతని కెవరైన పిల్లనిత్తురు. కాని నాగమ్మవంటి వాక్చాతుర్యము గల భార్య లభించునా ? అప్పులవాండ్రను దల యెత్తకుండఁ జీవాట్లు పెట్టువారిఁక నెవ్వరు? వారితో వాదించి నిరుత్తరులను జేయువారెవ్వరు? ఆయ వ్యయముల నంత బాగుగా లెక్కచెప్పు వారెవ్వరు? ఇఁక నెవ్వరి యఱపు లిరుగుపొరుగువారి హృదయములను బాణములవలె భేదింపఁగల్గును? అయ్యో! ఇంతటి నష్టము ఎట్లు తీరును?

ఆనాఁడు సాయంత్రమువేళ శవమును వెడలఁదీసిరి. శ్మశానమునకుఁబోయిన వారిద్దఱే. ఒకఁడు భైరవమూర్తి; రెండవ వాడు భేతాళమూర్తి. దిక్కుమాలిన ముసలిదాని శవమైనను నింత నికృష్టముగాఁ బోలేదు.

ముసలిది, నాగమ్మను జంపిన తరువాతనైనను, భైరవమూర్తిని వదలలేదు. రాత్రిందివము లాతనికి ముసలిదాని ధ్యానమే. ప్రొద్దుపోవు మార్గమేదైన నున్నచో నతని బాధ కొంత తగ్గియుండును; కాని, యొక పురుగైన నాతని కడపఁ ద్రొక్కలేదు. తానే నీళ్ళు తెచ్చుకొనును. కానే యంట్లు తోము కొనును. దుఃఖము, క్రోధము, విచారము, భయము! ఇందఱ శత్రువులతో నతని మేథస్సెన్ని దినములు పోరాడఁగల్గును?

అందులోనది పనిలేని మెదడా ? సదా 'లా' విషయములను గుఱించిన యాలోచనములకును, తర్కవితర్కమునకును, లోనైనమెదడు!

పండ్రెండు దినములు ఈ ఏకాంతవాస శిక్ష గడచెను. పదమూఁడవనాఁడు భైరవమూర్తి తెల్ల బట్టలు కట్టుకొని దస్తరమును చంకనుంచి, ఎప్పటివలెఁ గోర్టుకుఁబోయెను. ఆనాఁడాతని ముఖము కొంత వికసించియుండె. "కోర్టుకు పోఁగానే పార్టీలువచ్చి చుట్టుమూఁగుదురు; సన్మానించుదురు; నేనును నాల్గు కన్నీటిబొట్లను రాల్చెదను. ఆ తరువాత ట్రాన్స్ఫరు పత్రములు, రాజీనామా దస్తావేజులు, తాకట్టు పత్రములు కుప్పలు కుప్పలుగా వచ్చి కూలును, డబ్బులు దొరకును" అని తలఁచుకొనుచుండునప్పు డాతని కానందముగానే యుండెను. కాని కోర్టుకుఁ బోయిన తరువాత నక్కడ పత్రములు లేవు; పయికము లేదు. పార్టీల తొందరయును లేదు. దస్తరము విప్పుకొని చాల సేపు కూర్చుండెను; కాని, ఒకఁడైన నతని యొద్దకు వచ్చిన పాపమునఁబోలేదు. కుశల ప్రశ్నమైనను చేసినవాఁడు కానరాఁడయ్యె. క్రొత్త పార్టీలమాట యటుండ, తరతరముల నుండి పరిచితులుగానున్న పార్టీలు సైతము మొగము చాటువేసి దాటి పోవ నారంభించిరి. భైరవమూర్తి యెదుట దిగఁదుడుపునకైన బనికిరాని రామచంద్రయ్య యానాఁడందఱకు నాలోచన చెప్పువాఁడయ్యెను! అతని చుట్టు పెద్దగుంపు మూఁగియుండెను. నాల్గు

పఱ్తులరాని రామచంద్రయ్య కెంతటి యదృష్టము పట్టినది! సాయంత్రము వఱకుండి నిరాశావశుఁడై యింటివైపు మరలెను. ఇంటి వైపున కొక్కొక యడుగుపెట్టిన కొలది మునలిదాని విగ్రహము పొడకట్ట నారంభించెను! దీపము ముట్టించు వేళకు నిల్లుచేరి వాకిలి తలుపు తెఱవఁగానే యంతకు ముందు భేతాళ మూర్తి కొంటెతనమునఁ గట్టివేసి యుంచిన రెండు కుక్కలు తటాలునఁ బఱుగెత్తి వచ్చెను. ప్రాణములు పైఁబెన నెగురఁ గేకవేసి నేలమీదఁ బడెను!

భైరవమూర్తి గతి తరువాత నేమైనదో తెలియదు. ప్రతి దినము నాతఁడు కోర్టుకుఁ బోవుచు సాయంత్రమువేళ నిరాశతో నింటికి వచ్చుచుఁ గనఁబడుచుండెను. కోర్టులోవచ్చు నాదాయము లేకపోయినను నచ్చటికిఁ బోయివచ్చుట, అప్పులవాండ్ర బాధల దప్పించుకొనుటకు మాత్రము దివ్యమైన యుపాయముగా నుండెను! తరువాతఁ గొన్ని నెలలవఱకు నాతఁడు గానరాలేదు. బదరికాశ్రమమునకుఁ బోయెనఁట! ఒకనాఁడు బైరాగి యొకఁడు విభూతి ధరించి, పొడుగుపాటి జడలు, కేలఁగమండలవుఁబూని యీ యూరికి వచ్చెను. మాటయందేమి, నడక యందేమి ఆతఁడు భైరవమూర్తిఁ బోలియుండెను. ఆ రాత్రి మూర్తిగారి యింటినుండి పొగ వెడలి వెడలి పెద్దమంట లేచెను. నాగమ్మ వాగ్జ్వాలయైనను నంత భయంకరముగా నుండలేదు. వందల కొలఁది జనులచటికిఁ బోయిరి. వినోదము చూచుచుండిరి కాని చల్లార్పలేదు!

భైరవమూర్తి గ్రామము విడిచిపోయిన తరువాత భేతాళమూర్తి మేనమామ యింటికిఁ బోయి యచటఁ గొన్ని దినములు గడపెను. అతని సద్వర్తన మచ్చటి వారికి సంతోషగ నుండము లేదు! ఒకనాఁడతఁడెవరి పొలములోనో కంకులు గోసికొనెను. పొలమువాఁడు నాలుగు లెంపకాయ లంటించెను. మచ వానికిఁ గోపము వచ్చి రాత్రివేళఁ బొలమును బాడుచేసెను. వేల రూపాయలు నష్టము వచ్చెను. పోలీసువారు వానిని బట్టుకొని పోయిరి. ఇప్పుడతఁడు బహుళః జ్ఞాన మఠములో నుండవచ్చును.

నేనే

ప్రథమ రంగము

ఆ. అయ్యలార! మనఘు నెయ్యంపు మాటలు
పెక్కు పలుకనేర్తు ముక్కవమున
కర్మచేతఁగాని ధర్మంబుఁచేగాని
చేసిచూపనేరి చేతఁగాదు. మై. నృసింహశాస్త్రి.

ఇతర విషయములలో గణపతిరావు నభిప్రాయము లీకాలపు యౌవనులవంటివే యైనను, నీతి వర్తన విషయమున మాత్రమతని భావములు కొంతవఱకు విచిత్రములుగాను, సాధారణ దృష్టికిఁ జాల మీఱినవిగాను ఉండును. అతని యుద్దేశమున 'నీతి వర్తనము' అను దానికి స్త్రీ సంబంధమగు విషయ సుఖాభిలాష లేకపోవుటయని యర్థము. ఇట్లనుటవలన నతనికి నీతి వర్తనమను దానికిఁగల విశాలమగు నర్థము తెలియదనికాదు. నిజమేమనఁగా నతఁడు 'నీతి వర్తనము'లోని యీ ప్రత్యేక భాగమునకింతయని నిర్ణయించుటకు వలను గాని ప్రాముఖ్యము నిచ్చుచుండును. స్నేహితులతో సంభాషించునపుడేమి, ఉపన్యాస వేదికపైన నుండునపుడేమి, పత్రికాదులకు వ్రాయుటకై కలమును జేతఁబూని నపుడేమి, పైనఁజెప్పిన 'నీతి వర్తనము'

అప్రయత్నముగనే బయటబడుచుండెడిది. "...గారు చాల మంచివారు. వారి స్వార్థత్యాగము ప్రశంసనీయము. స్వలాభమునే యభిలషించియుండినచో వారిదివఱ కున్నత న్యాయస్థానాధికార (హైకోర్టు జడ్జీల) పదవికి వచ్చియుందురు..." అని ఎవరిని గుఱించియైనను నెవరైనఁ జెప్పినప్పుఁడతఁడు ముఖము చిట్లించి "అతఁడా! ఛీ! అంతటి దుర్మార్గుండెవ్వఁడును లేఁడు, అతని 'నీతివర్తనము'ను నీవు వినలేదు. నాకుఁ దెలియును" అని వాదము మొదలుపెట్టును. "...గారు...లక్షల రూపాయలను విద్యాలయమునకై యిచ్చిరి. ఏమి? వారి యౌదార్యము!" అని ఎవరైనఁ జెప్పిన పక్షమున "ఏడిసినాఁడు. అతనిని నేనెఱుఁగుదును. అతని వర్తనము తుచ్ఛమైనది. అంతటిజారుఁడు ప్రపంచములో లేఁడు" అని చెప్పనారంభించును. "...ఎంత ధనవంతుడైన నేమి? పట్టుమని పదిరూపాయలు జాతీయ కళాశాలకిచ్చిన పాపమునఁబోలేదు. ఒక విద్యార్థికైనను వారమియ్యఁడు. అధికారులకుఁ దోటవిందులు సేయుట యందు మాత్రము తన యౌదార్యమును జూపును" అని ఎవరిని గుఱించియైనను జెప్పఁబడిన పక్షమున "అతని సంగతి నీకేమి తెలియును? అతని నీతివర్తనము శ్లాఘాపాత్రము" అని వాదమునకు దిగును. వేయేల? మనుష్యుల మంచితనమునుగాని చెడుతనమునుగాని నిర్ణయించుట కతనియొద్ద సాధన మొకటే కలదు. స్త్రీ లోలత్వ సబంధమగు దౌర్బల్యము గలవాఁడేని యతని యందితర సుగుణము లెన్ని యున్నను సున్నయే. ఎట్టి దుర్గుణములు గలవాఁడైనను

నట్టి దౌర్బల్యము మాత్రము లేదేని. అతఁడు బ్రహ్మరథముఁ బట్టఁదగినవాఁడే.

ద్వితీయ రంగము

న్యాయవాది వృత్తిలోఁ బ్రవేశించిన తరువాత, గణపతి రావు యొక్క యాదాయ ముద్యోగములోనున్న నాఁటికంటెఁ జాల హెచ్చెను. నెలకు సుమారు వేయి రూప్యములు రాసాగెను. చిన్నతనమునుండియు నతఁడు చాల మితవ్యయబుద్ధికలవాఁడు. ఉద్యోగము చేయుచుండిన దినములలోఁ గూడ నాతని మిత వ్యయబుద్ధి యట్లే యుండెను. కాని న్యాయవాదియైనపిమ్మట నాదాయముతోఁబాటు మితవ్యయాసక్తియు వృద్ధియై పిసినిగొట్టు తనమును సమీపించెను. అంతేకాదు, అసూయాపరు లనేకు లతనికి 'పిసినారి' యను బిరుదము నిచ్చిరి. కాని, తానట్లు పిలువఁబడుటకుఁ గారణము మాత్రము గణపతిరావున కొక్క నాఁడైనను గ్రాహ్యము కాలేదు. 'నేను లోభినా?' యని యతఁడు పలుమాఱు వితర్కించుకొనెను. కాని ప్రతి పర్యాయమును 'కాను' అను తీర్మానమే ప్రత్యుత్తరమిచ్చుచుండెను. 'వందల కొలఁది రూప్యములు పాడుచేసి నేను పెద్ద యిల్లు బాడుగకు తీసికొనలేదఁట!' నా యింటిలో వ్యర్థముగ సోఫాలును, కురిచీ లును, మూల మూలలఁబడి మూల్గుచుండలేదఁట! నేను రెండు గుఱ్ఱముల 'బ్రూహాము' బండిని నుంచుకొనలేదఁట! పనిపాటలు

లేక కునికిపాట్లు పడుచుండు నౌకరులు నా యింటిలోఁ బదిమంది లేరఁట! కనుక నేను లోభినఁట! దక్షిణాఫ్రికా భారతీయుల నిధికి నేను ధన సాహాయ్యము చేయకపోవుటకుఁ గారణములు గలవు. గంధి యవలంబించిన మార్గము జయప్రదమగునది కాఁజాలదని నేనియ్యలేదు. బందరు జాతీయ కళాశాలలోఁ జెప్పు విద్య దొరతనమువారి నిబంధనల ననుసరించినది కాదు. కనుక దానిలోఁ జదువువారికి ముందు మంచి యాశలు లేవని తలంచి నేనా విద్యాలయమునకు సాహాయ్యము చేయలేదు. ఆంధ్ర రాష్ట్రోద్యమము మన దేశీయులలో నంతఃకలహమును బుట్టించు నది కావున నది నా యామోదమును బొందలేదు. కాకున్నచో నేను వీనికిని ద్రవ్య సహాయము చేసియుండనా?' యని కొన్ని వేళలను, 'లోభి లోభి యని యోర్వలేనివారు కొందఱు నన్ను నిందించుచుందురే! తత్త్వము విచారించినచో లోభి యేకారణము వలన దూష్యుఁడో తెలియరాకున్నది. తాను కష్టపడి చెమట యొడిపి సంపాదించుకొనిన ధనమును జాగరూకతతోఁ గాపాడు కొనుట సుగుణమా? దుర్గుణమా? ముందెట్లుపోయి యెట్లు వచ్చునో యని కొంత ధనమును దాచియుంచుకొనుట దూర దర్శిత్వమా? వెఱ్ఱితనమా?' యని మఱికొన్ని వేళలను, దల పోయుచు వృత్తివలనఁ దానార్జించిన యుక్తినంతయు వినియో గించి తుదకు తాను నిర్దోషినని మనోనిశ్చయము చేసికొను చుండెను. ద్రవ్యము విషయమున నతని పట్టెంత గట్టిదైనను నవయౌవనయు సుఖేచ్ఛగలదియునగు హైమవతిని సంతోష

పఱచి యామె వీక్షణములను ప్రసన్నములుగాఁ జేసికొనుటకొఱ కైనను దన యిష్టమునకు మించి ధనమును నప్పు దప్పు డతఁడు ఖర్చుపెట్టక తప్పినదికాదు.

తృతీయ రంగము

హైమవతి యాకారమునఁ గొంచెము పొడవై, బంగారము వంటి మనోహరమగు శారీరిక శోభతోను, దర్శనీయములగు ముఖలక్షణములతోను ప్రకాశించుచుండును. గానమువలె మధుర ముగా నుండు నామె కంఠధ్వని వినువారి వీనులకు విందుఁ గొల్పుచుండును. ఈ శారీరిక సౌందర్యమునకన్న నెన్నియో గుణము లధికముగా నామె మానసిక సౌందర్య మాకర్షణీయమై యుండె.

సాధారణముగా మన హిందూ స్త్రీలు చాల మృదుల స్వభావము గలవారు. వారికిఁ జిత్తస్థైర్య ముండదు. క్రొత్తవా రెవరైన మందలించినచో వారు ప్రత్యుత్తరమిచ్చుటకు జంకె దరు. ఇల్లు విడిచి యవతలికిఁ బోవలసివచ్చినచో వెంట మనుష్యుఁ డుండిననే కాని వారి యడుగు ముందునకు సాగదు. కొంచెమేదైన నాపద వచ్చినచో వారు కన్నీరు గార్చుట తప్ప మఱేమియుఁ జేయజాలరు. కాని హైమవతి స్వభావ మట్టిది కాదు. తన సామర్థ్యమునం దామెకు సంపూర్ణ విశ్వాసము

గలదు. ఆమె భావము లున్నతములై యుండెను. ఎట్టి యాపదలు వచ్చినను జంకెఱుఁగదు. మంచి యాలోచనశక్తియును, నట్టి శక్తి నుపయోగించుటకు వలయు ధైర్యమును నామె పుట్టుకతోడనే వెంటఁ దెచ్చుకొనెను. పురుషులతో సంభాషింపవలసినప్పుడును నామె నిర్భయముగా మాట్లాడుచుండును.

శ్రావణ మాసము వచ్చినది. హైదరాబాద యందలి పురోద్యానము చూపులకు విందుఁ గొల్పుచున్నది. ఎచ్చటఁ జూచినను పచ్చని పచ్చిక కానవచ్చుచున్నది. సాయంత్ర మయ్యెను. కృత్రిమములగు నీటి కొలనులో నొక ప్రక్కనఁ బడవలమీఁదఁ గొందఱు నీటుకాండ్రు విహరించుచున్నారు; వేఱొక ప్రక్కనఁ బెద్దబాతులు తమ రెక్కలను విప్పుచు ముడుచుచు రెపరెప లాడించుచు గుంపులు గుంపులుగఁ గూడి నీటిపైనఁ దేలియాడుచున్నవి. కాలినడకను, ద్విచక్రికల (బైసికళ్ల) మీఁదను, గుఱ్ఱపుఁబండ్లమీఁదను, స్వయంతోలనాశక్తిశకటంబులలోను (మోటారు) గూర్చుండి, వచ్చుచుఁ బోవుచునుండు వారి సంఖ్యను లెక్కించుట దుస్సాధ్యమై యున్నది. ఆ సమయమున గణపతిరావు తన యొంటి గుఱ్ఱపు బండి నెక్కి యచ్చటికిఁ బోయి యొక పొదరింటికి సమీపమున నున్న ఫలకముమీఁద గూర్చుండెను.

అంతలో నొక మాలరి (తోటలో పనిచేయు ఆడుది) మెల్లమెల్లఁగా మన న్యాయవాదిని సమీపించి లకోటా చేసి

యున్న యొకజాబు నతని కందించి వెడలిపోయెను. ఉత్తరమును జదువు కొనినప్పు డాతని ముఖమున నానందమును బెదవులపై నఁజిఱునగవును గాన వచ్చుండెను. దానిలో నేమియున్నదో?

చతుర్థ రంగము

" రసికవరా !

సృష్టి సౌందర్యమును జూచి యానంద తరంగములలో నోలలాడుచున్న మీ సౌఖ్యమునకుఁ గొంచెము నేపు భంగము గలిగించుచున్న నన్ను క్షమించి నా విన్నపము నాలకింప వేడెదను. చిరకాలము నుండి నేను పురుషుల స్వభావమును బరీక్షించు చుంటిని. పురుషులు సర్వసాధారణముగా స్వార్థపరులనియు, నీతి బలములేని వారనియు, నా యనుభవమువలనఁ గనుఁగొంటిని. ప్రేమాభరితమగు తన హృదయమును నిర్వ్యాజముగ నొక పురుషునకర్పింప నేదేని స్త్రీ తలఁచినచోఁ దదనుగుణ్యమగు నిశ్చల ప్రేమతో నా యమూల్య రత్నమును గ్రహించు యోగ్యుఁడు నాకుఁ గొన్ని దినముల క్రింది వఱకుఁ గానవచ్చి యుండలేదు.

అయినను నా కృషి వ్యర్థము కాలేదు. ఉన్నతమగు మానసము చేతను, సుగుణసంపదల చేతను, నిరుపమానమగు పురుష రత్న మొకటి నా కంటఁబడినది. అతని యందుఁగల గుణ

రాజములు స్థూలదృష్టికి గోచరములు కాఁజాలవు కాని, అన్వేషణ పరులకుఁ దెలియరాని రహస్యముండదు. ఆయన ప్రాయము గాని శారీరక సౌందర్యముగాని నన్నాకర్షింపలేదు. అతని గుణ సంపద నా హృదయమును వశము చేసికొనినది. నన్నా పురుష పుంగవున కర్పించుకొనుటయే నా మనోరథము. దీనికి వెనుక ముందు లేదు. రేపు రాత్రికిఁ దఘరు 'కృష్ణా థియేటరు'నకు వచ్చినచో నచ్చటఁ దమ కృపకుఁ బాత్రయగుటకై యీ దాసి వేచియుండును.

ఒక జవ్వని.''

అని యా యుత్తరమందుండెను. గణపతిరావా యుత్తర మును మరల మరలఁజదివెను. చదివిన కొలఁది నాతనికి మితి లేని యానందము గలుగసాగెను. ''ఈ యువతి విద్యావతియు రసజ్ఞయు నైనట్లు కానవచ్చుచున్నది. బాహ్య సౌందర్యమును ధనమును నాసించు స్త్రీలు విస్తారముగాఁ గలరు. కాని ఇట్టి సుందరు లఱుదు. ఒకరియందుఁగల గుణములను నిజముగాఁ గనుఁగొనువారు తక్కువ. నా సుగుణరత్నములఁ బరిశీలించు రత్న పరీక్షకురాలు నేఁడు దొరకెను. ఆమె నన్నెచటనో చూచి యుండును. నా వర్తనమును వినియుండును. సాధారణులగు వారిని లెక్కకుఁ దీసికొనని యా సుందరి నా యోగ్యతను సంపూర్ణముగ గ్రహించియే యిట్టి యుత్తరము వ్రాసినది!''

ఇట్లనుకొనుచుఁ గొలనుకడకుఁ బోయి నీటిలోఁ దన ముఖమును జూచుకొని చెమ్మటచేఁ దడిసియున్న నొసటిని గడిగి చేరుమాలుతోఁ దుడిచికొనెను. కొంతసేపైన పిమ్మట నింటికివచ్చి భోజనము చేసి నిద్రించెను. కాని కలలు తప్ప మంచి నిద్ర రానే లేదు.

పంచమ రంగము

మఱునాటి యుదయమున మన న్యాయవాది తొమ్మిది గంటలవేళ బజారునకుఁ బోయి షాపులలో మంచి వెలగల బట్ట లనేకములు గొనెను. అంతటి వెల గల వస్త్రములను నాతఁ డెన్నఁడు కొనియుండఁడు. వర్తకు లాతని యానాఁటి యుదార భావమును జూచి లోలోన నబ్బురవడసాగిరి. ఆతని స్వభావ మును బాగుగా నెఱిఁగిన కొందఱు యౌవనులు దారిలో నాతనిఁ జూచి 'నేఁడిదేమి చిత్రము' అని కనుసైగలు చేసికొనిరి.

ఆనాఁటి క్రొత్తఁదనమును గని హైమవతి, భర్త ముఖమును దేఱిపాఱఁజూచి "ఈ దినము దుకాణములో వస్త్రము లేవైన నింకను మిగిలియున్నవా?" యని చమత్కారము దోపఁ బలికెను.

"తొడుగుకొనుటకై వర్షకాలము వచ్చినదని బట్టలను కొని తెచ్చితిని" అని యాతఁడు ప్రత్యుత్తరము చెప్పెను.

హైమ:- ఈ సిల్కు కమ్బాలు, ఇమ్రాయిబట్టలు వర్ష కాలము నకుఁ జాలమంచివే! ఈ అత్తరు బుడ్లు, సెంటు బుడ్లో
గణ :- స్నేహితులెవరైన వచ్చినప్పు డుండవలెనని తెచ్చితిని.
హైమ:- ఇదివఱ కెన్నఁడును రాని క్రొత్త స్నేహితులు నేడు వచ్చువారుందురు. కనుకనే తెచ్చితిరి!

ఈ చివరవాక్యము పలుకునపుడు హైమవతి దృష్టులు గణపతిరావు ముఖమునఁ జెదరక నిలచియుండెను. అతఁడామె చేసిన పరిహాసమును దెలిసికొనకపోలేదు. పెదవులపైన నటించుచుండిన చిఱునగవుచేత నామె చెక్కుటద్దములపైన నేర్పడిన గుంటలను నాతఁడు చూడకపోలేదు.

మఱియొక మాట నేదియును ననక గణపతిరావు పని మిషమీఁద నవతలికిఁ బోయెను.

రాత్రి జాముప్రొద్దయినది. చర్చి (గుడి) మీఁది పెద్ద గడియారము తొమ్మిది గంటలు కొట్టెను. 'కృష్ణా థియేటరు' లోని విద్యుద్దీపికల కాంతులు విచిత్రవర్ణశోభితములగు పర్దాల పైఁ బడి చూచువారికి కన్నులపండువు సేయుచుండెను. వెలగల వస్త్రములను గట్టుకొని తళతళలాడు బంగారు చట్టములుగల సులోచనములను బెట్టుకొని ముంజేతులపైన 'వాటరుప్రూఫు (Water Proof) ఓవరు కోట్లను' మడతచేసి వేసికొని నీటుగా నటునిటు జూచుచు యౌవనులు గుంపులు గుంపులుగా నాటక

శాలలోఁ బ్రవేశించి కురిచీల నలంకరింపసాగిరి. ప్రేక్షకులను నెక్కించుకొని నాటకశాలకు వచ్చుచున్న మోటారుబండ్ల భంభ మారావమును, బగ్గీబండ్ల చప్పుడును లోపలివారికి విసుగుఁ బుట్టించుచుండెను. అంతలో నేత్రాకర్షకమగు వేషముతో గణపతి రావును, అతనికంటె ముందే ఘుమ ఘుమ లాడు సువాసన యును లోపలికి వచ్చెను. అంతకుపూర్వము వచ్చియుండిన నీటుకాండ్ర చూపులు సులోచనములలోనుండి యాగంతుకుని ముఖముపైనఁ బ్రసరించెను. వెంటనే వారొకరి ముఖము నొకరు చూచుకొని నవ్వుకొనసాగిరి. గణపతిరావు వారి సైగలను జూడనట్లు నటించెను; కాని, తా నసాధారణముగా నాటకశాలకు వచ్చినందున వారు పరిహసించుచున్నారని తెలిసికొనకపోలేదు.

నాటక మారంభమయ్యెను. కాళిదాసుని కథానాయికయగు శకుంతల చెట్లకు నీరుపోయుచు సఖులతో సంభాషించుచుఁ బ్రదర్శించిన మాధుర్యముగాని, తపోవనమును విడిచి హస్తినా పురమునకుఁ బోవునప్పటి కరుణారస ప్రధానములగు భావముల మార్దవముగాని, గణపతిరావు హృదయము నాకర్షింపలేక పోయెను. అతని దృష్టి మొదట ప్రేక్షకురాండ్రున్న ప్రదేశము నకు దుమికి యచ్చట వెదుకసాగెనుగాని వారందఱు నాటక మును జూచుటయందు నిమగ్నలై యుండిరి. అతని చూపుల కొకరయినను జవాబిచ్చి యుండలేదు. తుదకు నాటకము ముగిసెను కణ్వాశ్రమము నుండి భర్తృగృహమునకుఁ బోయిన శకుంతలతోఁబాటు నాటక ప్రేక్షకులుగూడ తమ తమ యిండ్లకుఁ బోవ వెడలిరి.

గణపతిరావు వందరకంటె వెనుకజిక్కెను. అతని చూపు లింకను వెదకుచునే యుండెను. నాటకశాలలోని దీపము లాఱి పోయినవి. ఆవరణములో నొకచోట మాత్రము మినుకు మినుకు మనుచు నొకదీపము గానవచ్చుచుండెను.

మన న్యాయవాది ద్వారముకడకు నిరాశతోఁ బోయి యటు నిటుఁ జూడఁగా, ఆవరణమున కవతలి మూల నొక చెట్టు క్రింద ముసుకుఁ గప్పికొని యున్నవా రెవరోతన్ను రమ్మని సంజ్ఞ చేయుచున్నట్లు కానవచ్చెను. ఆశాభరితమగు హృదయముతో నతఁడచ్చటికిఁ బోయి యేమి మాట్లాడుటకుఁ దోచక నిలఁబడి యుండెను.

"సుందరీ! నీగుణ సంపదకును, భావోన్నతికిని, నేను తగినవాఁడను గానని తెలిసియు నీ యాజ్ఞకు బద్ధుఁడనై వచ్చితిని. నీ ప్రసన్న వదనమునుజూపి నన్ననుగ్రహింపుము" అని యాతఁడు ముసుకుతోనున్న స్త్రీని వేడికొనెను. అంతనామె మెల్లగాఁ దన ముసుకును దొలగించెను. కొంత దూరమున నుండిన దీపకాంతి యామె ముఖమునఁ బ్రసరించెను. గణపతి రావు మోము వెలవెలఁ బాఱెను. కాళ్లు వడఁకసాగెను. కొంత సేపటికి ధైర్యము తెచ్చుకొని యెండిన పెదవులను గొంతకష్ట ముతోఁ దెఱచి యనెను. "ఈకొంటెతనము చేసినది నీవేనా?" ముసి ముసి నవ్వుతో గడుసుదనము దోపహైమవతి యనెను, 'నేనే'.

అగ్ని కుండము

ప్రథమ రంగము

ఉ. కంటికి నిద్రవచ్చునె? సుఖంబగునే రతికేళి? జిహ్వకుఁ
వంటకమిందునే? యితర వైభవముల్ పదివేలు మానసం
బంటునె మానుషంబుగల యట్టి మనుష్యునకెంతవానికిఁ
కంటకుఁడైన శాత్రవుఁడొకండు తనంతటివాఁడు గల్గినఁ

-కాశీఖండము.

యశవంత సింహమహారాజునకుఁబుత్రుఁడగు బృథ్వీ సింహుఁడుఁ శౌర్యసౌందర్యాలంకృతుఁ డనియు, పర్షియా, ఈజిప్టు, టర్కీ వివిధ దేశాటనార్జితానుభవ కుశలుఁడనియు, ననేక భాషావిశారదుఁడనియుఁ బేర్వాసిగాంచి యుండెను. ఈతని సోదరియగు రాజనందని యను నామె, రూపలావణ్యము నను, వాఙ్మాధుర్యమునను, స్వభావోన్నతివలనను, నప్పటి రాచ కన్నియలలో వన్నె కెక్కియుండినది. అపరాధ మొనర్చుట యన్న నామె కత్యంతాసహ్యము. నైతిక సమస్యలను గూర్చి యామె మహారాజుగారితోఁ బలుమాఱు వివాదము సలుపుచుండెడిది. రాజనీతి మఱుఁగున నధర్మ కార్య

ముల నొనర్పఁ గటిబద్ధుఁడై యుండిన తండ్రి యుద్యములఁ బెక్కుమారు లామె మార్చి యుండెను. చిన్న రాజపుత్ర సంస్థానమున కొక్క దానికి యువరాజై యశవంత సింహుని సేనాంగములో నున్నతోద్యోగ మందుండిన ధర్మసింహుఁడను పురుషసింహుని శౌర్యసాహసాదులఁ బరికించి, వృద్ధికాముఁనిగఁ దలంచి, మహా రాజాతనికి దన ముద్దుకూతు నిచ్చి పెండ్లి చేసెను. ఈ దంపతుల యనురాగము కడు ప్రశంసనీయమై యుండెడిది. ధర్మసింహుఁడు విశేషముగ యోధ పురముననే నివసించుచుండుటవలనఁ బృథ్వీసింహునకును నాతనికిని గలిగి యుండు ప్రేమాబంధములు మఱింత గట్టిపడెను. వేయేల ? వారి మైత్రి భ్రాతృత్వముకంటె మించిపోయెనని చెప్పిన నందతిశయోక్తి యావంతయు నుండఁజాలదు. రాజపుత్రులవలెనే రాజ పుత్రికల కిద్దఱకును బ్రాణ స్నేహముండెను. పృథ్వీసింహుని ధర్మపత్ని యగు దుర్గాదేవి, మిగుల శాంత స్వభావము గలదియై, నీతివర్తనమున మిన్నగా నుండెను. సామాన్యముగఁ బ్రపంచమున నగపడు నాడుబిడ్డమఱదండ్రునకు వలెఁగాక యీ జవ్వను లిరువురకును, నొకరికై యొకరు ప్రాణము విడుచునంతటి యన్యోన్యానురాగమును, నిరువురకును సమానముగ సంస్కృత సాహిత్యజ్ఞానమును నుండెడివి.

ఒకనాఁడా యువతీమణు లిరువురు నుద్యాన వనమున విహారమొనర్చుచుండ, దాసియొకతె రాజనందని చేతి కొకజాబు

దెచ్చియందిచ్చెను. సంస్కృతమున వ్రాయఁబడి యుండిన యాలేఖ నామె చదువుకొని, యంపిన వారిని వెంటనే లోనఁ బ్రవేశపెట్ట దాసి కాజ్ఞ యొసఁగెను. కొంతసేపటికి జీర్ణవసన ధారిణి యొకర్తు ప్రవేశించుచుండుట గానవచ్చెను. ఆ క్రొత్త వనిత యిరువదియైదింటికన్న నెక్కువ శరత్కాలములఁ జూచి యుండినట్లగపడకపోయినను, శరీరమున వ్యాపించియుండిన పచ్చందనమును, తడిలేని పెదవులును, నామె విశాలనేత్రముల యొక్కయు, మందగమనము యొక్కయు, నెమ్మనము నాకర్షించు ముఖ లక్షణమ్ములయొక్కయు. సొగసు నణచిపెట్టి చూచువారికి ''కాలవైపరీత్య మిట్టి దశకుఁ బాల్పఱఁ జేసినది గాని, యొకప్పు డీమె సౌందర్యరాశియై యుండనోపు''నను నూహను బుట్టించుచుండును. రసపుత్ర నారీమణులను సమీపించిన పిదప నా క్రొత్త జవ్వని, వినయసూచకముగ నవనత శరీరయై, వారిద్దఱ నాశీర్వదించి, సమీపమున నొక్కచోఁ గూరుచుండెను. రాజనందని యామె నాపాదమస్తకము పరీక్షించి ''మీ పేరే'' మని యడుగ ''వ్రజవిలాసిని''యని యామె బదులు చెప్పెను.

రాజనం:-మీదేయూరు ?

వ్రజ :-ఇచ్చటినుండి మూఁడుదినముల ప్రయాణమున నున్న విక్రమపురమే మా పురము.

రాజనం :-సంస్కృత మెచ్చట నభ్యసించితిరి ?

వ్రజ:-అశేషపాండితీ వైభవము గలిగియుండిన మా తండ్రియే
నాకు రెండు ముక్కలు నేర్పెను.

రాజనం:—మీకు వివాహమైయుండును కాదూ ?

వివాహము మాట వెలువడ(గనే, వ్రజవిలాసిని కనుద మ్ములనుండి ముత్తియములవలె బొటబొట బాష్పములు రాల సాగెను. అయినను నామె కన్నీరు దుడుచుకొని గొంతు సవరించుకొని ''అమ్మా! ఈ ప్రశ్నకు మఱియొక సమయమున నుత్తరము విన్నవించుకొనెదను. నా కథ యిసుక పాతరవలెఁ దఱుగనిదై, జాలిఁ బుట్టించునదిగా నున్నది. అట్టి దానిని విన్నచో మీ మనములు విషాదమగ్నములుకాక మానవు. ఇప్పటికా విషయమున నన్ను క్షమింపు(' డని వినయముగఁ బల్కెను.

నా(టినుండి వ్రజవిలాసిని యచ్చటనే నివసించుచుండెను. సంస్కృతమున నసామాన్య పరిచితిగల యా విదుషీమణి యను దినమును సుప్రసిద్ధ కవిరాజుల గద్య పద్యాత్మక కావ్యముల నాజవ్వనులకు వినిపించుచుండెను. ఆమె విద్యాసంపన్నతయు, సద్విషయ నిరతియు నచిరకాలముననే రాకొమరితల హృదయమున గౌరవయోగ్యమగు స్థలము నాక్రమించెను.

———

ద్వితీయరంగము

పృథ్వీసింహ ధర్మసింహు లిరువురును మహారాజుగారితోఁ గూడ నాఫ్ఘనిస్థానపు దండయాత్రకై వెడలిపోయి యనేకమాసములు గడచినవి. దుస్సహమగు నీవియోగకాలము మేఘసందేశ రఘువంశాది గ్రంథ పఠనమునం గడచుచుండెను. మహాకవి కాళిదాసుని కై తయెడ ననత్యంతాభిమానము గలిగియుండిన యావ్రజవిలాసిని యక్కావ్యములలోని కథావిషయముల మిగుల రసావహయుగ వర్ణించుచు నొక్కొక్కప్పు డందలి విశేషాంశములను సూక్ష్మదృష్టితో విమర్శించుచుఁ దన చెలుల నానందరస తరంగిత హృదయలఁ జేయుచుండెడిది. ఒకనాటి సాయంతనమువేళ రాజపుత్రిక లిరువురును గృహారామమున విహారము సల్పుచుండఁ బచ్చనిలేఁబచ్చికపై సాశ్రులోచనయై పడియుండిన వ్రజవిలాసిని వారికంటబడెను. రసపుత్రజనరాంద్ర యనుగ్రహమును, వారి మర్యాదయు, వారి యవ్యాజప్రేమయు, వ్రజవిలాసిని సౌందర్యమునకు మునపటికన్న నెక్కుడు వికాసము నిచ్చియుండె, తక్కిన యిరువురితోఁ బాటామెయు రాజకన్యవలె నగపడుచుండినది. అయినను నెట్టియూఅటకుఁ గారణములుండినను, నప్పుడప్పుడామె యేకాంతమునఁగూర్చుండి విలపించుచుండెడిది. నిముసమేనియు నెమ్మదినీయనంతటి నతిన భారమామె హృదయమునొత్తిపెట్టుచుండెను. తమ చెలికత్తె యొక్కయప్పటి దీనావస్థకు నెంతయు జాలిఁజెంది నా జవ్వను లిరువురును నామెకడకుపోయి కూర్చుండిరి. రాజనందని యామె

తల నెత్తి తనతొడపై నిడికొని, గులాబిపువ్వులఁ దృణీకరించు నామె చెక్కులను దుడుచుచు, నిట్లనియె: "నీ మనసులోని మాట మా కేల చెప్పవు? మమ్మునింకను లాతివారిగ భావించెదవా? మమ్మువదలి నీవొక్కదానవే యిట్లు దుఃఖాగ్ని సంతప్తవగు చుండుటఁ జూచి మేము భరింపఁజాలము".

వ్రజ:- (డగ్గుత్తికతో) అమ్మా! నేను దురదృష్టవంతురాలను; నా కథ వినఁగోరవలదు.

రాజ:- నీకుఁ దప్పఁగాఁ దోఁచదేని యొక్కమాట యడిగెదను.

వ్రజ:- అడుగుము.

రాజ:- క్రొత్తదేదియును గాదు: నాఁడు నేనడిగినదే; నీకు వివాహమైనదా లేదా ?

వ్రజ:- నేనేమి ప్రత్యుత్తరము చెప్పుదును? ఇంకను గాలేదు.

రాజ:- ఎవ్వరిదేని యనురాగ ఖడ్గము నీ హృదయమున నాటి యున్నదా ?

వ్రజ:- చెలీ ! లేదు. దేవునితోడు.

రాజ:- అట్లయిన విన్నవోయియుండుటకుఁ గతమేమి ? అనురాగామృతమును జవిగొన నిచ్ఛగించు చున్నావా ?

వ్రజ:- లేదు; నా హృదయమున దుఃఖమునకుఁ దప్ప సుఖమునకుఁ జోటు లేదు.

రాజ:- అట్లయిన మే మనురాగమునకుఁ జోఁటేర్పరచెదము.

వ్రజవిలాసిని వారి నర్మోక్తిని గ్రహించి "చెలీ! దయ చేసి యిప్పటి కీప్రసంగమును జాలింపు" డని బ్రతిమాలు కొనెను.

రాజ:- ఇఁక మేము నీ పరిణయ ప్రయత్నము లొనర్చెదము.

దివా:- జయచంద్రు నెన్నఁడయినఁ జూచితివా ?

వ్రజవిలాసిని దానికు త్తర మొసంగక కన్నీరు గార్చుచు నివ్విధముగఁ జెప్పఁదొడంగెను:

''రాకుమారీ! నే నొక వ్రతముఁ బూని యున్నాను. ప్రతిన నెఱవేర్చుకొనుటయే నా జీవితోద్దేశము. దీని కొఱకే నేను జీవించియున్నాను. కానిచో, నాకుడిచిన యిడుములు నన్నది వఱకే విషణ్ణ హృదయగఁ జేసి యంత మొందించియుండును. నా జనకుఁడు విక్రమపురమునకు జాగీరుదారుగ నుండెను. ఆయ నకు నేను తప్ప వేఱుసంతతి లేదు. కనుక నన్ను ప్రాణముతో సమానముగ గారామునఁ బెంచుచుండెను. నాకొఱకే యాయన యనేక సంవత్సరములు కృషిచేసి సంస్కృతము నభ్యసించెను. సంగ్రామ విద్యయందారితేఱినవాఁడు. పలుమారు రణరంగమున శత్రువుల వెన్నుఁజూచినవాఁడు. ఒకనాఁడసురస్యంధవేళ గోగ ణము లడవులమేసిగృహోన్ముఖములై వచ్చుచుండినవి. నేను మా యింటి ద్వారముకడ నిలిచియుంటిని, అంతలో నీటగు పాగాను ధరించి యాయుధాలంకృత శరీరుఁడై వీరరసోన్మాదునివలె నాయె దుట నొక పురుషుఁడు వచ్చుచుండెను. నాకుఁ గడుఁగూర్చు నావు

'మోహిని' యనునది పచ్చిక బయళ్ళలో హాయిగ మేసి మరలి వచ్చుచుండెను. దాని దూడ యటునిటు చెంగుచెంగున గంతులు వైచుచుండెను. విధివశమున నకస్మాత్తుగ నా దూడ యాపురుషుని పాదముల క్రిందఁబడి నలిగెను. ఆవు తన దూడ గతిఁ జూచి తటాలున నాతనిపైకి దుమికెను. శూరుఁడగు నారస పుత్రుఁడు పాఱిపోయినచోఁ బిఱికితనము ప్రకటనమగునని కాఁబోలు వెంటనే కత్తిఁ దూసి యావుపై కెగిరెను. గోవును లేశమేని జంకక యార్భాటము సేయుచుఁ బెనఁగులాడసాగెను. నా కన్నెదుటనే నిముసమున నాపురుషుఁడు ధేనువు ప్రాణములఁ గొనెను. అంతలో నచ్చట వందలకొలఁది జనులు గుంపులు గూడి, చేసిన దుష్కార్యమున కాతని దూఱసాగిరి. మఱియొక నిముసమున సంధ్యావందనమునకై జలాశయమున కరిగియుండిన మా తండ్రి మరల వచ్చి చూచువఱకు వాకిటియందు జనులు తండోపతండములుగ నగపడిరి. గోవుప్రాణావసాన స్థితి యందు గిజగిజఁదన్నుకొనుచుఁ బడియుండుటయు, దూడ కంట నీరుగార్చుచుండుటయు నాయన కన్నులారఁజూచెను. ఆయన కంఠధ్వని వినఁగానే యావు దుఃఖావేశమును బ్రకటించు నట్లు బిగ్గరగా నఱచి జాలిఁగొలుపువడువునఁ దన దృష్టిని యజమానుని వైఁపుఁబఱపెను. మా నాయన కత్యంత ప్రేమాస్పదమగు వస్తువులలో నా తరువాత నదియే ముఖ్యమైనదని మీరెఱుంగుదురుగాక! కనుక క్రోధావేశపరవశుఁడై 'నాయావును గొట్టినవాఁడెవఁ'డని దిక్కులు ప్రతిధ్వనించునటులు ప్రశ్నిం

చెను. యౌవనుఁడు సిగ్గుచేఁదలవాల్చి ముందఱకువచ్చి "నేనే" యని పల్కెను.

మా తండ్రి:-అయినచో క్షత్రియు నొక్కని మార్కొన సిద్ధముగ నున్నావా?

రాజపుత్రుఁడెఱ్ఱవారిన మోముతో 'క్షత్రియుఁ డెవ్వఁడేని నన్నెదుర్కొన సిద్ధముగ నున్నచో నా కభ్యంతరములే'దని బదులిచ్చెను.

అచ్చట నిలచియుండిన వేలకొలఁది జనులలో నొక్కని కైనను నారాజపుత్రు నెదుర్కొను ధైర్యము కలిగినదికాదు. అదిచూచి మానాయనయే ఖడ్గహస్తుఁడై యాతని నెదుర్కొనెను. అతఁడును గరవాలమును గైకొని ముందడుగిడెను. ఇట్టిద్దఱును బోరునకు డీకొనిరి. అయినను నిద్దఱలో మా తండ్రి వయసు ముదిరినవాఁడగుటచేత వక్షమునఁ దగిలిన గాయమునకుఁ గ్రిందవడఁగా నాయనను లోనికిఁగొనివచ్చిరి. ఆయన ముఖము పచ్చబారినను, నాగ్రహాగ్ని కణములు చేటలఁ జెఱఁగినట్లు నేత్రములనుండి వెడలుచుండెను. ఏడ్చుచు నెదురుగా వచ్చినిలచిన నన్నుజూచి, మాతండ్రి యందఱను నవతలకుఁ బొమ్మని కనుసన్నఁజేసెను. మేమిద్దఱ మేకాంతమునున్నప్పు డాయన నన్నుఁజూచి "అమ్మాయీ! నీవు రసపుత్ర స్త్రీవి కదా?" యనెను.

నేను:- అయ్యా ! అవును.

తండ్రి:-రాజపుత్రులు ప్రతిజ్ఞా నిర్వహణవ్రతులు గదా?

నేను:- అవును.

తండ్రి:-నా యావు ప్రాణముల నపహరించిన క్షత్రియునిపై నీవు పగతీర్చుకొనవలయును.

నేను:- అయ్యా! తమ యాజ్ఞ నడిపెదను.

తండ్రి:-నా కుమారుఁడు బ్రతికియుండిన పక్షమున నీ ప్రతిజ్ఞా భారము నీ తలపైఁ బడియుండదు.

నేను:- తమయాజ్ఞను నెఱవేర్చి తీరెదను.

తండ్రి:-నీవట్లు నాకభయ వచన మిచ్చెదవా?

నేను:- నిస్సందేహముగా.

తండ్రి:-నీవు ప్రతిజ్ఞను చేసి చూపుదువని నేను నమ్మవచ్చునా?

నేను:- నా ప్రాణములుండినచో నెఱవేర్చితీరెదను.

తండ్రి:-ఇదిగో. ఈ కటారును గైకొనుము. ఎంతవఱకు నీవా క్షత్రియుని హృదయమును దీనితో వ్రయ్యలుచేయవో యంతవఱకు నీవు సర్వసుఖ త్యాగినివిగా నుండవలయును.

ఈ మాటలతో మా తండ్రియాత్మ పరలోకము నసుగమించెను. నేనును నాఁటినుండి యోగినీవేషధారిణినై యాకటారు నుడుపులక్రింద గుప్తముగ నుంచుకొని యా క్షత్రియ యౌవ

సునినై దేశమంతయు గాలించుచుంటిని. అనేక సంవత్సరముల వఱకు నొకప్పుడు జనావాసంబులందును, మఱొకప్పు డరణ్యముల యందును నివసించుచుఁ గ్రుమ్మరుచుంటిని. కాని యాపురుషుని జాడ యగుపడలేదు. ఒకనాఁడు నిర్జనప్రదేశమునఁ గూర్చుండి నా దురదృష్టమును దలపోసి దుఃఖించుచుండ, నా యౌవనుఁ డెచటనుండియో నావైపు నడిచివచ్చుట గానఁబడియె. అతడు సమీపించి నన్నుగాంచి "నీవెవ"రని విచారించెను.

నేను:- నేను దీనురాలనగు నొకబ్రాహ్మణిని. కరుణించి నాకేమైన నాహారమిడుఁడు,

క్షత్రి:- అట్లయిన నా వెంట రమ్ము.

నేను లేచినిలచి యతఁడేమఱి యుండిన సమయమునఁ దటాలునఁ గటారుఁదూసి యాతని రొమ్మునఁ గ్రుమ్మితిని. అంతలో ననేకు లచ్చటికి వచ్చుచుండుట కానరాఁగా భయాకుల చిత్తనై కటారుఁ బాఱవైచి పరుగెత్తితిని. నాఁటినుండి మూఁడేండ్లవఱకు పర్వతారణ్యములలో డాఁగియుంటిని. ఏ నాఁతిలోనైననుబడి యుసురులవాయ పెక్కుమారులు నాకుఁ దోచెను. కాని, ప్రాణములు కడుపుతీపులు సుమా! ఇంక ముందేమేమి యనుభవింప వలసియున్నానో కాని యిప్పటి వఱకు నాకుఁ జావు రాలేదు. వనవాస జీవనము కొంతకాలము నకు వెగటుగ దోచి, జోధపురము వచ్చి, తమ దీనావన తత్పర త్వమును జెవులపండువుగ వింటిని. తమ సేవా భాగ్యమును

బడసిన యానాఁటినుండియు భవత్కృపా విశేషమున సుఖముగ జీవించుచున్నాను. ఇదియె క్లుప్తముగఁ జెప్పఁబడిన నా యుదంతము.''

ఈ వృత్తాంత మంతయును విని రాజనందని దీర్ఘనిశ్వాసముతో ''ఓహో! ప్రపంచమం దెంతటివారలున్నారు. అది యట్లుండె. నీ కటారాతని ప్రాణములఁ బాపియుండునా?'' అనెను.

వ్రజ:- ఎక్కడనమ్మా? అతఁడుతప్పించుకొనఁగల్గెను. గాయము తప్పితగిలెను. పిమ్మటఁ గొంతకాలమునకట్టి యాకారమే గల యౌవనుఁ డొకఁ డడవిలో వేటాడుచు నాకగుపడెను. అతఁడో కాఁడో చెప్పఁజాలను; కాని వారిద్దఱ రూపములు పచ్చున గ్రుద్దినట్లొక్కతీరున నున్నవి.

తృతీయ రంగము

ఈ సంగతులుజరిగి యనేకమాసములు గడచెను. వ్రజవిలాసికథ విన్ననాఁటనుండి రసపుత్ర నారీరత్నము లామెయెడ మునుపటికన్న నెక్కువ ప్రేమను, గనికరమును జూపసాగిరి. మున్నుచనవుచే నామె నప్పుడప్పుడు విసిగించుచుండిన యాజవ్వను లిపుడామెను సర్వదా యాదరించుచుందురు. ఆకాశము మేఘాచ్ఛాదితమై గడునానంద దాయకముగనున్న యొకనాఁడు,

రాజనందని "వర్షర్తు"ను గూర్చిన మనోహర వర్ణనము గల పొత్తము నొకదాని విషయమునఁ బ్రశంసించి దానిఁ జదువఁ గోరెను.

వ్రజ :-అది నిజముగా నమూల్యగ్రంథము చెలీ! నీ ప్రక్క నున్న యలమారునందా పుస్తకమున్నది. కొంచెముతీసి నా కందిమ్మా.

వ్రజవిలాసిని యాగ్రంథమునందికొని విప్పి. మొదటి పుట మరలింపఁగానే పుస్తకమామె చేతినుండి జారిక్రిందఁ బడెను. ఆ పుట నలంకరించుచుండిన ప్రతిమ తన తండ్రిని జంపిన పురుషునిదిగ నామెకుఁ దోఁచెను. దానిఁ జూచినతోడనే యామెకన్నులనుండి యగ్నిజ్వాలలు వెడలసాగె. లలాటమున ముడతలు పడెను, తన ప్రతిజ్ఞ జ్ఞప్తికి వచ్చెను. కాని యంత లోనే "యతని ప్రతిమ యిచ్చటి కేల వచ్చియుండును? ఆ పురుషుని కీ రాకొమరితలతో నెట్టి సంబంధమున్నది? కృతజ్ఞ తాభారమునకు లొంగి నా ప్రతిజ్ఞ నుల్లంఘింపవలసి వచ్చునా యేమి?" యను విచార పరంపరయామె మనస్సును వేధించెను. రాజనందని తన చెలి మోమువంకఁజూచి "సఖీ! ఏల యీ యాగ్రహ"మన్న యడుగ వ్రజవిలాసిని మెల్లన "నేమియు లేదు, కొంచె మేదో మనోవైకల్యము తప్ప మఱేమియులే"దని ప్రత్యుత్తరమిచ్చెను.

ఇదివఱకున్నది కాక నాటినుండి వ్రజవిలాసిని కొక క్రొత్తవిచార ముద్భవించెను. 'కృతజ్ఞతా భారము నన్ను బ్రతిజ్ఞ నుల్లఘింపఁ జేయునాయేమి' యనునదియేయది.

చతుర్థ రంగము

పదునాఱు మాసములు పూర్తిగఁ గడచిన పిదపఁ బృథ్వీ సింహ ధర్మసింహు లాఫ్గనిస్థానమునుండి మరలిరి. చక్రవర్తి సేన లాదండయాత్ర యందుఁ జాల నిడుమలఁ గుడువవలసి వచ్చెను. మార్గమధ్యమున మంచుగడ్డలు కురియఁజొచ్చెను. పర్వతపు కనుమలు హిమమయములై రాకపోకల నడ్డగించెను. వస్తుసామగ్రులు క్రమముగాఁ దగ్గిపోయె. సైనికులు పస్తుండ వలసి వచ్చెను, ఈ స్థితిగతుల లాభముగొని యాఫ్గనులు చక్రవర్తిసేనల నురుమాడఁ జొచ్చినందున యువరాజగు మొహియుద్దీనుఁడు భగ్నమనోరథుఁడై వెనుకకు మరలి రావలసివచ్చెను.

యోధపురము సమీపించిన కొలఁదిని, రసపుత్ర వీరు లిరువుర మనములును నాతురతతోడి సంతోషమున మునింగెను. ఇన్నినాళుల వియోగము తరువాత లభింపనున్న సంయోగ సుఖాశ వారి ధ్యానందములు మేరమీఱఁ జేసెను. రాత్రియనక పగలనక మార్గాయాసమును దలంపక వారు వడివడిగఁ బ్రయాణము సల్పసాగిరి. వారికిద్దఱకు బలమైన గాయములు తగిలి

యుండినను బ్రియజన దర్శనాభిలాష వారికి బాధను స్ఫురింప నీయలేదు. పృథ్వీసింహుఁడు తన మనోనాయకికై అస్పృహను నగరపు కటారునొకదానిఁ దెచ్చెను. ధర్మసింహుఁడునునట్లే పత్నికై కాశ్మీరశాలువు నొక్కదానిఁ గొనివచ్చెను. ఇరువురును దమ వారినెప్పుడు చూతుమాయను నుత్కంఠచేఁ దొందరపెట్టఁ బడుచుండిరి.

రాజకుమారుల యాగమనవార్తవినిన రాకొమరితల సంతోషము వర్ణనాతీతమై యుండెను. శరీరములు భూషణములతోను, పాపటలు ముత్తెఁపుఁజేరులతోను నలంకరింపఁ బడసాగెను. వారి వదనారవిందములు ప్రియవార్తా శ్రవణముచే వికసించెను. ఒకరినొకరు వేళాకోళము చేసికొనుటయు, మరల పరస్పరాలింగన మొనర్చుకొను చుండుటయు, జరుగుచుండెను.

ఆశ్వీజమాసమున నొకనాఁడు యోధపుర దుర్గమునుండి వెడలు స్వాగతసూచక శతఘ్నినినాదములు దిక్కులఁ బిక్కటిల్లఁజేసెను. పృథ్వీసింహుఁడు సురక్షితముగ నాఘనిస్థానము నుండి మరలివచ్చె ననువార్త నగరమందెల్లెడల నల్లుకొనియె. రాకొమరిత లిరువురును పళ్లెరములు హారతీద్రవ్యముల నిడుకొని యంతఃపుర ద్వారమునఁ బ్రతీక్షించుచుండిరి. పృథ్వీసింహుఁడు సభ్యులొనర్చు మర్యాదలఁ గొనుచు నంతఃపుర ప్రవేశము చేయఁగానే దుర్గాదేవి భర్తకు హారతి యిచ్చెను. దంపతుల చూడ్కు లన్యోన్యాలింగనముచేఁ దృప్తిఁబొందెను. శౌర్య

గర్వముతో ధర్మసింహుఁడు మందిరాంగణము లోనికిరాఁగానే తుమ్ము వినవచ్చెను. ఎడమ కన్నదరసాగె. అంతలో హారతి బూని యత్యాతురముతో వచ్చుచుండిన రాజనందని కాలుజాఱి పళ్లెరముక్రిందఁ బడెను. ధర్మసింహుని మోము వెల్లఁబారె. రాజనందని ముఖకమలము వాడ్పుఁజూపె. ఈ దుశ్శకునమున కర్థమేమై యుండును ?

పంచమ రంగము

రసవుత్ర వీరులింటికి వచ్చిన వార్తవిని వ్రజవిలాసిని వారిద్దఱను గురించియు నభివందన రూపముగ సరస పద్యాళి రచించి యుండెను. కనుక మరునటి యుదయమున పృథ్వీసింహుఁడు కాల్యకృత్యముల నిర్వర్తించుకొని తీఱికగఁ గూర్చుండువేళ నామె యాతని సమ్ముఖమునకువచ్చి కుశనిర్మిత మగు చక్కని పాత్రమున నా కవితారూపకాభినందన పత్రిక నునిచి యర్పించెను. పృథ్వీసింహుఁడెంతయు సంతసించి దాని నంగీకరించె. పత్రికయందలి కవిత్వమంత ప్రౌఢముగ నుండక పోయినను భావ సౌష్ఠవముచేతను, పొంగి పొరలు రసముచేతను నది మిగుల రమ్యమై యొప్పారె. కవితారసలోలుఁడగు పృథ్వీసింహుఁ డాపద్యముల జదివి యానందించి మేలు ముత్తియముల హారము నావిదుషీరత్నమునకుఁ బారితోషికముగ నొసంగెను.

అచ్చటినుండి వెడలి యాముద్దియ ధర్మసింహుని కడ కరుగు దెంచువఱకు నతఁడు సుఖాసీనుఁడై రాజనందనికి యుద్ధ వార్తలు వినిపించు చుండెను. వ్రజవిలాసిని దృక్కులాతనిపైఁ బ్రసరింపఁగనే యాశ్చర్య చకితయై యప్రయత్నముగ వెనుకకుఁ దగ్గెను. ఆమె ముఖము నవలోకింపఁగనే ధర్మసింహుని మోము సహితము వెలవెల్లఁ బారెను. పెదవు లెండెను. కాలు నేతులు తడఁబడఁ జొచ్చెను. వ్రజవిలాసిని వెనుకకుఁ దగ్గినది తగ్గినట్లే మరలి పోయెను. ధర్మసింహుఁ డుత్సాహమంతయుఁ గోల్పోయి మంచముపై నొరిగి హస్తద్వయముచేఁ గన్నుదోయి మూసికొనియె. ఈ వికార దశను బరికించుచుండిన రాజనందని యొక్క కుసుమ కోమల గాత్రము చెమటయందు మునిఁగెను.

ధర్మసింహుఁడా దినమంతయు నట్లే మౌనముగఁ బరుండి శయ్యపై నిటునటుఁ బొరలాడుచుండెను. చిరకాల వ్యాధిగ్రస్తునివలె నాతని ముఖము వన్నె తఱిగెను. పగలీ విధముగఁ గడిపి, రాత్రి మార్గాయాస వ్యాజమున నాతఁడు సత్వరమె నిదురించెను. పాపము ! రాజనందని కా మనోవైకల్య కారణ మేమియుఁ దోఁపలేదు. "వ్రజవిలాసిని దప్పిగొనియున్న దీయనరక్తమునకే కాదు గదా? నా మనోనాథుఁడు నా జ్ఞాననిధి యగు ధర్మసింహుఁ డంతటి కాఠిన్యమును వహించియుండుట సంభవమగునా? అసంభవ మసంభవ"మని పలుమాఱు విత

ర్కించుకొని తన చేష్టాచమత్కృతిచే నాతని మనోవ్యాధిని దొల గింపనెన్నియో యత్నము లొనర్చెను. కాని, వ్యర్థమయ్యెను. తుద కామెయు నిద్రా దేవతయొక్క యనివార్య ప్రభావమునకు లోనై కన్గవ మూసికొనెను. రాతిరి చాల ప్రొద్దు పోయినది. గగనకాంత యంధకార వసనముతోఁ దన వదనమును గప్పి కొనెను. అప్పుడప్పుడు సారస పక్షియొక్క వ్యసనకరమగు ధ్వనియును, దుర్గమునుగాచు రక్షకభటుల జాగ్రత్తోద్బోధకారావ ములను దప్ప మఱేమియు వినచ్చుటలేదు. రాజనందని కకస్మా త్తుగా మెలఁకువ వచ్చి చూడ ధర్మసింహుఁడు శయ్యపై నఁ గానఁబడలేదు. హృదయము భయవిహ్వలమయ్యె. విద్యుద్వేగ మున లేచి వ్రజవిలాసిని యుండు గది వైపు నడచి తద్వార మున నిలచి తొంగిచూడ నామె సంశయము యథార్థముగ మాఱెను. చూచుఁగదా వ్రజవిలాసిని ఖడ్గపాణియై నిలచియుండ ధర్మసింహుఁడు కేలుమోడ్చి యామె యెదుట నిస్సహాయుని వలె మోకాళులపై నిలచియుండెను.

ఈ దృశ్యము నవలోకింపఁగానే రాజనందనికి పిడుగు పడినట్లయ్యె; తల దిమ్మెపట్టెను; కాళులు తడఁబడఁ జొచ్చెను. నిశ్చేష్టయై, క్రిందఁ బడుదునేమో యని యామె కనిపించెను. అయిన నెట్లెట్లో తన గదికి మరలవచ్చి ముఖమున వస్త్రమును గప్పికొని పరుండెనే కాని యొక్క యశ్రు బిందువేనియు నామె నేత్రముల నుండి వెడలలేదు.

షష్ఠమ రంగము

మరునాటి వేఁకువను పృథ్వీసింహుఁడు ధర్మసింహుని కడ(కేగి చిఱునగవుతో "భయ్యా! నేటి దినము కడు రమణీయముగ నున్నది. వేఁటకుఁ బోవుదము వచ్చెదవా?" యని ప్రశ్నించెను.

ఏదో విచారమున మునిగియున్న ధర్మసింహుఁడు తలయెత్తి యుదాసీనతఁబూనియున్న ముఖము నాతనివైపు త్రిప్పి "ఏమంటివి?'' అని యడిగెను.

పృథ్వీ:—వేఁటకుఁబోవుదము వచ్చెదవా?

ధర్మ:—అట్లే పోవుదము.

అంత నాఱూరు లిరువురును గుఱ్ఱముల నాయత్తము చేయించుకొని మృగయార్థ మేఁగిరి. వృథ్వీసింహుని వదనము కమలమువలె వికసించియుండి ప్రతిపాదన్యాసమునను నాతని జాగరూకతను జుఱుకుఁదనమును వెల్లడిచేయుచుండెను. కాని ధర్మసింహుని మోమువిగతప్రాణునివలెఁ గళాహీనమై కన్పట్టుచుండెను. వృథ్వీసింహుఁ డనేకపర్యాయము లాతనిఁ బ్రసంగమునకుఁ బురికొల్పిచూచెనుగాని యత్నము కార్యకారిగాక తన మిత్రుని మనోవ్యథయట్లేయుండ, దానును మౌనముతోనే నడిచెను. ఇట్లు కొంతసేపు ప్రయాణముచేసి వారొక సరస్తీరమును జేరిన తరువాత ధర్మసింహుఁడు తటాలున నాగి, మిత్రునితోఁ

"గడచినరాత్రి నేనొక ఘోర ప్రతిజ్ఞ చేసితిని" అని పలికెను. ఈ మాట లనునప్పుడాతని నేత్రము లశ్రుపూరితములై యుండె.

పృథ్వీ:- (భయభ్రాంతుఁడై) అది యెట్టి ప్రతిన?

ధర్మ:- విని యుందువుకదా వ్రజవిలాసిని యుదంతమును?

పృథ్వీ:- అవును.

ధర్మ:- ఎవ్వఁడామె తండ్రిని వధించెనో యాతని నరకగామిఁ జేయఁ బ్రతిజ్ఞవట్టితిని.

పృథ్వీ:- సెబాస్! నీవు నిజముగ వీరపురుషోచితమగు ప్రతిన యొనరించితివి

ధర్మ:- అవునదియట్టిదే; కాని నెఱవేరవలయునుగ! నీ యభిప్రాయమేమి? అట్టివాఁడు కంఠము తెగనఱుకఁ దగినవాఁడా కాఁడా?

పృథ్వీ:- సందేహమేమి? అట్టి దుర్మార్గుని కంఠము మొండి కత్తితో నఱుకఁదగును.

ధర్మ:- అవును. నేనును నట్లె తలంచుచున్నాను, ఏదేని కారణమువలన నే నా ప్రతిజ్ఞను నిర్వహింపకపోయితినేని నీవాకార్యమును జేసెదవా?

పృథ్వీ:- ఆహా! సంతోషముగఁ జేసెదను. నీ వాతని నెఱుంగుదువుగదా?

ధర్మ:- బాగుగ నెఱుంగుదును.

పృథ్వీ:-అట్లయిన నా సత్కార్యము నన్నే చేయనిమ్ము.పాపము నీ కాతనిపై జాలిపొడము చున్నట్లున్నది.

ధర్మ:- మంచిది; కాని జ్ఞప్తియందుంచు కొనుము. అతఁడు మంచి యదృష్టవంతుఁడు. పలుమారులు మృత్యుముఖ మును దప్పించుకొన్నవాఁడు. కనుక నీ హృదయమును కఱఁగించినను గఱ్ఱగింపఁగలఁడు. అతని యమసదన మునకుఁ దప్పక పంపెదనని శపథము చేయుము.

పృథ్వీ:-నేనాతనిఁ గనికరింపను. దుర్గతోఁడు! ఆతని రక్తముచే నా కరవాలఁపు దాహము దీర్పక విడువను.

ధర్మ:- మన మిద్దఱముగలసి యీదండయాత్రను నడుపుదము. నీ చేసిన వాగ్దత్తమును క్రియారూపమున నొనర్చెదవు గదా ?

పృథ్వీ:-ఏల యీ ప్రశ్న? నేను క్షత్రియుండను గానా? ఒక మారు వచన మిచ్చిన తరువాతఁ బ్రాణములు వోయినను నన్నమాట నెఱవేర్చిగాని యూరకుండను.

ధర్మ:- తప్పక యట్లేచేయుదువు గదా ?

పృథ్వీ:-తప్పక యట్లే చేసెదను.

ధర్మ:- అతఁడొకవేళ నీ మిత్రుఁడై యుండుట తటస్థించినచో.

పృథ్వీ:-(ధర్మసింహుని ముఖమును బరీక్షించు చూడ్కులతోఁ జూచి) మిత్రుఁడైనచో నా...

ధర్మ:- అవును. అతఁడొకవేళ నీ బంధువు కావచ్చును. అప్పుడో ?

పృథ్వీ:-(ఉత్సాహముతో) ఎవఁడైనను గానిమ్ము. నా సోదరుఁడైనను ప్రాణములతో వానిని వదలను.

ధర్మసింహుఁ డంతవారువము డిగ్గి వాడినమోము దమ్మితోను, ప్రకంపితములగు నోష్ఠములతోను, నడుమనున్నకటారు విప్పినేలపైఁబెట్టి, పృథ్వీసింహునితో నెలుఁగెత్తి చెప్పెను: "పృథ్వీసింహా! జతనమున నుండుము. ఆ చెనఁటి మనకు దొరకనే దొరకెను!"

పృథ్వీసింహుఁడు త్రుళ్ళిపడి యటునిటుఁజూచెను గాని ధర్మసింహుఁడు తప్ప మఱెవ్వరును నాతనికి దృగ్గోచరులు కాలేదు.

ధర్మ:-నీకటారు నొఱనుండి లాగుము.

పృథ్వీ:-నా కాతఁడు పొడకట్టనే లేదు.

ధర్మ:-అతఁడు నీయెదుటనే యున్నాఁడు. ముష్కరుఁడగు నా హంతకుఁడు ధర్మసింహుఁడే.

పృథ్వీ:-(బెదరి) ఆ! అంతటి కటిగుండెయా!

ధర్మ:-క్షత్రియుఁడవేని ప్రతినఁబాలించుకొనుము.

ఈ వాక్యము చెవినిబడఁగానే పృథ్వీసింహుఁడు నడుమునకు బిగింపఁబడియుండిన కటారును తెప్పపాటున దూసి,

విద్యుత్కాంతులతో మెఱపించి, దాని ధర్మసింహుని రొమ్మునఁ గ్రుమ్మెను. రక్తము చిమ్మనగొట్టమునుండి వెడలునట్లు ప్రవహింపసాగెను. ధర్మసింహుఁడట్టి స్థితియందు నేలపైఁబడి యుండి మందస్వరముతో నిట్లనియె: "పృథ్వీసింహా! నేను నీ కెంతయుఁ గృతజ్ఞతాబద్ధుఁడనై యున్నాను. నీవు నిజమగు వీర శిరోమణివి. నీవు వీరపురుషోచిత ధర్మమును బురుషోచితముగ నెఱవేర్చితివి!!"

పృథ్వీసింహుఁడీ మాటలను విని, నేల పయిఁబడి విలపింపఁదొడఁగెను.

సప్తమ రంగము

చదువరులారా! నేఁడు రాజనందని సహగమనము చేయనున్నది! ఆమె శరీరము వివిధాలంకార శోభితమై యున్నది! పాపట ముత్తియముల హారములతోఁ గప్పఁబడి కానవచ్చుచున్నది! ముంజేతిని వైవాహిక కంకణ మమరి యున్నది! పాదమున నెఱ్ఱని లత్తుక యొప్పుచున్నది. శోణచేలముల నామె కై సేసినది! ఘుమ్మఘుమ్మను నెత్తావు లామె దేహమునుండి వెడలి వాతావరణము నాక్రమించినవి. పరలోక గమన ప్రయాణమున కామె సేసికొనిన సన్నాహములను మీ మనోవీధియందుఁ దిలకింపుఁడు!!

ఆమె ముఖము సంపూర్ణ చంద్ర బింబమువలెఁ దేజో వంతమై చూచు వారి మనముల భక్తిభావపూరితములుఁగఁ జేయుచున్నది.

ప్రేమాతిరేక మామె నున్మత్తగఁజేసినది. ఆమె దృగా కాశమునుండి యధ్యాత్మిక తేజము గురియుచున్నది. ఆమె నడక యెంత గంభీరముగ నున్నది! తన ప్రియకాంతు నొడిలో నిడి కొనివచ్చి, మంచి గంధముతోను బరిమళములఁ జిమ్ము పూలి కలతోను, సాంబ్రాణితోను జేర్పఁబడిన చితిపైఁ గూర్చుండు చున్నది ! చూడుఁడు!! చూడుఁడు!!!

ఈ విషాదాంత దృశ్యమునుఁజూడ నగరవాసు లందఱు గూడుచున్నారు. వాద్యములు మ్రోగుచున్నవి. పుష్పవృష్టి గురియుచున్నది !! ఇవ్విధముగ నా వీరపత్ని చితినెక్కువఱకు పృథ్వీసింహుఁడు పఱువున వచ్చి హస్తద్వయమును మోడ్చి, 'నారీరత్నమా ! నా తప్పు మన్నింపు' మని వేడెను. 'క్షమింప వలనుబడదు. నీవొక రసపుత్రయౌవనుని యుసురులుగొన్నావు. నీకును నట్టి యకాలమృత్యువే ప్రాప్తించు' నను ప్రత్యుత్తరము వినవచ్చెను. అంతలో నగ్నిజ్వాల లాకసమునంటి మండెను. జయజయారావములు హెచ్చెను. సంధ్యారాగ మస్తమయ భానుని వలె నగ్నిజ్వాల లందామె వదనము ధాళధళ్యముతోఁ బ్రకా శించెను. కొంచెము సేపటిలో నచ్చట బూదిరాసి తప్ప మఱే మియు నగపడలేదు.

ఆహా ! ఎట్టి ధార్మికోదాహరణము ! ఎట్టి విషాదకర మగు కథ ! అబ్బబ్బా! అపవాధ(పు టగ్నియెంత తీక్షణమైనది ! దాని జ్వాలలెంత ప్రాణోపద్రవ కరములు ! ఒక యపరాధ మెన్ని ప్రాణముల మ్రింగెనో చూడుఁడు ? రాజవంశజులగు నిద్దఱు యౌవనులును, నిద్దఱు లావణ్యవతులును నీ యగ్నికుండ మున నాహుతులైరి. ఏలయన, నీ పనిజరిగిన యేడు వారముల లోనే పృథ్వీసింహుఁడు సైతము ఢిల్లిలోఁ జంపఁబడుటయు, దుర్గాదేవి తన యుసురులఁ జితియను యజ్ఞవేదికపై బలియిడి భర్త ననుగమించుటయు సంభవించెను. మహాపతివ్రతయగు రాజనందని శాపము ఫలించెను. వ్రజవిలాసిని యేమయ్యెనో నేటివఱకెవ్వరును నెఱుంగరు.

——

నాఁడు నీపంతము! నేఁడు నాపంతము!

ప్రథమ రంగము

చ. ధరను బరోపకార సుకృతంబును బోలవు పుణ్యముల్ మనో
హరతర వస్తువు ల్గవలయాక్షులకన్నను గల్గ వెవ్వియుఁ!
-భర్తృహరి.

శ్యామసుందరుఁడు పాటలీపుత్ర వాసియగు నొక యౌవన న్యాయవాది. అతఁడు, శారీరిక మానసికాది సర్వ శక్తులను వాగాడంబరమునఁ బ్రకటించుచు నాగరక సంఘములలో నగపడు ప్రాయంపు యువకులవంటి వాఁడుగాఁడు. అతఁడుత్సాహ భరితుఁడు! చెప్పుటకన్నఁ జేయుటయం దెక్కువ యాసక్తి కలవాఁడు. తాను మనఃపూర్వకముగ నమ్మిన తత్త్వముల నాచరింపక వదలుటగాని, స్వార్థపరాయణత్వము చేతఁ దన యభిప్రాయములను మార్చుకొనుటగాని, యాతఁడెఱుఁగఁడు. పలు కార్యములం దొక్కపుడే ప్రవేశించుట యాతనికి సరిపడదు. పది పనులలో దిరుగువాఁ డొకకార్యమునేనియుఁ బూర్తిగా నెఱవేర్చుట యరుదు. పది సంఘముల కార్యదర్శిగను, పదిసభలకధ్యక్షుఁడుగనుండు మానవుఁడు క్రియాపూర్వకముగ దన విధుల నెఱవేర్చుటను నాశ, విచారశూన్యులగు వారికుండిన

నుండవచ్చునుగాని దూరదృష్టి గలవా(డెప్పుడును నట్టియాశకు(జోటియ్యడు. అటువంటి వాని యావచ్ఛక్తియు వా(గ్రూపమున నెగిరిపోవును. మన న్యాయవాది యీ రహస్యమును బాగుగ గ్రహించినట్లు(దోచెడిని. అత(డు నిమ్నజాత్యుద్ధరణమునకై చిన్న సంఘము నొకదాని స్థాపించి, తనకు(దొరకు విశ్రాంతి సమయమున(దన యాదాయములోని యొక భాగమును నా సత్కార్యమున కర్పించువా(డు. సాయంతనము న్యాయస్థానము నుండి యింటికి వచ్చినతోడనే యల్పాహారము భుజించి, తన ద్విచక్రికను (బైసికిలు) బయటికి(దెచ్చి, పుర పరిసరమున నున్న గూడెములకు(బోవును. పోయి, యచ్చటి హీనదశావశు లతో(గూర్చుండి, వారి బాగోగులనుగూర్చి సంభాషించుచు, నీతి వర్తనమును గూర్చి వారి కుపదేశించును. వారి బాలుర రప్పించి, బుజ్జగించి, యేమైన ఫలాహారముల నొసంగును. ఆదివారము గాని, మఱి యేదేని విశ్రాంతి దినముగాని, వచ్చి నప్పుడు, యక్షిణీదీపము (మాజికు లాంతరు)సహాయమున వారికి వినోదము గలిగించును. శ్యామసుందరుని యీ సహానుభూతి సుమారొక సంవత్సరకాలముననే యాప్రాంతములందు వసించు చుండిన హీనజాతులవారి జీవన విధానమున నెంతో మార్పు కలిగించెను. మృతజంతు మాంసమును భుజించుట మానిరి; మద్యపానాభ్యాసము పూర్తిగ(బోకపోయినను, దత్పానమూల మున జరగునేరముల సంఖ్య క్రమముగా క్షీణించుచుండినందున

నా రక్షకపర్యవేక్షకునకు (పోలీసు ఇనస్పెక్టరుగారికి) మాత్ర మిబ్బందిగ నుండెను,

మన న్యాయవాది, అంటరాని తరగతుల వారియందు క్రమముగా భ్రాతృభావము నెలకొల్పెను. ఆ ప్రాంతములనున్న మూడువందల గ్రామములలో నివసించు నాలువేల యంత్యజుల పైనను, నతనికి భ్రాతృ ప్రేమ కలిగియుండె. వారి యిండ్లలోని వివాహములకుఁ బోయి, తాంబూలముఁ గొనుచుండు వాఁడు; వారిలోఁ గలిగిన వివాదముల నాతఁడే న్యాయముగఁ బరిష్కరించువాఁడు, వైద్యశాస్త్రమం దించుక ప్రవేశము గల వాఁడగుటచేత సామాన్య స్థితులయందుఁ దానే వారి కౌషధముల నిచ్చును. నిరుపేదలగు వారికిఁ దన స్వంత ద్రవ్యముతోఁ జికిత్స చేయించుచుండును. అయినను, సాధారణముగ నిట్టి స్థితులందు నాతని యాదరణమే వారిని సంతృప్తమనస్కులగఁ జేయుచుండెడిది. పరోపకారమున, స్వార్థరహితమగు ప్రేయయు, స్వజాత్యభిమానమును, నెంత యవసరములుగ నుండునో, ద్రవ్యసహాయ మంత యవసరముగ నుండదు. శ్యామసుందరుని యిట్టికృషివలన వారాత్మ గౌరవము నేర్చుకొనిరి. ప్రథమమునఁ గొందఱు భూస్వాములకు వారియం దుదయించిన యీ మార్పు కోపకారణ మయ్యెను. కాని చేయునదేమియులేక యూరకుండిరి. ఆ రక్షకశాఖోద్యోగస్థులు వారిపై నొక కన్నునిచియే యుండిరి. కాని, రిక్తులగువారి నేమియుఁ జేయజాలకపోయిరి. ఇవ్విధముగ

మన న్యాయవాదికి వారితోడి సంబంధము ప్రబలము కాసాగెను. తుదకొక్కనాఁ డతఁడు నాయకునింట జరిగిన వివాహ సందర్భమున, వారితోఁగలసి భుజించెను.

ద్వితీయ రంగము

శ్యామసుందరుని భార్యపేరు కమల. హిందూస్త్రీలకు సహజమగు పతిభక్తి యామెకును మనఃపూర్వకముగ నుండెను. విద్యాసంపద యంతగా లభింపక పోయినను, కమల, భర్తసహవాస ఫలితముగ సాంఘిక దేశీయ సమస్యల నైజము లెఱింగియుండెను. మానవ జన్మకు సహజమగు దౌర్బల్యమనుఁడు, లేక యామె స్వభావ దోషమనుఁడు-ఎట్లయిననేమి, యామెకు సహనశక్తి విశేషము లేదు. వాక్పారుష్యము నామె యెఱుఁగదు. ముక్కోపియుఁగాదు. అయినను, హృదయమునఁ గ్రుచ్చుకొను మాటగాని, యెకసక్కెముగాని, యామెకత్యంత బాధకరముగ నుండును. ఇట్టి మాటల నెవరేనియనిన వినును; ప్రత్యుత్తర మిచ్చుట నామె యెఱుఁగదు. కాని యిట్టి స్థితులందు లోలోనఁదలపోయుచుఁ గృశించుట యామె కలవాటు. శ్యామసుందరుఁ డామె స్వభావమును బూర్తిగ నెఱింగిన వాఁడగుటచే వట్టిమాటల నెన్నఁడును నోట వెడలనీఁడు. కొన్ని సంవత్సరముల క్రింద క్రొత్తగా న్యాయవాదిత్వ వృత్తి నవలంబించిన

దినములలో నాతని యాదాయము కడు స్వల్పముగ నుండెను. అనుదిన వ్యయములకే శ్రమయగుచుండెడిది. ఆ దినములలో నొకనాఁడు, పగలంతయు న్యాయస్థానమునఁ బనిచేసి, యాతఁడు సాయంతనమగు వఱకు నుత్తచేతులతో నింటికి వచ్చెను. ఆనాఁడేదో పండుగైనందునఁ గమల, యుదార హృదయముతో నయిదు రూప్యముల వెచ్చించి పులగము వండి బీదసాదలకుఁ బెట్టెను. ఇంటికిఁ దానువచ్చువఱకీ యసమయ యౌదార్యముఁ గని, కఠినభాషణములతో భార్యననెను: "నేను దబ్బుదబ్బునకుఁ గష్టపడుచుండ, నీవిల్లు గుల్ల జేయుము. అంత యౌదార్య ముండిన, వివాహము నాఁడే తండ్రితోఁజెప్పి యొక మహారాజుఁ జెట్టఁబట్టవలసి యుంటివి." ఆ మాటలకు మారువల్కక, కమల తలవాల్చెను. తాఁజేసిన పనికై భర్తక్షమాపణమైనఁ గోరలేదు. కాని నాఁటినుండి యాఱు మాసములవఱకు జ్వరము చేతను, హృదయ దౌర్బల్యము చేతను మంచ మెక్కియుండెను ఈ విధముగ శ్యామసుందరుఁడు ముందునోరెత్తకుండ బాఠము నేర్చుకొనెను.

అది యట్లుండె. మన న్యాయవాది యానాఁడు గూడెమున నాయకునింట భుజించినవార్త రెప్పపాటు కాలమున పట్టణమందెల్లెడ నల్లుకొనెను. మఱునాఁడు, కమల గంగానదికి స్నానమునకై పోయెను. ఆనాఁడు సోమవత్యమావాస్య. పురమునందలి ధనికురాండ్రందఱు స్నానార్థము ఘట్టమునకు వచ్చిరి. కమల

మోమును జూడఁగనే వారొకరితో నొకరు గుసగుసలాడ నారం
భించిరి. గొప్పయిల్లాలుగ నగపడు నొకయువిద ప్రక్కన నిలిచి
యుండిన మఱియొక వనితతో, "చూచినావమ్మా, ఆ దొరసాని
గారిని? భర్త మాదిగ కూడుఁ దినుచుండ భార్య గంగస్నానముఁ
జేయవచ్చినది'' యనెను. ఆ మాటలు శూలములై హృదయ
మున నాట కమల విషాదముచేఁ దెలివిలేనిదై తత్తఱపడసాగెను
ఎవరో నిశితఖడ్గాహతి హృదయ ప్రదేశమునఁ బ్రయోగించినట్లు
దోచెను. స్నానముచేయకయే వెనుకకు మరలి యిలుఁజేరెను.
సర్పవిషము ప్రతిరక్త నాళమున నిండెను. అన్నము వండి
భర్తకు వడ్డింప నాతఁడు భుజించి న్యాయస్థానమున కేఁగెను.
ధనవంతుఁడగు నొక కక్షిదారుఁ (పార్టీ) డానాఁడాతనివలలోఁ
జిక్కుపడినందున, సంతోష పారవశ్యమున భార్య మనోవేదన
నాతఁడు గ్రహింపనేరఁడయ్యె. సాయంతనమున నింటికి వచ్చి
చూచువఱకు, ముఖమునిండ దుప్పటి కప్పుకొని పరుండి
యుండెను. శ్యామసుందరుఁ డామెస్థితి నవలోకించి, నుదు
రదుముకొనుచుఁ బల్కెను: "కమలా ! నేఁడిట్లు పరుంటివేందు
చేత? శరీరము స్వస్థముగనున్నదిగదా?" కమల లేచి కూర్చుండి
'శరీరమునకేమి? బాగుగానే యున్నది. ఊరకే పరుంటి'నని
బదులు చెప్పెను. కాని యంతటితో నాతనికిఁ దృప్తికలుగలేదు.
మనసు స్వస్థమ్ముగనే యున్నపక్షమునఁ బెదవులపైని తాంబూ
లపు నెఱ్ఱఁ దనమేది? వెండ్రుకల విరియఁబోసికొని యుండు
టెందుచేత ? ముఖమున విన్నఁదనమేల ? నా కొఱ కెప్పటి

యట్లు మంచుగడ్డఁ దెప్పింపకుండుటకుఁ గతంబేమి ? ఇట్టి భావము లనేకము లాతని మేధస్సునఁ బఱువిడ సాగెను. ఉడుపులవిడిచి, యల్పాహారము గుడిచి, కొంతసేపు లోకాభిరామాయణమునఁ గడపెను. రెండు మూఁడు వినోదములఁ గూడ వినిపించెను. కాని యా మంత్రముచే విషము దిగలేదు. కమల యాతని మాటలకు శిరఃకంపముఁ జేయుచుండినను, విషమహత్త్వ మామె మనస్సు నచ్చట నిలువనియ్యలేదు. సాయంతనమయ్యె. శ్యామసుందరుఁడు వేళయైనందున శకటము గొని యెప్పటట్లో వెడలెను. కాని కమల మనోవైకల్య మాతని హృదయమున మెదలుచునే యుండెను. ఆనాఁడు గూడెమున నొకరి యింట వివాహము. దూరమునుండి వచ్చిన పెండ్లికొడుకు పక్షమువాండ్రు మద్యపానమునకై తొందర పెట్టుచుండిరి. పెండ్లికూతురు పక్షమువాండ్రు దానికొప్పుకొనక నిరాకరించుచుండిరి. మన కథానాయకుని కృషివలన నిట్టి దురాచారము లనేకములు గూడెములందు రూపుమాసెను. కాని మొదటిపక్షమువాండ్రు దూరమున నివసించు వారగుటచేత నతని యుపదేశము లంతదూరము పోయియుండినవి కావు. శ్యామసుందరుఁ డచ్చటికిఁబోయి వారి వివాదమును విని మద్యపానమక్కఱలేదనియే తీర్మానించెను. ఇట్టి వివాదసందర్భములందాతఁడు రాత్రి ౮, ౧౦ గంటలవఱకుఁ గూడ గూడెమున నుండవలసి వచ్చుచుండెను. కాని నాఁటిదిన మాతని మనమస్వస్థముగ నుండెను. కమలయొక్క విచారాక్రాంతమగు

ముఖ మాతని కన్నులయెదుటఁ బొడకట్టుచుండెను. 'నా నోటి నుండి యేదేని పరుషవాక్యము వెలువడలేదు కదా? నాకట్టిజ్ఞప్తి లేదు. అట్లయిన నీ విచారమునకుఁ గారణమేమైయుండును? అకారణముగ నామె మనస్సిట్టిస్థితికిఁ బాల్పడుట సంభవింపదు' ఇట్టి యాందోళన మాతనిఁ దొందరపెట్టి వెంటనే యింటికి మరల్చెను.

తృతీయ రంగము

శ్యామసుందరుఁడు భోజనముచేసి శయ్యపైఁ బవళించెను. కమల కీపూటఁగూడ సన్నము రుచిగనుండలేదు. ముఖ మిప్పటికిని చిన్నబోయియుండెను. కొంచెము సేపాలోచించి యతఁడనెను: "కమలా! నీవెందు కిట్లున్నావు?"

కమ:-నా కే విచారములేదు.

శ్యామ:-నీ శరీరమెట్లున్నది?

కమ:- శరీరమునకేమైనది? చూచుచున్నారుగదా? బాగుగఁ గూర్చుండియే యున్నాను.

శ్యామ:-అట్లనిన నేనొప్పుకొనను. నీ విట్లు విచారగ్రస్తురాలవై కూర్చుండియుండుట కేదేనికారణముండి తీరవలెను. ఈ విషయమున నిన్నడుగు నధికారము నాకులేదా?

కమల:-మీరు నా ప్రాణేశ్వరులు, మీకుఁ గాకపోయినచో నీయధి
కార మింకెవరికుండును ?

శ్యామ:-అట్లయినచో నీదాపఱిక మేల ? నేను నా మనోగతము
నెన్నఁడైన దాచియుంటినా ?

కమల:-(క్రిందుగఁ జూచుచు) నేను మాత్రము దాచుచున్నానా?

శ్యామ:-ఇదివఱ కట్లుచేయలేదు కాని నేఁడు మాత్రము దాచు
చుండుట నిక్కము. కన్నెత్తి నా ముఖము వంకఁ
జూడుము. స్త్రీలొక్క చూపున పురుషుల ప్రేమను బరీ
క్షింపగలరని చెప్పుదురు; కాని నీవింకను నా ప్రేమ
యొక్క లోతుఁ గనిపెట్టిన ట్లగపడదు. నీ యీ యుదా
సీనత నన్నెంతయు నస్వస్థతపాలు చేసెనని దృఢముగ
నమ్ముము. ఇఁక నీవిచారకారణముఁ దెల్పకుండిన నా
యందు నీకు నమ్మకము లేదని తలంచెదను!

కమ:- (కన్నీటితో భర్తవంకఁజూచి) నా హృదయ శల్యము
నూడఁబెఱికి వైచెదరా ?

శ్యామసుందరుఁడు ఱిచ్ఛవడి కొంచెము సేపైపిన తరు
వాత భయకంపితమగు స్వరముతో నిట్లనెను : “కమలా ! నీ
యీ ప్రశ్న నన్నే మిగుల బాధించుచున్నది. నేనును, నా
సర్వమును నీ యధీనము. నా విషయమున నీవట్లు తలంపఁ
గూడదు.”

ఒకమాట యనఁబోయిన, వేఱొకమాట నోట వెడలెనని తెలిసికొని, కమలయనెను: "నేను మీ ప్రేమనుగూర్చి యొకనాఁ డేనియు శంకించియుండ లేదను సంగతి భగవంతుఁడెఱుంగును. నా విచారకారణమును వినినచో, నన్నెగతాళి చేయుదురేమోయని నేనట్లంటిని కాని వేఱుకాదు. నేఁజెప్పఁబోవుమాట లనఁదగని వని యెఱుఁగుదును. అందువలననే యింతవఱకు వానిఁ దాచితిని. నా మనస్తాపకారణ మొకమాటయే కనుక దాని రెండు మూఁడు మాసములలో మఱచియుందును;కాని మీరిప్పుడుపల్కిన వాక్యములు నా మనోగతమును బయటఁబెట్ట నన్ను నిర్బంధించు చున్నవి. నాకు మీ మీఁద నమ్మకము లేదని మీరు తలంచిన నాఁడు నా గతి యేమగునో విచారించితిరా? తమ యీ వాక్యమే నన్ను తొందర పెట్టుచున్నది,''

శ్యామ:- అవును. నీ మనసులోనిమాట నిర్భయముగఁ జెప్పుము.

కమల:-మీరిఁకముందు నిమ్న జాతులవారితోఁ గలయుట, వారితో భుజించుట. మానుకొనవలయును.

నిర్దోషియగు వాఁడు న్యాయాధిపతినోట శిక్ష నిర్ణయ మును వినినతోడనే నిట్టూర్పువిడచునట్లు శ్యామసుందరుఁ డా మాటల వినినతోడనే దీర్ఘనిశ్వాసము వదలి కొంచెము సేపూరక పరుండి తరువాత లేచి యనెను: ''మంచిది; నీ యిష్టప్రకారము చేసెదను. అట్లు చేయుటవలన నాకు మనస్తాపము కలుగుట నిశ్చ యము. అయిననుమానె. కాని యొక్కమాట చెప్పుము. ఇది

నీకు స్వయముగ దోఁచిన బుద్ధియా లేక యెవరి దేని యుప దేశమా?''

కమ:- తోడి స్త్రీలు నన్ను వెక్కిరించుచుందురు. నేను వారి వాక్శూలములపోటుల భరింపఁజాలను. వారి నోళ్ళఁ గట్టి వేయు నధికారము నాకు లేదు. మీ మీదఁ నాకధికారము కలదు. కావున మిమ్ము నిర్బంధించుచున్నాను.

శ్యామ:-సరి. మంచిమాట. నీవుకోరినట్లు జరుగును.

కమల:-మఱియొకమనవి. నేను నా మనసును విచ్చి మీ యెదుటఁ బెట్టితిని. పురుషు లిట్టి యెగతాళిమాట లను లక్ష్యము చేయరు. స్త్రీలమగు మేము బలహీనలము. మా మనస్సులు దుర్బలములు. పరుష వాక్యములు మా మృదు హృదయ ములందు లోతుగ గ్రుచ్చుకొనును. మీరావిషయమున విచారపడవలదు. నన్నిట్టి పరుషభాషణముల నుండి తప్పిం చుటకై మీ మనస్సునకు బాధ కలుగుట నాకిష్టములేదు. నేనును నిట్టిమాటలకుఁ జింతనొందకుండు నలవాటు చేసి కొనెదను. అది చేతఁగానిచో, తోడి స్త్రీలతోఁ గలయు టయే మానుకొనెదను.

శ్యామసుందరుఁడు భార్యను గౌఁగిలించుకొనియెను : ''కమలా! నామూలమున నీవిట్టిపోటు మాటలంబడుట నాకిష్టము లేదు. నీ మెత్తని హృదయమున నొప్పిఁగలుగ నియ్యను. విచారము మానుము. ఏదీ యొక పాట!''

కమల సంతసించెను. ఆమె మోము వికసించెను. హార్మోనియముదీసి మందమును మధురమును నగు స్వరమున(బాడ నారంభించెను.

చతుర్థ రంగము

శ్యామసుందరు(డు పల్లెలకు(బోక వారము దినములు గడచెను. నిమ్నజులగు సోదరులతో భ్రాతృ భావమును స్థాపించుట, వారికి పశుత్వమునుండి మానవత్వమును వివక్షించు యోగ్యత(గల్గించుట, వారి నజ్ఞానగుహనుండి వెలుతురునకు(దీసికొని వచ్చుట యనునవి మన శ్యామసుందరుని జీవితోద్దేశములు. ఇట్టి సత్కార్యమార్గమున కడ్డముగ గోడపెట్ట(బడినప్పు డాతనికి సంతాపమొదవుటయం దాశ్చర్యమేమికలదు? తనకర్తవ్యముల(దాను యథావిధిగ నిర్వర్తించుచున్నానని తెలిసియుండువలెకే కదా మానవుండగు వానికి నిజమగు నానందము లభియించుట. సంఘమునెడ(దమకర్తవ్యము లేవియో యెఱుంగని మహానుభావులుగూడ(బ్రపంచమున(గలరు. కాని యట్టివారిని మానవనామమున వ్యవహరించుటయే పొరపాటు. దుర్వర్తనము లలవడిన మనుష్యులు తాము నడచుమార్గము తప్పని తెలిసియు(దన్మార్గమునుండి తమను కాపాడుకొన(జాల కున్నారు. జూదరికెంత బోధించినను, నతనినెంత భయపెట్టినను, జూదమాడుట మానుకొన(డు. మద్యపాన పరాయణుని జెఱలో నుంచినను,

వదలినతోడనే మద్యవిక్రయ గృహమునకుఁ దారిదీయును. ఇది దుర్వ్యసనముల మైకము. సత్కార్యాచరణపు మైకమునైత మింతకన్న నెక్కువబాధించు స్వభావము గలది. పగలంతయు శ్యామసుందరుఁడు వ్యవహారకార్యము లందు మున్గియుండును. కాని సాయంత్రపువేళ రాఁగానే యతని మనస్సెంతయుఁ బరితాపపడుచు, సాంఘిక కర్తవ్యమును వ్యక్తికొఱకు బలియిచ్చుట కమానుషయత్నముఁ జేయవలసివచ్చుచుండెను. గృహోద్యానమున నొంటరిగఁ గూర్చుండి, యంతరంగమున నీ విషయమునె తర్కించుకొను నపుడాతఁడు పలుమాఱు తన మనోదౌర్బల్యమును నిందించుకొనును. 'మతేకార్యమైన నొనర్చెదగాని యీ పనిమాత్రము చేయనని ఖండితముగ కమలతోఁ జెప్పుదునా' యని పలుమారు యతడు తలంచుకొనెను. కాని, యక్కటా! ఈ మాటలామె మనస్సు నెట్టివ్యసనము పాలు సేయునో! నాపైఁ గల ప్రేమయందు నిమగ్నయైయున్న యా కమల కీవచనము లెంత బాధాకరములుగ నుండునో! ప్రాణముకన్నఁ బ్రియతర మగునో కమలా! నీవంటి యమూల్యరత్నమును గలిగియుండియు నేను నన్ను దురదృష్టవంతునిగ భావించుకొంటినేని, యది నా బుద్ధిమాంద్యమే యగును! నేఁడు నేనింతటి మనస్తాపమున కధీనుఁడనై తినని నీవెఱింగి యుండినచో, ముందెంతటి వాక్కాఠిన్యమునకును దప్పకఁ దలయొగ్గుదు వనుటయందు సంశయముండునా! ప్రపంచ మంతయు నేకగ్రీవముగ నిన్ను నిందించి నను దోసిలి యొగ్గుదువు! ఇంతటి ప్రేమకు మాఱుగ నీకిచ్చుటకు

నాయొద్ద నేమికలదు? మానవునకు జాతీయధర్మము సర్వధర్మము లలో నుత్కృష్టతమమైనదేకాని, యొక్కొక్కప్పు డసామాన్య స్థితులందు సంఘమును వ్యక్తికొఱకు వదలివలసివచ్చును. అయోధ్యానగరమున వసించి, తన ప్రజలకు సుఖము లభింపఁజేయుట శ్రీరామచంద్రుని సాంఘిక కర్తవ్యమై యుండియు, అతఁడు పితృవాక్య పాలనముకొఱకు దానిఁద్రృణీకరించెను! అయోధ్యవాసు లెవ్వాని దమ భాగ్యదేవతగ భావించుచుండిరో యట్టి శ్రీరామునిఁ బట్టాభిషిక్తునిఁజేయుట దశరథునికి సాంఘికధర్మమైయుండియు, నతఁడద్దాని వ్యక్తివిషయకమగు స్వీయధర్మమునకై విడిచి పెట్టెను!

అయినను, కమల, భర్తమానసికస్థితిఁ దెలియకయుండె ననుట పొరపాటు. ఏరాత్రి యా దంపతులకుఁ బూర్వోక్త సంభాషణము జరిగియుండెనో యానాఁటి నుండియు 'నా ప్రాణేశుని మనస్సు నెంత నొప్పించితి' నను పరితాప మామె యంతరంగమునఁ బొడమని నిమిషమే లేదు. ఆమె కతని ముఖమున సహజ కాంతి యొకింతయుఁ గన్పట్టలేదు; ఆహార నిద్రాదులయందాతని తొంటి యాసక్తి ప్రకటన మగుచుండలేదు. మాటలాడుచుండినఁ బరధ్యానముగ మాటలాడును. అతఁడాడు ప్రతిపదమును దన మానసికస్థితిని దాచుటకొఱ కాతఁడు చేయుచుండిన ప్రయత్నమును వ్యక్తపఱచుచుండెను. నవ్విన తెచ్చికోలు హాసముగ నుండెను. కమలకీ లక్షణము లన్నియు నద్దములోవలె స్పష్టముగ నగపడుచుండె. 'నేనెంతటి స్వార్థపరాయణు రాలను! ఎట్టి

హీనాత్మను! తుచ్ఛురాలును, మర్యాద హీనయు నగునొక స్త్రీ చేసిన వేళాకోళమునకుఁగినిసి, నాభర్త కెంతటి దారుణ సంతాపముఁ గల్గించితిని! నాకొఱకాయన తన యంతరాత్మ నింత గట్టిగ నడచిపెట్టెనుకాని నేనొక సామాన్యమగు పరుషవాక్యఁపు మనస్తాపమును సహింపలేక పోయితిని!' ఇట్లు చింతించి యా యువతి పలుమాఱు తనభర్తనా నిర్బంధ వాగ్దత్తమునుండి విడుదల చేయఁదలచును; కాని శ్యామసుందరు డామెకట్టి యవకాశము నొసంగఁడయ్యె.

పంచమ రంగము

ఒకవారమువఱ కంత్యజసోదరులు శ్యామసుందరునికై యెదురుచూచిరి. 'శరీర మస్వస్థముగ నైన నుండును; లేదా యేదైన వ్యవహారము విశ్రాంతి నియ్యకుండవలయును. ఈ రెండును గాదేని గ్రామాంతర మేగియుండు'నని వారు తమ మనసుల సమాధాన పఱచుకొనుచుండిరి. వారము గడచిన తరువాతఁగూడ నాతనిరాక గానరానందున, వీపున దుప్పటులును, దలలఁ దెల్లనిపాగాలును ధరించి, కాళులకు మోటు పాపోసులఁ దొడిగికొని, భుజములపైన గఱ్ఱలనిడి, గుంపుగ వెడలి వారు శ్యామసుందరు నింటికి క్షేమ మారయ వచ్చిరి. కర్తవ్యమును మానుకొనినందు కేదేని కల్పితకారణముఁ జూపక తప్పదయ్యె. ఇంటిలో శరీర మస్వస్థముగ నున్నదని యాతఁడు బొంకెను.

ఈమాట విన్నప్పటినుండి యాతని యింటికివచ్చుచు(బోవు చుండు నంత్యజ సోదరులకు విరామము లేదయ్యె. ఒక గ్రామము వాండ్రు వచ్చిపోయిన తోడనే మఱియొక గ్రామమువాండ్రు వచ్చు చుండిరి. మన న్యాయవాదియు మొదటి వారితో బొంకిన బొంకు లనే మరల బొంకవలసి వచ్చెను.

రెండవ వారము గడచినను శ్యామసుందరు నింట శరీర మింకను నస్వస్థముగనే యుండెను. ఒకనా(టి సాయంత్రమున నత(డు వాకిట నిలచియుండ, గూడెపు నాయకులనేకులు సూర్య నారాయణ శాస్త్రిలుగారిని దీసికొని వచ్చి నిలచిరి. ఈ వైద్యు(డభినవ ధన్వంతరి యని ప్రసిద్ధినొందియుండెను.మంత్రోచ్చాటన మైన తోడనే పిశాచములు పఱువిడునట్లు శాస్త్రిలుగారి దర్శన మైన తోడనే యెంతటి ప్రాత రోగమైనను పలాయనము చెప్పును. మఱియు(, బలుమాఱు వ్యాధితో(బాటు రోగికూడ(బోవుట గలదు. శ్యామసుందరు(డీవైద్యుని(జూడగనే తత్తఱపడ సాగెను. 'ఇప్పుడేమని బొంకుదును? గుట్టు బట్టబయలగు నవస్థ సంభవించినది. ఈ దౌర్భాగ్యుల కీవైకుంఠ వైద్యుని(దీసికొని రావలయునను బుద్ధి యేల పుట్టవలయును? ముందు వెనుక(జూడక మృత్యుదేవత(బోలెవచ్చి వాకిట నిలచిన యీ వైద్య శిఖామణి నేమనవలయు?' నని విచారింప(దొడ(గెను. కాని, విచారింప నవకాశ మెక్కడిది? ఎవ్వరి నాత(డు తన ప్రాణము కన్న నెక్కుడుగ(బ్రేమించుచుండెనో యట్టి కమలకు నాతరుణ మున(గొంచెము జ్వరము వచ్చిన నెంత బాగుగా నుండునని యతనికి(దో(పసాగెను!

వైద్యుఁడు వచ్చి "అయ్యా! తమ భార్య రెండు వారముల నుండి జబ్బు పడియుండిన వార్తవిన నా కెంతయుఁ జింత వొడమెను! మున్ముందుగ నాకీసంగతి తెలిసినచో వ్యాధి యింత దీర్ఘమైయుండదుగదా యని తలఁచినపుడు నాకు మఱింత విచారము కలుగుచున్నది. ఇంతకు, జబ్బేమిటి?" యనెను.

శ్యామసుందరుఁడేమియుఁ దోఁచక, నటునిటుఁ జూచి యొడలుసర్దుకొని, తలగోకికొని, దగ్గి, తలవంచి, పల్కెను: "అవును. అవే, స్త్రీలకు సామాన్యముగా వచ్చు వ్యాధులు. ఇప్పుడు తమ యనుగ్రహమున నారోగ్యము మరల వచ్చుచున్నది. డాక్టరు దొరసాని యౌషధ మిచ్చుచున్నది. ఇవి పాశ్చాత్య నాగరికత దినములు కదా! ఈ కాలమున ఇంగ్లీషు వైద్యమందు జనుల కెక్కువ విశ్వాసము; మఱియు నేవైద్యుని యందు విశ్వాసముండునో రోగి కాతనివలననే యారోగ్యము లభించును! ఇదియే తమకు శ్రమ యియ్యకుండుటకుఁ గారణము."

శాస్త్రి:—తమరు సెలవిచ్చిన మాట నిజము. ఏ డాక్టరు దొరసాని యుపచారము నడపుచున్నారు?

శ్యామసుందరుఁడు మరలఁ దలగోకికొని, యటు నిటుఁ జూచి చెప్పెను: "అదే: బోగను దొరసాని యుపచారము." ఈ సందర్భమున మన న్యాయవాది తనకుఁ గల వ్యవహార జ్ఞానము నంతయు వినియోగింపవలసి వచ్చెను! నాఁటిదిన మాతఁ డేదౌర్భాగ్యుని మోమువఱువాతఁ జూచెనో కాని, ప్రతి నిమిష

మును నాతనికిఁ బ్రతికూలముగనే పరిణమించుచు వచ్చెను. ఇట్లు శాస్త్రిలు గారితో సంభాషించు చుండగనే మఱి కొంద అంత్యజ నాయకులు బోగను దొరసానిని వెంటఁబెట్టుకొని రానేవచ్చిరి! శ్యామసుందరుని మోము మఱింత వాడిపోయెను. ముఖ వికాసము కప్పురమువలె నెగిరిపోయె. 'ఈ దయ్య మిప్పుడే యెందునకు వచ్చెరా దేవుఁడా!' యని దానిని మనసులోఁ దిట్టి పోయుచుండునంతలో నామె యాతని వాకిట నిలచెను. కురిచీపై నుండి లేచి హస్తస్పర్శ మొనర్చి యామె నోటి నుండి ప్రశ్న యేదియు వెలువడక పూర్వమే లోనికిఁగొనిపోయి, యచ్చటఁ గూర్చుండఁబెట్టి, కమలగదిలోని కేఁగి యామెతో నాలోచించెను. ''ఇప్పుడు పరీక్ష వచ్చినది. నీ శరీర మస్వస్థముగ నున్నదని బొంకితిని. అది విని యీ తెలివిమాలినవాండ్రు సూర్యనారాయణ శాస్త్రిని, బోగనుదొరసానిని దీసికొనివచ్చినారు. దొరసాని చావిడిలో నున్నది. ఇఁకఁ గర్తవ్యమేమి?''

కమ:—అట్లయిన నన్నిపుడు జబ్బు పడుమనెదరా?

శ్యామ:—(నవ్వి) నీ శత్రువులు జబ్బు పడెదరుగాక!

కమ:—శత్రువుల జబ్బు మనయక్కఱఁ దీర్పఁజాలదు. దొరసానిని దీసికొని రండు. నేను దుప్పటి బిగియఁ గప్పుకొని పరుండెదను.

శ్యామసుందరుఁడు దొరసానిని దీసికొనివచ్చుటకై యవతలకుఁబోయెను. కమల యాపాదమస్తకమును దుప్పటిఁ

గప్పుకొని మూల్గుచుండెను. దొరసాని వచ్చి, యుష్ణమాపకము (థర్మామీటరు) నోట నునిచి చూచి, నాలుకఁ బరీక్షించి, ముఖలక్షణముల మార్చి యనెను: "వ్యాధి హెచ్చినది. మూర్ఛవలెనున్నది. బయటికి జ్వరములేదు; కాని యది హృదయస్థమై యున్నది. తలనొప్పిగ నున్నది కాదూ?"

కమ:—తల పగిలిపోవుచున్నది.

బోగ:—ఆకలిలేదుగదా?

కమ:—మెతుకుఁజూచిన నసహ్యము.

అంతఁ దొరసాని యౌషధపత్రము వ్రాసి యిచ్చి వెడలి పోయెను. తన కట్నమునంతకు మునుపే చేత వేసికొని యుండిన శాస్త్రిలుగారిఁక నక్కడనుండుట వ్యర్థముగఁ దలంచెను. శ్యామసుందరుఁడు వాకిటనిలచియున్న తన యుపకర్తల కడకుఁ బోయి యనెను. "మీరందఱు చాలశ్రమ చేసితిరి; నా భార్యశరీరము కుదురుచున్నది. మీకందఱకుఁ గృతజ్ఞతావందనములు."

వారందఱు వెడలిపోయిన తరువాత శ్యామసుందరుఁడు లోనికేఁగి, నాఁడు జరిగిన చర్యనంతయుఁ దలంచి నవ్వసాగెను. పిమ్మట నిటువిచారింపఁదొడఁగెః 'చేయఁదగని కార్యము లేవి కలవో, యవియన్నియు నేఁడు చేయవలసి వచ్చెను. ఇఁకనైన దేవి ప్రసన్నమగునా?'

షష్టమ రంగము

శ్యామసుందరుఁడు భోజనానంతరము శయ్యపైఁ బరుండి నిద్రపోయెను. కాని కమలకు నిదుర రాలేదు. ఆమె శయ్యపై నూరక పొరలుచుండెను. ఒకమాఱు లేచి గదిలోఁ బచారుచేయును. వేఱొకమాఱు పుస్తకమును విచ్చిదీపము నెదుటఁ గూర్చుండును; కాని యే పనిఁ జేయుటకును దోఁచలేదు. గాలిచే గదలు కొమ్మలుగల చెట్టుక్రిందఁ జంద్రకిరణములు నృత్యము చేయునట్లామె తలంపులు స్వస్థత నెఱుంగక నటు నిటుఁ బఱు విడుచుండెను.

"నే నతని నెంత బాధించితిని! అక్కటా! నేఁడాయన కెంత సంతాపము గలిగియుండును! జీవితమున నెన్నఁడును ననృతమాడియుండని నా ప్రియభర్త నేఁడు నాకొఱకనృతవాది కావలసి వచ్చెను! ఆయన యొకవేళ యబద్ధమాడ సిద్ధపడియే యుండినచో, నేఁడొక రాజ్యమును సంపాదించియుండును! ఇట్టి సత్యవ్రతుని నేదుర్గతి పాలొనరించితిని! ఇట్టికార్యము కొఱకేనా నేనతని సమభాగినిగఁ దలఁపఁబడుట! ఆయనయెడ సహాను భూతిఁగల్గి యుండుట; సత్కార్యము లందాతనికిఁ దోడ్పడుట; సదుపదేశ మొనర్చుట; ఆపదలందు ధైర్యమిచ్చుట; ఇవి కదా నేను చేయవలసిన పనులు. వీనికిమాఱుగ నేనాసత్పురుషుని ననృత వాదిత్వఁపు వలలోనికి లాగుచున్నాను. ఈశ్వరా! నా తప్పు మన్నింపుము! అతఁడుపూనిన యాసత్కార్యమున సాయమొన ర్చుట నాకు విధియై యుండెను. పాప మీగూడెఁపు వాండ్రెంత

నిష్కపట స్వభావులు! ఎంత యుదారమానసులు! ఇట్టివారి యభివృద్ధికై పాటుపడకుండగదా నా భర్త నాపితిని! తెలివిమాలిన యొక స్త్రీమాటలకు నొచ్చుకొనిగదా నేనింతటి యకార్యమొనర్చితిని! అంతటితో సంతసింపక యతని నబద్ధమాడుటకుఁగూడ బలవంత పెట్టుచున్నాను! నా యీ దుష్కృత్యములఁ జూచియు, మూర్తీభవించిన గుణరాశియగు నా నాథుని మనస్సెప్పటివలె నున్నది! ఆయన, నన్నజ్ఞానురాలిగఁ దలంచి నా యీ దౌర్బల్యముల నన్నిటిని దన ప్రేమాంబరమునఁ గప్పి పెట్టుచున్నాఁడు! నేనెట్టి సంకుచిత హృదయను? నేనాతని పాదములఁ గడుగుటకైన యోగ్యురాలను గాను. దొరసానిని బంపి వచ్చినప్పు డాతని ముఖము నలంకరించిన హాసమెంత పవిత్రమైనది! అది కేవలము నన్ను సంతోషింపఁజేయుటకై జన్మించినదే. నాథా! నే నాపాద మస్తకమును బాపములతో నిండి యున్నదానను! నేను పతితను! నాకు నీ ప్రేమాంబుధియందుఁ దావిమ్ము!''

ఇట్లు తలపోయుచు నామె తటాలున శ్యామసుందరుని ముఖము వంకఁ దిరిగి చూచెను. సంతోష ప్రదమగు నిద్దుర యాతని ముఖకమలమును వికసింపఁ జేసియుండె. పెదవుల పైనఁ జిఱునగవు ప్రకాశించుచుండెను. ఆతనిమోము దమ్మిఁ జూచినతోడనే కమల హృదయమునఁ బ్రేమతరంగ మొకటి యుద్భవిల్లెను. సముద్రమువలెనే మానవ హృదయము నైత ముప్పొంగు చుండును. స్వచ్ఛమగు నా ప్రేమచేఁ బరవశయై,

యామె భర్త వశము నలముకొనెను. నిద్రితుఁడగు యజమానుని సంపదల యథేచ్ఛముగ జూఱఁగొను దొంగవలె, సుషుప్తియందున్న భర్తయొక్క ప్రేమఁపు నిధిని కమల నిర్భయముగఁ గొల్లగొనుచుండెను. యజమానుఁడు మేల్కొనునేమో యను శంక చోరుని మనమును బాధించునట్లే, భర్త మేల్కాంచి యుండఁడుగదాయను సందియమామెను వేధించుచుండెను. స్త్రీల యనురాగము నిరంకుశ స్వాతంత్ర్యము ననుభవింపదు. లజ్జయు, మౌగ్ధ్యమును స్త్రీల కన్నులఁ బై కెత్తనీయవు. తమయుత్సాహమును, మోహమును గృత్రిమములుగఁ దలంపఁబడునేమో యను భయము వారి పాదములకు శృంఖలములై యుండును!

సముద్ర ముప్పొంగినపుడు పగిలిపోయిన నౌకా శకలములును, నత్తగుల్లలును, పనికిమాలిన యితర పదార్థములును, తీరమునవచ్చి పడునట్లు కమలహృదయమున నువ్వ్విల్లిన ప్రేమ సాగర తరంగమంతకు మున్నామె యంతరంగమున మెదలుచుండు శల్యములఁ బైకినెట్టివై చెను!

మఱునాఁడు శ్యామసుందరుఁడు న్యాయస్థానము నుండి యింటికివచ్చి కమలతో ననెను: "నేను గ్రామాంతరమునకుఁ బోవలసియున్నది: రెండుమూఁడు దినములలో వచ్చెదను. నాకు సెలవా?"

కమ:—ఏ గ్రామము పోయెదరు?

శ్యామ:—వ్యవహారమొకటి వచ్చినది; భాగల్పురమునకు.

కమ:—ఇప్పుడే వెడలవలయునా?

శ్యామ:— రేపే యచట నుండవలసిన దినము.

సాయంత్ర మాఱుగంటలవేళ శ్యామసుందరుఁడు భాగల్పూరమునకై వెడలెను. మూఁడుదినములలో వత్తునని చెప్పినదానికిఁ బదులుగ నాల్గు దినము లచటనే గడచెను. అయిదవనాఁడు సాయంత్రము మూఁడు గంటలగు వఱకుఁ బాటలీపుత్రము వచ్చి, యింటికిఁ బోవుచుండ, వీధిలో గూడెపునాయకుఁ డొకఁ డగపడ, "ఏమయ్యా! ఎటుఁబోవుచున్నా" వని శ్యామసుందరుఁ డాతనిఁ బ్రశ్నించెను.

నాయకుఁ డులికిపాటుతోఁ దలయెత్తి చూచి పల్కెను: "నిన్ననే వచ్చెదరనుకొంటిమి; ఆలస్యమైనదేమి?"

శ్యామ:—నిన్న రా వలనుగలుగలేదు; అందఱు క్షేమమా?

నాయ:—తమ దయచేత నందఱును బాగుగ నున్నారు. నేఁడు తమ యింట గొప్ప సమావేశమైనది.

శ్యామ:—మా యింటనా? ఏమిటాసమావేశము?

నాయ:—దొరసానిగారు సభచేసినారు; మా యూఁడువాండ్రందఱును వచ్చియున్నారు.

శ్యామసుందరుఁడు ముందు సాగిచూచువఱకుఁ బరిచితములగు ముఖము లనేకము లగపడెను. వారు చేయు ప్రణామములకుత్తరమిచ్చుచు ద్వారముకడకుఁబోవ జనులచట గుమిగూడి

యుండిరి. వారందఱును దమ స్త్రీలవెంటఁ గొనివచ్చియుండిన వారు. శ్యామసుందరుఁడు చావిడిలోనికిఁబోయి వస్త్రములవిడచి. తనరాక భార్య కెఱిగింపవలదని నౌకరుల కాజ్ఞాపించి, తాను కిటికిలో నుండి లోపల జరుగు చర్యలఁ గనిపెట్టుచుండెను,

పందిరిలోఁ దెల్లనివస్త్రము పరువఁబడి దాని మీఁద మూఁడు నాలుగు వందల యాఁడువాండ్రు మోటునగలతోను, మోటువేషములతోను, గూర్చుండి యుండిరి. కొందఱు నవ్వుచుండిరి; మఱి కొందఱు మాట్లాడుచుండిరి. కమల, కేలఁ బళ్లెరముఁబూని వారలందఱకుఁ దాంబూలమిచ్చుచుండెను. చిన్న పిల్లలకు మిఠాయియు, నాటబొమ్మలను నిచ్చుచుండెను. తాంబూలము లైనతరువాత సంగీత మారంభమయ్యెను. నేఁడు కమల సైతము మోటుచీరఁ గట్టియుండెను. ఒక నగయైన నామె శరీరమున నగపడలేదు. యంత్ర సహాయమున నామె పాడి వారి కానందముఁ గల్గించుచుండెను.

ఈ చర్య నంతయుఁ గనిపెట్టుచుండిన శ్యామసుందరుని యానందము వర్ణనాతీతముగనుండెను. సంగీతమైనపిమ్మట కమల పదునైదు నిమిషముల వఱకు గ్రామ్యభాషయందు స్త్రీల కుపదేశ మొనర్చి సభఁ జాలించెను. తరువాత నామె వారినందఱను మర్యాదతో వీడుకొల్పెను. శ్యామసుందరుని యుత్సాహమాగదయ్యె. చావిడిలోనుండి యొకయదుముకున లోనికివచ్చి కమలను గనుకన్నచే గదిలోనికిఁ బిలిచి కౌఁగిలించెను. అంతకుమునుపు

చూచినదృశ్యము భార్యను మరల మరలఁ గౌఁగిలింప నతనిఁ బురికొల్పెను. కమల సిగ్గుతోఁ బల్కెను: "ఉన్నప్రేమనంతయు నేఁడే వెచ్చించెదరా యేమి?"

శ్యామ:— నా యానందము నేఁడు మేరగానకున్నది; నీవు నిజముగ దేవివలె నా కగపడుచున్నావు.

ఆనాఁ డొక రాజ్యమ్ము లభించినను శ్యామసుందరుఁడంత సంతసించియుండఁడు. అంత నతఁడు పదిమందిలోనికివచ్చి గుమిగూడియుండిన స్త్రీల కభిముఖుఁడై యిట్లనెను: "సోదరీ రత్నములారా! అనాఁడు నేనన్నట్లు కమల నిజముగ జబ్బుపడి యుండలేదు; మీతోఁ గలసిమెలఁగ వలదని యామె నన్ను నిర్బంధించి యుండెను, కాని నేఁడామెయే మిమ్మందఱ నాహ్వానించి మీతో సోదరీభావమును వహించెను. నాకిప్పుడు కలిగిన యానందమునకు సూచనగా గ్రామమునకు వేయిరూప్యముల చొప్పుననిచ్చి పది గ్రామము లందుఁ బది వ్యవసాయ నిధుల నేర్పఱచెదను. అచ్చట మీకు వడ్డీలేక యప్పుదొరకును. సాహుకారుల కపరిమితముగ వడ్డీయిచ్చి యిల్లు గుల్ల చేసికొనుచున్న మీ బాధలు నివర్తియగును. ఎవ్వరు నేఁడు మిమ్మాహ్వానించిరో వారే యా నిధుల కధ్యక్షులుగ నుందురు."

స్త్రీలందఱు చేతులెత్తి యా దంపతులకు మ్రొక్కిరి. అంత కమల భర్తతో ననెను: "బాగుగనున్నది; ఈ బాధల నన్నిటిని నా తలపైఁ బడవైచితిరి!"

శ్యామ:- (మందహాసముతో) నీటిలోనడుగుపెట్టిన తరువాత నీవే యీతనేర్చుకొన(గలవు.

కమ:- నాకీలెక్కలు ఏమితెలియును?

శ్యామ:- వానియంతట నవియే తెలియ(గలవు. రెండువారముల క్రిందనేకదా నీవు నన్నుఁత్యజులతోఁ(గలయుట, మెల(గుట, మానుకొనఁబలవంతపెట్టితివి; అట్టిదానవు నే(డు వారల సోదరులఁగ(దలంచుచుంటివి. నా(డు నీ పంతము చెల్లెను; నే(డు నా పంతము సాగెను!

ఆత్మార్పణము

ప్రథమ రంగము

ఉ॥...................................పాం
చాలురనెల్ల తీవ్రశరజాలములం బొలియించికాని భూ
పాలక పుచ్ఛకత్తశము . . . . . . (భారతము. శల్యపర్వము.)

పదమూఁడవ శతాబ్దారంభమున నంతమొందిన చందేలు వంశపుతుదిరాజు పరిమళదేవుఁడు. ఆ కాలమున నీవంశము వారికి మహోబాయను చిన్న నగరము రాజధానియై యుండెను. మహోబా రాజ్య మప్పటిదినములలోఁ ప్రాబల్యదశనంది యుండిన ఢిల్లీరాజ్యముతోను, కనోజురాజ్యముతోను, భుజాస్ఫాల నము చేయుచుండెడిది. పరిమళ దేవుని దర్బారునందు, అల హుఁడు, ఓదలుఁడు అను నిద్దఱు క్షత్రియవీరులుండిరి. వీరి తండ్రి యశరాజు వీరి బాల్యముననే మరణించెను తండ్రిలేని యాబాలురపైనఁ గనికరము వహించి పరిమళ దేవుఁడు వారిని వారితల్లిని రాజమందిరమునకు రప్పించిరాణీమల్హణదేవి కప్పగిం చెను. రాణియు నాసోదరులను దాఁగన్న కుమారులవలె నెంతో ప్రేమతోఁబెంచెను. కొంతకాలమునకు వారు మహావీరులై విఖ్యా తులై ఘనకార్యములవలన మహోబాకీర్తిని జిరస్థాయిగాఁజేసిరి.

మల్హాణదేవి వారిని బెంచిపెద్దలఁజేసి పెండ్లిండ్లు చేసెను. ఆకారణమున వారు మహోబా రాజ్యము నెడ మిగుల భక్తిఁగల వారై యుండిరి. పరిమళదేవుని కొఱకుఁ బ్రాణముల నర్పించుటకు వారు సర్వదా సిద్ధముగనుండిరి. వీరసోదరుల నిర్వక్ర పరాక్రమము, చుట్టుపట్టులనుండు ననేక సంస్థానాధీశులను చందేలుల హితైషులుగ నొనర్చెను. మహోబారాజ్యము క్రమక్రమముగా విస్తరిల్లసాగెను. యౌవనదశ ప్రాప్తించిన తరువాత నీసోదరులు విశ్రాంతిగొఁని యెఱుఁగరు. సమరాంగణమే వారికి విశ్రమస్థానము! మెత్తని పఱుపుల మీఁద వారికి నిద్రయే వచ్చుచుండలేదు.

ఆ కాలమే చిత్రమైనది. ఆ దినములలో విశ్రాంతిగాఁ గూర్చుండుట యనినను మరణమనినను నొకటే యర్థము. మాటలలోనే పలుమాఱు ఖడ్గము లెగయుటయు, రక్తము ప్రవహించుటయు సంభవించుచుండెను. పలుమాఱు వివాహవేదికలే రణరంగము లగుచుండినవి. ఎవనియింట నేని యాఁడుపిల్ల పుట్టినచోఁ గొప్ప యనర్థముకలుగుచుండెను. వేలకొలఁది సిపాయిల యొక్కయు, బంధువులయొక్కయు రక్తము హరణమగుచుండెను. మన వీరసోదరు లట్టికాలపు నాదర్శపురుషులు. ఆ కాలమునకు సహజములగు నైతికదౌర్బల్యములును, లోపములును వారిని దమకు లోఁబఱచుకొనక వదల లేదు; కాని నిజము విచారించి చూచితిమేని యవి యాకాలఁపు దోషములు కాని వారి దోషములు కావు!

ద్వితీయ రంగము

ఈ సోదరుల మేనమామ మహీలుఁ డనువాఁడు చాలఁ గపటవర్తనుఁడు. వీరి యౌన్నత్యమును, గీర్తియును నాతని కసూయకారణములయ్యెను. వీరి నీయున్నత స్థానమునుండి యెట్లు క్రిందికిఁ బడఁద్రోయవచ్చునాయని యాతఁడు సదా విచారించు చుండెను. ఈసత్కార్యమును సాధించుటకై యాతఁడు తన జీవితమును ధార వోయఁదలఁచియుండె. కనుక నెన్నియో యత్నములుచేసి వేసరి తుదకు నెట్లెట్లో పరిమళ దేవునకు దుర్బోధ చేసి యాతనిఁ దన వలలో వేసికొనెను.

ఒకనాఁడు పరిమళదేవుఁ డొంటరిగాఁ గూర్చుండి యుండువేళ మహీలుఁ డచటికి వచ్చెను. రా జాతని ముఖమున విచారలక్షణములను జూచి యడిగెను. "అయ్యా! నీ ముఖము వాడియున్నది; క్షేమమేకదా!" మహీలుఁడు కన్నీరునించెను. కపటవర్తనగల వానికి తనచిత్తవృత్తులపైన నెట్టి యాధిపత్యముండునో యట్టిది సంపూర్ణ విరాగికిఁగూడ నుండదు. వాని మనస్సు దుఃఖించుచుండ మోము నవ్వుచుండును. హృదయ మానందమయమైయుండఁ గన్నులు నీరు గార్చుచుండును. అంతస్సు, అసూయాగ్నిజ్వాలలో మలమలమాడుచుండ, నాలుక, అమృతఁపు సోనలఁగురిపించుచుండును!

"రాజోత్తమా! దేవరవారి చల్లని నీడలోనున్న నేను కోరఁదగినవస్తు వేదియునులేదు. కాని ఎవ్వారిని తమరధోగతి నుండి లేవనెత్తి యున్నత శిఖరమున నిల్పితిరో, ఎవ్వారు తమ

కృపచేత సౌఖ్యమున నోలలాడుచు సత్కీర్తిని జూఱఁగొను చున్నారో, అట్టివారు తమయెడఁ గృతఘ్నులై కుట్రలు చేయుచుం డుట నా హృదయమును దహించుచున్నది" యని మహీలుఁడు పలికెను.

పరిమళదేవుఁడు ఆశ్చర్యముతో నడిగెను: "నా సేవకు లలో నిట్టివారుఁగూడ నున్నారా?''

మహ:—అయ్యా! నేనేమియు ననఁ జాలను. దేవర హృదయము కృపాసముద్రము. దానిలోఁ బ్రాణ ములఁదీయు మొసలి యొకటి డాఁగియున్నది.

పరి:—ఎవఁడతఁడు?

మహీ:—నేనే.

పరి:—(ఆశ్చర్యచకితుఁడై) నీవా?

మహీ:—అవును, దేవా? ఆమందభాగ్యుఁడను నేనే. నేఁడు నామీఁద మొఱ పెట్టుకొనుటకు నేనే వచ్చియున్నాను. నా బంధు వులయెడ నేను నెఱవేర్చవలసిన విధిగలదు; కాని అది దేవరవారి యెడనేను నెఱవేర్చవలసిన విధికంటే మహ త్తరమైనది కానేరదు. అలహుఁడు నాకు రక్తబంధువు, వానిరక్తమే నారక్తము; వాని మాంసమే నామాంసము. అయినను, తన శరీరమునఁ బొడసూపినది కదా యని రోగమును వైద్యున కెఱిఁగింపక తప్పునా ? అక్కటా ! 'నా బాహుబలమునఁ గదా మహో బారాజ్యము నిలచి

యున్నది' యను సహంకారము వాని మనసున నాటుకొని యున్నది.

ఎఱ్ఱవారిన కన్నులతో రాజనెను : "అలహుని నేను నా పుత్రునిగ భావించుచుంటిని గదా!"

మహీ:—కాదు. అంతకన్న నెక్కువగఁ దలఁచుచుంటిరి.

పరి:—తండ్రిలేనివాఁడు కదా, నిస్సహాయుఁడు కదాయని నే నాతని నెత్తికొని ప్రేమించుచుంటిని! జాగీరులిచ్చితిని; సేనాధిపుని జేసితిని; ఆతని వివాహసమయమున నే నిరువదివేల చందేలుశూరులఁ గోల్పోయితిని; వాని తల్లియు మల్హాణ దేవియు పౌరుషసుమాట నెఱుఁగక యనేక వత్సరములు కలసి యుండిరి. అట్టివాఁడు నా యుపకారమును మఱచునా? నేను నీ మాట నమ్మఁజాలను.

మహీలునిమోము వెలవెలఁబారెను. కొంతధైర్యముఁ దెచ్చికొని, యతఁడనెను "అయ్యో! నానాలుక యెన్నఁడును నబద్ధమాడి యెఱుఁగదు."

పరి:—నాకేమి నమ్మకము?

మహీలుఁడు మెల్లగా నేదో రాజు చెవిలోఁ జెప్పెను.

తృతీయరంగము

'రాజుగారు పిలచుచున్నా' రని భటుఁడొకఁడు వచ్చి విన్నమించు నపుడు మన వీరసోదరులు విశాలమగు నొక మైదా

నమందు సేనా విన్యాసమున నిమగ్నులై యుండిరి. రాజుగారి యాజ్ఞవినఁగానే, అలహుఁడు, భటుని వెనువెంట దర్బారునకు వచ్చి పరిమళ దేవునకు సవినయముగ నమస్కరించెను.

పరి:-నేనొకటి యడిగెదను. ఇచ్చెదవా?

అలహుఁడు నిష్కపటముగా ననెను: "చిత్తము, సెలవియ్య వచ్చును."

పరి:—మాట తిరుగవు గదా!

అలహుఁడు, కనుఁగొనల మహీలునిజూచి యేదోదుస్తంత్రము జరిగినదని యనుమానించెను. 'కానిచో నితని మొగమున నీ చిఱునవ్వేల? రాజు నావిశ్వాసమును పరీక్షించుచుండ వచ్చును' అనుకొని వచించెను. "మహారాజా! ఇంతకు ముందు దేవరవారి నోటనిట్టి ప్రశ్న విని యెఱుఁగను. తమరు నా పోషకులు; నా హితైషులు: నాప్రభువులు. దేవర కనుసన్నమాత్రమున నగ్నిజాల్వలలోదుమికెదను. మృత్యువుతోఁ బోరాడెదను! ఏలిక యాజ్ఞ యయ్యేనేని యసంభవమును సంభవముగఁ జేసెదను. నన్నిట్లు ప్రశ్నింపవలదని విన్నవించుకొనుచున్నాను."

పరి—సెబాసు! నీవట్లెచేసెదవని నాకాశ గలదు.

అల: —నాకేమి యాజ్ఞ?

పరి:—'నాహరు' అను పేరుగలగుఱ్ఱము నీయొద్దనున్నది కదా!

అల:—'చిత్తము. ఉన్నది.' యని మహీలునిపైనఁ దన నేత్రాగ్నిగురిపించెను.

పరి:—నీకిష్టమైనచో. దానిని మాకిమ్ము.

అలహుండు మారుపలుకలేక పోయెను. "మాటతిరుగనని ఇప్పుడేకదా ప్రతిజ్ఞచేసితిని. ఇయ్యనని యందునా? ఈసమయమున రాజు నాకృతజ్ఞతను బరీక్షింపఁ దలఁచుచున్నాఁడు. నామాటను చెల్లింపకపోయితినా యుపద్రవము వాటిల్లును. ఉపద్రవమువచ్చిన మానె. ఇయ్యనని యెట్లందును? నన్ను విశ్వాసహీనునిగఁదలంపఁడా? రాజునకు నేను సామాన్యుఁడనగు సేవకుఁడనుగానే! నేనాయన ప్రక్కలోను రెక్కలోను బెరిగితిని. నా కాలు సేతులలో బలములేనికాలమున నా కృత్యముల నాయన సహించుకొనెను; ననుఁ బుత్రునివలెఁ బ్రేమించెను! అట్టివాని కోరికను జెల్లించకుండఁగలనా?"

భావము లింకొక మార్గమున మఱలెను. "రాజు నాకుఁ జేసిన యుపకార మపరిమిత మనుట నిజమే. నా శరీరములోని యొక్కొక యణువు నాతని యుపకార భారమును వహించి యున్నదను మాట నిజమే. కాని క్షత్రియుఁడు తన గుఱ్ఱము మఱొకనికియ్యఁడు. ఇది క్షత్రియ ధర్మము. నేనతని యన్నముఁ దిని బ్రతికినివాఁడను. ఈ శరీర మాతని యౌదార్యముచేఁ బెరిగినది. నా శరీరముపైన నాకు సంపూర్ణాధికారము గలదు. దానిని నేను రాజున కర్పింపఁగలను. కాని క్షత్రియ ధర్మము నా చేతిలోనిది కాదు. నేను దాని నతిక్రమింపఁ జాలను. పవిత్రమగు క్షత్రియ ధర్మమును లోహదుర్గముగ భావించిన వీరపుంగవుల మూలముననే కదా దాని కీర్తి నేఁటికిని బ్రకాశించుచున్నది.

నా పేరునకుఁ జిర స్థాయియగు కళంకము నెట్లాపాదించు కొందును? అక్కటా! మహీలుఁడు నన్నెట్టి స్థితిలో నిఱికించి నాఁడు! 'వెనుకకుఁ బోయినఁ గోయి, ముందునకుఁ బోయిన నూయి' అనునట్లున్నది. క్షత్రియ ధర్మమునకుఁ గళంకము నైనఁ దెచ్చి పెట్టవలయును; స్వీయ వినాశమునకైన నొప్పుకొన వలయును! ఎటులైనను సరే. కృతఘ్నుఁడనైన నగుదుఁ గాక, ధర్మాతిక్రమణము నా కిష్టము లేదు. నా యౌన్నత్య మధోగతి పాలైనను మానె: క్షత్రియ ధర్మమునకు దుష్కీర్తిఁ దేఁజాలను!"

అలహాఁడిట్టి విచారమునఁదలవాల్చి యాలోచించుచుం డెను. పాపము, అది యాతనికిఁ బరీక్షా సమయము. ఈ పరీక్ష యందలి గెలుపు పైననే యాతని భవిష్యత్తాధారపడి యున్నది! మహీలుని హృదయ మానందమున మునిఁగి యుండెను.

అంతలో, పరిమళ దేవుఁడు బిగ్గరగా ననెను: "ఏమి యాలోచించుచున్నావు. ఇచ్చుట కిష్టము లేదా?"

అలహా:— (కన్నుల నేలవాల్చి) "అయ్యా ఇష్టము లేదు."

పరిమళ దేవుఁడు కోపోద్దీపితుఁడై ఖండితముగఁ బల్కెను: "ఎందుచేత?"

అలహాఁడు నిబ్బరముతో ననెను: "అది క్షత్రియ ధర్మమునకు విరుద్ధము గనుక."

పరిమ:— అలహా! నేను మీకుఁ జేసిన యుపకారమున కిదియా ప్రతిఫలము? ఎఱుఁగుదువు గదా నీవొకప్పు డెట్టి స్థితియం దుంటివో, ఇప్పు డెట్టి స్థితియం దున్నావో!

అలహూ:—చిత్తము: ఎఱుఁగుదును.

పరిమ:—తెలియును గదా ఎట్లు బాగుచేసితినో యట్లే నిన్ను చెడఁ గొట్టగలనని!

అలహూని సహన శక్తి తగ్గెను. కన్ను లెఱ్ఱనయ్యె. కొంచెము కఠినమగు ధ్వనితో ననెను: "రాజేంద్రా! తమరు నాకుఁ జేసిన యుపకారమునకు సదా కృతజ్ఞుఁడనై యుందును. క్షత్రియుఁడగువాఁ డేనాఁడును నుపకారమును మఱవఁడు. తమరు చేసిన యుపకారమునకు నేనుసు ప్రాణముల కాసింపక ప్రతిఫల మొనర్చితిని. పలు మాఱులు నేను చూపిన ప్రభు భక్తిని, ఆత్మార్పణాసక్తిని, కేవలము జీతము తినినంత మాత్ర మున నెవఁడును జూపియుండఁడు. ఇఁక దేవర వారి దర్బారు నందు నాకు జీవనము లేదని తోఁచుచున్నది. ఇదియే నా తుది నమస్కారము. తెలివి లేమిచే నేను చేసిన యపరాధములను క్షమింపఁ బ్రార్థించుచున్నాను."

చతుర్థరంగము

అలహూని తల్లి పేరు దేవలదేవి. భావౌన్నత్యము చేతను, సద్వర్తనము చేతను, భారత వర్షము యొక్క పూర్వ చారిత్ర

మును పవిత్రముగ నొనర్చిన నారీరత్నములలో నామె యొకతె. పరస్పర వైషమ్యమువలనను, స్వార్థపరత్వవలనను, మన దేశ మంధకారమయమై యుండిన కాలమున నైతము దేశచరిత్రమును కాంతిమంతముగఁ జేయు వనితామణు లిచ్చట జన్మించిరి. అల హుండు చూపిన ధర్మపరాయణత్వము వినిన దేవలదేవి కన్నుల నానందాశ్రువు లూరెను. పుత్రులఁగౌఁగిలించుకొని యామె పలి కెను: "నాయనలారా! మీరు క్షత్రియధర్మమును బాలించితిరి. మీయట్టి పుత్రులఁగని నే నెంతయు ధన్యురాలనైతిని.''

ఆనాఁడే వారు మహోబా వదలి వెడలిరి. తమ యశ్వ ములను దప్ప వారు మతేవస్తువును వెంటఁ దీసికొనలేదు. తమ సామాను నంతను నచ్చటనే వదలిరి. క్షత్రియుని యైశ్వర్యమును గౌరవమును నతని ఖడ్గమునందే యుండును! ఎవ్వాఁడు శౌర్య ధనుఁడో వాని కితర ద్రవ్యముతోఁ బనియేమి?

అది వర్ష కాలము. నదీ నదములు పుక్కిలి పాఱు చుండెను. ఇంద్రుని యౌదార్యముచే భూదేవి యలంకృతయై యుప్పొంగుచుండెను. నెమళ్ళు చెట్లపై నెక్కి క్రేంకారములు నేయుచుండె. సేద్యగాండ్రు పొలములలో సృష్టి సౌందర్య దర్శనమున నున్మాదులై పాటలు పాడుచుండిరి. పచ్చని పచ్చికతోఁ గప్పఁబడియున్న పర్వతములతోను, కఱఁగిపోసిన వెండినీటిఁబోలు. స్వచ్ఛజలముతో నొప్పు తటాకములతోను, ప్రకృతి సొంపు నింపుచుండెను. బయలులందు వీచుచుండిన చల్లనిగాలియు, నడవి పూవులు వెదఁజల్లుచుండిన కమ్మని

తావియు, వాయువుచే శిరఃకంపము చేయుచుండిన వృక్షాగ్రము లును, మనమునఁ గోరికలను బుట్టించుచుండెను. అట్టి మనో హరమగు కాలమున నా సోదరు లిరువురు మహోబాపురమును వదలివెడలిరి. వారి కన్నులశ్రువుల రాల్చి రాల్చి యెఱ్ఱఁబడెను. ప్రేమాస్పదమగు జన్మభూమిని వారు వదలవలసిన వారైరి. ఏ నగర వీధులలో వారు తప్పటడుగు లిడనేర్చుకొని యుండిరో, ఎచ్చటి చెఱువులలో వారే తమ బాల్యమున కాగితపు పడవలను వేసి యాడుకొనియుండిరో, ఎచ్చట వారు యౌవనకాల సౌఖ్య ముల ననుభవించి యుండిరో, అట్టి 'మహోబా' పురమునకు వారు దూరస్థు లగుట సంభవించెను. ముందునకుఁ బోవుచుండిరికాని యడుగులు సాగుటలేదు. పరిమళదేవుఁడు, ఎవరినైన నంపి తమ్ముర మ్మనుచున్నాఁడేమోయని వారు మాటి మాటికి వెనుక వంకఁ దిరిగిచూచుచుండిరి. పోను పోను మహోబాపర్వతము లదృశ్యము లయ్యెను. అంత వారి యాశ నిరాశ యయ్యె. దీర్ఘనిశ్వాసమును విషాదముతో వదలి గుఱ్ఱముల నదలించిరి. వీరు దేశాంతరగతులైనవార్త నలుదెసలవ్యాపించెను. అట్టి వీర పుంగవులకుఁ దావులేని దర్బారుండునా? అన్ని దిశలనుండియు నాహ్వానములు రాసాగెను. కనోజురాజు జయచంద్రుఁడు, వారిని దోడి తెచ్చుటకుఁ దనకుమారునంపెను. వారును రాజ కుమారుని సత్కారమునకును, నుత్సాహమునకును సంతసించి, కనోజుపురమునకు వచ్చిరి. వారి రాకకై నిరీక్షించుచుండిన జయచంద్రుఁడు, అలహునిఁ దన సేనాధిపునిఁగాఁ జేసికొనెను.

పంచమ రంగము

మన వీర పురుషు లిరువురును వెడలిపోయిన పిమ్మట 'మహోబా' రాజ్యమున దురాగతము లారంభ మయ్యెను. పరిమళదేవుని దౌర్బల్యమును గనిపెట్టి మాండలికరాజులు తిరుగఁబడిరి. వీరి నడఁచిపెట్టు ప్రబలశక్తి రాజ్యమున లేదయ్యెను. ఒకనాఁడు ఢిల్లీశ్వరుఁడగు పృథ్వీరాయని సైన్యములు 'సమతా' యను స్థలమునకుఁబోయి విజయోపేతములై మఱలి వచ్చుచు మార్గమధ్యమున మహోబాయందు దిగెను. మూర్ఖులగు సిపాయిలలోఁ గత్తు లెగురుట కెంతసేపు పట్టును? పరిమళదేవుని యుద్యోగియుల పొరపాటైన నేమి, చౌహాణుల తప్పిదమైన నేమి, మొత్తముమీఁద చందేలులకును, చౌహాణులకును పోరు తారసిల్లెను. చౌహాణులు స్వల్పసంఖ్యాకు లగుటచే చందేలులు ఆతిథ్య ధర్మముల నొగఁ ద్రొక్కి, వారినందఱను సంహరించి సంతసించిరే కాని యా దుష్కృత్యమునఁ దమ కెట్టి కీడు మూడనున్నదో తెలియలేకపోయిరి. ఈ దుర్వార్త వినినంతనే పృథ్వీరాయని యాగ్రహమునకు మేరలేక పోయెను. భయంకరమగు పెనుగాలివలె నతఁడు మహోబాపై కెత్తివచ్చి 'మహోబా' రాజ్యములోని ప్రసిద్ధనగరమగు సరసాపురమును నాశనము చేసి రాజధానివైపు మఱలెను. చందేలులుకూడ సమరసన్నాహములు చేసిరికాని, యంతకుముందు చౌహాణులతోఁ జేసిన యుద్ధమువలన వారలసియుండిరి. అంతేకాక, అలహుఁడు, ఓదలుఁడు, లేని సేనలు పెండ్లికొడుకులేని యూరేగింపువలె శోభారహితములై

యుండెను. సైనికులు ధైర్యమును వీడసాగిరి. దేశమున హాహాకారములు వెడలెను. మఱియొక నిమిషమున పృథ్వీరాజు మహోబాపైన వచ్చిపడునను భయము జనులను నిర్విణ్ణులుగాఁ జేసెను. పరిమళదేవుఁడు జరిగినదాని కెంతయుఁ బశ్చాత్తాపము నొందెనుకాని, దానివలన నేమి ప్రయోజనము? మార్గాంతరముఁ గానక, అతఁడు, 'యుద్ధమున కొంత నెల గడువిం'డని పృథ్వీరాయని వేడికొనెను. చౌహాణవీరుఁ డెంతటిశూరుఁడో యంతటి యుద్ధ ధర్మమును బాటించువాఁడు. దుర్బలుఁడుగా గాని, అజాగ్రత్తతోఁగాని యున్న శత్రువును నతఁడెదుర్కొనఁదలంపఁడు. రణధర్మము నతఁ డట్లు పాలించియే యుండనిచో షహాబుద్దీను చేతఁ బడునట్టి దుర్దినము వచ్చియే యుండదు! అతని ధర్మనిరతియే యతని ప్రాణశత్రు వయ్యెను! అది యట్లుండె. పృథ్వీరాయఁడు పరిమళదేవుని సందేశము నంగీకరించి సేనలను మఱలించుకొనెను. 'నేఁటికి బ్రతికితిమిరా దేవుఁడా' యని చందేలులు కొంత సంతసించిరి.

ఢిల్లీశ్వరునితో నెట్లు సమరము సేయవచ్చునను విషయమును 'మహోబా' రాజ్యహితైషు లందఱు తల లొకచోఁ జేర్చి విచారింపసాగిరి. నగరముచుట్టును దుర్భేద్యమగు గోడఁ బెట్టింతుమని కొందఱును, మహోబాను నాశనదేవత కప్పగించి దక్కనునకు బోవుదమని మఱికొందఱును అభిప్రాయ మిచ్చుచుండిరి. సంధిచేసి కొనుట తప్ప నుపాయాంతరము పరిమళదేవునకుఁ గానరాదయ్యె. అప్పుడు మల్హణదేవి లేచినిలచి యిట్లనెను:-

"చందేలువంశజులగు క్షత్రియులారా! బాలుర వలె నర్థములేని మాటలేల యాడెదరు? గోడలు మనను శత్రువులబారి నుండి తప్పింపఁగల్గునా? వృక్షము లెన్నఁడైనను గాలి నాపఁగలవా? మహోబాను విడచిపోవుద మనుమాట, ఆఁడువాండ్రనఁదగినది కాని మీరు చెప్పవలసినదా? మీ శౌర్యము, మీ యాత్మార్పణము నేఁడెచటికిఁ బోయినవి? మొన్న మొన్నఁటి వఱకుఁగదా చందేలులపేరు శత్రువులగుండియల నవియఁజేయుచుండెడిది! కడచిన కొన్ని సంవత్సరములలో మీరు వందలకొలఁది యుద్ధములందు గెలుపొందితిరి! పరాజయ మనునది మిమ్మెన్నఁడైన వచ్చితాకెనా? మీ ఖడ్గముల మెఱపు లెన్నఁడేని మందగిల్లెనా? అట్టి ఘనకార్యములు చేసిచూపినవారు మీరే. కాని మీయందప్పటి పౌరుషము పోయినది. ఆ పౌరుష మా సోదరద్వయముతోఁ గూడ 'మహోబా'ను వదలిపోయినది! దేవలదేవితోఁ బాటు జయలక్ష్మి కూడ మనలను ద్యజించినది! వేయేల? మన యీ దుస్థితిని బోఁగొట్టఁగలవాఁడొకఁడే కలఁడు! అతఁడెవఁడు? అలహాఁడే! ఆసోదరులే యీ సందిగ్ధావస్థయందు మనలఁ గాపాడఁగలరు. వారినే సమాధాన పఱచుకొనుఁడు! మహోబా వారికి చేసిన యుపకారములెన్నియో కలవు. మహోబా యోషధులును, మహోబా జలమును వారిని పోషించినవి! మహోబాయెడఁ దమకుఁగల విధులను వారెన్నఁటికిని మఱువరు! రాఁబోవుయుద్ధమున విజయ

లక్ష్మిని గైకొనుటకు వలయు సామర్థ్యమును, విద్యను ఈశ్వరుఁడు వారికే ప్రసాదించి యున్నాఁడు!''

మల్హాణదేవి వచనములు జనుల మనములలో నాటుకొనెను.

షష్ఠమ రంగము

మన కథా నాయకులను బిలుచుకొని వచ్చుటకై జగన్నాథ భాటుఁడు కనోజు ప్రవేశించువఱకు వారు వేఁటకుఁబోవుచుండిరి. భాటుఁడెదురై రాఁగానే వారాతనికి నమస్కరించిరి. అతని ముఖమున నవమానమును, సిగ్గును చిత్రితములై యుండెను. అలహుఁడు తత్తఱముతో నతని నడిగెను ''కవిశేఖరా! దారి తప్పి వచ్చినట్లున్నది! మహోబాయందు నందఱు క్షేమముగా నున్నారా? మేమెట్లు జ్ఞప్తికి వచ్చితిమి?'' కన్నీటితో భాటుఁ డిట్లనియె: ''శూరపుంగవులారా! క్షేమముగా నుండినచో మీ శరణేల చొచ్చియుందుము? ఆపత్కాలముననేకదా దేవతలు జ్ఞప్తికి వచ్చెదరు. 'మహోబా' పైన నేఁడు ఈశ్వరున కాగ్రహము వచ్చినది. పృథ్వీరాయఁ డిప్పుడానగరమును ముట్టడించి యున్నాడు. నరసింహుఁడును, వీరసింహుఁడును శత్రు కరవాలముల కర్పితులై యున్నారు. సరసాపురము బూడిదకుప్పయైనది. చందేలుల రాజ్యము నాశనము కానున్నది! దేశమం దెల్లెడల దుఃఖారావములు ప్రబలినవి. ఎంతో కష్టముమీఁద నొకమాసము

గడువు దొరకినది. పరిమళ దేవుఁడు నన్ను మీ కడకుఁ బంపి నాడు. ఈ యాపత్కాలమున మాకు దిక్కెవ్వరునులేరు. మాకు ధైర్యమిచ్చువా రెవ్వరును గానరారు. మీరు మహోబా వదలిన నాఁటి నుండి యొకసారి యైనను పరిమళ దేవుని పెదవులపైనఁ జిఱునగవు కానరాలేదు. ఎన్నియో దినముల నుండి యాతని కన్నులు నిద్దుర నెఱుఁగవు. మిమ్ముఁ దనప్రక్కలోను తెక్కల లోను బెంచిన మల్హణదేవి రాత్రిందివములు మీ కొఱకుఁ గన్నీరు గార్చుచున్నది! క్షత్రియవంశ సత్పుత్రులారా! చందేలుల నావ మునుఁగుచున్నది: చందేలుల పేరు నిముసములో మాసిపోవ నున్నది! ఇదే సమయము! ఖడ్గములఁ బూనుఁడు! మునుఁగు చున్న యీ నావను వెంటనే పైకెత్తరేని చిరకాలము వగవ వలసి వచ్చును. ఈ నావతోఁగూడ మీ పేరే కాదు శూర శిఖా మణి యగు మీ తండ్రిపేరు కూడ నడుగంట నున్నది!"

అలహాఁడు ముఖము చిట్లించి బదులు చెప్పెను: "ఏమైనను కానిమ్ము, మా కావిషయమున జాలిలేదు. మా తండ్రి పేరు నేఁడు మునుఁగుటేల? ఏనాఁడు మమ్ము నిష్కారణముగ మహోబా నుండి వెడలఁగొట్టిరో యానాఁడే మునిఁగెను. మహోబా మంటఁగలియనిమ్ము; చందేలుల దీపము కొండ నెక్కనిమ్ము; మాకే మాత్రమును జింతలేదు. మహోబాకొఱకు మే మొడిపిన చెమటకు మమ్ము వెడలఁగొట్టుటయేనా ప్రతి ఫలము? మాతండ్రి మహోబా కొఱకుఁ దన ప్రాణముల నర్పించెను. మేము గోఁచులను, జెండాడితిమి: చందేలులకు దేవగడ

మిప్పించితిమి; యాదవ వంశముతోఁ బోరాడితిమి: కట్యారు బయళ్లలో, చందేలుల పతాకమును నాటితిమి; ఈ చేతులతోనే కదా నేను ఖ్వాహిల సేనా ప్రవాహము నడ్డగించితిని; గయలో యుద్ధమ్మును మేమే గెలిచితిమి; రేవాను గర్వమును మేమే భజించితిమి: మే వాతుల నుండి పన్నులఁగొంటిమి; ఈ పనుల న్నిటికి మాకు వచ్చిన బహుమానమిదియే! మాతండ్రి పదిమంది రాజులను మహోబాదర్బారునకు మాండలికులఁ జేసెను. పరిమళ దేవుని కొలువున నే నేడుమారు లపాయకరములగు గాయముల నొందితిని. మూఁడు మారులు మృత్యుముఖమునుండి వెడలితిని. ఓటమనునది లేక నలువది యుద్ధములఁ జేసితిని. ఓదలుఁదేడు రణాంగణములలో జయముఁగాంచెను. చందేలుల ప్రతాపమును మేము దిగంతములఁ జాటితిమి. చందేలుల కీర్తిని మేమాకాశ మున కంటించితిమి. ఇట్టి సేవకు ప్రతిఫలము మాకు లభించి నది. మహీలుని సంతోషపెట్టుటకే కదా పరిమళ దేవుఁడు మమ్ము దేశాంతరమున కంపెను; ఆ మహీలునే యిప్పుడేల పిలుపించు కొనఁడు?''

జగన్నాథుఁడిట్లు ప్రత్యుత్తరమిచ్చెను: "అలహా! క్షత్రి యులనవలసిన మాటలా యివి? ఏ రాజ్యముకొఱకు మీతండ్రి ప్రాణముల నర్పించెనో, ఆ రాజ్యమే యిప్పుడు శత్రుపాదముల క్రిందనడఁగి పోవుచున్నది. అంతటివాని పుత్రుఁడవగు నీకు రోషములేదా? తన రాజును నాపదలలో వదలి తటస్థుఁడుగా నుండు క్షత్రియునకు నరకాగ్నికన్న వేఱాశ్రయము కలదా?

నీ మాతృ దేశముపైన దుర్దశామేఘము లావరించి యున్నవి. మీ తల్లులు మీయక్క చెల్లెండ్రు, శత్రువులచేత నవమానము పొలగుచున్నారు! ఇకనైన మీకు జాలికలుగదా? మాతృదేశ మిట్టి దుర్గతియందుండ, కనోజులో మీకెట్లు సుఖనిద్రపట్టును?''

జగన్నాథుఁడు వచ్చినవార్త దేవలదేవికిఁ దెలిసినందున నామె లక్షణమే కుమారులను బిలచి యనెను: "నాయనలారా! గడచిన దానిని మఱచిపొండు. నేఁడే మహోబాకు ప్రయాణము కండు.''

అలహుఁడేమియు మాట్లాడలేదు. కాని ఓదలుఁడు కోపముతో ననెను: ''మహోబాకుఁబోవుట మా కిష్టములేదు. మనలను వారు కుక్కలవలె 'మహోబా' నుండి పాఱఁదోలిన దినమును మఱవఁజాలము. 'మహోబా' మునిఁగినను సరే తేలినను సరే. దానిని జూచు కోరికయు మాకు లేదు. కనోజే మాకు మాతృభూమి!"

దేవలదేవి కీవాక్యములు ములుకులవలెఁదోఁచెను. రౌద్ర మూర్తియై యనెను: "ఓదలా! ఇట్టిమాటలు పలుకుటకు నీకు సిగ్గులేదా? ఇట్టి పుత్రులఁగనుటకన్న గొడ్రాలనైన బాగుండెడిది. కులమునకుఁ గళంకము నాపాదించు పుత్రులను గనుటకా నేను గర్భవేదనను సహించినది? దురాత్ములారా! నాయెదుట నిలువ వలదు. మీముఖముఁ జూడఁగూడదు. మీవంటి మూర్ఖులు యశ రాజునకుఁ దగిన పుత్రులుగానేరరు!''

ఈ మాటలు వారి హృదయమున బాకుపోటులై నాటెను. వారినుదుటఁ జెమటలు గ్రమ్మెను. లేచి నిలచియనిరి "అమ్మ! శాంతింపుము ఇఁక మమ్ము నీశూలములచే నొప్పింపకుము. నేఁడే 'మహోబా' కుఁబోయెదము. పరిమళదేవుని కార్యమున మా రక్తము నొడిపెదము. రణరంగమున మా ఖడ్గముల కాంతితో మా తండ్రి కీర్తిని బ్రకాశింపఁ జేసెదము! చౌహాణుల తోడిపోరున శౌర్యమును బ్రదర్శించి దేవలదేవి సుతులయశమును నజరామరముగఁ జేసెదము!"

సప్తమ రంగము

సోదరు లిరువురును తల్లితోఁగూడ కనోజువదలిరి. వీరు 'మహోబా'కుఁ బోవఁగానే వాడిన చేలమీఁద వర్షము గురిసినట్లయ్యెను. ఛిన్నభిన్నములైన హృదయశకలము లతికికొనెను. శూరాగ్రేసరులకు స్వాగతమిచ్చుటకై యొకలక్ష చందేలులు నిలువఁబడిరి. దేశాంతరగతులైన సోదరులెంతో కాలమునకు దేశ సోదరులఁ గలసికొనిరి. ఆనందబాష్పములు కన్నులఁ గ్రమ్మెను. వీరిరాక విని పరిమళదేవుఁడు కీర్తిసాగరమను సరోవరమువఱకు నెదుర్కొనుటకై కాలినడకనఁబోయెను. వీరసోదరులు పఱువునఁ బోయి పరిమళదేవుని పాదములమీఁద వ్రాలిరి. మువ్వురికన్నులనుండి స్రవించిన కన్నీటి ప్రవాహమంతకుఁ బూర్వము వారి హృదయములందుండిన మాలిన్యమును గడిగివేసెను.

శత్రుసేనలు సిద్ధముగా వచ్చియే యుండుటవలన నాతిథ్య సత్కారముల కవకాశము లభింపలేదు. కీర్తిసాగర తీర మునసే చందేలు మహాపురుషులయొక్కయు మంత్రిగణము యొక్కయు నాలోచన ననుసరించి, అలహాండు సేనాధిపతిగా నభిషిక్తుండయ్యెను, అచ్చటనే, దేశారాధనమున నవసరమైనచోఁ జచ్చుటకును జంపుటకును శపథములు జరిగెను! అచ్చటనే, చందేలు వీరులు రణరంగమునుండి ప్రాణములతోఁ గదలమని ప్రతిజ్ఞ చేసిరి! అచ్చటనే జనులొకరి నొకరాలింగనము చేసికొని, యదృష్టములను భవిష్యత్తున కప్పగించి సాగినడిచిరి! ఆనాఁ డొకరి ముఖమున నైనను దుఃఖచిహ్నములులేవు. ఒకరి చూపులం దైనను విన్నఁదనము లేదు. స్త్రీలు వికసిత ముఖకమలము లతోఁ దమ ప్రియులను వీడుకొల్పుచుండిరి. ఇదియే తుది పందెము. దీనిని గెలచుటయే బ్రతుకు: దీనినోడుటయే చావు!

ఇప్పుడు 'ఓరాయి' యను గ్రామమున్నచోటనుభయ సైన్యములు డీకొనెను. పదునెనిమిది దినములవఱకుఁ బోరుఘోర ముగ జరుగుచుండెను. పృథ్వీరాయడు స్వయముగా సేనలనడపు చుండెను. ఇరువాగుల వారు ధైర్యముతోఁ బోరి యచ్చటనే మరణించిరి. మూఁడులక్షల సేనలో ముగ్గురు మాత్రము మిగి లిరి. మొదటి వాఁడు పృథ్వీరాజు; రెండవవాఁడు చాందుబాటు; మూఁడవవాఁడల్హాండు. చందేలు లోడిరి. వారి పేరు దేశచరి త్రలో మాసిపోయెను. స్థానేశ్వరమున ముందు జరుగఁబోవు యుద్ధముయొక్క ఫలితముకూడ నిచ్చటనే ప్రకటితమయ్యెను.

ఏలయన, చౌహాణులయొద్ద నుండిన శూరసైనికు లందఱుఁ నీ యుద్ధముననే మడియుటవలన, షహాబుద్దీనుతోఁ జేసిన సమరమునందు ననుభవశూన్యులగు క్రొత్తసిపాయీలు రణాంగణమునకు రాపలసివచ్చెను. పర్యవసానమెట్లుండుట సహజమో యట్లే యుండెను. అలహానిజాత తరువాత నెచ్చటనుగానరాలేదు. సిగ్గుచేత నాత్మహత్య చేసికొనెనో, యోగులలోఁ గలసెనో తెలియదు. అతఁడింకను బ్రతికియున్నాఁడని జనసామాన్యముయొక్క విశ్వాసము. అది నిజమే. అతఁడెప్పటికిని బ్రతికియేయుండును!

ఎవరిది తప్పు?

(ఒక కథ)

—మాడపాటి హనుమంతరావుగారు

౧

పండు వెన్నెల యందు మనోహరమగు పిల్ల వాయువులు వీచుచుండగా, గృహోద్యానమందలి నీటి హౌజు (కేళాకూళి) ప్రక్కన తిన్నెపై గూర్చుండిన కృష్ణారావు సుందరమ్మతో ననెను: "నీవు భయపడవలసిన పనిలేదు; నేను త్వరలోనే వచ్చెదను."

సుందరమ్మ భర్తవైపు దీనమగు చూడ్కుల బరపి పలికెను: "నన్ను మీవెంట తీసికొని పోగూడదా?"

కృష్ణ: వీలులేదు. అక్కడ నీకు శ్రమ చాలయగును. నేను ఒక నాడొకచోట రెండవనా డింకొకచోట ఉండవలసి వచ్చును. కంపన బడ్డ కాకివలె ఊరూరు తిరుగవలసి యుండును.

పర్వత ప్రాంతము. కొన్నిచోట్ల పెక్కు క్రోసులవరకు గ్రామమే కనుబడదు. అరణ్యము. క్రూర మృగముల

భయము. మంచి వస్తువులు దొరకవు. నీ విట్టి కష్టములకు అలవాటు పడిన దానవు కావు.

సుంద : మీకు మాత్రము యీ కష్టము లలవాటై యున్నవా ?

కృష్ణ : నేను మగవాడను; పనిబడిన యెడల, ఎట్టి కష్టములనైనను సహించుకొనగలను.

సుంద : నేను ఆడుదానను; పనిబడిన యెడల అగ్ని గుండములో దుముకగలను. స్త్రీలు సుకుమారలను మాట పురుషుల కల్పనము. వారిని అబలలని, సౌకుమార్యము కలవారు అని అని, వారిని చేతగానివారిగా జేసియున్నారు. మనము దుర్బలము అయిన కావచ్చును గాని మానసము దుర్బలము కాదు. వారి ధైర్య సాహసములను జీవితమందలి ఎట్టి అవాంతరములైనను లొంగదీయలేవు.

కృష్ణారావు భార్యను ప్రేమ పూరితమగు చూపున జూచి యనెను: "నీ తర్కము యధార్థమే. కాని పురుషుల యీకల్పనము చాల కాలమునుండి వచ్చుచున్నది. ఇంత ప్రాత విశ్వాసము ఒక్క నిమిషమున మాయమై పోజాలదు. నీ కష్టములను జూచి సహించుట నా వలన కాదు. చూడుము, యీ వెన్నెల యెంత మనోహరముగా నున్నది ! కొన్ని విషయములలో ఈ వెన్నెల కంటె సాయంత్రపు లేత యెండ

ఎక్కువ మనోరముగా నుండును సుమా! నీ యభిప్రాయ మేమి? ''

సుంద: నా మాటలను మరపించి పిచ్చిదానిని జేయవలె నని చూచుచున్నారు. నేను మీ వెంట వచ్చుమాట నిజము. మిమ్ము విడిచియుండుట యన్న నాకెంతో బాధాకరము. మీతో వచ్చిన శరీర కష్టము అనేదరు. శరీర కష్టముకన్న మానసిక కష్టము యెక్కువ బాధించునది గదా!

కృష్ణ: నీ శ్రమ మాట కాదనుకో. నీవు వచ్చుట వలన నేను పడవలసిన కష్టము లెన్నియో విచారింపుము. నీ కొరకు పోయిన చోట నెల్ల ఇల్లు చూచుట, బండ్లు కుదుర్చుట, ఇతర సుఖ సాధనముల సంపాదించుట-వీనియందు నా కాల మంతయు సరిపోవును; నేను బోవుచున్న పనిమూలబడును.

సుందరమ్మ నిరాశతో ననెను: ''మీ యిష్టము వచ్చినట్లు చేయుడు. నేను పట్టువల వదలెదను. మీరు పోయిన తరు వాత మీ రెట్లున్నారోయని నామనస్సూరక బాధించుచుండును. నాది విచిత్రమైన స్వభావము. మీరు యెదుట లేనప్పుడు వివిధ ములగు భ్రమలు, ఆందోళనలు వేధించుచుండును. అదేమి చిత్రమో కాని, మీ క్షేమమును కాపాడువారు యీ ప్రపంచమున నేను దప్ప మరెవ్వరులేరను భావము నా హృదయపు మారుమూల దాగియుండును. దీనికి కారణము కనుబడదు. మీరు ఆట

లాడబోయినప్పుడు మీ కేదైన దెబ్బ తగిలెనేమో యని నా మనస్సు శంకించుచుండును.

మీరు వేటాడ బోయినప్పుడు గుఱ్ఱమేమయిన కొంటె తనము చేసెనేమోయని మానసము కలవరపడుచుండును. ఇంతటి స్వచ్ఛమయిన వెన్నెలకదా ! ఇంటిలోని తోటకదా ! నేను మీ సమీపమున గాక యింటిలోపల నుండుట సంభవించె నేని మీరు మరల కనుపడు వరకు నా మనస్సు నిశ్చింతగా నుండదు. నా స్వభావ నిర్మాణమే అట్టిది."

కృష్ణారావు ఆ మాటలు విని కొంత విచారపడెను. 'సుందరమ్మ యొక్క దుర్బలమగు హృదయము వియోగ భారమును సహించగలదా ? సున్నితములగు ఈమె భావ తంత్రులను ఏదైన యంశము త్రెంచి వేయదుగదా !' అని పలుమారు వితర్కించుకొని ఇట్లనెను: ''సుందరీ ! నా వంటి కృత్రిమ స్వభావముగలవాడు నీ యథార్థమగు అగాధ ప్రేమకు తగియుండ జాలడు ? నా విషయమున ఉన్నతమగు అభిప్రాయమును నీవు హృదయమున స్థాపించుకొనినట్లు కానవచ్చుచున్నావు. నేను సాధారణమగు భావములను కలవాడను; స్వార్థపరుడను: ఆశావంచితుడను; కార్యవాదిని; స్వసుఖము నపేక్షించువాడను - ప్రేమ కన్న భోగాపేక్షకు నా మనసున నెక్కువ ప్రాముఖ్యము కల్గియుండును. మిత్రులతోడ కలయక, వేటాడుట, ఖేలనములు- ఇవి లేకుండా జీవించుటనా కెంతో కష్టము ! ప్రేమ తరంగము

నకు నా మానస సముద్రమున తావు కలదు గాని ఆ యల మహా దుర్బలమైనది. నామ మాత్రమైనది !''

సుందరమ్మ భర్తపై అనుమానమును ప్రకటించు దృష్టిని బరపెను. ఆ చూపునందు, ''మాటలెన్ని చెప్పినను మీ హృదయమును నేను ఎఱుగనా ?'' యను భావము వ్యక్తమగుచుండెను.

౨

కృష్ణారావు స్వభావము కొంత విలక్షణమైనది. స్వతంత్రాభిలాషియయ్యును నియమబద్ధుడు; ధనవంతుడయ్యు జాగరూకుడు; జమీదారుడయ్యు వినయశీలుడు; గొప్పవారి ప్రాపుకలవాడయ్యు పేదలకు మిత్రుడు. ఈతని తల్లిదండ్రులు బాల్యముననే ఈ లోకమును వదలి, చనిరి. ఇతని పోషణ భారము సేవకులపైననే బడియుండెను. ప్రేమ యొక్క ప్రభావమునకాతడు అపరిచితుడుగా నుండెను. అతడు ఏదైన వస్తువు 'నాకు కావలెను' అనగానే వచ్చుచుండెడిది. దానికొరకై ఏడ్చుటకు గాని అలుగుటకు గాని బాల్యమున అవసరమే కలిగినది కాదు. తనతో నాడుకొను బాలురు, తమ తల్లిదండ్రులచేత చీవాట్లు పడుటయు, అప్పుడప్పుడు దెబ్బలు తినుటయు ఆతడు చూచి యుండెను. కోపపడుటకును, మారాము పెట్టుటకును. అతని బాల్య చాపలము ఉత్సాహపడుచుండెను. కాని, అతని కట్టియవకాశమేది ? పిల్లలు చీవాట్లు తినియు తమ తల్లులవెంట

పరుగెత్తుచునే యుందురు. పని పాటలు సవరించుకొని ఆ తల్లులు వారినెత్తికొని ముద్దుగొనగానే కల్గిన పిల్లల ఆనందము వర్ణనాతీతము కదా! కృష్ణారావు బాల్యమున నట్లే తన్ను ప్రేమించువారిచే చీవాట్లుతిని వారివలన తరువాత మెప్పునొంది, వారి కొంగున మోము గప్పికొని, వారి చంకకెక్కి యానందింప నువ్విళులూరుచుండెను. కాని ఏడువవలసిన పని పడకపోయినను నవ్వవలసిన పనియు కలుగుచుండలేదు! అతని బాల్యము నిస్సారముగాను, మనోహర దృశ్యములులేనిదిగాను గడిచిపోయెను.

పెద్దవాడైన తరువాత నలువైపుల నుండియు సంబంధములు రాసాగెను. ధనవంతులగువారు వర్తమానము లంపజొచ్చిరి. వరదక్షిణల మొత్తము లొకదానికంటె నొకటి పెచ్చు పెరుగుచుండెను. కాని మన కృష్ణారావు ధనమునకు గాని, ఆస్తికిగాని ఆకలిగొని యుండినవాడా? అతని హృదయము ప్రేమను గోరుచుండెను. అతని పిపాస యాయమృతమునే వెదకుచుండినది. ఎన్నియో సంవత్సరము లీయన్వేషణము సాగుచునేయుండెను సౌందర్యము దొరకెను; సౌకుమార్యము దొరకెను; విద్య దొరకెను; నిర్వహణ సామర్థ్యము దొరకెను; కాని దొరకనిదేది? అది ప్రేమయే!

కనుక బంగళాలను, సుందర మందిరములను వెదకుట మాని కృష్ణారావు కుటీరముల వైపు దృష్టి సారించెను. అచ్చట నాతని కోరిక నెరవేరెను. సుందరమ్మ యొక పేద యింటి

యాడపడుచు. ఆమె తండ్రి కృష్ణారావు దివాణమున గుమస్తా. పిన్ననాట ఆమె నాతనితో నాడిన బాలిక. కొద్ది స్థితిగల యాపిల్ల దొరసానియగునని ఎవరైన తలచి యుండిరా? కృష్ణారావు సుందరమ్మను వివాహమాడ నిశ్చయించెను. కావలసిన వారందరు "కూడదు, కూడదు" అని హితము బోధించిరి. కృష్ణారావు పట్టుదల కలవాడు. సుందరమ్మను తన ఇల్లాలిగా జేసికొనియే తీరెను.

౩

కొంత కాలమునకు దేశము యొక్క మారు మూలన కఱువు ఒకటి దాపురించెను. జనులు చెట్లయాకులను, బెరళ్లను తినసాగిరి. వేళ్ల త్రవ్వి తీసి, కడుపు నింపుకొను చుండిరి. క్షుద్బాధకులాచారములను, మతధర్మములను తొలగద్రోచివైచెను. శుద్ధము, ఎంగిలి-వీనికి నడుమగల యంతర మెగిరిపోయెను. పశువులు, నిసువులు సంగతి యటుండనిండు-మనుష్యులు తమ శిశువులను తవ్వెడు గింజల కమ్ముకొన నారంభించిరి. హృదయ వేధకములగు నరమాంసాహారకథలే వినవచ్చుచుండెను. పత్రిక లందీవార్తలు చదువగానే కృష్ణారావు హృదయ ముద్విగ్నమాయెను. సేవాసమితి పక్షమున వెంటనే కొందరు ఐచ్ఛిక భటులనుగొని ప్రయాణమయ్యెను. పోవునప్పుడు సుందరమ్మ భర్త వెంట జన దలచెను; ప్రార్థించెను. కాని వీలులేకపోయెను. తుదకు 'త్వరగా వత్తు' ననిపించుకొని 'దిన మొక యుత్తరము వ్రాతు' నని

భర్త చేత వాగ్దానము పొందెను. వారముదినముల వరకు కృష్ణా రావు వాగ్దానము పాలించెను కాని, కార్య బాహుళ్యము ప్రతి దినము హెచ్చుచుండినందున ఆలస్యము కాజొచ్చెను. కొన్ని గ్రామములు టప్పాఖానా (పోస్టాఫీసు) కు దూరమున నుండెను కనుక ప్రతి దినము ఉత్తరమందు వేర్పాటు చేయుట యసాధ్య మయ్యెను.

సుందరమ్మ ఉదయము నుండి సాయంత్రము వరకు ఉత్తరమునకై ఎదురుచూచుచుండెడిది. ఆ దినములలో ఆమె యాత్మ శాంతికిదియే ముఖ్యమగు సాధనముకదా! ఉత్తరము ఆలస్యముగా వచ్చుట మొదలైనతోడనే ఆమె మనస్సు కలత నొంద నారంభించెను. 'నేను వారి మాటల వలన నెంత మోస పోయితిని? తప్పక వెంట పోవలసియే యుంటిని' అని పరి పరి విధముల యాలోచించుచుండెను. ఎటు దోచక ఒక్కొకసారి మేడపైకెక్కును. మరల క్రిందకి దిగును. ఒకవేళ తోటలోనికి పోయి యచ్చట గూలబడును. కనుపడు ప్రతి వస్తువు ఆమెకు వ్యాకులమయముగా నుండెను. పెంపుడు చిలుక పలుకులయందలి మాధుర్యము ఎచ్చటికో పోయెను. వీణా తంత్రులలోని చిత్తా కర్షక స్వభావము నశించెను. తోటలోని లేడిపిల్ల యొక్క చెంగుచెంగులు జుగుప్సాకరములయ్యెను. పిల్లులు, కుక్కలు మున్నగు జంతువులు కరువవచ్చుచున్నట్లు తోపసాగెను. అల మారులలో మంచి మంచి పుస్తకము లుండెను - కాని సుంద రమ్మ కవి ఏ మాత్రము నానందమును గొలుపలేదు. ఉత్తరము

వచ్చువరకు ఆమె హృదయము విచార భరితమై యుండెడిది. ఉత్తరము రాగానే వాడిన చేనుల మీద వర్షము పడినట్లగు చుండెను; కన్నుల కద్దుకొనును; మరల మరల చదివి ఆనందించును.

అయినను ఆ యానందము ఆనాటి వరకే; మరుచటి దినము మరలనదే విచారము కృష్ణారావు ఛాయా పటమును గంటలకొలది చూచుచుండెను. మొదటి దినములో ఇదియే ఆమె ముఖ్య దిన చర్య. క్రమ క్రమముగా వియోగమునకు కొంత యలవాటు పడసాగెను. మొదటి దినములలో భర్త కూరుచుండు కుర్చీ, ఉత్తరిగానే జూడగానే మనస్సు తత్తరపడు చుండెను. ఇప్పుడు ఆమె నిరాశావశయై యట్టి మానసికావస్థను మరలించుకొన జొచ్చెను. ఆయన పుస్తకములను విడివిడిగా యటు నిటు పడియున్నవానిని ఒకచో కూర్చి వరసగా చేర్చి పెట్టుట; ఆయన పటముపైన పడిన దుమ్మును దులిపి, పరిశుభ్రముచేసి యుంచుట. ఆయన యాయుధములను యధాక్రమమున సవరించుట మున్నగు పనులామెకు తాత్కాలిక మనశ్శాంతి కలిగించుచుండెడివి.

నెల దినములు గడచెను. ఒకనాటి రాత్రి సుందరమ్మకు స్వప్నము వచ్చెను. కృష్ణారావు ఉత్త తలతో, ఉత్త కళ్ళతో, నిలబడి ఏడ్చుచుండినట్లు ఆమె కాంచెను. కెవ్వున కేకవేసి నిద్ర లేచి కూరుచుండెను. వెంటనే బంగాళా పైకి బోయి చూచెను.

ఎల్లెడలను వ్యాపించి యున్న నిశ్శబ్దత చూచిన పిమ్మట ఆమెకు బాగుగా తెలివి వచ్చెను. భర్తకు తక్షణమే అర్జెంటు తంతివార్త పంపెను. ప్రత్యుత్తరము రాలేదు. దిన మంతయు గడచెను; జవాబు లేదు. సుందరమ్మ అన్నము, నీరు ముట్టక, వ్యాకులమగు మనస్సుతో కూర్చుండి యుండెను. కనుపడిన వానినెల్ల 'జవాబు వచ్చినదా?' యని యడుగుచుండెను. ఆకు కదలినను 'జవాబు వచ్చినదా?' యను పదములే యామె పెదవుల నుండి బయట బడుచుండెను!

సుందరమ్మ మనస్సును ఎన్నియో యనుమానములు బాధింప సాగెను. పనికత్తెలను ఈ స్వప్న ఫలమేమని యడుగును. 'అమ్మా! దొరగారు సుఖముగానే యున్నారు. కలలో 'ఏడ్చుట' యనగా నిజమున 'నవ్వుట'; కలలో ఉత్తతలతో గానవచ్చుట యనగా యధార్థమున 'గుఱ్ఱము నెక్కుట.' 'భయ పడవలదు' అని సమాధానము చెప్పుచుండిరి. కాని సుందరమ్మ మనస్సు నీమాటలు శాంతపరుపలేదు. 'తంతికి జవాబు రాక పోవుటకు కారణమేమొ' యని యామె కళవళపడుచుండెను. ఇంతలో నాల్గు దినములు గడచిపోయెను.

౪

చుట్టు పట్టు గ్రామములలో మూడు ఆమడల వరకు గోపాలశాస్త్రిగారి నెరుగనివారు అరుదు. వీరి తండ్రి తాతలు

విశేషముగా చదువుకొనిన వారు అగుటవలన పుట్టిన తరువాత నామకరణము నాటి నుండియే వీరు శాస్త్రిగారని పిలవబడు చుండిరి. వీరి వృత్తి వంశ క్రమముగా పౌరోహిత్యమేయైనను, జ్యోతిషమునందేమి, సాముద్రికము నందేమి, వైద్యము నందేమి, స్వప్న ఫలనిర్ణయమునందేమి వీరి నైపుణ్యమును అందరును మెచ్చుకొనుచుండిరి. ప్రశ్న చెప్పుటయందు వీరి కౌశల్యము ఆబాల గోపాలము ఎరిగుదురు. ఏదైన పల్లెటూరికి శాస్త్రిగారు వచ్చినచో ఆ వార్త నిమిషమాత్రము నలుదెసల నల్లు కొనుచుండెను. అనుభవశాలినులగు అత్తలు, విఫల మనోరధలైన తమ కోడండ్రను శాస్త్రిగారికి జూపి, తృణమో పణమో సమర్పించి, వారి యదృష్టమును తెలిసికొనుచుండిరి. దూరదృష్టి గల తల్లులు యౌవనవతులగు తమ కూతుళ్ల చేతులను శాస్త్రి గారిచే పరీక్షింపించి వారిని ధన్యాత్ములుగ జేయుచుండిరి. శాస్త్రి గారును సుఖ దుఃఖములను, వచ్చిన వారందరకును తృప్తి కరముగా బంచిపెట్టుచుండిరి. ప్రశ్నలకు వారు చెప్పు ఉత్తర ములలో స్పష్టత తక్కువగను, గూఢత ఎక్కువగ నుండినను, వినువారు మాత్రము వారి వచనములను తమకు సమాధానమగు విధమున నన్వయించుకొని, శాస్త్రిగారి వాక్యములలోని అర్థ గాంభీర్యమునకు వారినెంతయు కొనియాడుచుండిరి. కాని భక్తి విశ్వాసశూన్యులగు ఈకాలపువారు శాస్త్రిగారుఅదృష్టమునుగూర్చి చెప్పు ఫలములు అదృష్టముకంటె ఎక్కువ గూఢముగను సంది గ్ధముగను నుండు ననుచుండుటవలన శాస్త్రిగారి కప్పుడప్పుడు

కొంచెము కోపము వచ్చుచుండుట కలదు. అయినను ప్రపంచ జ్ఞానము కలవారు కనుక త్వరలోనే శాంతత వహించుచుందురు. నవీన విద్యా ప్రభావము జ్యోతిశ్శాస్త్ర గౌరవమును తగ్గించి యుండవచ్చునేమోగాని జ్యోతిష్కుని గౌరవము మాత్రము తగ్గించలేదు. ఫలము నమ్మినను, నమ్మకపోయినను అడుగు విషయమున వెనుదీయు వారెవరును కానబడరు. కనుక నవీనుల మూలమున శాస్త్రిగారి ఆదాయమునకు నష్టము వాటిల్లియుండ లేదు.

సుందరమ్మ భర్తకు తంతి సమాచార మంపి నేటికి ఐదు దినములు గడిచినవి. ఆ నాడు గ్రామమునకు శాస్త్రిగారు వచ్చిరి. ఈ సంగతి తెలియగానే సేవకులు వారిని దొరసానిగారి ఇంటికి పిలుచుకొనిపోయిరి. చుట్టుపట్టుల అమ్మలక్కలు కృష్ణారావు గారి చావిడిలో గుమిగూడిరి. జ్యోతిష్కుడు కాలగర్భమున దాగియున్న భవిష్యత్తు లన్నిటిని ఈవలకు లాగివేయ సాగెను. సుందరమ్మకు కొంత సమాధానము కలుగుదారి యేర్పడెను. శాస్త్రిగారిని లోనికి రప్పించి స్వప్నఫలమును విచారించెను.

శాస్త్రిగారు ఇటునటు పరికించి చూచిరి. పంచాంగము కట్టవిప్పి కాగితముల తిరుగవేసిరి. వ్రేళ్ళ గణుపులు లెక్కించిరి. కాని, ఎట్టి ప్రత్యుత్తర మవసరమో నిశ్చయింపలేక యడిగిరి: "దొరసాని గారికా ఇట్టి స్వప్నము వచ్చినది?"

సుంద: కల నాకు రాలేదు. నా స్నేహితురాలికి వచ్చినది. ఇది దుస్స్వప్నమని నా వాదము; కాదు మంచి కల యని ఆమె వాదించుచున్నది. తమ రేమి నిర్ణయింతురు?

శాస్త్రిగారు మరల ప్రక్కల చూడసాగిరి. కృష్ణారావు గ్రామాంతరమునకు—దూర దేశమునకు పోయిన సంగతి పాపము వారికెరుకలేదు. గ్రామమునకు వచ్చిన తరువాత ఈ సంగతులు విచారించి తెలిసికొనునంత యవకాశము వారికి లభింపలేదు. అట్టి యవకాశమే దొరికినచో ఆ విశేషమును, దొరసాని గారి ముఖ లక్షణమును. సమ్మేళనముచేసి సంపూర్ణమగు భవిష్యత్తునుగాని ప్రశ్నఫలమునుగాను సిద్ధపరచి యుందురు. సుందరమ్మ నొక ప్రశ్న యడిగి కొంత యవగాహన సంపాదింప శాస్త్రిగారు యత్నించిరి గాని నిష్ఫలమయ్యెను. ఎట్లైనను అమ్మగారికి అనుకూలమగు విధమున ప్రశ్న ఫలమును నిర్ణయించుట క్షేమకరమని భావించి పల్కెను: "దొరసానిగారి అభిప్రాయమే సరియైనది. స్వప్నము మంచిదికాదు."

సుందరమ్మ భయ విహ్వలయై వడ వడ వడక సాగెను.

శాస్త్రిగారు చెప్పుచుండిరి: "ఆమె భర్తకు గొప్ప ఆపద మూడనున్నది. గృహభాండ శుద్ధియగును. దేశాంతర గతుండగును మహా దుఃఖ దాయకమగు సంకటమేదో వచ్చి పడగలదు."

సుందరమ్మ కెవ్వున కేకవేసెను. 'ఆపద్బాంధవా! హతోస్మి! హతోస్మి! మాంరక్ష! మాంరక్ష!' యని యరచి మూర్ఛిల్లెను.

తాను మోసపోయిన సంగతి శాస్త్రిగారు ఇప్పుడు గ్రహించిరి. ఇప్పుడాతడు సుందరమ్మను ఓదార్చసాగెను: 'అమ్మా ఇట్లంటినని భయపడవల్దు. దీని పరిహారము నాకు తెలియును. నాకు కొంచెము నూనె, దారము, ఒక క్రొత్తకుండ తెప్పించి యివ్వండి. ఒక కొబ్బరికాయ, పది నిమ్మకాయలు దొరికితే చాలును. తక్షణమే నివారణము చేయుదును. దొరగారు సుఖముగా నున్న సమాచారము వచ్చిన తరువాత తమ చిత్తమునకు నచ్చిన బహుమానము దయచేయవచ్చును. కార్యము కఠినమగు సంగతి మాత్రము నిజము, అయినను ఈశ్వరానుగ్రహమువలననే నీ దుస్స్వప్న దోషమును పొగొట్టగలను. నాకు గొప్ప గొప్ప మహారాజులెన్నియో బహుమానములిచ్చి సత్కరించినారు. మొన్నమొన్న తహసీలుదారుగారి బిడ్డ వ్యాధిగ్రస్తురాలై నది. డాక్టరులు మంచి మంచివారు-చేతులు వెలికల వేసిరి. నేనొక యంత్రము ఇచ్చితిని. తీసివేసినట్లు వ్యాధి మాయమైపోయి తెలివివచ్చెను. ఇది నిన్నటి మాటయే! మొన్న సముద్రాల శేఖరయ్యగారి యింట నొక రూపాయలసంచి మాయమైనది. నేను ప్రశ్న చూచి చెప్పితిని. నిముసములో దొంగ పట్టుబడెను. అతడెవ్వడోకాడు-వారి గుమస్తాయే. సంచి వాని యింటిలోనుంచి చెక్కుచెదరక బయటబడెను...''

శాస్త్రిగారు స్వీయచరిత్ర వినుపించు చుండిరి కాని సుందరమ్మకు స్మృతియేలేదు.విషము శరీరమంతయు ఎగబ్రాకెను! మంత్ర మిప్పుడేమి పనిచేయగలదు?

కొంత సేపటికి తెలివి వచ్చినది. పనికత్తెను పిలచి యిట్లాజ్ఞాపించెను: " ప్రయాణసన్నాహము చేయుము. సాయంత్రపు రైలుబండింలో వెళ్ళెదను. మనుష్యుల సిద్ధముగ నుంచుము. దొరగారియొద్దకు పోవలయును.—శాస్త్రిగారికిగుమాస్తాతో చెప్పి ఏమైన ఇప్పించుము."

౨౪

కృష్ణారావు వ్రాసిన తుది ఉత్తరమునందు ఆయన సీతపురమున సున్నట్లుండెను. కనుక టికటు తీసుకొని సుందరమ్మ రైలులో నెక్కెను. పరిచారకులు వేరుబండిలో గూరుచుండిరి. కొన్ని దినములనుండి యామెకు నిదురయే లేదు. రైలు కదలిన కొంత సేపటికి ఆమె కన్నులు కునుకసాగెను. నిద్దుర పట్టగానే మనసులోని కలవరము విచిత్రములగు దృశ్యములను ప్రదర్శింప దొడగెను.

విశాలమగు సముద్రము. దానిలో నొక పగిలిన పడవ అటునిటు కొట్టుకొనుచున్నది. దానిమీద మాలిమికాడు లేడు. తెరచాపలేదు. తెడ్లులేవు. తరంగముల తాకుడున కొకొక్కొక్కసారి యది పైకి లేచుచుండును. మరియొక్కొక్కవేళ క్రిందికి బోవు

చుండును అకస్మాత్తుగా దానిపై నొక మానవుడగపడెను. అతడు కృష్ణారావే. ఉత్త తల; ఉత్త కాళ్ళు; కన్నుల నశ్రువులు గారు చున్నవి. సుందరమ్మ ఈ దృశ్యమును జూచి కంపించు చుండెను. పడవ మునిగె; మునిగె నను స్థితియందుండెను. ఆమె బిగ్గరగా కేకవేసెను. కన్నులు తెరిపిడి పడెను. శరీరమంతయు చెమ్మటచే దడిసియుండెను. గుండె తటతట కొట్టుకొనసాగెను. లేచి, ముఖము కడిగికొని, ఇక నిద్రపోకూడదని ధైర్యముతో గూర్చుండెను. "అక్కటా! ఎంతటి భయంకరమగు కల! దేవా! నిన్నే నమ్మియున్నాను! వారికెట్టి యాపదయు రానీయకుము!!!" అనుకొనెను.

తల బయటికి వెళ్ళబెట్టి చూచెను. ఆకాశమున నక్షత్రములు ప్రకాశించుచుండెను. గడియారమున ౧౨ గంటలు కొట్టెను. పుస్తకమొకటి పెట్టెలోనుండి తీసి, భావములను కేంద్రీకరింపయత్నించెను. కొంతసేపైన తరువాత కన్నులు మూతలు పడసాగెను. మరల తెలివి తెచ్చుకొని బిగ్గరగా చదవ మొదలు పెట్టెను. ఎన్నియో దినముల నుండి నిద్రనెరుగని కనులు, ఆమె యుద్దేశ్యమునకు లొంగ నిష్టపడలేదు. అంత దిండుకు తలను ఆనించి చదవ నారంభించెను. కునికిపాట్లు మొదలయ్యెను. మరి యొక దృశ్యము ఎదుటకు వచ్చెను.

పెద్ద పర్వతము. దాని శిఖరము ఆకాశము నంటి నట్లుండెను. పైనున్న వృక్షములు చిన్న మొక్కలవలె గాన్పించు

చుండెను. నల్లని మేఘములు కమ్ముకొని చెవులు చిల్లులు పడు నట్లు గర్జించుచుండెను. భయంకరమగు నా పర్వత శిఖరమున మానవుడొకడు నెత్తికి బట్టలేక కూర్చుండి యుండెను. అంత ఎత్తున నున్నను అతని కన్నుల నుండి కారుచున్న నీటిచుక్కలు స్పష్టముగా కానవచ్చు చుండినవి. సుందరమ్మ హృదయము వ్రక్కలయ్యెను. ఆ విగ్రహము కృష్ణారావుదే! అతడా కొండపై నుండి క్రిందికి దిగ యత్నించుచుండెను. కాని దారి దొరకదు. ఆయన ముఖము భయముచే పచ్చబారి యుండెను. తటాలను మేఘ మధ్యము నుండి పిడుగు దిగజారెను. దాని నుండి వెడలిన మహాజ్వాల కృష్ణారావు విగ్రహమును కనుపడకుండ జేసెను.

సుందరమ్మ మరల కేక వేసెను. తెలివి వచ్చినది. రొమ్ము పగులుచుండినట్లు తోచెను. కన్నుల నుండి వెడలు నీరు ప్రవాహముగా మారెను. లేచి నిలచి, రెండు చేతులు మోడ్చి, ఆకాశమువంక చూచి ప్రార్థింప జొచ్చెను. "ప్రభువా! నాకిట్టి దుస్స్వప్నములు పరంపరగా వచ్చుచున్నవి. వారిగతి ఏమైనదో తోచుటలేదు. నీవు దీనుల పాలిటి కల్పవృక్షమవు. నాపై దయ జూపుము. నా కైశ్వర్యము వలదు! మందిరముతో పనిలేదు. కుటీరమునందు మహా సంతోషముతో నుందును. భర్తగారి క్షేమము మాత్రము అనుగ్రహింపుము. ఇదియే నాకు గావలసిన వరము!"

సుందరమ్మ స్వస్థలమున గూర్చుండెను. తెల తెలవార జొచ్చినది. రాత్రి గడిచినది; కనుక ఇక నిద్దుర రాదుకదాయని యామె ధైర్యము తెచ్చుకొనెను. మార్గమున కిరుప్రక్కల మనోహరములగు వృక్షలతాదులును, పచ్చిక బయళ్ళును నేత్ర పర్వము చేయుచుండెను. చూచుచుండగానే ఎప్పుడు కన్నుల మలి గెనో కాని నిద్ర పట్టనేపట్టెను! కల రానే వచ్చెను.

కృష్ణారావు గుర్రముపై నెక్కి యొక వంతెన మీదుగా బోవుచున్నాడు! వంతెన చాల ఇరుకైనది!! గుర్రము తంటాలు పెట్టుచున్నది!!!

"గుర్రమును దిగండి! గుర్రమును దిగండి!" యని అరచుచు సుందరమ్మ అతనివైపు దుమికెను. కన్నులుతెరచి చూచు వరకు రైలుబండి ఏదో స్టేషను ప్లాటు ఫారము వద్ద నుండి సరసర సాగిపోవుచున్నది. కృష్ణారావు ఉత్త తలతో, ఉత్త కాళ్ళతో ప్లాటు ఫారముపైన నిలచి యుండెను. సుందరమ్మ దృష్టి యందింకను స్వప్నములోని దృశ్యమే స్థగితమై యుండి నది. భర్తను చూడగానే, అతడు గుర్రము నుండి క్రిందపడి నది లోనికి బోవుచున్నాడని భ్రమించెను. తత్క్షణమే యాతని పట్టుకొనుటకై యామె చేతులు సాచెను. భర్త శరీరము అందక పోయినందున అసంపూర్ణ జాగ్రదవస్థలోనే యామె రైలుబండి తలుపు తెరచెను! ఆకాశమునుండి ఎవరో నేలపైకి పడద్రోచి నట్లయ్యెను. గట్టి దెబ్బ యొకటి తగిలినట్లు స్ఫురించెను!! అంతే - స్మృతి తప్పిపోయినది!!

సీతాపురము స్టేషను ఇదియే. సుందరమ్మ పంపిన తంతి వార్త అంది భర్త స్టేషనుకు వచ్చి యుండెను. అది మేలుబండి యగుటచేత అచ్చట ఆగదు. భార్య చేతులు ముందుకు సాచు చుండుట చూచి యతడు "హా! హా!" యని వారించుచు విద్యుత్తువంటి వేగముతో ముందునకు దుమికెను. కాని అంత లోపలనే, లలాట లిఖితము పూర్తి అయ్యెను. సుందరమ్మ వియోగ దుఃఖమునకు తావులేని లోకమును చేరనే చేరెను!

కృష్ణారావు మూడవ దినమున స్వగ్రామము వచ్చెను. దుఃఖ భారమును సహింపలేక, ఆస్తి అంతయు సేవా సమితికి దానము చేసి, ఉత్త తలతో, ఉత్త కాళ్ళతో దేశదేశములు సంచరించుచున్నాడు. శాస్త్రిగారి వాక్యము ఫలించినది!!

ఎవరికి ?

(౧)

"మీ యోగ్యతకు తగిన ఉద్యోగము మా వద్ద ప్రస్తుతము ఖాళీలేదు. మిమ్మును మా దగ్గర ఉంచుకోవలెనని ఉన్నది, కానీ ఏమి లాభము?'' అని జమీన్‌దార్ ప్రతాపవర్మగారు తమ రాజ ఠీవిని ప్రకటించుచు మోహనరావుతో బలికిరి.

మోహనరావు కాలేజి వదిలిన తరువాత ఏదైన తగిన జీవనోపాధి సంపాదించుకొనుటకై యాలోచించవలసిన వాడయ్యెను. నీతివర్తనమునకు అడ్డమురాని ఏదేని వృత్తి నవలంబించవలయుననియు, భుక్తి, ముక్తి రెండును కలిసివచ్చునట్లు తన కుటుంబపోషణ చేసుకొనుచు తోడిమానవుల యోగక్షేమములనుగొను నవకాశమును సంపాదించవలయు ననియు అతని మనోరథము. ఏదైన ప్రభుత్వ కార్యాలయములో లేఖకునిగా ప్రవేశింతునా, జనసామాన్యముతో సంబంధముండదు కనుక అది వలదనుకొనెను. ''న్యాయవాది వృత్తికై యత్నింతునా? దానియందు రెండు కోరికలును నెరవేరును. కాని భగీరథ ప్రయత్నము చేసినను-నా నడవడిని నిష్కళంకముగ నుంచుకొనుట అసాధ్యము కనుక అది పనికిరా దనుకొనెను. ''పోలీసు ఉద్యోగమున బీదసాదలయెడ దయచూపవీలు కలదు. కాని అచ్చటి వాతా

వరణము సద్వర్తనమునకును, న్యాయస్వభావమునకును వీలు కలిగించదు. కనుక అది అసలే తలంపకూడనిది''అని నిశ్చయించెను. ఈ విధముగా ఎన్నియో తెన్నుల విచారించి ఆలోచించి, చివరకు జమీందారుని వద్ద యుద్యోగము సర్వవిధముల మంచిదనుకొనెను. ''ఏ జమీందారు కడనైనను ముఖ్యోద్యోగిగ ప్రవేశించితి నేని, ...జీతము తక్కువ దొరికిన మానె పేద సావలగు రైతులతో రాత్రిందినములు కలిసిమెలసియుండగలను. వారిక్షేమమునకై ఉపకరించగలను. డంబములేని సాధుజీవనమును గడుపగలను. ఇదియే మంచి మార్గము '' అని నిశ్చయించుకొని, విఖ్యాతుడగు జమీందారు ప్రతాపవర్మగారి దర్శనముచేసి. ''నన్ను దేవరవారి సేవకాబృందమున చేర్చుకొనప్రార్థించుచున్నా'' నని సవినయముగా మనవి చేసుకొనగా జమీందారుగారు, ప్రత్యుత్తరము పైన ఉల్లేఖింపబడిన విధమున అనుగ్రహించిరి.

"నాకొరకు ప్రత్యేకమగు ఉద్యోగము అవసరము లేదు." మోహనరావు సవినయముగ పలికెను. ''నేను పని ఎట్టిదైనను సంసిద్ధుడనై యున్నాను. జీతము యిష్టానుసారము దయచేయవచ్చును. జమీందారు వద్దతప్ప వేరేయుద్యోగము చేయవలదని నేను నిశ్చయించుకొన్నాను.''

''జమీందారు వద్ద నౌకరీకాదు; దొరతనమనుకొనండి'' ప్రతాప వర్మగారు సగర్వముగా నాజ్ఞాపించిరి. "చూడండి నేను చప్రాసికి (బంట్రోతుకు) నెలకు నాలుగురూపాయలు యిస్తాను.

వాడు పట్టుకోట్లు తొడుగుకొనుచున్నాడు.వాని వాకిట్లో గుర్రములున్నవి! నా గుమస్తాలకు జీతము ఎనిమిది రూపాయలుకదా, వారు వకీళ్లతో సంబంధము చేయుచున్నారు!! వారి సంపాదనలో ఎట్టి మహాత్మ్యము ఉన్నదో తోచదు. ఏండ్లుగడచినను జీతము లెక్కచూచుకొనరు! ఎందరో ఇప్పుడు జీతము లేకుండ చప్రాసి పని, గుమాస్తా పని యిప్పించవల్లసినదని ప్రార్థించుచున్నారు!కాని మా సంప్రదాయము అట్టిది కాదు. మా ముఖ్త్యారు అనగా ఏమనుకున్నారు? అది రెండవ జమీందారీ పదవియే! అదే ఠీవి, అదే వైభవము, అదే గాంభీర్యము! ఈ ఉద్యోగపు రుచి తగిలినవాడు తహశీలుదారు నౌకరీని తృణీకరించుతాడు!!''

''చిత్తము''అని శిరఃకంపము చేయవలసియుండెను.కాని మోహనరావు అట్లు చేయలేదు. ప్రపంచ ధర్మములు యింకను ఎరుగని వాడు కనుక అనెను: ''నేనిదివరకు ఏ జమీందారీలోను నవుకిరీ చేయలేను. ఇటీవలనే కాలేజి విడిచినాను. తమరు సెలవిచ్చిన కారణములనుబట్టి నేను ఉద్యోగము కోరుటలేదు. కాని ఒక సంగతి. ఇంత కొద్ది జీతము చాలదు. తమ నౌకరులు పేదరైతులను పీడించి సంపాదించుచుండవచ్చును. కాని నావల్ల అటువంటి పని కాజాలదు. ప్రమాణ బుద్ధిగల నౌకరులకు ప్రోత్సాహము దొరుకుట సాధ్యమే అయిన పక్షమున, నేను త్వరలో తమ అనుగ్రహమునకు పాత్రుడనగుదునని నమ్ముచున్నాను.''

ప్రతా:- ''నిజమే కాని, ఎక్కువ జీతము యియ్యవీలు పడదు!''

మోహ:- "అట్లయిన పక్షమున నన్ను క్షమింపగోరు చున్నాను. ప్రమాణ బుద్ధిగల ఉద్యోగి ఇంత చౌకగా దొరక దేమో!"

జమీందారుగారు ఆలోచింపసాగిరి. కోర్టులలో ఎల్లప్పుడు కాగితములు దాఖలు చేయవలసియుండును. ఇంగ్లీషులో తర్జుమా చేయించుటకు బోలెడు ఖర్చుపెట్టుట తప్పదాయెను. ఇతడు అమాయకుడుగా నున్నాడు. ఇంగ్లీష్ వచ్చిన వాడు కూడను. కొంచెము ఎక్కువ జీతము యిచ్చినా బాధలేదు. అయినను ప్రస్తుతము జవాబు ఏదైనా చెప్పవలెను. కనుక జమీందారు గారు యిట్లనిరి:

"పంతులు గారూ! ప్రమాణ బుద్ధికలవాడు ఎంత తక్కువ జీతము యిచ్చినను తన మార్గమును వదలడు. అదే విధముగా దుర్వర్తనము కలవాడు ఎక్కువ జీతము తీసు కున్నంత మాత్రాన ప్రమాణబుద్ధి కలవాడు కాజాలడు. నీతికి ద్రవ్యమునకు ఎట్టి సంబంధము లేదు. నేను నా మట్టుకు ఎందరో నీతిగల చప్రాసీలను చూచినాను. లంచగొండులగు హైకోర్టు జడ్జీలను చూచినాను! సరే పోనియ్యండి, మిమ్మలను నా ఊళ్లలో కొన్నిటికి ముఖ్యారుగా ఏర్పరచగలను. మీ పని చూచిన తరు వాత జీతము వృద్ధి కూడా కాగలదు."

మోహనరావు యిరువది రూపాయల జీతం ఒప్పుకొనెను. తిమ్మాజిపేట పట్టీకి అతడు జమీన్‌దారు తరఫున ముఖ్యారుగా నియోగించబడెను.

(౨)

మోహన్‌రావుకు ఈ ఉద్యోగము, జమీందారు గారు నెల విచ్చినట్లు "దొరతనము" వలెనె యుండెను. అందమైన బంగాళా, కుర్చీలు, బల్లలు, మంచములు మొదలైన పరికరములు సమృద్ధి. ఎందరో చప్రాసీలు, ప్రయాణమునకు మంచి గుఱ్ఱపు బండి, వేయేల ‛సుఖమునకు కావలసిన సామాగ్రి యంతయు నుండెను. కాని ఈ ఆడంబరములు మోహనరావును సంతోషపరచలేదు. తన చుట్టు ప్రక్కల లెక్కలేని బీదసాదల గుడిసెలుండగా అతనికి బంగాళా నివాసము సుఖప్రదముగా తోచలేదు. గుడిసెలోని మనుష్యులు మట్టి ముంతలు వాడుకొనుట చూడ అతనికి బంగాళాలోని మంచి పాత్రలు యింపుగా కానరాలేదు. నలుదెసల నివసించుచున్న కుటుంబములకు కుక్కి మంచములైనను గతిలేకయుండ, బంగళాలోని పట్టెమంచములు అతనికి ఆసక్తి గొలుపలేదు. రైతులు ప్రతి స్వల్ప విషయమునను భయభ్రాంతులై వడవడ వడకుచుండ, గంభీరధ్వనులు చేయు పరిజనులయొక్క సేవ అతనికి సంతోషప్రదముగ నుండలేదు. చుట్టును కనుమేర దూరము వ్యాపించియున్న దారిద్ర్యమునకు నడుమగల ఐశ్వర్యధామము అతని మనస్సునకు బాధాకరముగ కన్పట్టసాగెను!

మోహనరావు ఉద్యోగమున ప్రవేశించి బంగళాలో దిగిన నాడే, రైతులందరు కానుకలు తీసుకొని వచ్చిరి. కాని అతడు

ఒక కానైనను ముట్టడయ్యె. ఇది వారికి ఆశ్చర్యము కలిగించెను. వారు సంతోషించిరి. కాని చప్రాసీలకు మాత్రము ఈ వర్తనము వెగటుగా దోచెను! ఊరి మంగలివాడు కాళ్లు పిసుకుటకై వచ్చెను. అక్కరలేదని పంపివేయబడెను. గొల్లవాండ్ర యింటినుంచి బుడ్డెడు మంచి పాలు వచ్చెను. అవసరము లేదని త్రిప్పివేయబడెను. తోటవాడు తమలపాకులు కట్ట తెచ్చి సమర్పింపజూచెను. "నాకు అలవాటు లే"దని పంపివేయబడెను!

రైతులు తమలో తాము 'ఈయన ధర్మరాజువలె ఉన్నాడు సుమా' యని గుసగుసలాడుకొనిరి. ఎవరేమైన అనుకొనెదరుగాక! ఎవరైన సంతోషించిన సంతోషించెదరుకాక! చప్రాసీలు ఇట్టి వర్తనమును సహింపగలరా? వారు ధైర్యముతో మోహనరావుకు విన్నవించిరి. "మీరు ఈ కానుకలను తీసుకొనకపోయిన మానె. కాని ఆచారము పోగొట్టుట బాగుండదు. ముందు క్రొత్త ఉద్యోగి వచ్చినప్పుడు ఈ ఆచారమును పునస్థాపితము చేయవలసి వచ్చును. అది చాలా కష్టమైనపని!"

మోహనరావు దీనికొకటే జవాబు చెప్పెను. "ఎవడి తిప్పలు వాడు పడగలడు. నే నిప్పటినుంచే ముందు వచ్చేవారి విషయమున కష్టపడవలసిన పని ఏమి?"

ఒక చప్రాసి ధైర్యముచేసి యనెను. "అయ్యా! ఈ రైతులు తమరు అనుకొనుచున్నంత బీదవారు కారు. వీరిట్టి

వేషములు వేయుచున్నారు. అంతే! ఉత్త నటన!! చూచుటకు వీరొక్కరు కొమ్ములులేని ఆవులుగా నున్నారు. కాని ఒక్కొక్కడు ఒక్కొక్క హైకోర్ట్ వకీలు అనుకొనండి!."

అయినను చప్రాసీల ఈ వాదము మోహనరావు హృదయమును మార్చలేకపోయెను. అతడు ప్రతి రైతుతోను నెమ్మదిగ మాట్లాడసాగెను. వారి విషయమున్న మహా దయతో ప్రవర్తించు చుండెను. ఉదయము ఏడు గంటల నుండి తొమ్మిది గంటల వరకు ఉచితముగా ఔషధము లిచ్చుచుండెను. తరువాత తన లెక్కడొక్కలను వ్రాసుకొనుచుండువాడు.

ఈ విధముగా నతని వర్తనము రైతుల మనస్సుల వశము చేసుకొనెను. పూర్వము ప్రతి సంవత్సరము పన్నులు వసూలు కాక ఆస్తుల జప్తు చేసుకొనవలసి వచ్చెడిది. ఈ సంవత్సరము ద్రవ్యము అవలీలగా వసూలు ఆయెను. బీద సాదలందరు వేళయనక పాళయనక తమ కష్టనిష్ఠూరముల చెప్పుకొనుచుండిరి.

(౩)

మన ప్రతాపవర్మగారు రైతుల మీద అభిమానము కల వాడే. వారికి విత్తనములకు గింజలు యిచ్చును. కూళ్లకు, ఎద్దులకు డబ్బు యిప్పించుచుండును. పంటకళ్లముల మీద ఒకటికి ఒకటిన్నర లెక్క చొప్పున తిరిగి పుచ్చుకొనును! అంతే.

ఈ పద్ధతిపైననే తిమ్మాజీపేట పట్టీ రైతులు జమీందారు గారికి అప్పుపడి యుండిరి. ఇంకను కొంత ధాన్యము కళ్లము లలో నుండెను, కొంత రైతుల యిండ్లు చేరెను. దొరవారు రైతులను పిలిపించి డబ్బుకు తొందర పెట్టిరి.

"దొరగారూ! రకం అంతా యిప్పుడు పెకలదు. కొంత యిప్పుడు తీసుకోండి; కొంత తరువాత ముట్ట చెప్పుకుంటాము. మా ప్రాణాలు దొరవారి చేతులలోనే యున్నవి కదా!'' అని రైతులు చెప్పుకొనిరి.

ప్రతా:- "అట్లా పనికి రాదు. దమ్మిడీకి దమ్మిడి బేబాకు చేసి అవతలపొండి. అంతవరకు అడుగు అవల పెట్టనియ్యను. మీ చేష్టలు ఎప్పుడూ ఇట్లాగే వుంటవి!''

ముసలి పాపిరెడ్డి అనెను:- ''అయ్యా, కానిండి ఏమి చేస్తాము, మాకేంగావాలి! దొరగారిది గంజి; మావి కడుపులు. ఇంతపిండం వెయ్యండి. తింటూ పడి వుంటాము. అసలు అంతా దొరగారిదేకదా, అయ్యా, మేమింత చాకిరి చేసి పొట్ట గంజితో నింపుకొనేవాండ్లము !''.

శ్రీశ్రీ ప్రతాపవర్మగారికి ఆ ముసలివాని పొగరుబోతు తనము చూచి ఆగ్రహము వచ్చెను. ఆయన రాజుగారు కదా, అడ్డము ఎవరు? పండ్లు పటపటకొరికి కండ్లెఱ్ఱచేసి పల్కెను. ''చూస్తారేమిరా! ఆ ముసలివాడికి కొంచెము ముల్లు పెరిగినట్లు న్నది. పిండు, వాడి చెవులుపిండు!''

దొరవారు ఈ మాటలు ఊరికే బెదిరింపుకు అనిరేమో, కాని చప్రాసీలు ఊరకుందురా? ఇంతకు ముందే తిమ్మాజీపేట పట్టీరైతులపైన వారికి కన్నెర్రగా నుండెను! అబ్దుల్లా చప్రాసీ వెంటనే ముందుకు దుమికి ముసలి పాపిరెడ్డిని మెడపట్టి తోసెను! పాపము, ముసలి రెడ్డి నేలమీద బోరగిల పడిపోయెను. అది వరకు సహించి శాంతముతో నిలబడి యుండిన పడుచువాండ్రు పాపిరెడ్డి కొడుకులు ఇద్దరు, కస్సుమని ముందడుగువేసి అబ్దుల్లా పైన బడిరి. సాహెబు కుర్తా చినిగెను! దభీలున క్రిందపడెను. కాని వాక్కూరత్వము రవంతయైనను తగ్గలేదు!

అనుభవశాలియైన పాపిరెడ్డి పరిస్థితులను నిమిషములో గ్రహించెను. లేచి నిలుచుండి అబ్దుల్లాను విడిపించెను. కొడుకులను తిట్టనారంభించెను. కుమాళ్లు తండ్రిని ఘురకాయించిరి. అంతలో రెడ్డిపోయి వర్మగారి కాళ్ళమీద పడెను. కాని, లాభ మేమి? పాకము ముదిరినది. పాపిరెడ్డియొక్క సమయోచిత ప్రజ్ఞ నిరర్థకమైనది. ప్రతాపవర్మగారి కన్నుల నుండి నిప్పులు గురియుచుండెను. ఆగ్రహపరవశుడై పాపిరెడ్డినెను.

''చండాలుడా! వెళ్ళిపో, నా యెదుట నిలువకు, నిలిస్తివా నీ నెత్తురు తాగినాననుకో!''

ముసలివాని శరీరములో దొరవారు త్రాగుటకు రక్తము అసలే లేదు. కాని ఉష్ణము మాత్రముండెను. న్యాయము జరుగు నేమోయని అతడు ఆశించియుండెను. ఈ కఠోర వాక్యములు

విని అనెను. "అయ్యా! ముసలితనములో దొరగారి గడీ ముందర నా మానము మంటిలో గలిసెను. పైగా నన్నే తిట్టు తుంటిరి!"

ప్రతా:- "ఇప్పుడే మానము ఏమి పోయిందోయ్. ముసళ్ళ పండుగ ముందున్నది! చూతువుగానిలే."

పాపిరెడ్డి కొడుకులు కొంచెము ముందునకు వచ్చి గట్టిగా ననిరి. "దొరగారూ, తమరు రూపాయలు తీసుకుంటారా, మానము తీసుకుంటారా?"

ప్రతా:- "చూతాము లెండోయ్. మీ రూపాయలు తరువాత తీసుకొంటాలే. మీ మానము ఏపాటిదో కొంచెము పరీక్షింతాము."

(౪)

తిమ్మాజీపేట రైతులు స్వగ్రామము పోయి జరిగిన వృత్తాంతము మోహనరావుతో చెప్పుచుండగానే, ప్రతాపవర్మ గారి నౌకరులు వచ్చి మోహనరావుతో ననిరి. "దొరవారు మిమ్ములను రమ్మన్నారు."

మోహనరావు రైతులకు సమాధానము చెప్పి, వెంటనే గుఱ్ఱమెక్కి దివాణములోనికి వచ్చెను.

ప్రతాపవర్మ దీవాన్‌ఖానాలో కూర్చుండియుండెను. అతని చూపులు అగ్నిజ్వాలల వెదజల్లుచుండెను. గుమస్తాలు,

చప్రాసీలు చుట్టూ మూగి ఆ జ్వాలలపైన తైలము చల్లుచుండిరి! మోహనరావును చూడగానే ప్రతాపవర్మ తీక్ష్ణదృష్టులతనిపై బరపి, "తిమ్మాజీపేట రైతుల చేష్టలు చూచినారా?" అని ప్రశ్నించెను.

మోహ :- (తల వంచి) "అయ్యా! విన్నాను. చాలా విచారపడితిని. వాండ్లు అంత పొగరుపోతులు కాకుండిరి!"

ప్రతా :- "అయ్యా! నిజమే కాకుండిరి. కాని, యిది అంతా తమ సహవాస ఫలితము. మీరింకా బడి పిల్లవాండ్రు. ప్రపంచములో ఎట్లా నడుచుకోవలెనో మీకు ఏమి తెలియును? రైతుల విషయమున మీ ప్రవర్తన ఈ ప్రకారమే సాగుతూ వున్నట్టయితే, నా జమీందారీ బాగా తగలబడ్డట్టే! ఇదంతా మీ ప్రభావము. ఈ నా గడీ దర్వాజా ముందర - ఈ వాకిట్లో నేను మా, — ఆసామీలను తాళ్ళతో తలకిందుగా వేళ్ళాడ గట్టించి ఉంచాను! తెలుసునా? ఒక్కడన్నా కుంయ్యు మన్నాడా? ఇప్పుడు చూచినారా, నా యెదుటనే నా నవుకరు మీద కలియబడిరి!"

మోహ:- (వినయముతో) "అయ్యా! ఈ విషయమున నా దోషమేమి? ఈ సంగతి విన్నప్పటి నుండి నేను చాలా దుఃఖించుచున్నాను."

ప్రతా:- ""మీది కాకపోతే ఎవరిదీ తప్పు? మీరే కదా వీరిని తలపై కెక్కించుకొంటిరి. వెట్టిపని తీసివేస్తిరి. వీండ్లతో అన్నదమ్ములవలె మెదల మొదలుపెట్టితిరి. వారితో ఎకసక్కెము

లాడుచుంటిరి. ఈ హల్కావాండ్లు మీ ప్రవర్తనమును గ్రహించగలరా? విన్నారా? పుస్తకములలో, పాఠశాలలలో, కాలేజీలలో చదువుకొన్న నీతులు బళ్లల్లో పనికివచ్చేవే సుమండీ. అంటే ప్రపంచములో నడచుకొనవలసిన నీతి పద్ధతి వేరే. సరే! జరిగినదేదో జరిగినది పోనియ్యండి. ఈ రైతు ముండాకొడుకులు చేసిన బద్మాషీకిగాను వారికి కొంచెము రుచి చూపించవలెనని ఉన్నది! ఏమంటారు? తసామీలు చెల్లించిన మాల్గుజారి పైకముకు మీరు రసీదులు యింకా యియ్యలేదు కదా?''

మోహనరావు భయపడుచు అనెను:- ''లేదండీ, రసీదులు తయారైనవి. తమ దస్కతుకొరకు మాత్రము ఆగి యున్నవి.''

ప్రతాపవర్మ ముఖమున సంతృప్తి ప్రకటితమయ్యెను. ఇట్లనెను:- ''ఇది మంచిపనియే. శుభసూచనయే. ఆ రసీదులను పరశురామ ప్రీతి చేయండి. తెలిసిందా? వీండ్లమీద మాల్గుజారీ పైకము బాకీ వున్నదని దావాలు చేతాము. వీండ్ల పంటలను జప్తు చేయించి హర్రాజు చేయింతాము. అప్పుడు గాని వీరికి గింజల ధర తెలిసిరాదు! ఇప్పటి వరకు వసూలైన పైకమును విత్తనములు, ఎడ్లు వీటి బాకీలకింద జమ కట్టుకొనండి. మీరు మాత్రము సాక్ష్యములో, 'వాండ్లిచ్చిన పైకము మాల్గుజారికింద యియ్యలేదు; పాత బాకీలకింద చెల్లించినా''రని చెప్పవలసి యుంటుంది. అంతకంటే మించి యేమీలేదు.''

మోహనరావు ఆలోచనలో మునిగెను. "ఏ బాధలు వలదని, మారుమూలలో శాంతజీవనమునకు నేను ప్రాముఖ్యత

నిచ్చియుంటినో, ఆ బాధలే, ఆ తికమకలే నన్ను లోబరుచు కొనునా? తెలిసియుండి ఈ పేద రైతుల గొంతులపైన కత్తి వేటు ఎట్లు వేయించగలను? ఈ విధముగా నాకు జీవనోపాధి లభించవలసినది? ఇట్టి కార్యము నా వలన కా జాలదు!'' అను కొని మెల్లగా నడిగెను.

''అయ్యా! నా సాక్ష్యము లేకుండ పని వెళ్ళజాలదా?''

ప్రతా:— (మందధ్వనితో) "ఇంతమాత్రము అనగూడదా? మీకేమైన ఆక్షేపణయా?

మోహ:- (మందధ్వనితో) ''నేను తమ పోషణలో నున్న వాడను, ప్రతిజ్ఞను చెల్లించుటకు సంసిద్ధుడను. కాని నే నెపుడును సాక్ష్యమిచ్చిన వాడనుగాను. నా వలన ఈ పని కాజాల దేమో? నన్ను క్షమింపుడు.''

ప్రతా :- (ఖండితముగా) ''ఈ పని మీరు చేయక తప్పదు. దీనిలో వెనుక ముందాడవద్దు. మీరు పెట్టిన మంటను మీరు కాక మరెవ్వరు చల్లార్పగలరు?''

మోహ:- ''అయ్యా! అబద్ధములు చెప్పు అలవాటు నాకు లేదు. ఇట్టి సాక్ష్యము నే నియ్యజాలను.''

ప్రతాపవర్మ కొంత తిరస్కారభావము, కొంత బుజ్జ గింపు కలసి యుండు వైఖరి నవలంబించి ఇట్లు బోధించెను:- ''మిత్రవర్యా, ఇది అసత్యము చెప్పుటకాదు. నేను అబద్ధపు వ్యాపారము చేయను. 'రూపాయలు ముట్టనేలేదని చెప్పండి'

అని నేను మిమ్ము అడుగుటలేదు. రైతులు నాకు బాకీదారులు కనుక వారు చెల్లించిన పైకమును నా పాత బాకీలకిందనైనా జమ కట్టుకొనవచ్చును. అట్టి అధికారము నాకున్నది. ఇంత మాత్రపు మాట మీకు అసత్య ప్రలాపముగా తోచినట్లయితే మీదే అన్యాయము! మీరింకా ప్రపంచమును చూడలేదు. మీరు తలంచిన సత్యవర్తనమునకు ఈ ప్రపంచములో ఎక్కడా తావు లేదని తెలుసుకోండి. మీరు నా నౌకరులు. నా ఉప్పుతినినందుకు మీపైన కర్తవ్యభారమేమైన ఉన్నదంటారా? లేదంటారా? మీరు విద్యాధికులు, వృద్ధికి రాదగినవారు. ఇంకా మీరు ప్రపంచములో చాలా దినములు వుండవలసిన వారు. చాలా పనులు చేయవలసినవారు. ఇప్పుడే యిటువంటి నడవడి మొదలు పెట్టినట్లయితే జీవితములో మీకు నిరాశ, దుఃఖము ఇవి తప్ప గత్యంతరము లేదు. ప్రామాణిక బుద్ధి నిజముగా చాలమంచిదే, కాని మితమును దృష్టిలో నుంచవలెను. అతి సర్వత్ర వర్జయేత్! ఎక్కువ ఆలోచన వద్దు, ఈ సమయమే అట్టిది."

ప్రతాపుడు జగమంతటిని గాలించిన ముసలి అనుభవశాలి. అట్టివాని యెదుట పొట్టిగాడైన మోహనరావు నిరుత్తరుడయ్యెను. "ఇటా", "అటా" అని విచార సాగరమున బడి మునుకలు వేయుచుండెను. అట్టి ఆందోళనము ఉత్తమ సంకల్పమునకు విషప్రాయము గదా ?

(౨౪)

పది పదునేను దినములలో తిమ్మాజీపేట పట్టి రైతుల మీద మున్సిప్ కోర్టులో దావాలు దాఖలు అగుటయు, ప్రతివాదులకు సమనులు వచ్చుటయు జరుగనే జరిగెను. ఇంటింట రోదనములు ఆరంభమయ్యెను. స్త్రీలు దొరవారిని దీవించ సాగిరి. పురుషులు దోషములను తమ అదృష్టములపై బడ వేసిరి. పేషీ తారీఖున రైతులందరు కట్టగట్టుకొని న్యాయస్థానమునకు ప్రయాణమైరి. స్త్రీలు వారి వెనువెంట పిల్లల నెత్తుకొని ఎంతో అపాయము వాటిల్లినట్లు బయలుదేరిరి! మరల భర్తల ముఖములను చూడమనుకొనిరా?

మోహనరావు మానసికావస్థ యెట్లుండెనో ఊహింపుడు. అటు ప్రక్క జమీందారుగారి బుజ్జగింపు, ఇటు ప్రక్క బీద రైతుల హాహాకారములు. రెండు మూడు దినములు ఆందోళనములో చిక్కుకొని యుండి తుదకు నిశ్చయించుకొనెను. "ఇది మొదటి పరీక్ష. దీనిలో పడిపోయితినా జీవితమున ఎదుర్కొను పరీక్షలలో నిలుచుట అసంభవము! నా లాభము కొరకు నోరు లేని వారిని కష్టముల పాలుచేయజాలను! చేయజాలను!!"

మొత్తము మీద న్యాయస్థానములో విచారణ జరిగెను. మోహనరావు ముఖ్య సాక్షి. ఇతనిని బోనులో నెక్కించి వాఙ్మూలములు పుచ్చుకొనిరి. అతని ప్రత్యుత్తరములు న్యాయస్థానమున కొంత కళవళపాటు కలిగించెను. ఉద్యోగస్థులు, నౌకరులు అతని వైపు దృష్టుల నిలిపి చూడసాగిరి.

న్యాయాధి :- "నీవు న్యాయాధిపతి యెదుట నున్నావని ఎరుగుదువు కదా ?".

మోహన :- "ఎరుగుదును."

న్యాయా :- "అబద్ధములు చెప్పిన పక్షమున నీ మీద తప్పు సాక్షపు నేరము రావచ్చును. తెలియునా ?"

మోహ :- "అవును, నా మాట అబద్ధమైనచో."

న్యాయా :- "రైతులు పైకమంతయు చెల్లించిరని నీవు ప్రమాణముగ చెప్పుచున్నావా ?"

మోహ :- "అవునండీ రైతులు ఒక గవ్వయైనను ఈ సంవత్సరము పంటల బాపతు బాకీలేరు."

న్యాయా :- "అయితే రసీదులు వారికి ఏల ఇయ్య లేదు ?"

మోహ :- "యజమానుని ఆజ్ఞ."

రైతుల మీద దావాలు కొట్టి వేయబడిన సంగతి తెలిసిన మీదట ప్రతాపవర్మగారికి మోహనరావు మీద వచ్చిన ఆగ్రహ మునకు మితిలేదు. "మోసగాడు, విశ్వాసహీనుడు. పరమ చండాలుడు ! నేనీతని కొరకెంత మొగమాటము చూపితిని ! కుక్కతోక వంకరమానునా? కొంప ముంచనే ముంచెను! ఇంకా అదృష్టవంతులము. న్యాయాధిపతి తీర్పు చెప్పగానే, గుమస్తాకు తాళపుచేతులు కాగితములు అప్పగించి అతడు వెళ్ళిపోయినాడు.

అట్లా కానట్టయితే ఎంత అపాయమైనా వచ్చేదే సుమా!'' అనుకొనెను.

మనవర్మగారికి రైతులవలన రావసిన పాత బాకీలు ఎన్నియో వేల రూపాయ లుండెను. వాటిని వసూలు చేసుకొనుట కష్టమైన పని. అవి మునిగి పోవలసినవే కదా? మోహనరావు రైత్కుముండా కొడుకులను తలపైకి ఎక్కించుకొన్నాడు. వారికి భయము యింక ఎక్కడిది? ఈ ప్రకారము వితర్కించుకొనగా గుండె పగిలినట్లయ్యెను. ఆలోచనా పరులగు ప్రాత ఉద్యోగులతో విచారించి చూచెను. ''కాగితములను న్యాయస్థానము ఎదుటకు తెచ్చినచో మరికొన్ని కొత్త చిక్కులు వచ్చును గాని పైకము మాత్రము వసూలుకా''దని అభిప్రాయము స్థిరపడెను. లెక్కలలో రంగు బయటపడెనా, తక్కిన ప్రాంతముల రైతుల అప్పులు కూడా ఎగిరిపోతవి! ఇక గతి ఏమి? గోవిందా! గోవిందా!!

(౬)

మూడవ నాటి యుదయమున జమీందారుగారు గడీలో దీవాన్‌ఖానా యందు కూర్చుండి యుండగా, తిమ్మాజీపేట పట్టీ రైతులు గుంపులు గుంపులుగా లోన ప్రవేశించిరి. ''వీండ్లేమైన తగువులాడుటకు వచ్చుచున్నారేమో'' యని జమీందారు గుండెలు తటతట కొట్టుకొనసాగెను. కాని ఒకని చేతిలోనయినా కట్టె లేదు. అందరికి ముందుగా పుల్లారెడ్డి నడుచుచుండెను. పుల్లారెడ్డి

రెండు చేతులు జోడించి ధొరవారికి దండము పెట్టెను. ధొర వారికిది స్వప్నావస్థగా దోచెను. వుల్లా రెడ్డి ప్రభువుగారితో కేలు మోడ్చి యనెను.

"దొరగారూ! మా తప్పు మన్నించవలెను. మేము దేవర వారి సేవకులము. దొరవారే మమ్ములను బ్రతికించుచున్నారు. ముందు కూడా మా మీఁద అనుగ్రహం వుంచవలెను."

"మోహనరావు వెళ్ళిపోయినాడు కనుక వీండ్ల మదమడి గినది. ఇక ఎవరి ఆసరా వున్నది? ఆ దుర్మార్గుడే కదా వీరంద రిని రెచ్చబెట్టినాడు." అనుకొను జమీందారు గర్జించుచు పలికెను.

"ఏడీ మీ దొర, మీ పోషణకర్త మోహనరావుగారు? ఆయన ఎదుటికి వస్తే కొంచెము వారి యోగక్షేమము తెలిసి కొందునే!"

పుల్లారెడ్డి కన్నులలో నీరునిండెను. ఆతడు పలికెను.

"దొరగారూ! ఆయనను మీరు ఏమీ అనకూడదు. అతడు మనుష్యుడు కాడు; దేవత. అతడు మాకు ఏ దుర్బోధన చేయ లేదు. మీ పాదముల తోడు. అతడు మాకు మాటిమాటికి 'యజమానునితో పోరాటము వలదు జాగ్రత' అని హెచ్చరించు చుండువాడు. మా దగ్గిర పంచపాత్రెడు మంచినీళ్ళయినను త్రాగిన పాపమున పోలేదు! పోవునపుడు మాతో గట్టిగా, యజ మానునికి మీరు యెంతెంత బాకీ యున్నారో అది పైసాపైసా

లెక్క చేసి పంపించండి! అని చెప్పిపోయెను. తమరు మాకు అన్నముపెట్టే దొరలు. మేము మీ నీడలో వున్నాము. ఈ శరీరములు మీరు పెట్టిన ఆహారమువలన పెరిగినవి. కనుక మా మనవి యేమనగా, మా లెక్కపత్రము జూచుకొని మేము ఎంత బాకీ యున్నామో చెప్పండి. సొంతము చెల్లించిగాని మంచినీళ్లు తాగము.''

గుమాస్తాగారు పుస్తకములు తెరచిరి; రైతులు సంచుల తెరచిరి. ఆరువేల రూపాయలు కుప్పలు కుప్పలుగా యెదుట నిలచెను. ఒక దమ్మిడియైన బాకీ లేదు. ఇది న్యాయవర్తనము యొక్క ఫలితము! జులుముచేతను, బలాత్కారముచేతను ఏ పని జరుగలేదో, మంచితనముతో ఆ పని జరిగినది.

రైతులు న్యాయస్థానము నుండి తిరిగివచ్చిన వెంటనే బాకీ చెల్లించవలెనని వారికి దోచెను. మోహనరావును వారు ఈశ్వరావతారముగా భావించుచుండిరి. అట్టివాడు పైకము చెల్లించుమని ఆజ్ఞాపించిన తరువాత వారిక వెనుకముందు జూతురా? కొందరు గుమ్ములలోని ధాన్యము అమ్మిరి. కొందరు నగలు తాకట్టు పెట్టిరి. కొందరు పశువులను విక్రయించిరి. ఎట్టి శ్రమకైనను ఓర్చిరి కాని, మోహనరావు యొక్క ఆజ్ఞను ఉల్లంఘించదలచరైరి.

ప్రతాపవర్మ ఇప్పుడు కన్నులు తెరచెను. మోహనరావు వద్ద ప్రసంగావధానము, సమయోచితబుద్ధి లేకపోయిన లేకపో

వచ్చును. కాని అతడు యదార్థవాది, ధర్మాత్ముడు అని నిశ్చయించుకొనెను.

తిమ్మాజీపేట పట్టీ రైతుల నుండి తరువాత అతనికెట్టి శ్రమయు గలుగలేదు. బాకీ అనునది లేకుండపోయినది.

ప్రతాపవర్మ జీవితము ఐశ్వర్యముతో గడచెను. అయిదుగురు కుమార్తెల వివాహములు వైభవముతో జరిగినవి. తిమ్మాజీపేట పట్టితప్ప తక్కిన ప్రాంతముల రైతులలో జరుగవలసిన లాంఛనములు, జరుగుచునే యుండెడివి. పూర్వము వలెనే అల్లరులు, ప్రతిదినము న్యాయస్థానములో పనులు ఉండుచునే వచ్చెను. ఫౌజ్దారి క్రిమినల్సు కోర్టులలో కూడ పని చేతికింద యుండనే యుండెను. బెదిరింపులు, చీవాట్లు, ఎండలో కూర్చుండబెట్టుట, చెవుల పిండింపు ఇవన్నియు యధావిధిగా నుండెను. ఈ మాత్రము లేకపోతే ఇక దొరతనమేమి?

జమీందారుగారికి క్రమముగా ముసలి తనము వచ్చెను. పూర్వపు ఝుంకారములు, హడావిడులు తగ్గెను. శారీరక శక్తులు సన్నగిల్లెను. కోర్టు వ్యవహారముల తర్కవితర్కములు తగ్గి, భగవద్గీతాపారాయణము, సాధువుల సేవ కొంతకొంత యిష్టము కాసాగెను. అట్టి వార్ధకదశలో వర్మగారికి పుత్రోద్భవమైనది.

వ్యాధులు క్రమముగా దేహము నావరించెను. వైద్యుల రాకపోకలు హెచ్చెను. ఔషధములు గుణములిచ్చుట మానెను ఈ విధముగ రెండున్నర సంవత్సరములు గడచినవి. శారీరక

మానసిక శక్తులన్నియు తిరుగబడెను. జీవితపు ఆశ పలుచబడి "దినములు దగ్గరికి వచ్చినవిరా" అనిపించెను.

"ఇంత పెద్ద ఆస్తిని ఎవరిపైన వదలిపెట్టుదును? కోరికలన్నియు వృధయయ్యెను. పిల్లవానిని యొక యింటివానిగ చేయనైన చేయజాలకపోయితిని. ఈ పసిపాపను ఎవరికప్పగింతును? ఈ మొక్కను పెంచి పెద్దచేయు వారెవరు? పిల్లవాని తల్లి యా-యాడుది, ఏమియు ఎరుగదు. వ్యవహార భారము దుర్భరము, ఆడది ఎట్లు సంబాళించుకొనగలదు? గుమస్తాలు, నౌకరులు ఎందరో - కరువుకు వచ్చినంత మంది - వున్నారు. కాని ఏమి భాగ్యము? అందరూ మోసకాండ్రు, లుచ్ఛాలు, స్వార్థపరులు, ఒక్కడైన నమ్మకమైనవాడు కాడు. కోర్టు ఆఫ్ వార్డ్సు వారికి అప్పచెప్పుదామా అంటే, అందులో మాత్రము చిక్కులు తక్కువగా వున్నవా? వీడు బెదిరించుటయు జరుగును. అంతేకదా!

"నాకొక రత్నము దొరికియుండెను. కాని నేను దానిని పెంట మీద కందిగి జయనుకొని అవతల పారవైచితిని. దాని యోగ్యతను గ్రహింపనైతిని. ఆ రత్నము మరల ఎచ్చటి నుండియైన దొరికిన పక్షమున యెంతబాగుండును? నా పను లన్నియు నెరవేరును. నా చిక్కులన్నియు వీడిపోవును. దుర దృష్టవంతుడగు ఈ శిశువును నేను అతని కాళ్ళపైన బడవేసి, అతని బ్రతిమాలుకొని, 'నా తప్పు సైరింపు'మని 'నా బాలుని కాపాడుమని' ఈ శిశువును నేను అతనికి అప్పగించి యుందును.

నా ఆస్తినంతయు అతని వశము చేసియుందును. అతని హృదయమున దాక్షిణ్యమున్నది. నెనరు కలదు. తండ్రిలేని బాలుని పైన నతడు తప్పక జాలిపడును. అక్కటా! అట్టి ఉత్తముడు నాకు దర్శనము మరల యిచ్చునా? నేనాతని పాదముల కడిగి తలపైన చల్లుకొందును. నా కన్నీటితో అతని చరణముల తడుపుదును. అతనిని కొంగు చాచి అభయ ప్రదానము వేడియుందును. అతడు వచ్చెనా, మునిగిపోవుచున్న నా నావ ఒడ్డుకు తగుల గలదు. నా కంతటి ప్రాప్తము కలదా!" అని ప్రతాపవర్మ వగవసాగెను.

అవసాన కాలము రానే వచ్చెను. పసి బాలుని మొగము చూచినపుడెల్ల అతని గుండెలు పగులుచుండెను. "ఆ దేవత ఎక్కడయున్నదో కదా!" అని అతడు మాటిమాటికి గొణుగుకొనుచుండెను. కాని మోహనరావు జాడ తెలియలేదు.

"మోహనరావూ! నే నెంతటి బుద్ధిహీనుడను? నీవంటి యమూల్య వస్తువును కోలుపోయితిని. నేను కండ్లుండియు గ్రుడ్డినైతిని. దుఃఖ సాగరమున మునుగుచున్న నన్ను పైకి లేవనెత్తి కాపాడుము! ఈ శిశువును, ఈ కాబోవు వితంతువును రక్షింపుము, నా తప్పు మన్నింపుము" అని లోలోన వగచుచుండెను.

బంధువులందరు చుట్టు మూగియుండిరి. ప్రతాపవర్మ తన దృష్టులను వారందరి మోములపైన బరపి చూచెను. కాని ఒకరి

ముఖముననైనను నిజమగు దయాలక్షణము కనపడదయ్యె. తెరచినకన్ను మరల మూసికొనెను.

జమీందారుగారి భార్య కన్నీరు గార్చుచు ఎదుట నిలువబడెను. భావముల యుద్రేకమును, దుఃఖతరంగముల యుద్వేగమును ఎంత ఆపుకొనినను ఆగలేదు. తుదకు ధైర్యము చిక్కబట్టి, ''ఈ బాలకుని, నన్ను ఎవరికప్పజెప్పి పోవుచున్నారు?'' అని మందస్వరమున బలికి ఏడ్వసాగెను.

జమీన్‌దారు;- ''ఎ-వ-రి-కా? ఆ-ఆ-ఆ- మో-హ-న-రా-వు-కు'' అని మూసికొనిన కన్నులు మరల తెరువలేదు.

విధి ప్రేరణము

విక్రమపుర దుర్గము ఆంధ్రదేశమున చాలా పురాతన మైనదిగ ప్రసిద్ధి చెందినది. దీని యెదుటనే కాకతీయుల ప్రతాపాగ్ని ఓరుగల్లునందు చల్లారెను. ఈ దుర్గము చూచుచుండగానే విజయనగర సామ్రాజ్య భాను డుదయించి, గగన మధ్యమున కెగబ్రాకి అస్తమయమును సమీపించెను. గోలకొండయందు ఖుతుబ్ శాహీ రాజులు అవక్ర పరాక్రమముచే తమ కీర్తిని దిగంతములకు వ్యాపింపజేయుచుండిరి. సంస్థానములు ఎన్నియో పుట్టెను, ఎన్నియో గిట్టెను. మహమ్మదీయరాజులెందరో ఆంధ్ర సంస్థానాధిపతులను లోబరుచుకొనిరి. కాని విక్రమపుర దుర్గము పైన మాత్రము మహమ్మదీయ రాజుల పతాకము స్థాపితము కాలేదు. ఎంత యాశ్చర్యము!

విక్రమపుర సంస్థానాధిపతి ప్రతాపుడు. ఈతని తమ్ముడు పద్మనాభుడనువాడు. వీరి సంస్థానము చిన్నదియే కాని శౌర్య సాహసములందు దీని చరిత్రము నిరుపమానమైనది. కాలము గడచిన కొలది ఆంధ్రుల సామ్రాజ్యము అడుగంట జొచ్చెను. కాని ఈ సంస్థానపు రాజవంశము నందు పురాతనాంధ్రుల పవిత్ర రక్తమింకను ప్రవహించుచునే యుండెను.

ప్రతాపుని వీర విహారములను, పద్మనాభుని శక్తి సామర్థ్యములను విని యిబ్రాహిం ఖుతుబ్‌షాహి విజయనగర సామ్రాజ్యమున కంకితుడుగా నున్న ప్రతాపుని దనకు సహాయకునిగా జేసుకొన ప్రయత్నించుచుండెను. తుదకు విజయనగర సామ్రాట్టగు రామరాజునకు మహమ్మదీయుల యెడ జనించిన మత ద్వేషాతిరేకమును, మహమ్మదీయుల పవిత్ర స్థలముల యెడను, తన మతస్థులగు సాధువుల యెడను అతడు చూపిన యగౌరమును, మహమ్మదీయ స్త్రీల విషయమున జరిగిన కొన్ని యకార్యములను తలపోసి విజయనగర సామ్రాజ్యమునెడ విముఖుడగుచున్న ప్రతాపుని రాజనీతి విశారదుడగు మలికిభరాము సమయోచిత ప్రవర్తనముచే గౌరవించి, యుత్తమ గజములను, మేలు జాతి గుర్రములను బంపి తనకు స్నేహితునిగ జేసుకొని, ఆంధ్రదేశములో గోలకొండ సామ్రాజ్యము క్రింద నుండిన కొన్ని దూరపు దుర్గముల కాతని నధిపతిజేసి పంపెను. ఆంధ్ర సింహము కుతుబ్‌షాహి మాండలికత్వము నంగీకరించెను. మలికిభరాము మన్ననకు బాత్రుడయ్యె! అంతే కాదు; అతని ముఖ్యమిత్రుడయ్యె! ఎట్లయిననేమి? బంగారపు పంజరమేయగుగాక, బంధింపబడియున్న పక్షికది పంజరమే!!

మహా వైభవ సంపన్నుడగు గోలకొండరాజు ప్రతాపునకు జేసిన గౌరవమునకు సూచనగా నుత్సవములు జరిగెను. పద్మనాభుని ముఖపద్మము వికసింపలేదు. కాని ప్రతాపుడు తన ప్రతాప ప్రదర్శనమునకు అవకాశము దొరికినందున కొంత

సంతసించినట్లు కానవచ్చెను. అతడు తమ్ముని బిలచి "తమ్ముడా! నేను దూర దేశమునకు పోవుచున్నాను. త్వరలో వత్తునని తోచదు. ప్రజా పరిపాలనము నీ కప్పగించితిని. న్యాయ పాలనమునకన్న రాజున కుత్తమతరమగు ధర్మము లేదు. న్యాయవర్తనగల రాజు దుర్గమును శత్రువులు భేదింపజాలరు. కాని న్యాయమననేది? దేనిని ప్రజలు న్యాయమని భావింతురో, అది న్యాయము. జనులయెడ న్యాయము జేయుటయేగాక, వారు నీ వర్తనము న్యాయమైనదిగా నెంచునట్లు చేయవలయును. ఇంతకంటె చెప్పవలసినది లేదు. అనుశ్రుతముగా వచ్చుచున్న మన కుటుంబ గౌరవమును కాపాడుటయందు నీవెట్టి కార్యమునకై నను వెనుదీయకుము సుమా!" యనెను.

తరువాత ప్రతాపుడు రాణి వాసమునకు బోయెను. కల్యాణి భర్త పాదములపై వ్రాలి కన్నీరుగార్చెను. ఆమెను లేవనెత్తి కౌగిలించుకొని భర్త, "ఇది దుఃఖ సమయముగాదు. క్షత్రియ యువతులిట్టి సమయమందు వగవరు. ప్రోత్సహించి భర్తల నంపుదురు. ఈశ్వరానుగ్రహమున త్వరలో మనము కలిసికొందుము. పద్మనాభుడు రాజ కార్యములను జరుపుచుండును. పసివాడు- వానికాలోచన చెప్పుచు ప్రజా పరిపాలనము చేయించుము" యనెను. అశ్రువులు బొటబొటరాల కల్యాణి గద్గదకంఠయయ్యెను. "క్షత్రియ స్త్రీలిట్టి వేళ యందు దుఃఖింపరట! ఎంత చోద్యము? వారి హృదయములు వజ్రములా? నాకట్టి గుండెను ఈశ్వరుడియ్యక పోయెగదా! ఇచ్చియే

యుండిన నా భర్త హృదయము సంతసించియుండునే!" ఈ విచారము లామె మనస్సున మెదలుచుండెను. విధి లేక యామె దుఃఖము నాపికొనియెను. ఆమె పెదవులపైన చిరునవ్వు నాట్యమాడెను. అది ఎట్టి చిరునవ్వు? గాఢాంధకారము నడుమ ఆకస్మికముగ కానవచ్చు మెరుపు. ఆ యంధకారమును మరింత భయంకరముగా జేయునట్లు, కల్యాణి చిరునవ్వు ఆమె హృదయములోని చీకటిని మరింత విశదముగా జూపెను.

ప్రతాపుడు వెడలిపోయిన తరవాత పద్మనాభుడు పాలింపసాగెను. అతని న్యాయవర్తనము ప్రజల మనములను వశము చేసుకొని, యన్నను మరిపించెను. ప్రతాపునకు శత్రువులుండిరి; మిత్రులుండిరి. పద్మనాభుని సత్యవర్తన యందరిని మిత్రులుగా మార్చెను. ఎట్టి నగుమొగము! ఎట్టి వాఙ్మాధుర్యము!! ఎట్టి కలుపుగోలుతనము!!! ఒకమారతనితో మాటలాడిన మానవుడు బ్రతికినన్నాళ్లు అతని మరచునా? అతని సన్నిధికి పోయి ఏదైన సంగతి విన్నవించుకొనుట అతని ప్రజలలో హీనాతిహీనునకైనను కష్టముగా దోచునా? రాత్రిందినములు అతని దర్బారు దర్శనార్థులకు సులభ సాధ్యము. అంతటి ప్రజానురంజకుడగు రాజు విక్రమ పురమున నంతకు పూర్వమెన్నడు నుండలేదు. అతడు న్యాయైకనిరతుడు. విద్యలను, కళలను బ్రోత్సహించువాడు. అన్నింటికంటె మించిన యోగ్యత అతని పరాక్రమము.

ఆ కాలపు మహాత్మ్యమే యట్టిది. అది కలమునకు గాలముగాదు; కత్తిపోటునకు కాలము. మాటల దినములు కావు, కార్యము ప్రధానము. కుటిల వర్తనమునకు గౌరవము లేదు, ఖండితత్వమునకు ఆధిక్యత. జాతియౌన్నత్యము ఖడ్గముపై నాధారపడియున్న కాలమున, ప్రజలకు తమ రాజునందుగల యన్ని సుగుణముల కంటెను. పరాక్రమ మెక్కువ ప్రియమై యుండును. పద్మనాభుడు పాలితుల మనములపై ప్రభుత్వము చేయుచుండెను ప్రజల యాస్తిపైనను, శరీరములపైనను అధికారముపూనుట ప్రతిరాజు చేయుచున్న పనియే. జనుల హృదయముపైన నాధిపత్యము నల్పుట ఎంతో మంచి రాజునకుగాని సాధ్యముగాదు. అటు ప్రతాపుడు కుతుబ్‌షాహి ప్రభుత్వమును ఆంధ్రదేశ దుర్గములపైన స్థాపించుచుండెను. ఇటు పద్మనాభుడు ప్రజాహృదయములపైన సమ్మోహనాస్త్రము ప్రయోగించుచుండెను.

ఫాల్గుణమాసము వచ్చినది. నలుదెసల పర్వతారణ్యములు వింత శోభను వహించెను. వృక్షముల యాకులు రాలి రాలి మోడులు నిలచెను. మోదుగు చెట్ల ఎర్రని పూవులు అరణ్యము నలంకరించెను. ఎండలింకను ముదురలేదు. సాయంత్రములు మనోహరములయ్యెను. అట్టి దినములలో నొకనాడు గోలకొండ పట్టణ వాస్తవ్యుడు, అలీఖానునను సుప్రసిద్ధుడగు పహలువాను (మల్లుడు), విక్రమపురమునకు వచ్చెను. ఎందరో బలశాలులగు మల్లులు అతని సామర్థ్యము నొప్పికొని యుండిరి.

గోలకొండనుండి విక్రమపురము వరకు నడుమ నుండిన ఎందరో శౌర్యరసోన్మాదులు అతని నెదుర్కొనిరి; కాని వ్యర్థము. అతని డీకొనుట యనగా అదృష్టముతో బోరాడుటగాదు; మృత్యు దేవతతో వెనుగులాడుట! సరిగా ఫాల్గుణ పౌర్ణిమనాడు అల్లీ ఖానుడు నగరమందంతయు ఇట్లని చాటింపించెను: "అభినవ భీముడు- అలీఖానుడు- విక్రమపురము వచ్చియున్నాడు. ఎవడు ప్రాణముల రోసి యున్నాడో, అతడు వచ్చి తన యదృష్టమును బరిష్కరించుకొనవచ్చును.''

విక్రమపురమునందలి శౌర్యధనులగు నాంధ్రక్షత్రియు లీ వీరాలాపము వినగనే రోషావేశము జెందిరి. మృదు మధురము లగు సంగీతనాదములకు మారుగా భేరీనాదము లారంభమయ్యెను. పురమందలి మల్లులు వ్యాయామ ప్రియులు నగు వారందరు, తరచుగా సమావేశమగు మైదానమొకటి యుండెను. పట్టణము లోని వీరులందరచ్చట గూడిరి. కాళీ నాయకుడును, బేతాళ నాయకుడును, విక్రమపుర క్షత్రియులకు శిరోమణులనదగినవారు. వందలకొలది శూరులతో బోరి గెలుపు నొందినవారు వీరిర్వురును అల్లీ ఖానుని గర్వభంగమునకై ఎన్నుకొనబడిరి!

మరునాటి యుదయమున, దుర్గమునకు సమీపమందు చెరువు వెనుక విశాలమగు మైదానములో పెద్దలు, యౌవనులు, పిన్నలు గుమిగూడి యుండిరి. రంగురంగులు కలిగి తీర్చి కట్టిన తలగుడ్డలతోను, తెల్లని యంగీలతోను, స్ఫుటముగా గాన వచ్చుచుండిన గంధపు బొట్లతోను, వీర రసోద్రేకమును ప్రక

టించు కన్నులతోను, నడుముల నలంకరించు కటారులతోను ప్రకాశించుచున్న అచ్చటి యౌవనుల విలాసమును, వారి ఠీవిని, వారి శౌర్యోత్సాహమును ఏమని వర్ణింపదగును? చేపలవంటి పుష్టీ మీసములు, తెల్లని వంకరపాగాలు, ఆకారము ముసలి తనమును ప్రకటించుచున్నను హృదయమున యౌవనపు కదలిక గల యచ్చటి వృద్ధుల్కు, వయోభారముల తృణీకరించుచు పడుచువారిని సిగ్గు పరచుచుండిరి. అచటనుండిన ప్రతివాని వాక్కునను శౌర్యప్రసంగము తప్ప మరేమియు లేదు. "మన విక్రమపుర గౌరవ మెట్లు దక్కునో చూడవలసి యున్నది" అని యౌవనులు అనుకొనుచుండిరి. "విక్రమపురము అపజయ మను మాట ఇదివరకెరుగదు; ఇకముందు వినదు" అని ధైర్యముతో ముదుసలులు పలుకుచుండిరి. ఈ సంభాషణమును వినుచుండిన పద్మనాభుడు బిగ్గరగ నిట్లనెను: "విక్రమపుర యౌవనులారా! వృద్ధులారా! విక్రమపురమునకు జయము గలిగినను సరే; పరాజయము వచ్చినను సరే. విక్రమపురవాసుల న్యాయవర్తనమునకు భంగము కలుగజూడరు సుమా! విక్రమపుర వాసుడగు ఫలానివాడు, ఖడ్గబలముచే గాక, వేరు విధముగా గెలుపొందెనని- అధర్మపద్ధతిచే గెలుపొందెనని- మన చెవినబడెనా, అట్టి వానిని మన శత్రువుగా తలంచవలెను!"

ప్రొద్దెక్కెను. తటాలున భేరీనాదము వినవచ్చెను. ఆశ, భయము, జనుల హృదయముల నొకదాని తరువాత మరియొకటి కమ్ముకొనుచుండెను. కాశీనాయకుడు, అలీఖానుడు ఇద్దరును,

రెండు బెబ్బులులవలె రంగమున దుమికి కలిసికొనిరి. ఇరు ప్రక్కలనుండి కత్తులెగసి పరస్పరాలింగన మొనర్చిరి. నల్లని రెండు మేఘముల నుండి వెడలిన రెండు మెరపుతీగెలా యనునట్లుండెను. మూడు గంటల కాలము పోరు జరుగుచుండెను. వేలకొలది జనులు చూచుచుండిరి. జన సమూహమున అర్ధరాత్రి యందుండెడు నిశ్శబ్దత వ్యాపించియుండెను. కాశీనాయకుడు తీవ్రమగు కత్తివేటు ప్రయోగించినపుడును, ఘాతుకమగు దెబ్బ నాతడు తప్పించుకొనునప్పుడును ప్రేక్షకుల కంఠములు పైకెగయుచుండెను. కాని నోట మాత్రము మాట వినవచ్చుట లేదు. యుద్ధావరణమున కత్తుల కలయిక యుండెను. మైదానమున నున్న జన సమూహము యొక్క స్థితి యెక్కువ దర్శనీయమై యొప్పె. కులగౌరవమును, పురగౌరవమును నిలుపవలయునను నుత్సాహతరంగములు హృదయమున ఉప్పొంగుచుండ, అట్టి భావోద్రేకము నడచుకొని, సంతోషధ్వనిగాని నోటినుండి వెడలకుండ ఆపుకొనుట, కత్తిపోటు తప్పించుకొనుట కంటె కఠినతరమగు పనికదా!

అంత తటాలున అలీఖానుడు ''అల్లాహో అక్బర్'' అని సింహనాదము చేసెను. ప్రళయమేఘము గర్జించెను. దానినుండి వెడలిన పిడుగు కాశీనాయకుని తలపైన గూలెను!

కాశీనాయకుడు నేలగూలగనే విక్రమపురవాసులు మన స్థైర్యముల గోలుపోయిరి. వారిలో ప్రతివాని ముఖమునను

కోపము, అవమానము చిత్రితములయ్యెను. వేలకొలది జనులు వెర్రివారివలె రంగముపై పునకు బరువిడిరి! అంతలో పద్మనాభుడు ఎలుగెత్తి యరచెను:

''ఆగుడు! ఆగుడు! ముందున కొక్కడైనను పోవలదు. జాగ్రత్త!'' అంతకుముందావేశపరవశులై పరుగులిడుచున్న వారి పాదములకు ఈ శాసనము గొలుసై, వానిని బంధించివైచెను! గుమిగూడిన జనసమూహము మధ్యనుండి దారి చేసికొని, పద్మనాభుడు, నేలగూలిన కాశీనాయకుని యొద్దకు బోయి చూచి కన్నీరు నించెను. పడిపోయిన ఆ బెబ్బులి విలవిల దన్నుకొనుచుండెను. వాని యాయువు తంతివలెనే అతని ఖడ్గము కూడా రెండు తునకలై పడియుండెను.

ఆంధ్ర వీరులకా రాత్రి నిదుర పట్టలేదు ప్రక్కలపై నిటు నటు పొరలుచు రాత్రి గడిపిరి. తీవ్రమగు వ్యాధితో అవస్థ పడుచున్న రోగియైనను యింత పరితాపము పడియుండునో పడియుండడో! జనులు మాటిమాటికి ఆకసము వంక జూచుచు, రాతిరి యొక్క మందగమనమునకు విసుకుకొనుచుండిరి. ఎందుకీపరితాపము? ఆ దినము విక్రమపుర పౌరుషమునకు కళంకము గలిగినది గదా యనియే! మరునాడు ఉదయభానునకు స్వాగతమిచ్చుటకై లక్షమంది చెరువుగట్టున వేచియుండిరి. భేతాళ నాయకుడు మల్లరంగమునకు బోవుచుండినప్పుడు జనులగుండియలు తట తట కొట్టుకొనసాగెను. నిన్నటి దినమున కాశీనాయకుడు మైదానమునకు బోవుచుండినప్పుడు విక్రమపురవాసుల చిత్తస్థైర్యము

కొంకు జంకు లేక యుండెను; కాని నేడట్టి స్థితిలేదు. హృదయముల నుండి ఆశ వెడలిపోయి ఆ స్థలమును భయమాక్రమించెను. అలీఖానుడు తీవ్రమగు ఖడ్గాహతిని ప్రయోగించినప్పుడెల్ల, చూచువారి హృదయములు తల్లడమందుచుండెను. సూర్యుడు తలపైకి వచ్చునప్పటికి జనుల మానసములు ఉదాసీనములగుచుండెను. భేతాళనాయకుడు తన సోదరునికంటె ఎక్కువ హస్తనైపుణ్యము కలవాడే! అనేకసార్లు అతడు అలీఖానుని పరాజితుడగు నంత స్థితికి దెచ్చెను. కాని అనుభవశాలియగు ఖానుడు ప్రతి వ్రేటును తప్పించుకొనుచుండెను. తటాలున "కంగ్" మని చప్పుడయ్యె. అదేమి? భేతాళనాయకుని ఖడ్గము రెండు తునియలయ్యెను. పద్మనాభుడు రంగము యెదుటనే నిలిచియుండెను. కనుక భేతాళనాయకునిపైపు ఖడ్గము విసరివైచెను. నాయకుడా కత్తినెత్తుకొనుటకై వంగునప్పటికి, ఖానుని కత్తి ఆతని కంఠముపై వ్రాలెను! గాయము అపాయకరమైనదికాదు; కొద్దిపాటిదే. అయిననేమి? ఆ గాయము వారి పోరాటము యొక్క ఫలితమును నిర్ధారణ చేయనే చేసెను.

ఖిన్న మనస్కులైన ప్రజలు తలలు వాల్చి ఇండ్ల వైపు మరలిరి. భేతాళ నాయకు డింకను యుద్ధము చేయ సిద్ధముగ నుండెను. ఆంధ్రులింకను తమ పరాజయము నొప్పుకొనలేదు. అయినను పద్మనాభుడు వారికీ విధముగ బోధించెను: "సోదరులారా! ఎప్పుడు మన వాని ఖడ్గము తునకలయ్యెనో, యప్పుడే మనమోడిన వారమైతిమి. అలీఖానుని స్థానమున మన మెవ్వరమైన యుండినచో, నిరాయుధునిపైన ఖడ్గము ప్రయోగించి యుందుమా? ప్రతిపక్షి చేతికి ఆయుధము వచ్చునంత దనుక

అతని నెదుర్కొనియే యుండము. కాని అలీఖానుడట్టివాడు కాడు. శూరునకు దగిన పాఠము నాతడు నేర్చినవాడు కాడు. శత్రువు విషయముననే యగుగాక, ధర్మేతరముగా నడుచుకొన వచ్చునా? అయిన మానె; విచారింపవలదు. ఖడ్గ ప్రయోగమున అలీఖానునకు దీసిపోవు వారము కామని మాత్రము మనము ప్రకటించితిమి. మన ఖడ్గమునకు గూడ వాని ఖడ్గము వంటి పదునేయున్నదని మాత్రము చూపవలసియున్నాము. అంతే!''

ఈ విధముగా జనుల సమాధానపరచి, పద్మనాభుడు మందిరములోనికి పోయెను. ''నేటి సమాచారమేమి?'' అని కల్యాణి ప్రశ్నించెను.

పద్మనాభుడు మోము వాల్చి ప్రత్యుత్తరమిచ్చెను: ''నేడును నిన్నటివలెనే జరిగినది.''

కల్యా :- ''భేతాళ నాయకుడు చనిపోయెనా?''

పద్మ :- ''ప్రాణముపోలేదు, ఓడిమాత్రము పోయెను.''

కల్యా :- ''ఇక చేయవలసిన పని?''

పద్మ :- ''నేనును ఇదియే ఆలోచించుచున్నాను. నేటి వరకెన్నడును విక్రమపురము లొంగవలసిరాలేదు. మన వద్ద గొప్ప ఐశ్వర్యము లేదు; మన రాజ్యము పెద్దదిగాదు. అయినను, ఐశ్వర్యమును, రాజ్యమును మనము పరాక్రమము నెదుట తృణప్రాయముగా జూచితిమి! నేడికనేమి చెప్పగలము? విక్రమపుర గౌరవము నేటితో నస్తమింపనున్నది.''

కల్యా :- ''ముందేమియు నాశలేదా?''

పద్మ :- ''మనవద్ది బలశాలులలో ఇక ఖానుని డీకొను వాడెవడును లేదు. భేతాళ నాయకు డోడిపోవుటవలన మన యావ

నుల ఉత్సాహము చల్లబడినది. నేడు పురమంతయు దుఃఖమున మునిగియున్నది. వందల కొలది యిండ్లలో నేడు ప్రొయి రాజ లేదు. భేతాళ నాయకుడు మల్ల విద్యయందు నాకు గురువు. అతడు పడిన తరువాత నేను రంగమున నడుగుపెట్టుట అతని నవమానించుటయే. అయినను విక్రమపుర కీర్తి మాయనున్న ప్పుడు నా పేరు కూడా మాయుట యుచితము. అలీఖానుడీ విద్య యందు నిపుణుడే. భేతాళ నాయకుడు మాత్రము తీసి వేతవాడా? ఖానుని విజయమునకు కారణము వాని ఖడ్గము గట్టిగా నుండుటయే! ఖానుని ఖడ్గమే నాయకుని చేతయుండిన పక్షమున నేటి జయము నాయకునికే లభించియుండును. మన పురమున ఖానుని ఖడ్గము వంటి దొక్కటే కలదు. అది మా అన్నగారి కత్తి. విక్రమపుర గౌరవమును నిలబెట్టవలెనని నీకున్నచో, ఆ కత్తిని నాకిమ్ము. ఇదియే మన తుదియత్నము. దీనిలో గూడ మనము పడిపోయితిమా, విక్రమపురకీర్తి మరల తలయెత్తకుండ నశించును.''

కల్యాణి ఆలోచింపసాగెను. ''ఇతరుని నీడయైన నీ కత్తి పైన బడనీయవలదని భర్త యాజ్ఞాపించియుండెను. ఇచ్చితినా వారు కోపగించుకొందురేమో! ఏల కోపగించుకొందురు? ఆనం దింతురు. విక్రమపుర కీర్తిని సమయోచితముగ గాపాడినందుకు వారు శ్లాఘింతురు. ఇది వారికెంత సంతోషమగు విషయము! మన వారి శౌర్య ప్రతాపములను ప్రోత్సహించువారు వారికంటె నెక్కువ ఇంకెవ్వరున్నారు? ఈ సమయమున వారి యాజ్ఞ నుల్లంఘించుటయే వారి యాజ్ఞను పాలించుట!''

ఇట్లు నిశ్చయించి కల్యాణి పద్మనాభునకు భర్త కత్తి నిచ్చివేసెను.

దృష్టి బరపెను. అంతట జనులు తెలివి దెచ్చుకొనిరి. ఖడ్గము లొరలలో దూరెను. "ఎందులకీ విపరీత సంభ్రమము! ఈ యపస్మారము! విక్రమపుర వాసులకీపాటి పని క్రొత్తదా?" అను వాక్యములు జనుల యావేశమును తగ్గించి నెమ్మది కలిగించెను. న్యాయ పాలనము, ఉదారభావము ఈ రెండును చేరియు పద్మనాభునకే స్థానము జనుల మనసులం దదివరకు ఇయ్యలేక పోయెనో, అట్టి స్థానము ఆతనికానాటి వీర విహారమువలన వెంటనే లభించెను! ఇంతకు ముందు వారికాతడు ప్రియుడు; ఇప్పుడాతడు వారికి నాయకుడు; పూజనీయుడు!

(౨౪)

ప్రతాపుడు తాను బోయిన ప్రాంతమున, యుద్ధకలా కౌశల్యమున నేమి, రాజ్యతంత్రమునందేమి నిరుపమానుడను కీర్తినార్జించెను. అంతః కలహములకు, దుష్పరిపాలనమునకు తావలమైయుండిన యా దేశమును నతడు సుందరా రామముగ మార్చివైచెను. సంవత్సరకాలమచట పూర్తిగా గడపిన తరువాత, విక్రమపురమునకు బోవనుద్దేశించెను. స్వపురము జ్ఞప్తికి వచ్చినప్పుడెల్ల అతని హృదయమెంత సంతోషతరంగిత మగుచుండెనో వర్ణింప నేరితరము? అతడు పగలనక, రాత్రియనక, ఆకలి దప్పులను లెక్కచేయక వేవేగమున ప్రయాణము చేసెను. పోయి పోయి తుదకు విక్రమ పురమునకు సమీపమందున్న యరణ్యము ప్రవేశించెను. పరిజనము వెనుకబడిపోయె. రెండు జాముల వేళయైనది. మిటమిటలాడు ఎండ! గుఱ్ఱమును దిగి యొక చెట్టు నీడ గూర్చుండెను. దైవ వశమున నానాడు పద్మ

నాథుడు గూడ విజయోత్సాహ సంరంభమున వేటాడుటకై యదే యరణ్యమునకు పోయి యుండెను. వందల కొలది యాంధ్ర వీరు లతని వెంట నుండిరి. వారు గర్వముతో సాగి నడుచు చుండిరి. ప్రతాపుడు వృక్షఛాయ క్రింద నొంటరిగా కూర్చుండి యుండెను. వారు చూచిరి; కాని గుర్తింపరైరి. ఎవరో బాట సారి యనుకొనిరి. పద్మనాభుని కన్నులు కూడ పొరపాటుకు లోబడెను! సమీపమునకు జని, "మీరెవరు?" యని యడుగ బోవుచు, నిదానించి చూడగా అన్న యని తెలిసికొని, వెంటనే గుర్రము నుండి గుభాలున దుమికి, సోదరుని పాదములపైన వ్రాలెను. ప్రతాపుడు తమ్ముని గౌగిలించుకొనెను. అయినను ప్రతాపుని హృదయమున నిప్పుడు ప్రేమాగ్నికి బదులు అసూయాగ్ని రగుల్కొనెను. పద్మనాభుడు దూరము నుండియే పాద చారియై పోవనందున, పరిజనముకూడ దూరమునుండి యుక్త మగు వినయగౌరవమును ప్రతాపుని విషయమున జూపి యుండ లేదు; తలలు వాల్చలేదు! సాయంత్రమువరకు సోదరు లిరువురు విక్రమపురము చేరిరి. ఈ సువార్త పురమునందంతట నిము షములో వ్యాపించెను ! నగారాలు ఎల్లెడల మ్రోయసాగెను. విక్రమపురమందంతటను దీపావళులు నిండెను. భర్తరాక వలన కల్యాణికి కలిగిన యానందము వర్ణనాతీతము. ఆనాడామె వంట తానే చేసెను! జాము ప్రొద్దుపోయిన తరువాత సేవకురాలు వచ్చి విన్నవించెను :-

"మహారాజా! సువావరము సిద్ధమైనది. దేవరయాజ్ఞ." సోదరులు భుజింపబోయిరి. బంగారు పళ్లెరమున ప్రతాపుని

కొరకును, వెండి పళ్లెరమున పద్మనాభుని కొరకును కల్యాణి స్వయముగా వడ్డించెను. కాని యా పళ్లెరముల దెచ్చి ఎదుట బెట్టునప్పుడు తొందరచే మొదటి పళ్లెరము పద్మనాభుని ఎదుటను, రెండవదాని భర్త యెదుటను ఉంచెను! పద్మనాభు డీ మార్పును చూడలేదు. సంవత్సరము నుండి బంగారుపళ్లెరమున భుజించుట కలవాటు పడియుండిన పద్మనాభునకు దీనియందు క్రొత్తదన మేదియు కనుపడలేదు. కాని ప్రతాపుని క్రోధాగ్ని మాత్రము దీనివలన ప్రజ్వలించెను. అతడు నోట నేమియు ననలేదు. కన్ను లెఱ్ఱబారెను. ముఖము తీవ్రత్వమును బొందెను. కోరచూపుల నాతడు కల్యాణి నవలోకించెను. భోజనము చేయుచుండెను. కాని ఒక్కొక్క కబళమతనికి విషప్రాయముగ దోచెను. ఎట్టెట్టో నాలుగు మెతుకులు తిని లేచెను. భర్తయందీ మార్పును గని కల్యాణి ఏమియు దోపక నివ్వెరపాటు జెందెను. ఆనాడెంతో ప్రేమతో వంటచేసి యుండెను! భర్త యాగమనమునకు ఆమె యానందపారవశ్యము నంది యుండెను! ఏడాది తరువాత కదా ఆమెకిట్టి సంతోష సమయము లభించినది. వారు భోజనము చేసి లేచిన తరువాత పళ్లెములవైపు జూచువరకామె గుండెలు జల్లుమనెను! కాళ్ళక్రిందనేల కదలి పోయినట్లయ్యె. "అక్కటా, నేటి రాత్రి ఎట్లు గడచునో?" అని యామె తల మోదుకొని చదికిలబడెను!

(ఽ)

ఎప్పటివలె మందిరమున ప్రతాపునకు శయ్య సిద్ధము చేయబడెను. కళ్యాణిని చెలికత్తె చక్కగా దిద్ది, భూషణముల

నలంకరించి "చూడుము! ఎంత బాగుగా దీర్చి దిద్దితినో! రేపు మాయన్నగారివలన బహుమాన మందెదను" అని వెడలి పోయెను. కాని కల్యాణి హృదయము స్వస్థముగలేదు. "ఎందులకే సౌందర్య ప్రదర్శనము? ఏ మొగముననే నాయన కడకు బోదును? ఈ సొగసునకాయన సంతసించునా? నేను నిందితురాలను! యిట్టి స్థితిలో నేను యింపైన వేసము బూని భర్త యొద్దకు పోవుట తగునా? కూడదు. నేను నేడతని కడకు బిచ్చపుదానివలెగదా పోవలయును! నన్ను క్షమింపుమని వేడుకొనవలయును! ఇదియే నేను చేయదగినపని" ఇట్లని తర్కించుకొని కల్యాణి నిలువుటద్దము యెదుట నిలిచెను. అప్పు డామె యప్సరసవలె మనోహరమై యుండె. అంతకుముందామె యెన్నియో సుందర విగ్రహముల గాంచియుండెను. కాని యిప్పు డామెకు గాన వచ్చిన తన యాకృతి వంటి మనోజ్ఞమైన విగ్రహము అంతకు పూర్వమెప్పుడును తాను చూచియుండనట్లు ఆమెకు దోచెను. కొంచెపు తడువు కల్యాణి సౌందర్య గర్వమున నుప్పొంగెను. నీటుగా నిలబడెను. సౌందర్య మొక ఇంద్రజాలమని కొందరు వర్ణించెదరు. నిజముగా నది యట్టిదే. సామాన్యమగు నింద్రజాలమా? ప్రాణము, ధనము, న్యాయబుద్ధి, ధైర్యము యిట్టి యుత్తమ వస్తువులను బలిగొను నింద్రజాలము. నేనందకత్తెనుగానేమో; కాకపోయినను అనాకారినిగూడా గాను! భర్తచేత నా తప్పిదమును మన్నింపజేయునంతటి ప్రభావము ఈ సౌందర్యమున లేదా? నేను నా ప్రియుని యెదను బాహులతల వైచి హారముగా నలచినప్పుడు-అనురాగ మహిమవలన నా కన్ను లెర్రబారి భర్త చూడ్కుల నెదుర్కొనిన

సమయమున-నా యీ సోయగపు హిమబిందువులాతని కోపాగ్నిని చల్లార్పకుండునా?'' అని యామె లోలోన దలపోసెను.

ఇట్టి విచార సాగరమున నా యువతి కొంతసేపు మునిగి యుండి. పిమ్మట తెలివి దెచ్చుకొనెను. ''ఇదెట్టి స్వప్నము? ఎట్టి భ్రమ? నా వలన పశ్చైరముల విషయమున అపరాధమైనది. నేను నేరముచేసిన దానినైతిని! - ఇక అలంకారములేటికి? వేడికొనదలిచిన దానికి వేసములేటికి? కాళ్లపై వ్రాలవలసినదానికి గర్వమెందులకు? తప్పిదము చేసిన దానికి తళుకు బెళుకుతో నేమి ప్రయోజనము?" ఇట్లనుకొని కల్యాణి యాభరణముల నవతల బెట్టెను! ఘుమఘుమలాడు సువాసనలుగల చీరెలను వదిలెను! దానికి బదులు లోక సామాన్య వస్త్రమును ధరించెను! తుదకు బరితాపమును బట్ట జాలక వెక్కి వెక్కి యేడ్వసాగెను! ''అక్కటా! ఇది సంయోగపు రాత్రికదా! వియోగపు రాత్రి కన్న ఎక్కువ సంతాపకరమైనదే!'' అని యనుకొనెను. బిచ్చపు వేసముతో కళ్యాణి శయనగృహము బ్రవేశించెను. అడుగులు ముందుకు సాగుచుండెను; కాని మనస్సు వెనుకకు లాగుచుండెను! ద్వారమువద్దకు వచ్చెను. అడుగు లోపలికి పెట్టుటకు సంశయించుచుండెను. గుండెలు తటతట కొట్టుకొనుచుండెను. కాళ్లు వడవడ వడకుచున్నట్లు తోచెను. "ఎవరు వారు? కల్యాణీ! లోపలికెందుకురావు?'' అని రాజడిగెను.

కళ్యా:- ''ఆర్యా! ఎట్లు వత్తును, నా స్థలమును క్రోధమాక్రమించుకొని యున్నది.''

ప్రతా:- ''మనస్సపరాధము చేసినది. కనుక కన్నులపైకెత్తనీయకున్న దనరాదా?"

కల్యా:- ''ఆర్యా! నిజమే. నా వలన అపరాధము జరిగిన మాట నిజమే! అయినను ఒక యబల క్షమింపుమని తమను వేడుకొనుచున్నది.''

ప్రతా :- ''అపరాధమునకు ప్రాయశ్చిత్తము వలదా?''

కల్యా :- "ఎట్టి ప్రాయశ్చిత్తము? ఆర్యా!''

ప్రతా :- ''పద్మనాభుని రక్తపాతము.''

కల్యాణి ఆపాదమస్తకము వడకియనెను. ''ఆర్యా! భోజనపు పళ్లెరములు తారుమారైనంత మాత్రమునకేనా?''

ప్రతా :- "కాదు, పద్మనాభుడు నీ ప్రేమను తారుమారు చేసినందునకు!''

కల్యాణి మోమెఱ్ఱబారెను. క్రోధాగ్ని మానవ హృదయమునందలి కోమల భావములను గాల్చివేయును! మర్యాద, ప్రేమ, దయ, న్యాయము మున్నగునవన్నియు నొక్కమారు బూడిదయగును! నిముసము సేపు హృదయము, మెదడు రెండును కళపెళ కాగినట్లు దోచెను. తుదకు ఎంతో యోరిమి దెచ్చుకొని ధైర్యముతో ననెను: ''పద్మనాభుని నేను తమ్మునిగను, బాలునిగను జూచుచుంటినే!''

ప్రతాపుడు లేచి కూర్చుండి నెమ్మదిగా ననెను:

''పద్మనాభుడేల బాలుడగును? తెలివిమాలిన బాలప్రాయుడను నేను! కళ్యాణీ! నీవిట్లు చేయుదువని నేను కలనైనను దలచియుండలేదు! నిన్ను జూచుకొని మురియుచుంటిని; నీ పాతివ్రత్యమునకు నేను గర్వించుచుంటిని! నా బుద్ధి మాంద్యమును నేనుగదా నేడు తెలిసికొంటిని! స్త్రీల ప్రేమ నీటి ధార

వంటిది. ఎటు పల్లము గానవచ్చిన నటు ప్రవహించునని పెద్దలు చెప్పినమాట నిజము." బంగారు ఎక్కువ కాగినగాని కరుగదు. కల్యాణి కన్నులనుండి కన్నీరు కారదొడంగెను. అంత నామె ధైర్యము జిక్కబట్టి యిట్లనెను:

"తమ యనుమానము నే నెట్లు తీర్చగలను?"

ప్రతా:- "పద్మనాభుని రక్తపాతమూలమున."

కల్యా:- "నా రక్తముచే నీ యనుమానము తొలగి పోదా?"

ప్రతా:- "పోదు. మరింత బలపడును."

కల్యా:- "రెండవ యుపాయమేదియు లేదా?"

ప్రతా:- "లేదు."

కల్యా:- "ఇది తమ తుది తీర్మానమేనా?"

ప్రతా:- అవును! నా తుది తీర్మానమే. చూడుము. ఈ పళ్లెరమున తమలపాకుల విడియమున్నది. నీవు దీనిని పద్మనాభునకీయవలెను! దానివలన నీ పాతివ్రత్యము రుజువగును. ఆతని శవ మీ మందిరమునుండి వెడలినప్పుడు నా హృదయము నుండి యనుమానము వెడలును.

కల్యాణి విషాదపూరితమగు చూపుతో వెనుకకు మరలెను.

(౭)

"అక్కటా! నిర్దోషియు, నీతిసంపన్నుడును నగు పద్మనాభుని రక్తముతో నా పాతివ్రత్యమును ప్రకటింపవలయునా?

నన్ను సోదరిగా భావించి, పూజించు నా బాలుని చావు నేనెట్లు కోరగలను? ఎంతటి పాపకార్యము! కల్యాణీ! నేడు నీ పాతి వ్రత్యమును ఈ విధముగా గాపాడుకొనదలచితివా? నా వలన ఈ ఘోరకార్యము కాజాలదు! నన్ను అపవిత్రగా తలచి యనుమానించిన యనుమానింతురు గాక! నేనిట్టి పాపకృత్యమున కొడిగట్టజాల!'' అని కల్యాణియనుకొనెను.

''ఈ యనుమానమునకు గారణమేమై యుండును? పళ్లెరములు తారుమారగుటయేనా? నేడు పద్మనాభుడు వేటకుపోయి యుండెను. భర్తగారి ఖడ్గము అతని యొద్దనుండుటను వారు చూచియుందురు. పద్మనాభునివలన నేమైన యపచారము జరిగి యుండునోయో? అగుగాక! అందు నా దోషమేమి? ఇంత భయంకరమగు దోషము నాపై నేల ఆరోపించిరి? పళ్లెరముల మూలముననేనా? ఈశ్వరా! నా దుఃఖము నే నెవరితో జెప్పుకొందును? నీవు సర్వసాక్షివి! ఏది ఎటులైనను సరే నేనిట్టి పాపకృత్యమున కొడిగట్టజాల!'' అని తలపోసెను.

''ఆర్యా! నీ హృదయమెంత సంకుచితము. పద్మనాభుని జనవశీకరణము; అతని యధికార ప్రాబల్యము, అతని కీర్తి నీకు అసూయ కలిగించినచో, అతని నేల వధింపగూడదు? నా మీద నీ దయ తప్పినచో నన్నేకాశికో, మధురకో, పంపవచ్చును కదా? నన్ను దుర్నయగా దలచిన తలపుము! నా వలన నీ కెట్టి సుఖమును ఈ జీవితమున లభింపదు కదా! నన్నేల వధింపవు?'' ఈ విధమున దురపిల్లి, ఇట్లు నిర్ణయించెను. ''కల్యాణీ! నీ వీ

పాపమునకొడిగట్టక తప్పదు! నీ భర్త నీ వర్తనమును సందేహించుచున్నాడు! అతని సందేహమును నీవు బాపవలెను. నీవీ పాపపు పని చేసియే తీరవలెను. చేయుట మాత్రమే కాదు; చేసి నగుమొగము బూనవలయును. చేసి సంతోషింపవలసిన దానవై యున్నావు. అట్లు కాక, నీవీ ఘోరకృత్యమొనర్చిన తరువాత, ఏ మాత్రముగాని వ్యసనపడినట్లు, నీ మొగము చిన్నబోయినట్లు కానవచ్చెనేని, యింతటి పాపకార్యమునకు లోబడినదానవయ్యు నీ భర్త యనుమానమును తొలగింపలేకపోదువు సుమా! జాగ్రత్త! నీ మానసికావస్థ యెటులుండినను ఉండనిమ్ము; ఈ పని మాత్రము చేయక నీకు తప్పదు!'' అనుకొనెను. ''ఈ పని ఎట్లు చేయుదును? అని తలచినప్పుడు కల్యాణి శరీరము ఆపాదమస్తకము కంపించెను.'' "నా చేతులీ దుష్కృత్యము నెట్లు చేయును కుమారా! పద్మనాభా! నేను నీకెట్లు విషము పెట్టుదును? నా కోసము నీవు సంతోషముగా విషమును మ్రింగుదువు; నే నెరుగుదును! నీవు వద్దనవు; నాకది నమ్మికయే! కాని నేనీ పాపమునకొడిగట్టజాల! ఒడిగట్టజాల!! ముమ్మాటికి ఒడిగట్టజాల!!!'' అని వగచెను.

(౮)

వెనుకటి ప్రకరణములందలి వార్తలు పద్మనాభునకు తెలియనే తెలియలేదు. మరునాటి యుదయమున సేవకురాలు వచ్చి జరిగిన యుదంతము అతనికి వినిపించెను. గడచిన రాత్రి

కల్యాణి వెంట నా పని కత్తె శయన గృహముదనుక బోయి యుండెను. కనుక సంగతులు తెలుసుకొనెను. అన్న హృదయమున నేదో కళంకము ప్రవేశించినదని పద్మనాభుడంతకు యున్నె యనుమానించెను. ఆ యనుమానమిప్పుడు నిశ్చయముగా మారెను. సేవకురాలి మాటలు వినగనే యాతడనెను.

''దాసీ, వినుము, ఈ సంగతులు ఎవరికేని తెలిపితివేని, డొక్కచీల్చి వైచెదను; జాగ్రత్త!''

పద్మనాభుడు శూరశిఖామణి. అతడు తన వంశమున కలంకారభూతుడు. అతని కనుసన్నపైన వేలకొలది భటులు యుద్ధమునకు సిద్ధమగుదురు. విక్రమపురమున ఎవరును అతనితో డీకొనుట యసంభవము. శూరుడు తన ప్రాణములను సులభముగా వదలడు! చంపుట, చచ్చుట అతనికవలీల! కాని, అట్టి శౌర్యమిప్పుడాతని కక్కరవచ్చునా?

"నేను రాజ్యమపహరించితినని నాపైన అన్నకు అనుమానము తోచి యుండిన నేనెంతమాత్రము విచారపడి యుండను. రాజ్యముకొరకు హత్య, మోసము మున్నగునవి ధర్మములేగదా! కాని యిప్పుడన్న హృదయమును బాధించుచున్న అనుమానము నా మరణమువలన దప్ప మరియొక విధమున నెట్లు మాసిపోగలదు? నే ప్రాణములబాసి ఆయన మనస్సును చల్లబడజేయవలెను. యిట్టి ఘోరమైన యనుమానము నాతని మానసమున రగులు కొలువ నేను బ్రతికియుంటినా? పాతి

ప్రత్యము కంటె ఎక్కువ పవిత్రయగు కల్యాణీదేవిని అగౌరవమునకప్పగించితినా? నేనెంత సిగ్గుమాలినవాడను! కనుక, ఇట్టి యుత్కృష్ట కార్యమున వెనుక ముందు చూడవలసిన పనిలేదు. క్రోధముచేతను, ప్రతీకారోత్సాహముతో, శౌర్య రసోన్మాదము వలనను, నగారా మోతల సందడి ఫలితముగను మృత్యుదేవతను గౌగిలించుకొనుట అంత కఠినమగు పనికాదు. ఇట్టి మృత్యువే నిశ్చయముగా గౌరవప్రదము!!".

పద్మనాభుడు స్నానాది కృత్యముల నొనర్చి, ఆయుధముల బూని మందహాసముతో అన్నకడకు బోయెను. ప్రతాపుడప్పుడు నిద్రలేచి శయ్యపైన పొరలాడుచుండెను. అంతలో తటాలున పద్మనాభుడు శయ్యా గృహము ప్రవేశించెను. ప్రతాపుడు ఉలికిపడి, కొంత ధైర్యము తెచ్చుకొని ''తమ్ముడా! ఇప్పు డెక్కడకు పోవుచున్నావు?'' అని యడిగెను.

తమ్ముని మోమున సంతోషము కాంతులీనుచుండెను. మానవుడు కామరూపికదా! నవ్వెను. ''నిన్న తమరు దయచేసితిరి. ఆ సంతోషమున నేడు వేటకుబోవుచున్నాను. ఈశ్వరుడు తమ చేతికి జయకంకణము కట్టి యున్నాడు. పవిత్రమగు తమ చేతితో నాకు జయము కలుగునట్లాశీర్వదించి విడియ మివ్వ వేడుచున్నాను." .

ఈ మాటలతో పద్మనాభుడు పళ్లెరమునెత్తి అన్నముంగట బెట్టి విజయమునకై చేయి సాచెను. పద్మనాభుని వికసితమును

చూచి, ప్రతాపుని క్రోధాగ్ని మరింత ప్రజ్వలించెను. అంతనాత డిట్లనెను. "ఇదిగో విజయపు విడియము. కాని ఈ విజయము నీది కాదు: నాదే!" అని విడియము చేతితోనెత్తి తమ్మునకిచ్చెను. పద్మనాభుడు దాని నెత్తి కన్నుల కద్దుకొని, తలవాల్చి శూన్య దృష్టితో నా మందిరము నలు దెసలను చూచెను. విడియము నోట వేసికొనెను! అంత కన్నులు తేలగిలబడెను. దీర్ఘ విశ్వాసము వదిలెను. రెండు చేతులనన్నకు నమస్కరించి నేలపై బడెను. నుదుట సన్నని చెమ్మట చుక్కలు కానవచ్చెను. శ్వాసము వేగముగా రాసాగెను. ముఖము మాత్రము ప్రశాంత ముగా నుండెను! ప్రతాపుడు కదలలేదూ మెదలలేదు. అతని మోమున నిర్దయాత్వపు చిరునగవు కానవచ్చెను! దానితోబాటు కన్నుల బాష్పములు నిండెను!! వెలుతురు, చీకటి రెండును ఏకమయ్యెను!!!